www.andhrajyothy.com

విజయవాడ సిటీ

ఆంధ్రజ్యోతి


పేజీలు: 18 + 20 | వెల: రూ. 5.00 | సంపుటి: 58 | సంచిక: 313

మంగళవారం | 27-2-2018

శ్రీహేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి మ. 2.39 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పుష్యమి తె. 3.51 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: మ. 12.44-2.15; దుర్ముహూర్తం: ఉ. 8.59-9.46, రా. 10.21-11.09; అమృతఘడియలు: రా. 10.02-11.29; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.39; సూర్యాస్తమయం: 6.18

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai





చంద్రజాలం



నేటికి సరిగ్గా 40ఏళ్ల క్రితం..
ఎమ్మెల్యేగా 'తొలి గెలుపు'

ప్రత్యక్ష రాజకీయాల్లో 4 దశాబ్దాలు.. విద్యార్థి నేత నుంచి సీఎందాకా ప్రస్థానం

సుదీర్ఘ ముఖ్యమంత్రి, విపక్ష నేతగా ఘనత.. 'అన్నగారి అల్లుడి'గా కీలక మలుపు

వ్యూహాలు, చాకచక్యానికి చిరునామా.. సంక్షోభం విసిరే సవాళ్లకు సమాధానం

జాతీయ స్థాయిలోనూ చెరగని ముద్ర.. కాంగ్రెస్ వ్యతిరేక కూటమికి సారథ్యం

అది ఆగ్రా! ఆంధ్రా నుంచి వెళ్లిన యువ దంపతులు తాజ్ మహల్ వద్ద సరదాగా ఒంటె బండి ఎక్కారు! బండిని చిన్న కుర్రాడు నడుపుతున్నాడు! 'ఆప్ కహాసే ఆయే!' అని అడిగాడు. 'విజయవాడ' అని ఆ దంపతులు చెప్పారు! 'చంద్రబాబు నాయుడూ...' అని ఆ కుర్రాడు ఉత్సాహంగా వారి వైపు చూశాడు. ఇది పదేళ్ల కిందటి సంఘటన! ఆశ్చర్యకరమేమిటంటే... అప్పటికి చంద్రబాబు సీఎంగా లేరు! కానీ... ఉత్తరాదిలోని ఓ చిన్న కుర్రాడికి సైతం 'ఏపీ' అనగానే చంద్రబాబు గుర్తుకొచ్చారు! ఇదీ... రాష్ట్రంపై, రాష్ట్ర రాజకీయాలపై ఆయన వేసిన ముద్ర! 'ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని' పట్టి నిలిపిన నాయకుడు ఎన్టీఆర్! ఆంధ్రప్రదేశ్ గుర్తింపు కీర్తి పతాకను దేశ, విదేశాలకు చేర్చిన నేత... చంద్రబాబు నాయుడు! అలాంటి వ్యక్తి 'నాయకుడు'గా జనంలోకి అడుగు పెట్టి ఇప్పటికి నాలుగు దశాబ్దాలు! అంటే... నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం! ఇది ఆషామాషీగా సాగింది కాదు! విద్యార్థి నాయకుడి నుంచి రాష్ట్ర పరిపాలనా సారథి దాకా... రాజకీయాల్లో ఎదగాలనుకునే వారికి ఆయన ఓ పెద్దబాల శిక్ష! అధికారంలో ఉన్నా, విపక్షంలో ఉన్నా... ప్రతి పాత్రపై ఆయనది చెరగని ముద్ర! 'ఆయన వ్యూహాలను తట్టుకోవడం కష్టం' అని నేటి ప్రత్యర్థులు సైతం అంగీకరించే నిజం!

చంద్రబాబు రాజకీయ ప్రస్థానంపై 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనాలు



- సచిత్ర కథనాలు 6, 16, 17లో..

40 ఏళ్ల నారాజకీయం

ఫార్టీ ఇయర్స్ పాలిటిక్స్ చంద్రబాబుతో 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణ ముఖాముఖి ముచ్చట్లు

ఈ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ABN లో





గుండెపోటని చెప్పిన బోనీ తమ్ముడు

ప్రమాదవశాత్తు బాత్ టబ్బులో మునిగి చనిపోయిందన్న దుబాయ్ అధికారులు

టబ్బులో ఉండగా గుండెపోటు వచ్చిందా?

బాత్‌టబ్బులో మునిగి చనిపోతారా?

దుబాయ్ పోలీసుల సందేహాలు

పోస్టుమార్టం నివేదికపై అసంతృప్తి

బోనీకి 18 గంటలు ప్రశ్నలు

నేడు ఇంటరాగేషన్?

కేసు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు

సంతృప్తి చెందితేనే భౌతికకాయం అప్పగింత

ఈ ప్రశ్నకు బదులేది?

- ? ముంబై తిరిగొచ్చిన 3 రోజులకే బోనీ మళ్లీ దుబాయ్ ఎందుకెళ్లారు.
- ? శ్రీదేవికి సర్‌ప్రైజ్ విజిట్ ఎందుకు ఇవ్వాలని అనుకున్నారు.
- ? ఆమె 2 రోజులు గదిలోంచి బయటకే రాలేదని ఆయనకు తెలుసా.
- ? రెండురోజుల పాటు శ్రీదేవికి పదే పదే ఫోన్ చేసిందెవరు.
- ? మార్వా పెళ్లిలో బోనీ తొలి భార్య బంధువులతో గొడవ జరిగిందా.
- ? బాత్రూంలో ఆమె అచేతనంగా పడి ఉన్నట్లు ఎన్నింటికి చూశారు.
- ? బాత్ టబ్బులో ఆమెను చూసింది బోనీయా.. హోటల్ సిబ్బందా.
- ? కార్డియాక్ అరెస్టుతోనే చనిపోయినట్టు ఏ డాక్టరు నిర్ధారించారు.
- ? మరణ కారణాన్ని డాక్టర్ కాకుండా బోనీ తమ్ముడెందుకు చెప్పారు.
- ? సాయంత్రం 6 నుంచి రాత్రి 9దాకా హోటల్లో అసలేం జరిగింది.
- ? 6:30కి శ్రీదేవిని గుర్తిస్తే 9 దాకా పోలీసులకి చెప్పలేదేం.
- ? హోటల్లోనే ఉన్న ఆస్పత్రికి ఆమెనెందుకు తరలించలేదు.

మిస్టరీ ..ఇండియా!

గుండెపోటా?.. ప్రమాదమా? మరేదైనా ఉందా?

దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ

బోనులో బోనీ?

13, 14, 15 పేజీల్లో

శ్రీదేవి ఎలా చనిపోయింది?

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

శ్రీదేవి ఆకస్మిక మరణం అత్యంత మిస్టరీగా మారింది. ఆమె గుండెపోటుతో మరణించలేదని, స్నానానికి వెళ్లి బాత్‌టబ్‌లో మునిగి చనిపోయారని దుబాయ్ పోలీసులు తెలిపారు. "ఆమె ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయారు" అంటూ దుబాయ్ ప్రభుత్వం సోమవారం ఇచ్చిన ఫోరెన్సిక్ నివేదిక ఈ మిస్టరీని మరింత జటిలం చేసింది. శ్రీదేవి రెండడుగుల లోతు కూడా లేని బాత్‌టబ్ నీటిలో మునిగి చనిపోవడమేంటనే ప్రశ్న భారతదేశ ప్రజల మనసును

మిగతా 13వ పేజీలో...

మన కష్టానికి **గుర్తింపు**

2

- పెట్టుబడుల రాకే దీనికి నిదర్శనం
- 13 జిల్లాల సమగ్రాభివృద్ధే లక్ష్యం
- విశాఖ ఒప్పందాలన్నీ ఈ దిశగానే: సీఎం

ఇన్నోవేషన్ వ్యాలీగా **ఆంధ్ర**

- పెట్టుబడిదారుల నమ్మకం వమ్ముచేయను
- డీపీఆర్‌లిస్తే 21 రోజుల్లో అనుమతులు
- 22వ రోజు నుంచే పనిచేసుకోవచ్చు
- భాగస్వామ్య సదస్సుపై 92% సంతృప్తి
- వచ్చే ఏడాది కూడా విశాఖలోనే
- సదస్సు ముగింపు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రకటన

11

4.3 లక్షల కోట్లు

పెట్టుబడుల వెల్లువ

- ఏపీ బాట పట్టిన పారిశ్రామికవేత్తలు
- భాగస్వామ్య సదస్సులో 734 ఒప్పందాలు
- రాజధానిలో 49 వేల కోట్ల పెట్టుబడులు
- మౌలిక సదుపాయాల్లో 45 వేల కోట్లు
- ఘనంగా ముగిసిన విశాఖ సదస్సు



ఎలక్ట్రానిక్స్‌పై జరిగిన సెషన్‌లో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో ప్రతినిధులు

(భాగస్వామ్య సదస్సు నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు సాక్షిగా నవ్యాంధ్రకు పెట్టుబడిదారులు వరుస కట్టారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పారిశ్రామిక అనుకూల విధానాలు, రాయితీలు, మౌలిక సదుపాయాల కల్పన తదితర చర్యలకు ఆకర్షితులై... భారీ పెట్టుబడులతో వస్తున్నారు. విశాఖలో మూడు రోజులపాటు జరిగిన సదస్సులో ప్రభుత్వంతో మొత్తం 734 అవగాహన ఒప్పందాలు చేసుకున్నారు. వీటి ద్వారా రూ.4,39,765 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానున్నాయి. ఇవి కార్యరూపం దాల్చితే 11,02,125 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి. వాస్తవానికి 400 ఒప్పందాలు... రూ.3 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యంగా ఈ సదస్సును నిర్వహించగా... అంతకంటే ఎక్కువ స్పందన రావడం గమనార్హం. మూడు రోజుల సదస్సులో

మిగతా 2వ పేజీలో...

'వికాస్ కా నారా... ఆంధ్రప్రదేశ్ హమారా'

- పేదరికం లేని ఏపీ ఎంతో దూరంలో లేదు
- పెట్టుబడులకు రాష్ట్రం ఎంతో అనుకూలం
- చక్కటి పాలనకు ప్రజా సంతృప్తే కొలమానం
- విశాఖ సదస్సులో గవర్నర్ వ్యాఖ్యలు

11

ఎమ్మెల్యే, ఎంపీల కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు

3

రేపటి నుంచి ఎంసెట్‌కు దరఖాస్తులు

ఏప్రిల్ 22 నుంచి పరీక్షలు

జేఎన్టీయూకే(కాకినాడ), ఫిబ్రవరి 26: ఎంసెట్ దరఖాస్తులను బుధవారం నుంచి స్వీకరిస్తామని ఏపీ ఎంసెట్-2018 కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు తెలిపారు. ఏపీ ఆన్‌లైన్, టీఎస్ ఆన్‌లైన్, క్రెడిట్, డెబిట్, నెట్ బ్యాంకింగ్ ద్వారా రూ.500 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఏప్రిల్ 21తో దరఖాస్తుల స్వీకరణ ముగుస్తుందన్నారు. ఇంజనీరింగ్ విభాగ పరీక్ష ఏప్రిల్ 22, 23, 24, 25 తేదీల్లో, అగ్రికల్చర్ పరీక్ష 25, 26 తేదీల్లో ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు విద్యార్థులు 0884 2340535, 2356255 నంబర్లలో లేదా apeacet18@gmail. com వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చని సాయిబాబు సూచించారు.

అభ్యర్థుల మార్కులు **వెల్లడిస్తాం**

ఇది మా విధాన నిర్ణయం: ఏపీపీఎస్సీ చైర్మన్

2



భవతారిణి.. మోక్షప్రదాయిని



పరంజ్యోతి (Paramjyothi)

బెంగాల్ ప్రాంతంలో కాళీదేవిని పూజించడం, ఆరాధించడం అధికంగా కనిపిస్తుంటుంది. ఎంతో మంది ప్రజలు ఆరాధ్య దైవంగా, ఇంటి ఇలవేల్పుగా ఆ తల్లిని కొలుస్తుంటారు. రామప్రసాద్ సేన్, రామకృష్ణ పరమహంస వంటి ఎందరో కాళీ సిద్ధులు ఆ ప్రాంతంలో కాళీ భక్తి సంప్రదాయాన్ని వ్యాపింపజేశారు. ముఖ్యంగా కోల్‌కతాలో ప్రపంచ ప్రసిద్ధ కాళీ మందిరాలున్నాయి. వాటిలో విశేషమేంటంటే.. అక్కడ కాళీఘాట్‌లో అత్యంత తీవ్ర స్వరూపిణిగా, ఉగ్రదేవతగా కనిపించే కాళీదేవి, దక్షిణేశ్వర్ దేవాలయంలో ప్రేమస్వరూపిణిగా, ఆహ్లాదమూర్తిగా అనుగ్రహిస్తుంది. రెండు ఆలయాల్లోనూ భక్తజనసందోహం ఉంటుంది. దక్షయజ్ఞంలో ప్రాణాలు విడిచిన సతీదేవి ఖండితాంగాల్లో కుడిపాదం వేళ్లు పడినచోటున క్షేత్రమే కాళీఘాట్. అందుకే అమ్మవారు అక్కడ శక్తిస్వరూపిణిగా పొడవాటి నాలుక చాచి దర్శనమిస్తుంది. స్థానికులు ఆ తల్లిని గ్రామదేవతగా భావించి పూజిస్తారు. భూతప్రేత ప్రయోగ బాధలను, కష్టాలను తొలగించే దేవతగా, నరదిష్టిని పోగొట్టే దేవతగా కొలుస్తారు. దక్షిణేశ్వర్‌లో కొలువైన కాళిని 'భవతారిణి'గా.. అంటే భవబంధాల నుంచి జనులను తరింపజేసి మోక్షాన్ని అనుగ్రహించే దేవతగా పూజిస్తారు. కాళికాదేవిని ప్రేమస్వరూపిణిగా భావించి ఉపాసించిన రామకృష్ణ పరమహంసకు అమ్మ అనుగ్రహం చాలా త్వరగా లభించింది. అమ్మ కరుణవల్లనే ఆయన అద్వైత స్థితిని పొంది మూడురోజుల పాటు నిర్వికల్ప సమాధిస్థితిలో ఉండగలిగారు. రామకృష్ణుల వారికే కాదు.. ఆ తల్లిని భవతారిణీదేవిగా భక్తిగా ఉపాసిస్తే ఎవరికైనా మోక్షాన్ని అనుగ్రహిస్తుంది.

-మాతా రమ్యానంద భారతి

మా కంటే బాగా చేస్తున్నారు

- రియల్ టైమ్ గవర్నెన్స్‌పై జపాన్ మంత్రి ప్రశంసలు
- అద్భుతంగా ఉంది: భూటాన్ మంత్రి

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రియల్ టైమ్ గవర్నెన్స్(ఆర్టీజీ)లో ఏపీ జపాన్‌ను మించిపోయిందని ఆ దేశ ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి సాయినకు కిరాకి ప్రశంసించారు. వెలగపూడిలోని సచివాలయంలో ఆర్టీజీని సోమవారం ఆయన నేతృత్వంలోని జపాన్ ప్రతినిధుల బృందం సందర్శించింది. వారికి ఆర్టీజీ డైరెక్టర్ బాలాజీ ఆదివిష్ణు స్వాగతం పలికి, ఆర్టీజీ పనితీరు వివరించారు. పాలనలో పెద్ద ఎత్తున టెక్నాలజీని వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పట్ల ప్రజల సంతృప్తి స్థాయిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నామని వివరించారు. అనంతరం కిరాకి మాట్లాడుతూ ఆర్టీజీ అద్భుతంగా ఉందన్నారు. 'కొన్ని అంశాలు చూస్తుంటే జపాన్ కంటే మీరు చాలా మెరుగ్గా పని చేస్తున్నారు. అది నాకెంతో సంతోషంగా ఉంది. ముఖ్యంగా డాటా విశ్లేషణ, దాన్ని భద్రపర్చడంలో మీరు తీసుకుంటున్న జాగ్రత్తలు ఎంతో సంతృప్తి కలిగించాయి' అన్నారు. వినూత్న ఆలోచనలు అమలు చేస్తున్న సీఎం చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. బృందంలోని 14మంది ఆర్టీజీ పనితీరును ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. తొలుత ఈ బృందం శాసనసభ, శాసన మండలి భవనాలను తిలకించింది. అలాగే ఏపీలో అమలు చేస్తున్న ఆర్టీజీని భూటాన్ బృందం ప్రశంసించింది. సోమవారం భూటాన్ దేశ ఐటీ మంత్రి దీననాథ్ ధుంగ్యేల్ నేతృత్వంలో ఎనిమిది మంది బృందం ఆర్టీజీని సందర్శించింది. వారికి ఆర్టీజీఎస్ డైరెక్టర్ ఆర్‌కే అనంతకృష్ణన్ స్వాగతం పలికి, ఆర్టీజీఎస్ పనితీరును వివరించారు. ఆర్టీజీ చాలా అద్భుతంగా పని చేస్తోందని దీననాథ్ ధుంగ్యేల్ కొనియాడారు. పరిపాలనలో ఏపీ ప్రభుత్వం టెక్నాలజీని వినియోగించుకుంటున్న తీరు ఆదర్శప్రాయంగా ఉందన్నారు. ఈ బృందంలో భూటాన్ ఐటీశాఖ డీజీ జిగ్మే థినైల్ నామ్‌గైల్, సీనియర్ ఐసీటీ ఆఫీసర్ పెంబా వాంగ్ చుక్, భూటాన్ లీగల్ ఆఫీసర్ సోనమ్ డోర్జీ, భూటాన్ ఈ-ప్రగతి ప్రతినిధులు విక్రమ్ భోహేటీ, జయసూర్య ఉన్నారు.



మాట నిలబెట్టుకున్న కియ

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాట ఇచ్చిన దక్షిణ కొరియా దిగ్గజ ఆటోమొబైల్ సంస్థ 'కియ' తన హామీని నిలబెట్టుకుంది. దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ అనుబంధ సంస్థలను రాష్ట్రానికి రప్పించడంలో కీలకపాత్ర పోషించడంతో సహా... కియ కార్లను భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలో ప్రదర్శనకు ఉంచింది. ఫలితంగా... రాష్ట్రంలో ఆటోమొబైల్ కంపెనీలు కొలువుతీరుతున్నాయన్న విశ్వాసం ప్రజలకు కలిగింది.

4.3 లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎనిమిది ప్లీనరీలు, రెండు ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. అదనంగా జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్‌లతో విదేశీ సెషన్లు చేపట్టారు. ఆటోమోటివ్, పర్యాటకం, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, టెక్స్‌టైల్స్, రెన్యువబుల్ ఎనర్జీ, వైద్యపరికరాలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ రంగాలపై ప్రధానంగా దృష్టి పెట్టారు. సీఎం చంద్రబాబు ఈ మూడు రోజులు 15 దేశాల ప్రతినిధులతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. గత భాగస్వామ్య సదస్సులకు భిన్నంగా ఈ సదస్సు ఉందని ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు చేసుకున్న పారిశ్రామికవేత్తలు పేర్కొన్నారు. ఈ విషయంలో గట్టి కసరత్తు చేస్తూ సీఎం వ్యూహాత్మకంగా అడుగులు వేశారు.

మారిన పంథా!

రాష్ట్ర విభజన జరిగాక తొలిసారిగా 2016 జనవరిలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును సీఐఐ-ఏపీ ప్రభుత్వం నిర్వహించాయి. అప్పట్లో రాష్ట్ర విభజన సమస్యల నుంచి ఏపీ బయటపడలేదు. పాలన హైదరాబాద్ నుంచి సాగుతోంది. మౌలిక సదుపాయాలూ లేవు. ఇలాంటి తరుణంలో పెట్టుబడులను విశేషంగా ఆకర్షించాలన్న లక్ష్యంతో... రాష్ట్రంలో వ్యాపారాన్ని నిర్వహిస్తామంటూ ముందుకు వచ్చిన వారందరితోనూ ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. తొలిసారి సదస్సులో రూ.4,65,000 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలను ప్రభుత్వం చేసుకుంది. 2017లో మరోసారి విశాఖలో పారిశ్రామిక భాగస్వామ్య సదస్సును ప్రభుత్వం నిర్వహించింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఈసారి కూడా పారిశ్రామికవేత్తలు భారీగానే వచ్చారు. దీంతో.. పెట్టుబడుల ఒప్పందాలు ఏకంగా పది లక్షల కోట్ల రూపాయలు దాటాయి. రాష్ట్రంలో గత రెండేళ్లుగా చేసుకున్న ఒప్పందాల్లో 33 శాతం వాస్తవ రూపం దాల్చాయి. అయినా ఒప్పందాలు మరింతగా క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలన్న లక్ష్యంతో 2018 పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో ఒప్పందాల విషయంలో ప్రభుత్వం ఆచితూచి స్పందించింది.

ఫలితమిచ్చిన రోడ్ షోలు..

ఒక కార్యక్రమం విజయవంతం కావాలంటే ముందస్తు కార్యాచరణ అవసరమని ముఖ్యమంత్రి తరచూ అధికారులకు నిర్దేశిస్తూ ఉంటారు. ఇందులో భాగంగానే... విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో దిగ్గజ సంస్థలు ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు చేసుకునేందుకు వీలుగా పారిశ్రామికవేత్తల కోసం దేశ విదేశాల్లో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా రోడ్‌షోలు చేపట్టారు. దుబాయ్, సింగపూర్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో పర్యటించారు. ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ కూడా స్విట్జర్లాండ్, అమెరికాల్లో పర్యటించి ఐటీ రంగ సంస్థలతో సంప్రదింపులు జరిపారు. పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి కూడా అమెరికా, జర్మనీ, దక్షిణ కొరియాల్లో రోడ్ షోలు నిర్వహించారు. ముంబైలోనూ రోడ్‌షో చేపట్టారు. పరిశ్రమలశాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోక్యరాజ్, కమిషనర్ సిద్ధార్థ జైన్, ఏపీఐఐసీ ఎండీ అహ్మద్‌బాబు తదితరులు కూడా రోడ్ షోలలో పాల్గొన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి మండలి సీఈవో జాస్తి కృష్ణ కిశోర్ కూడా పలు సంస్థలను రాష్ట్రానికి రప్పించడంలో ముఖ్య భూమిక పోషించారు. ఫలితంగా సదస్సులో తొలిరోజు రూ.44,245 కోట్ల విలువైన 79 ఒప్పందాలు, రెండో రోజు రూ.1,74,568 కోట్ల విలువైన 286 ఒప్పందాలు, మూడో రోజు రూ.2,20,951 కోట్ల విలువైన 369 ఒప్పందాలు జరిగాయి.

పెట్టుబడి ఒప్పందాల వివరాలు..

శాఖ	ఒప్పందాలు	పెట్టుబడులు (కోట్లలో)	ఉద్యోగాలు
రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ (ఈడీబీ)	144	151400	152496
సంప్రదాయేతర ఇంధన సంస్థ (ఎన్ఆర్ఈడీసీపీ)	38	78935	24411
పరిశ్రమల శాఖ	129	58337	131682
రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ)	37	49643	78680
మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు	22	45981	386200
ఐటీ అండ్ ఎలక్ట్రానిక్స్	75	30050	130343
మైన్స్	31	12227	16225
వైద్య ఆరోగ్యం	25	5090	4750
పర్యాటక రంగం	49	5002	30338
ఫుడ్ ప్రాసెసింగ్	165	3100	47000
రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ	19	-	100000
మొత్తం	734	439765	1102125



లోకం తీరు




ఉష్ణోగ్రతలు

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
హైదరాబాద్	16.2	34.5
గుంటూరు	18.0	37.5
అనంతపురం	14.0	33.8
విశాఖపట్నం	17.4	37.2
విజయవాడ	16.4	36.1

తగ్గిన రాత్రి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమల్లో రాత్రి చలి వాతావరణం నెలకొంది. వాయువ్య గాలులతో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయాయి. సాధారణం కంటే మూడు నుంచి ఆరు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. సోమవారం జంగమహేశ్వరపురంలో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మరో ఇరవై నాలుగు గంటలు కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఇదే మాదిరిగా కొనసాగే అవకాశం ఉంది. అదే సమయంలో పగటిపూట ఎండ మాడుపగులగొట్టింది. ఆకాశం నిర్మలంగా వుండడంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి మూడు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కర్నూలులో 36 డిగ్రీలు నమోదైంది. పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతాయని వాతావరణ అధికారి ఒకరు తెలిపారు.



దేశాన్ని కాచుకోవాల్సిన బాధ్యత హిందువులదే

దేశాన్ని కాచుకోవాల్సిన బాధ్యత హిందువులదే. ఇందుకు హిందువులందరూ ఏకం కావాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రపంచ దేశాల చేతుల్లో నష్టపోతాం.


- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్



బీజేపీ దేశానికి పట్టిన రోగం!

బీజేపీ.. దేశానికి పట్టిన పెద్ద రోగం. కాంగ్రెస్ జలుబు, దగ్గులాంటిది. పెద్ద రోగానికి మందు వేయాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదు. కానీ 'జస్ట్ ఆస్కింగ్' ద్వారా దేశ వ్యాప్తంగా చైతన్యం తీసుకురాదలుచుకున్నా.

- నటుడు ప్రకాశ్‌రాజ్



కాంటాక్ట్ లెన్స్‌తో మధుమేహ పరీక్ష

సియోల్, ఫిబ్రవరి 26: మధుమేహ రోగులు ఎప్పటికప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షిస్తూ నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. దాని కోసం క్రమం తప్పకుండా రక్త పరీక్ష చేసుకోవాలి. ఆ బాధ లేకుండా కేవలం కన్నీళ్లతోనే చక్కెర స్థాయిలను పర్యవేక్షించే కాంటాక్ట్ లెన్స్‌ను దక్షిణ కొరియాలోని ఉల్సాన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధకులు రూపొందించారు. గ్లూకోజ్ సెన్సర్, చిన్న ఎల్ఈడీ బల్బును కలిగి ఉండే ఈ లెన్స్‌ను కళ్లకు పెట్టుకున్నపుడు కన్నీరు తాకి దానిలో ఉండే చక్కెర స్థాయిలను గ్లూకోజ్ సెన్సర్ గుర్తిస్తుంది.

కేన్సర్‌పై పోరుకు కణుతుల సృష్టి

లండన్, ఫిబ్రవరి 26: కేన్సర్ వ్యాధిని తగ్గించేందుకు కీమోథెరపీ ఒక్కటే మార్గం. దీని వల్ల ఆరోగ్యకర కణాలు చనిపోవడం, బాధితుడు కుంగుబాటుకు గురి కావడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. ఈ సమస్యను తప్పించేందుకు శాస్త్రవేత్తలు ఔషధాలను తయారుచేసే పనిలో నిమగ్నమయ్యారు. వాటిని కేన్సర్ రోగిపై పరీక్షించాల్సి ఉంటుంది. ఒకవేళ ఆ మందులు వికటిస్తే రోగి ప్రాణానికే ప్రమాదం. అందుకే, కేన్సర్ కణితుల లాంటి 'చిన్న కణితుల'ను యూకేలోని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కేన్సర్ రీసెర్చ్ పరిశోధకులు ల్యాబ్ వాతావరణంలో తయారుచేశారు. ఏ మందు ప్రభావవంతంగా పనిచేస్తుందో తెలుసుకునేందుకు ఈ కణితులు ఉపయోగపడతాయని శాస్త్రవేత్తలు తెలిపారు.



ప్రకాశంజిల్లా పొదిలిలో జరిగిన సభలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

హోదాపై బాబు ద్వంద్వ నీతి!

- భాగస్వామ్య సదస్సుల ద్వారా ఒక్క పరిశ్రమైనా వచ్చిందా?: జగన్

పొదిలి, ఫిబ్రవరి 26 : "సీఎం చంద్రబాబు అవినీతి పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం కావాలి. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో టీడీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమయింది" అని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రకాశం జిల్లాలో ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా పొదిలిలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టారన్న జగన్, ప్రజల్లో పెల్లుబికిన ఆగ్రహావేశాలనుచూసి, దానిపై మాట మారుస్తున్నారని ఆరోపించారు. భాగస్వామ్య సదస్సుల ద్వారా ఇప్పటిదాకా రూ.15 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని చెప్పుకుంటున్నారని, అయినా, ఎక్కడైనా ఒక్క పరిశ్రమ వచ్చిందా అని జగన్ ప్రశ్నించారు. కేంద్రంపై పోరాడేందుకు ఎంపీలతో రాజీనామా చేయించడంతోపాటు అవిశ్వాస తీర్మానానికి సిద్ధం కావాలని కోరినా ముందుకు రాకపోవడం, చంద్రబాబు ద్వంద్వనీతికి నిదర్శనమన్నారు.

హోదాపై సురేశ్‌ప్రభు మౌనం



సింహాచలం, ఫిబ్రవరి 26: నవ్యాంధ్ర ప్రజల ఆకాంక్షలైన ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీలపై కేంద్రమంత్రి సురేశ్ ప్రభు మౌనం దాల్చారు. సింహాచల వరాహలక్ష్మీనృసింహస్వామిని మంత్రి గంటా శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో కాసేపు మాట్లాడారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీలపై ప్రశ్నించగా స్పందించకుండా.. చిరునవ్వు చిందిస్తూ ముందుకు వెళ్లిపోయారు. మంత్రి గంటా మాట్లాడుతూ కేంద్ర మంత్రి దైవ దర్శనానికి వచ్చారని, ఇక్కడ ఇటువంటి విషయాలు ఎందుకని సర్దిచెప్పారు.

రాష్ట్రంలో మాకు పోయేది వెంట్రుకే : బీజేపీ

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు మెట్రోకు రూ.17వేల కోట్లు ఇచ్చిన కేంద్రం, అమరావతి మెట్రోకు ఎందుకివ్వదంటూ ప్రశ్నించడం ఏ మాత్రం సబబు కాదని బీజేపీ రాష్ట్ర అభివృద్ధి కమిటీ చైర్మన్ వై.రఘునాథబాబు అన్నారు. 1956 నుంచి రాయలసీమ ముఖ్యమంత్రులే ఎక్కువమంది ఉన్నా ఆ ప్రాంతానికి వారే ద్రోహం చేశారన్నారు. మంత్రి మాణిక్యాలరావు అన్నట్లు రాష్ట్రంలో బీజేపీ కోల్పోయేది వెంట్రుక మాత్రమేనని రఘు వ్యాఖ్యానించారు.

ప్రత్యేక హోదాపై వెనకడుగు లేదు: చినరాజప్ప

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 26: బీజేపీ పొత్తుపై ముఖ్యమంత్రిదే తుది నిర్ణయమని హోం మంత్రి చినరాజప్ప అన్నారు. ప్రత్యేక హోదా విషయంలో టీడీపీ వెనుకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. మిత్రబంధానికి బీజేపీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలే అవరోధాలు సృష్టిస్తున్నారని రాజప్ప అన్నారు.

జనవరినాటికి పది లక్షల ఇళ్లు: కాల్వ

- జగన్‌ను సీఎం చేస్తే సర్వనాశనమే : జేసీ

రాయదుర్గం, ఫిబ్రవరి 26 : వచ్చే ఏడాది జనవరి నెలాఖరుకల్లా రాష్ట్రంలో పది లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కాల్వ శ్రీనివాసులు వెల్లడించారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో సోమవారం 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఆయన మహా శంకుస్థాపన చేశారు. వైసీపీ నేత జగన్‌ను ముఖ్యమంత్రి చేస్తే, రాష్ట్రం సర్వనాశనమవుతుందని ఈ సందర్భంగా ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఎండీ కాంతిలాల్ దండే, జెడ్పీ చైర్మన్ పూల నాగరాజు పాల్గొన్నారు.

మన కష్టానికి గుర్తింపు వస్తోంది

- రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి
- 13 జిల్లాల సమగ్రాభివృద్ధే లక్ష్యం
- విశాఖ ఒప్పందాలన్నీ ఈ దిశగానే
- ఉపాధి నిధులు 1045 కోట్లు విడుదల
- ఉపాధి కూలీలకు రూ.187 చెల్లించాలి
- అధికారులతో సీఎం టెలికాన్ఫరెన్స్

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'మన కష్టంతో రాష్ట్రాన్ని నిర్మించుకుంటున్నాం. ఆ కష్టానికి తగిన గుర్తింపు వస్తోంది. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి.. ప్రపంచం మొత్తం మనవైపే చూస్తోంది. విశాఖలో మూడో పెట్టుబడుల సదస్సు విజయవంతం కావడం శుభపరిణామం. మూడు సదస్సుల్లో ఒప్పందాలన్నీ 13 జిల్లాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగానే జరిగాయి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై సోమవారం ఉదయం అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'జల సంరక్షణ ఉద్యమం సత్ఫలితాలిచ్చింది. దీనివల్ల రాష్ట్రంలో భూగర్భ జలాలు 1.6 మీటర్లు పెరిగాయి. రాయలసీమలో 4.6 అడుగులు పెరిగాయి. ఇదే స్ఫూర్తితో రెండో దశ జల సంరక్షణ ఉద్యమం మరింత ఉత్సాహంగా నిర్వహించాలి' అని సీఎం పిలుపిచ్చారు. కాలువల్లో నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. 'ఉపాధి హామీ పథకం కింద 24 కోట్ల పని దినాల లక్ష్యాన్ని చేరుకోవాలి. రోజుకు 15 లక్షల పని దినాల లక్ష్యంలో ప్రస్తుతం 11 లక్షల పనిదినాలకే చేరాం. ఇది మరింత మెరుగుపడాలి. 14వ ఆర్థిక సంఘ నిధులు రూ.745 కోట్లు విడుదల చేశాం. గతంలో ఉన్న నిధులు రూ.300 కోట్లను కూడా పూర్తిగా ఖర్చుచేయాలి. మొత్తం రూ.1045 కోట్లతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి. కరువు మండలాల్లో అదనంగా 50 పనిదినాలు కల్పించాలి. రోజుకు కూలి రూ.187 చెల్లించాలి. ఉపాధి హామీ కింద నర్సరీలను అభివృద్ధి చేయాలి. వాటిలో మొక్కలు పెంచి, రహదార్లకు ఇరువైపులా ప్లాంటేషన్‌కు వినియోగించాలి' అని తెలిపారు. వాయు కాలుష్యం నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని.. పీల్చే గాలి నాణ్యత మెరుగుపరచాలని సూచించారు. 'ఈ సమస్యలన్నీ మనం సృష్టించుకున్నవే. వాటిని పరిష్కరించే శక్తి కూడా మనలోనే ఉంది.. మన శక్తి సామర్థ్యాలు సద్వినియోగం చేసుకోవాలి' అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రబీలో వర్షపాతం లోటు అధికంగా ఉన్నా.. సాగు విస్తీర్ణం 95శాతానికి చేరిందని చెప్పారు. అయితే దిగుబడులు తగ్గకుండా చూడాలని, అవసరమైనచోట రెయిన్ గన్స్ వినియోగించాలని వ్యవసాయశాఖ ఆదేశించారు. వేసవిలో పశుగ్రాస కొరత లేకుండా శ్రద్ధ వహించాలన్నారు. పింఛన్ల పంపిణీకి నగదు కొరత లేకుండా చూడాలని సూచించారు.

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను సీఎం ఆదేశించారు. విద్యార్థులు సకల సౌకర్యాలు కల్పించాలని.. ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా నడపాలని.. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో ఆయా శాఖల ఉన్నతాధికారులు జవహర్‌రెడ్డి, రాజశేఖర్, గోపాలకృష్ణ ద్వివేది, రామాంజనేయులు, అహ్మద్‌బాబు, కృష్ణమోహన్, ఉదయలక్ష్మి, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

అభ్యర్థుల మార్కులు వెల్లడిస్తాం

- ఇది మా విధాన నిర్ణయం: ఏపీపీఎస్సీ
- మార్కులు చెప్పాల్సిన అవసరం లేదన్న సుప్రీంకోర్టు
- సివిల్స్ ప్రిలిమ్స్‌పై దాఖలైన పిటిషన్‌లో తీర్పు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల్లో నమ్మకాన్ని పెంచడంతో పాటు పారదర్శకత కోసం అభ్యర్థుల మార్కులను ప్రదర్శిస్తున్నామని ఏపీపీఎస్సీ చైర్మన్ పిన్నమనేని ఉదయభాస్కర్ తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే విధాన నిర్ణయాన్ని పాటిస్తామన్నారు. ఉద్యోగ నియామక పరీక్షల మార్కుల ప్రదర్శనపై యూపీఎస్సీ, ఏపీపీఎస్సీ స్పష్టత ఇవ్వడంతో అభ్యర్థుల్లో నెలకొన్న సందేహాలకు తెరపడినట్లయింది. ఈ రెండూ రాజ్యాంగబద్ధ సంస్థలైనప్పటికీ మార్కులను వెల్లడించే విషయంలో వేర్వేరు విధానాలను అవలంబిస్తున్నాయి. అభ్యర్థులు పొందిన మార్కులు ప్రదర్శించడం సాధ్యం కాదన్నది యూపీఎస్సీ విధాన నిర్ణయం. 2010నాటి సివిల్స్ ప్రిలిమ్స్ మార్కులు విడుదల చేయాలంటూ కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించగా కోర్టు యూపీఎస్సీ నిర్ణయాన్ని సమర్థించింది. సమాచార హక్కు చట్టం కింద కోరినప్పటికీ మార్కులు వెల్లడించాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. ఈ విషయంలో ఏపీపీఎస్సీ విధానం మరోలా ఉంది. పారదర్శకతకు పెద్దపీట వేస్తూ అభ్యర్థుల మార్కులు విడుదల చేయాలని విధాన నిర్ణయం తీసుకుంది. గత రెండేళ్లుగా చేపట్టిన రిక్రూట్‌మెంట్లకు సంబంధించి అభ్యర్థులు సాధించిన మార్కులను తమ వెబ్‌సైట్లో ప్రదర్శిస్తోంది. ఇంటర్వ్యూలు ఉన్న పోస్టుల విషయంలో మాత్రం మెయిన్స్ మార్కులను ముందుగా విడుదల చేయడం లేదు. ఇంటర్వ్యూలు పూర్తయిన తర్వాత మెయిన్స్, ఇంటర్వ్యూల్లో అభ్యర్థి పొందిన మార్కులను ప్రదర్శిస్తోంది. యూపీఎస్సీపై నిరుద్యోగుల్లో ఉన్న నమ్మకం దృష్ట్యా వారు మార్కులను విడుదల చేయడం లేదని ఏపీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి.

చనువుగా ఉంటేనే మంచి మార్కులు!

- విద్యార్థినులకు అధ్యాపకుడి వేధింపులు
- విధుల నుంచి సస్పెండ్ చేసిన ప్రిన్సిపాల్

బాపట్ల, ఫిబ్రవరి 26: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగిక వేధింపులకు గురిచేస్తున్న ఓ అధ్యాపకుడి లీలలు ఆలస్యంగా వెలుగు చూశాయి. గుంటూరు జిల్లా బాపట్ల పట్టణం సూర్యలంక రోడ్డులోని సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఈ ఉదంతం చోటుచేసుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ వేదవతి తెలిపిన వివరాల ప్రకారం... ప్రాక్టికల్ పరీక్షల్లో మార్కులు బాగా రావాలంటే తనతో చనువుగా ఉండాలంటూ రెండో సంవత్సరం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్(ఎంఎల్‌టీ) కోర్సు చదువుతున్న విద్యార్థినులను కాంట్రాక్ట్ అధ్యాపకుడు జి.ఎస్.వి.సుబ్బారావు వేధిస్తున్నాడు. బాధిత విద్యార్థినులు విషయాన్ని ప్రిన్సిపాల్‌కు చెప్పడంతో పాటు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుబ్బారావును విధుల నుంచి తొలగించినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు.



రైతుల కోసం జ్యోతిర్మయి లక్ష గాయత్రి జపం

హైదరాబాద్, ఫిబ్రవరి 26: రైతుల సంక్షేమం కోసం అమ్మ కొండవీటి జ్యోతిర్మయి కాశీలో లక్ష గాయత్రి జపం నిర్వహించారు. గంగానదీ ఒడ్డున, కాశీ విశ్వేశ్వరుడి ఆలయం, అన్నపూర్ణ ఆలయం వద్ద ఈ నెల 15 నుంచి 25 వరకు రోజూ 18 గంటల చొప్పున క్రమం తప్పకుండా నిష్ఠగా జపం చేశారు. ఈ మేరకు అమ్మ కొండవీటి జ్యోతిర్మయి సెంట్రల్ ట్రస్టు, శ్రీవారి సేన చైర్మన్ కేవీవీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రైతులు పాల్గొన్నారని తెలిపారు.



విద్యుత్ కార్మికుల వినూత్న నిరసన

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 26: రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ)లో విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె సోమవారం ఏడో రోజుకుచేరింది. సోమవారం కార్మికులు పలువురు అరగుండు, అర మీసం గీయించుకుని జెన్‌కో యాజమాన్యం, ప్రభుత్వం తీరుపై తీవ్ర నిరసన తెలిపారు. ఏడురోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభు త్వం ఏమాత్రం పట్టించుకోకుండా మొండివైఖరి ప్రదర్శిస్తోందని నాయకులు విమర్శించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇప్పటికీ తమ గోడును పట్టించుకోకపోవడం దారుణమన్నారు.



హైకోర్టు ఉద్యమం ఉధృతం

కర్నూలు, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): హైకోర్టు మా హక్కు.. అంటూ రాయలసీమ జిల్లాల్లో న్యాయవాదులు సాగిస్తున్న ఆందోళనలు తీవ్ర రూపం దా లుస్తున్నాయి. సోమవారం కర్నూలు జిల్లా ఆదోనిలో జిల్లా కలెక్టర్ ఎస్.సత్యనారాయణ చేపట్టిన ప్రజాదర్బార్‌ను కూడా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీసీ రంగన్న, ప్రధాన కార్యదర్శి అనిమేష్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అడ్డుకున్నారు. శ్రీభాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమ జిల్లాలో హైకోర్టును ఏర్పాటు చేయాల్సిందేనని, అప్పటిదాకా వివిధ దశలలో ఆం దోళనలు తీవ్ర తరం చేస్తామని, సీమ వాసులుగా అధికారులు సహకారం అందించాలని డిమాండ్ చేశారు.

రౌడీషీటర్ల జాబితా ఇంట్లో పెట్టి పూజ చేయండి

విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్‌పై ముఖ్యమంత్రి ఆగ్రహం

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): 'రౌడీషీటర్ల జాబితాను ఇంట్లో పెట్టి పూజ చేయండి' అంటూ విశాఖ జాయింట్ పోలీస్ కమిషనర్ నాగేంద్రకుమార్‌పై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవీఎంసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కమాండ్ అండ్ కమ్యూనికేషన్ సెంటర్‌ను సీఎం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెంటర్‌కు వచ్చే సమాచారాన్ని ఇతర శాఖలకు ఇవ్వడంతోపాటు ఆయా శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సెంటర్‌కు అనుసంధానం చేసుకోవాలని సూచించారు. దీనివల్ల కలిగే ఉపయోగాలపై మాట్లాడుతూ ఉదాహరణగా రౌడీషీటర్ల అంశాన్ని ప్రస్తావించారు. రౌడీషీటర్ల వివరాలు, ఫొటోలను సెంటర్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయడం వల్ల వారు ఎక్కడ తిరుగుతున్నా ఫేషియల్ రికగ్నైజింగ్ కెమెరాల ద్వారా సెంటర్‌లోని సిబ్బందికి సమాచారం వచ్చేస్తుందన్నారు. విశాఖలో ఎంతమంది రౌడీషీటర్లు ఉన్నారని అక్కడే ఉన్న నాగేంద్రకుమార్‌ను ఈసందర్భంలో సీఎం అడిగారు. నగరంలో 400 మంది రౌడీషీటర్లు ఉన్నారని ఆయన సమాధానమిచ్చారు. వాళ్ల ఫొటోలు ఉన్నాయా? అని ప్రశ్నించగా...తమ వద్ద ఇప్పటికే ఫైల్ చేశామని జాయింట్ సీపీ తెలిపారు. వాటన్నింటినీ ఆన్‌లైన్‌లో పెట్టారా? అని ముఖ్యమంత్రి తిరిగి ప్రశ్నించగా, ఇంకా లేదని జాయింట్ సీపీ సమాధానం ఇవ్వడం ముఖ్యమంత్రికి ఆగ్రహం తెప్పించింది.

తెలుగు ఉద్యోగులకు శ్రమ అవార్డులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని ఉద్యోగులకు ప్రధాన మంత్రి శ్రమ అవార్డులు అభించాయి. ఆయా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ప్రతిభ చూపించిన సిబ్బందికి కేంద్రం వివిధ కేటరిగిల్లో అవార్డులను ప్రకటించింది.

ఏపీ గ్రామీణ రోడ్లకు 52 కోట్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రోడ్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.52.37 కోట్లు విడుదల చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్వలాభం మానండి

తోటివారికి సాయపడండి.. సమాజానికి కొంత తిరిగివ్వండి

- సామాజిక సేవ.. గొప్ప పెట్టుబడి
- శాంతి లేని సంపద వృథా
- చంద్రబాబు సమర్థ నాయకుడు
- 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' రవిశంకర్ వెల్లడి

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సమాజం నుంచి సంపాదించిన దాంట్లో ఎంతో కొంత సమాజానికి తిరిగివ్వాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్ సూచించారు. అలా చేస్తే జీవితాలు సంతోషమయమవుతాయని, అది దేశానికి మంచిదని పేర్కొన్నారు. సోమవారం విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సు చివరి రోజున 'స్పెషల్ ప్లీనరీ విత్ సోషల్ ఐకాన్' పేరిట ఆయనతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఓ సదస్సు నిర్వహించారు. దీనికి క్రాంతినేషన్ రచయిత ప్రాంజల్ శర్మ సంధానకర్తగా వ్యవహరించారు. వ్యాపారంలో పెట్టే పెట్టుబడుల కన్నా సమాజ సేవలో పెట్టేవి ఎక్కువ ఫలితాన్ని ఇస్తాయని రవిశంకర్ తెలిపారు. 'ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు వాటి ఆదాయంలో రెండు శాతం సామాజిక సేవకు వినియోగిస్తున్నాయి. ఆ మొత్తాన్ని 4 నుంచి 5 శాతానికి పెంచితే సమాజానికి మరింత మేలు జరుగుతుంది. దీనివల్ల పేదల కొనుగోలుశక్తి పెరుగుతుంది. అది దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. 'స్వలాభం' అనే మాటను పక్కనపెట్టి తోటివారికి సహాయపడే తత్వం అలవ రచు కోవాలి. అందులో ఎంతో తృప్తి లభిస్తుంది. సేవ చేయడం జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి' అని సూచించారు. నేటి తరానికి రెండు నిమిషాలు మొబైల్ ఫోన్ చేతిలో లేకుంటే ఏదో కోల్పోయిన భావన కలుగుతోందని, టెక్నాలజీని ఎంతవరకు ఉపయోగించుకోవాలో తెలియకపోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. ఏదైనా మనకు సౌకర్యంగా ఉన్నంత వరకే ఉపయోగించుకోవాలని, దానికి బానిసగా మారకూడదని హితవు పలికారు. మనిషి తను ఏమి కావాలని కోరుకుంటున్నాడో...తనకు తాను ప్రశ్నించుకోవాలన్నారు. దీనికి కొంత ఏకాంత సమయం కావాలని, ఆ తీరికను ప్రతి ఒక్కరూ కల్పించుకోవాలని కోరారు. మనతో మనం మాట్లాడుకోకపోతే.. జీవితంలో పైకి రావడం సాధ్యం కాదన్నారు. ఏ పని చేసినా ఆత్మవిశ్వాసంతో చేయాలని, వ్యవస్థను విశ్వసించాలని, అప్పుడు మంచి ఫలితాలు వస్తాయన్నారు. వాస్తవిక జీవితం (వర్చువల్ లైఫ్) నుంచి నిజమైన జీవితం (రియల్ లైఫ్)లోకి రావడానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నించాలన్నారు. శాంతి లేని సంపద వృథా అని వ్యాఖ్యానించారు. ఆధ్యాత్మిక భావన వల్ల శాంతి లభిస్తుందన్నారు. ఆరోగ్యంగా ఉండడమే పెద్ద సంపదని, అనారోగ్యానికి ఎక్కువగా వెచ్చించడం ఆర్థికంగా మంచిది కాదన్నారు.



విభజన తీరు బాధ కలిగించింది..

ఆంధ్రప్రదేశ్ విభజన తీరు చూసి తనకు చాలా బాధ కలిగిందని, అయితే సమర్థుడైన నాయకుడు చంద్రబాబు ముఖ్యమంత్రిగా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలతో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాన్ని చూసి సంతోషంగా ఉందని రవిశంకర్ పేర్కొన్నారు.

ఏప్రిల్‌లో పెళ్లా... ఖర్చంతా నాదే

- పేదలకు గురజాల ఎమ్మెల్యే ఆఫర్
- దళితతేజం-తెలుగుదేశంలో ప్రకటన



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 26 : గుంటూరు జిల్లా గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తన నియోజకవర్గ ప్రజలకు బంపర్ ఆఫర్ ప్రకటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జన్మదినం జరగనున్న ఏప్రిల్ నెలలో పెళ్లి చేసుకునే పేదలకు అన్నీ తన సొంత ఖర్చుతో ఉచితంగా అందిస్తానని ప్రకటించారు. సోమవారం దాచేపల్లిలో దళిత తేజం-తెలుగుదేశం కార్యక్రమంలో యరపతినేని ఈ ప్రకటన చేశారు. చాలామంది పేదలకు పిల్లల పెళ్లిళ్లు తలకు మించిన భారం అవుతున్నందున తాను ఈ నిర్ణయం తీసుకున్నానన్నారు. వధువు, వరుడు, వారి తల్లిదండ్రులకు అవసరమైన పెళ్లి వస్త్రాలతో పాటు, విందుకు సంబంధించిన సరుకులను, బంగారపు మంగళసూత్రాన్ని అందజేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా 24 గంటలు పనిచేస్తున్న చంద్రబాబునాయుడు స్ఫూర్తితో ఈ కార్యక్రమం తలపెట్టానన్నారు. కాగా, యరపతినేని నిర్ణయం పట్ల టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ అభినందనలు తెలిపారు. దళితతేజం-తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా దాచేపల్లిలోని 4 వేల మంది ఎస్సీలకు నూతన వస్త్రాలను యరపతినేని అందించడం హర్షణీయమన్నారు.

అమరావతి అభివృద్ధిలో మేము సైతం

సీఎం చంద్రబాబుతో సింగపూర్ బిజినెస్ సమాఖ్య

(విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

నవ్యాంధ్ర రాజధాని అమరావతి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నామని సింగపూర్ బిజినెస్ సమాఖ్య వెల్లడించింది. విశాఖ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సుకు సింగపూర్ వాణిజ్య మంత్రి ఈశ్వరన్ సోమవారం వచ్చారు. ఆయన వెంట సింగపూర్ బిజినెస్ సమాఖ్య ప్రతినిధులూ వచ్చారు. అమరావతి అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న అసెండాస్ వంటి సంస్థల ప్రతినిధులూ ఈ బృందంలో ఉన్నారు. ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరావతి నగర నమూనాను ఆసక్తిగా పరిశీలించారు. రాజధాని నిర్మాణం, అభివృద్ధిపై సీఎం చంద్రబాబుతో ఈ బృందం చర్చించింది. అమరావతిలో ఒక కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తున్నామని వివరించింది. సీడ్ క్యాపిటల్‌లో ఎగ్జిబిషన్, సెరిమోనియల్, గ్యాలరీ, కమ్యూనిటీ జోన్‌లుగా విడదీసి ఈ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తామని తెలిపింది. ఈ సెంటర్ ఐదెకరాల్లో విస్తరించి ఉంటుందని, ఇందులో భవిష్యత్తు సాంకేతికతను ఉపయోగిస్తామని వివరించింది. రూ.5000 కోట్ల విద్యుత్ ప్రాజెక్టును విశాఖలో ఏర్పాటు చేస్తామని స్టెరిలైట్ పవర్ బృందం వెల్లడించింది. ఈ ప్రాజెక్టులను కాంపిటీటివ్ బిడ్డింగ్ విధానం ద్వారా ఏర్పాటు చేస్తామని, వోల్టేజీ సమస్యలు ఎదురుకాబోవని వివరించింది. బిల్డ్, డిజైన్, కన్‌స్ట్రక్షన్, ఓన్స్, ఆపరేట్ విధానంలో పవర్ ట్రాన్స్‌మిషన్ అసెట్స్‌ను ఏర్పాటు చేస్తామని, రాష్ట్రంలో అమలు చేస్తున్న ఫైబర్ గ్రిడ్‌కు అవసరమైన ఆప్టికల్ ఫైబర్ టెక్నాలజీకి సహకరిస్తామని తెలిపింది. ప్రాజెక్టు నివేదికను అందజేస్తామని వివరించింది. ప్రఖ్యాత ఆధునిక ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీని ఫైబర్‌గ్రిడ్ ద్వారా అందిస్తామని తెలిపింది.

10లక్షల మందికి నైపుణ్య శిక్షణ

- ఉపాధి కల్పనకు శిక్షణ సంస్థలతోనే ఒప్పందం
- ప్రవాసాంధ్రులకు అరబ్ దేశాల్లో శిక్షణకు చర్యలు
- మంత్రి కొల్లు రవీంద్ర

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది లక్షల మంది యువతకు ఈ ఆర్థిక సంవత్సరంలో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు న్యాయ, యువజన, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. విశాఖ సీఐఐ సదస్సుకు హాజరైన ఆయన సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. గత ఏడాది రాష్ట్రంలో 123 నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాల ద్వారా 6.5 లక్షల మందికి శిక్షణ ఇచ్చామన్నారు. 390 డిగ్రీ కళాశాలలు, 290 ఇంజనీరింగ్ కళాశాలలు, 316 గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖ విద్యాలయాల్లో యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడమే కాకుండా, వారికి ప్లేస్‌మెంట్స్ ఇప్పించే బాధ్యత కూడా ప్రభుత్వం తీసుకుందని తెలిపారు. శిక్షణ ఇచ్చే సంస్థలతోనే కచ్చితంగా 70 శాతం మందికి ప్లేస్‌మెంట్స్ ఇవ్వాలని ఒప్పందం చేసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి వెల్డర్, ఫిట్టర్ వంటి సర్టిఫికెట్లతో అరబ్ దేశాలకు వెళ్తున్న వారు.. పని నైపుణ్యం లేక కూలీలుగా, పశువుల కాపర్లుగా పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. అలాంటివారికి అరబ్ దేశాల్లోని నైపుణ్య శిక్షణ సంస్థల్లో శిక్షణ ఇప్పించడానికి అంగీకారం కుదుర్చుకుంటున్నారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో ఆశించిన దానికంటే ఎక్కువ పెట్టుబడులు వచ్చాయని, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

పారదర్శకంగా 'ల్యాప్‌టాప్' టెండర్లు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు కావలసిన ల్యాప్‌టాప్‌ల కొనుగోలుకు నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో అవకతవకలు చోటుచేసుకోలేదని, ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరిగిందని ఆర్‌జీయూకేటీ పౌరసంబంధాల అధికారి ఎం.పి.నరసింహరాజు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీ ప్రాంగణాల విద్యార్థులకు అవసరమైన ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్ల టెండర్ల ఖరారు వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. టెండర్లను ఈ- ప్రొక్యూర్‌మెంట్ విధానంలో పిలిచినట్టు వివరణ ఇచ్చారు. ట్రిపుల్ ఐటీలోని కంప్యూటర్ విభాగ నిపుణులతో పాటు ఇతర విశ్వవిద్యాలయాల నిపుణులు, ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లోని నిపుణులతో కూడిన కమిటీ పర్యవేక్షణలో టెండర్ల ప్రక్రియ నిర్వహించామని తెలిపారు.

హామీల అమలులో జాప్యం!

జూనియర్ డాక్టర్ల అసహనం.. డీఎంఈతో మరోమారు చర్చలు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జూనియర్ డాక్టర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందని, డీఎంఈ(వైద్య విద్య డైరెక్టర్)తో జరిగిన చర్చల్లో ఈ విషయం స్పష్టంగా అర్థమైందని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ అన్నారు. డీఎంఈ హామీ ఇచ్చి రెండు వారాలవుతున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో సోమవారం డీఎంఈతో వారు మరోసారి భేటీ అయ్యారు. నాలుగు గంటల పాటు వీరిమధ్య చర్చలు జరిగాయి. మరోసారి 4 సమస్యలను డీఎంఈ ముందు ఉంచామని వెంకట్ తెలిపారు. హౌస్‌సర్జన్లు, పీజీలకు 15 శాతం పెంపు బకాయిలు రూ.32 కోట్లు ఇంకా క్లియర్ అవ్వలేదని, రెండు రోజుల్లో చేస్తామని డీఎంఈ చెప్పారన్నారు. ఎస్‌ఆర్‌ల బకాయిలను కూడా ఈనెల 28 లోగా క్లియర్ చేస్తామని చెప్పిన విషయాన్ని గుర్తుచేయగా, దీనిపై ఆర్థిక శాఖతో మాట్లాడతామని డీఎంఈ బదులిచ్చారన్నారు. ఇలా ప్రతి విషయానికి చూస్తాం, చేస్తామన్న సమాధానాలే వచ్చాయని తెలిపారు. డీఎంఈ సమాధానాలు సంతృప్తిగా లేవని, అయినా ప్రభుత్వానికి తాము గతంలో ఇచ్చిన గడువు మేరకు ఈనెల 28 వరకూ వేచి చూస్తామని, అప్పటికీ డిమాండ్లను పరిష్కరించకపోతే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

ఎమ్మెల్యే, ఎంపీల కేసుల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎంపీలు, ఎమ్మెల్యేలపై ఉన్న క్రిమినల్ కేసులపై సత్వరమే విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రంలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేయనున్నారు. విజయవాడలో జిల్లా సెషన్స్ జడ్జి కేడర్‌లో ప్రత్యేక కోర్టు ఏర్పాటుతో పాటు సిబ్బందిని మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చారు. జిల్లా జడ్జి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, సూపరింటెండెంట్ హెడ్‌క్లర్క్, సూపరింటెండెంట్ ట్రాన్సలేటర్, సీనియర్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్, జూనియర్ అసిస్టెంట్లు 5, టైపిస్టులు 2, ఫీల్డ్ అసిస్టెంట్లు 3, తదితర సిబ్బందిని నియమిస్తూ న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది

'టెట్'కు 90.20% మంది హాజరు

అమరావతి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)కు ఆరో రోజైన సోమవారం 90.20 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు సెషన్లలో కలిపి మొత్తం 51,058 మంది అభ్యర్థులకుగాను 46,056 మంది హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో పేపర్-2(సోషల్)కు 28,636 మందికిగాను 25,706 (89.77%) మంది, మధ్యాహ్నం సెషన్‌లో పేపర్-2 (సోషల్)కు 22,422 మందికిగాను 20,350 (90.76%) మంది హాజరయ్యారని ఏపీటెట్-2018 కన్వీనర్ ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థినులపై వేధింపులు ఇద్దరు టీచర్ల అరెస్టు

ఒంగోలు క్రైం, ఫిబ్రవరి 26: ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఓ పాఠశాలలో బాలికలను వేధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులను అరెస్టు చేసినట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. 3నెలలుగా ప్రధానోపాధ్యాయుడు కొలసాని సాయిశ్రీధర్, పీఈటీ చక్కా రామకృష్ణారావులు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఓ విద్యార్థిని ఈ మేరకు ఫిర్యాదు చేయడంతో వారిద్దరిపై కేసు నమోదు చేసి విచారణ చేయించినట్టు తెలిపారు. విచారణలో ఉపాధ్యాయుల ప్రవర్తనను విద్యార్థినులు ఏకరువుపెట్టి తాము అనుభవిస్తున్న వేదనను వివరించారన్నారు. దీంతో వారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు.

కరువు మండలాల్లో అదనపు 'ఉపాధి'

అమరావతి, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో కూలీలు వలసలు వెళ్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని కరువు మండలాల్లో ఉపాధి పథకం కింద కూలీలకు అదనపు పనిదినాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం, నెల్లూరు, కడప, అనంతపురం, విజయనగరం జిల్లాల్లో ఉపాధి పనులకెళ్లే ఒక్కో కుటుంబానికి ప్రస్తుతం కల్పిస్తున్న 100 రోజుల పాటు మరో 50 పని దినాలు కల్పిస్తారు.

మల్లన్నసేవలో జస్టిస్ అభయ్



శ్రీశైలం, ఫిబ్రవరి 26: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం విచ్చేశారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని రుద్రాభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో సంప్రదాయబద్ధంగా వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయాధికారులు న్యాయమూర్తి దంపతులకు స్వామిఅమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

ఏఎన్‌యూ పీజీ సెట్ నోటిఫికేషన్ జారీ

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 26 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నోటిఫికేషన్ సోమవారం జారీ అయింది. నోటిఫికేషన్‌కు సంబంధించిన బ్రోచర్‌ను వర్సిటీ వీసీ ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల కంటే ముందస్తుగా నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తును చేసుకోవచ్చన్నారు.

ఒక చరిత్ర... ఒక విషాదం

కొందరు అంతే... కాలానికీ, తరాలకూ అతీతంగా ఆకర్షణ మంత్రం వేసేస్తారు. తెలియని ఆత్మీయబంధం పెనవేసుకుంటారు. బహుభాషా నటి శ్రీదేవి అలాంటి ఉదాహరణే. ఈ అభినయ తారక అకస్మాత్తుగా కనుమరుగైపోయిందంటే, కోట్లాది జనం విషాదంలో మునిగిపోయిందీ అందుకే. బహుశా, ఒక సినిమా నటి మరణాన్ని భాషలు, ప్రాంతాలకు అతీతంగా దేశమంతా ఓ తీరని విషాదంగా జరుపుకొన్న సందర్భం ఇటీవలి కాలంలో ఇదొక్కటేనేమో! నాలుగో ఏట మొదలుపెట్టి యాభై నాలుగో ఏట కన్నుమూసే వరకు యాభై ఏళ్ళ పాటు కుటుంబాన్నే ప్రేమించి, నటననే శ్వాసించిన అమ్మాయి...అందంతో కట్టిపడేస్తూనే, అభినయంతో మనసుపై చెరగని ముద్ర వేసిన అమ్మాయి... అడుగుపెట్టిన ప్రతిచోటా అందలం ఎక్కిన అమ్మాయి... నటనలో, పారితోషికంలో టాప్ హీరోలకు దీటుగా నిలిచిన అమ్మాయి... హిందీ చిత్రసీమలో ఇంత ఘనత సాధించిన తొలి స్టార్ హీరోయిన్ అనిపించుకున్న అమ్మాయి ఒక్క శ్రీదేవి! ఇన్నీ సాధించిన తెలుగమ్మాయి ఒక్క శ్రీదేవే!


బాలనటులుగా మొదలై ఇంతటి శిఖరస్థాయికి చేరినవాళ్ళు, అయిదు దశాబ్దాలుగా నటనలోనే ఉన్నవాళ్ళు సమకాలీన దక్షిణ భారత సినీ చరిత్రలో కమలహాసన్, శ్రీదేవి ఇద్దరే కనిపిస్తారు. శ్రీదేవి, కమలహాసన్, రజనీకాంత్‌లు ముగ్గురూ ఒకే కాలఘట్టంలో ఎదిగి, దక్షిణాపథాన వెలిగిన వైనం ఒక యాదృచ్ఛిక విచిత్రం. అందులోనూ, అయిదు దశాబ్దాల కెరీర్... మూడొందల దాకా సినిమాలు... అందులో తొంభై శాతం సినిమాల్లో హీరోయిన్‌గానే చిత్రసీమను ఏలడం మాత్రం శ్రీదేవి మాత్రమే సృష్టించిన చరిత్ర. ఆమెను తొలినాళ్ళలో తీర్చిదిద్దింది బాలచందర్, భారతీరాజా, మహేంద్ర లాంటి తమిళులైనా, ఆమెను జనసామాన్యానికి దగ్గర చేసి, ముందుగా స్టార్‌ను చేసింది మన దాసరి, రాఘవేంద్రరావు, బాపయ్య లాంటి తెలుగువాళ్ళు, తెలుగు చిత్రసీమే. ఆమె కెరీర్‌లో అధిక సంఖ్యాక చిత్రాలూ తెలుగే. మనుమరాలిగా మొదలుపెట్టి అదే హీరో సరసన హీరోయినైనా, మూడు తరాల నటులతో హీరోయిన్‌గా నర్తించినా అది ఒక్క శ్రీదేవికే చెల్లింది. అందుకే, దక్షిణాదిలో ఆమె సినీ విజయప్రస్థానం, 1983 నుంచి హిందీ రంగంలో గ్లామర్ తారగా ఒక దశాబ్దాన్ని ఆమె ఏలిన వైనం ఎప్పటికీ ఓ ఆశ్చర్యమే. అంత అందాల బొమ్మా నిపుణులైన దర్శకుల చేతిలో పడ్డప్పుడల్లా అభినయ విశ్వరూపిణిగా మారడం అప్పటి 'వసంత కోకిల', 'ఆకలిరాజ్యం' 'మిస్టర్ ఇండియా' నుంచి ఇప్పటి 'ఇంగ్లిష్ వింగ్లిష్' దాకా చూడవచ్చు. మరికొన్నాళ్ళుంటే ఆరేళ్ళక్రితం మొదలైన ఆమె రెండో ఇన్నింగ్స్ మరెన్ని అభినయ దీపాలు వెలిగించేదో!

తమిళంతో మొదలుపెట్టి, తెలుగులోనూ బాలనటిగా పేరు తెచ్చుకొని, టీనేజ్‌లో అడుగు పెట్టీపెట్టక ముందే హీరోయిన్ అయిన శ్రీదేవికి బాహ్య ప్రపంచం తెలిసింది తక్కువ. రోజుకు రెండు, మూడు షిఫ్టులతో, ఒక షూటింగ్ నుంచి మరో షూటింగ్‌కి ప్రయాణంలో, సెట్స్ మీదే వేషాలతో ఆమె టీనేజ్, యూత్ అంతా గడిచిపోయింది. సినీ రంగంతో ఇంతగా మమేకమైపోయిన ఆమె ఎప్పుడూ తోటి నటులతో రాసుకు పూసుకు తిరిగేవారు కాదు. సహజంగా ఉన్న సిగ్గు, బిడియాలకు తోడు చిన్నప్పటి నుంచి జీవితంలో తగిలిన ఎదురుదెబ్బలు, కష్టపడి పైకొచ్చిన విధానం, తల్లి నేర్పిన క్రమశిక్షణతో శ్రీదేవి తనకు తానే ఓ పెట్టని గోడను కట్టుకున్నారనుకోవచ్చు. సినీ రంగంలో ఆమెకు స్నేహితులే తప్ప సన్నిహితులు చాలా కొద్దిమందే కనిపిస్తారు. ఎదురైన అందరినీ గౌరవంగా చూస్తూ, చిరునవ్వుతో పలకరిస్తూనే దూరంగా ఉంచడం, వివాదాలకు దూరంగా ఉండడం ఈ అందాల రాశి అలవరచుకున్న విద్య. సహజమైన ప్రతిభకు క్రమశిక్షణ, అంకితభావం తోడైతే, ఎంచుకున్న రంగంలో ఎంత దూరం వెళ్ళవచ్చో శ్రీదేవి సినీ ప్రయాణం చెబుతుంది. అదే సమయంలో జీవితంలో ఉండే అభద్రతకూ ఆమే ఓ చిహ్నంగా కనిపిస్తారు. కెరీర్‌లో పైపైకి చేరాలనే ఆకాంక్ష, వ్యక్తిగత జీవితంలో కోరుకున్న స్థిరత్వం మధ్య సంఘర్షణలో చిక్కుకున్న మహిళగా అనిపిస్తారు. నటి కావాలనుకొని కాలేకపోయిన కన్నతల్లి చూపిన మార్గంలోనే వెళుతూ, ఏడో తరగతి సగంలోనే ఆపేశారామె. కానీ, చదువుకు మించిన సంస్కారం, ఒద్దిక, పెద్దల మీద గౌరవం శ్రీదేవిని జీవితాంతం పైపైకి తీసుకెళ్ళిన సహజ ఆభరణాలు. అదే సమయంలో ఎప్పుడూ అందంగా కనిపించాలి, ఏ రంగంలోనైనా అగ్రస్థానంలోనే ఉండాలనే తాపత్రయం శ్రీదేవిని ఆమెకు ఇష్టమైన చాలా వాటికి దూరం పెట్టాయి. కెరీర్ మొదటి నుంచీ నోరు కట్టేసుకొని ఉండడం, ఎప్పటికప్పుడు పెరుగుతున్న వయసును కనిపించనివ్వకూడదంటూ శత విధాల ప్రయత్నం కూడా సెలబ్రిటీ జీవితంలోని మరో విషాద పార్శ్వం. అలా శ్రీదేవి జీవితం నుంచి ఈ తరం నేర్చుకోవాల్సినవి కొన్ని! నేర్చుకోకూడనివీ కొన్ని!

లక్ష్యం కోసం కట్టుబడి, దారి తప్పకుండా, స్వయంకృషితో భారతీయ చిత్ర పరిశ్రమలో మరెవ్వరూ చేరని, చేరలేని స్థానాన్ని అందుకున్న జీవితసాఫల్యం శ్రీదేవిదే. అయితే, వ్యక్తిగతంగా సినిమాతో పాటు కుటుంబాన్నీ అంతే ప్రేమించిన ఈ సెలబ్రిటీ, వైవాహిక జీవితం కన్నా మాతృత్వాన్నే ఎక్కువ ఆస్వాదించినట్లు కనబడిన ఈ స్త్రీమూర్తి సాధారణమైన ఓ కన్నతల్లిగా తానూ తన పిల్లలు జాన్వి, ఖుషీని సినీరంగంలో పైకి తీసుకురావాలనుకున్నారు. అయితే, ఆ కన్నతల్లి కలలో తొలి అడుగు పడేలోగానే ఆ అమ్మ గుండె ఆగిపోవడం విషాదం. బ్రెయిన్ ఆపరేషన్‌లోని పొరపాటుతో కన్నతల్లి మరణంలానే, ఇవాళ శ్రీదేవి మరణం కూడా అనేక ప్రశ్నలకు తావివ్వడం మరో విషాదం. చిన్ననాటే ప్రయాణం మొదలుపెట్టి, చేరవలసిన ఎత్తులన్నీ చేరి, సాపేక్షంగా చిన్న వయసులోనే జీవితాన్ని ముగించారామె. అందం, ఆకర్షణ, అభినయంతో పాటు ఇలాంటి ఎన్నో కారణాలు శ్రీదేవిని మరికొన్ని తరాల పాటు మర్చిపోనివ్వవు.

నవ్యాంధ్ర ఆత్మవిశ్వాసం

అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ఎన్నడూ విఫలం కాలేదు. నవ్యాంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి దేశంలో మూడో అగ్రగామి రాష్ట్రంగా, 2029 నాటికి దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా రూపొందించాలన్నదే చంద్రబాబు సంకల్పం.



సాధారణమైన జీవితాన్ని గడుపుతూ అసాధారణమైన ఆలోచనలు చేస్తూ దేశానికే ఆదర్శ నాయకుడిగా నిలిచిన మహాత్మా గాంధీజీ ఆశయాలను ఆలంబనగా చేసుకొని ప్రజల్లో నుంచి పుట్టుకొచ్చిన అరుదైన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు. ఆంధ్ర రాష్ట్ర ప్రాశస్త్యాన్ని, తెలుగు వాడి ప్రాముఖ్యాన్ని నలు దిక్కులా వ్యాపింపజేసిన ఏకైక నాయకుడు చంద్రబాబు నాయుడు. ఆయన రాజకీయాల్లో ప్రవేశించి 2018 ఫిబ్రవరి 27 నాటికి 40ఏళ్ళు పూర్తవుతుంది. ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో అత్యంత ఎక్కువ కాలం ముఖ్యమంత్రిగా పని చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకి దక్కుతుంది. దేశంలోని ఇప్పటి ముఖ్యమంత్రుల్లో అగ్రగణ్యుడు. ఇంతటి పరిపాలన అనుభవం ఉన్న వారెవ్వరూ లేరు. దేశ సమస్యలను సైతం తన అనుభవంతో, విషయ పరిజ్ఞానంతో పరిష్కరించిన రాజనీతిజ్ఞుడు. ఆర్థిక సంస్కరణలను పూర్తిగా ఒంట బట్టించుకున్న అతి కొద్ది మంది ఆర్థిక, రాజకీయ వేత్తలలో ఆయన ఒక్కరన్నది నిర్వివాదాంశం.

నాయకుడికి నిలువెత్తు రూపం చంద్రబాబు నాయుడు. ప్రపంచం మొత్తం సాంకేతికత ఇరుసు మీదే సాగుతుందని 90వ దశకంలలోనే గ్రహించి విజన్ 2020ని ఆవిష్కరించి దేశంలోని ముఖ్యమంత్రులందరికీ ఆదర్శంగా నిలిచారు. సమగ్రమైన అవగాహనతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ముందు చూపుతో పనిచేసే చంద్రబాబు వ్యక్తిత్వం ఎందరికో స్ఫూర్తిదాయకం. ఆదర్శాలు వల్లించడం కాదు ఆచరించడమే నా నైజం అంటూ ముందుకు సాగుతున్న ప్రజల మనిషి. ఆయనకు పనే దైవం, ప్రజా శ్రేయస్సే ముఖ్యం. అందుకే ఆరుపదుల వయస్సును సైతం లెక్కచేయకుండా పనులను పరుగులు తీయిస్తుంటారు. ఏ పని చేసినా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా, దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాల దృష్టితోనే చేస్తారు.

సాధారణ మధ్యతరగతి రైతు కుటుంబం నుంచి వచ్చిన చంద్రబాబు ముఖ్యమంత్రిగా, జాతీయ రాజకీయాలను శాసించే స్థాయి నేతగా ఎదిగే క్రమంలో ఎన్నో ఒడుదుడుకులు, ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని అందిపుచ్చుకోవడంలో ఆయన విఫలం కాలేదు. బిఎ చదువుతుండగానే 'వినాయకసంఘం' పేరుతో సామాజికాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఐదున్నర కిలోమీటర్ల మేర నారావారిపల్లె నుండి భీమవరానికి శ్రమదానంతో రోడ్డు నిర్మించారు. వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదువుతున్న దశలోనే ఆయన క్రియాశీల రాజకీయాలలో అడుగుపెట్టారు. 1977లో దివిసీమ ఉప్పెన సందర్భంగా చంద్రబాబు నాయకత్వంలో చేపట్టిన సహాయక చర్యలు ఆయనలోని సామాజిక సేవాభిలాషకు, మానవత్వానికి, నాయకత్వ పటిమను చాటిచెప్పాయి.

1978లో చంద్రగిరి నియోజక వర్గం నుంచి ఆయన విజయం సాధించారు. 1980లో పురావస్తుశాఖ, సినిమాటోగ్రఫీ, సాంకేతిక విద్య, పశుసంరక్షణ, పాడి పరిశ్రమాభివృద్ధి శాఖల మంత్రిగా సమర్థంగా బాధ్యతలను నిర్వహించారు. చంద్రబాబు తెలివితేటలు, వినయ విధేయతలు, శక్తి సామర్థ్యాలు ఎన్టీఆర్‌ను అమితంగా ఆకట్టుకున్నాయి. ఎన్టీఆర్ కోరికపై చంద్రబాబు 1983 చివరలో తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడ్నుంచి ఆయన రాజకీయ జీవితంలో మరో అధ్యాయం ప్రారంభమయ్యింది. 1984లో ఎన్టీఆర్ గుండె చికిత్స కోసం అమెరికాకు వెళ్లినప్పుడు నాదెండ్ల భాస్కరరావు కాంగ్రెస్‌తో చేతులు కలిపి కొంత మంది శాసనసభ్యులను తనవైపు తిప్పుకొని అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకొన్నారు. ఈ ఉపద్రవాన్ని తిప్పికొట్టడానికి చంద్రబాబు రంగ ప్రవేశం చేశారు. ఈ సంక్షోభంలో చంద్రబాబు నిర్వహించిన పాత్ర అమోఘం. 1989లో ప్రతిపక్ష నాయకుడు ఎన్టీఆర్ అసెంబ్లీని బహిష్కరించగా ఐదు సంవత్సరాల పాటు అసెంబ్లీలో చంద్రబాబు నిర్వహించిన పాత్ర అసాధారణమైనది. 1994లో అధికారంలోకి రావటానికి చంద్రబాబు పాత్రే ప్రధానమైనది. 160 మంది ఎమ్మెల్యేలు ఎన్టీఆర్‌పై అవిశ్వాసం ప్రకటించడంతో ఆయన స్థానంలో చంద్రబాబు నాయుడు 1995 సెప్టెంబర్ 1న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. దశాబ్దాల తరబడి కార్యాలయాలకు పరిమితమైన ప్రభుత్వ ఉద్యోగులను ప్రజల వద్దకు పంపి ప్రజల వద్దకే పాలనను 1995 నవంబర్ 1న ప్రారంభించారు. తెలుగువారి ఆత్మగౌరవ చిహ్నం ఎన్టీఆర్ కాగా.. తెలుగువారి ఆత్మవిశ్వాస ప్రతీకగా చంద్రబాబు నాయుడు నిలిచారు. ఆర్థిక అసమానతలు లేని ఆరోగ్యకరమైన, ఆనంద దాయకమైన అభ్యుదయాంధ్రప్రదేశ్ నిర్మాణమే కర్తవ్యంగా ఎంచుకొని 1997 జనవరి 1న జన్మభూమి కార్యక్రమాన్ని రూపొందించారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన దగ్గరనుంచి పార్టీ అధినేతగా, ముఖ్యమంత్రిగా విశేష కృషి చేశారు.

అనేక సంక్షేమ పథకాలను చంద్రబాబు రూపొందించి అమలు చేశారు. సాంకేతికాభివృద్ధిని అర్థం చేసుకొని 1998లో హైటెక్ సిటీని ప్రారంభించి, అనతి కాలంలోనే ఐటి రంగంలో అగ్రగామిగా నిలబెట్టి ఆంధ్రప్రదేశ్‌కు ప్రపంచ స్థాయిలో గుర్తింపును తెచ్చారు. హైదరాబాద్ హైటెక్‌సిటి ఒక అంతర్జాతీయ సంచలనం. రాష్ట్ర ప్రజల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన వాతావరణంలో సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే సదాశయంతో 1998 సెప్టెంబర్ 10న 'పచ్చదనం–పరిశుభ్రత' కార్యక్రమంలో దాదాపు 9.36 కోట్ల మొక్కలు నాటారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు చేసారు. బీసీలకు 33% స్థానిక సంస్థల రిజర్వేషన్లు చిత్తశుద్ధితో చేపట్టారు. అందుకే తిరుగులేని మెజార్టీతో రెండవసారి అధికారంలోకి వచ్చారు. రాజకీయ రంగంలో చంద్రబాబుకు అపరచాణక్యుడు అని పేరుంది. ఆనాటి నేషనల్ ఫ్రంట్ వెనుక చంద్రబాబు పాత్ర కీలకం. రెండుసార్లు ప్రధానమంత్రుల నియామకంలో ప్రధాన పాత్ర పోషించారు. రాష్ట్రపతిగా అబ్దుల్ కలాం నియామకంలోనూ ముఖ్య భూమిక వహించారు. ఫ్రంట్ తరపున ప్రధాని పదవిని స్వీకరించమని రెండుసార్లు అభ్యర్థనలు వచ్చినా ఆయన సమ్మతించలేదు. తన కార్యస్థానం రాష్ట్రమేనని స్పష్టంగా చెప్పి ప్రతిపాదనను తోసిపుచ్చారు.

1999 ఎన్నికల్లో విజయం సాధించి ముఖ్యమంత్రిగా రెండవ సారి ప్రమాణస్వీకారం చేశారు. 2000 ఏప్రిల్–అక్టోబర్ మధ్య నీరు–మీరు కార్యక్రమాన్ని మొదలు పెట్టి భూగర్భ నీటి మట్టం పెంపుదలకు పాటుపడ్డారు. రైతు బజార్ల ఆవిర్భావం రాష్ట్ర చరిత్రలోనే ఒక నూతన అధ్యాయం. 2003 అక్టోబర్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు వెళ్తుండగా అలిపిరి వద్ద ఆయనపై హత్యా ప్రయత్నం జరిగింది. పీపుల్స్ వార్ నక్సలైట్లు మందుపాతరలు పేల్చారు. ఆయన ప్రాణాపాయం నుంచి తప్పించుకొని మృత్యుంజయుడు అయ్యారు. 1995–2004 మధ్య రాష్ట్ర ,జాతీయ రాజకీయాలలో ఒక వెలుగు వెలిగారు. 2004 ఎన్నికల్లో ఓటమి చెందినా 2009లో మళ్ళీ అధికారంలోకి రాలేకపోయినా ఆత్మస్థైర్యం కోల్పోకుండా నాయకుల్లో, కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపుతూ అనేక సమస్యలపై గల్లీ నుండి ఢిల్లీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్ర ప్రభుత్వం వరకు అలుపెరగని పోరాటం చేశారు. అన్నదాత కోసం నిరాహారదీక్ష చేపట్టి 8రోజులపాటు అన్నం మానేసిన నాయకుడు చంద్రబాబు. ప్రజాసమస్యలు తెలుసుకోవడం కోసం 208రోజులు 2,817 కి.మీ ప్రజల కోసం పాదయాత్ర చేశారు.

రాష్ట్ర విభజనతో తెలుగుజాతి ప్రభావం జాతీయ స్థాయిలో తగ్గింది. మళ్ళీ తెలుగుజాతికి పూర్వవైభవం తీసుకొచ్చే నాయకుడు ఎవరంటే ఆంధ్రా ప్రజలకు మొదట గుర్తుకొచ్చింది చంద్రబాబునాయుడే. అదే నమ్మకంతో 2014 ఎన్నికలలో పార్టీకి పట్టం కట్టారు. మూడోసారి ముఖ్యమంత్రిగా 2014 జూన్ 8న ప్రమాణస్వీకారం చేశారు. ఎన్టీఆర్ ఆత్మగౌరవం కోసం పోరాడితే చంద్రబాబు పారదర్శక పాలన ద్వారా ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింపజేశారు. ప్రమాణ స్వీకారం చేసే రోజునే 5 సంతకాలు చేసి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారు. ప్రజాభీష్టం మేరకు ప్రజా రాజధానిగా అమరావతిని ప్రకటించారు. రైతులు చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో 32వేల ఎకరాల భూములను రాజధాని నిర్మాణంకోసం ఇచ్చారు. ఇది ప్రపంచంలో ఒక రికార్డు. మన రాష్ట్రాన్ని మన ప్రాంతం నుంచే పాలించుకోవాలనే ఉద్దేశంతో రికార్డు సమయంలో తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలను నిర్మించారు. పెండింగ్ ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ వస్తున్నారు. బడ్జెట్‌లో అధిక నిధులను ప్రాజెక్టులకే ఖర్చు చేస్తున్నారు.

ఆంధ్ర రాష్ట్ర ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2019 నాటికి పూర్తి చేసే విధంగా అడుగులు వేస్తున్నారు. 13 జిల్లాల నవ్యాంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు నడుం బిగించారు. లోటు బడ్జెట్‌లో ఉన్నా కూడా రెండెంకెల వృద్ధి రేటును సాధించగలిగారు. దేశ, విదేశాలు పర్యటించి ప్రపంచ దృష్టిని మన వైపు మరల్చగల్గటంలో సఫలీకృతులయ్యారు. చంద్రబాబు నాయుడు కృషి వల్లే ప్రపంచంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మకమైన కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయి. అనుబంధ రంగాలలో 22% వృద్ధి సాధించి, నదుల అనుసంధానం చేసిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ పెట్టారు. బీసీలకు ప్రత్యేకంగా సబ్‌ప్లాన్ తీసుకొచ్చారు. నవ్యాంధ్రప్రదేశ్‌ను 2022 నాటికి దేశంలో మూడో అగ్రగామి రాష్ట్రంగా 2029 నాటికి దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా, 2050 నాటికి ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా రూపొందించాలన్నదే చంద్రబాబు సంకల్పం. పేదరికంలేని సమాజం కోసం నిరంతర కృషిని మార్గంగా ఎంచుకొని ఎన్నో అవరోధాలు, ఒడిదుడుకులు ఎదురైనా అకుంఠిత దీక్షతో అనుక్షణం ప్రజాసేవకే అంకితమైన ఆదర్శ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.

■ టి.డి. జనార్దన్
శాసన మండలి సభ్యులు

'పంజాబ్' పాఠాలు



భరతవాక్యం

■ భరత్ ఝున్‌ఝున్‌వాలా

పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంలాంటివి పునరావృతంకాకుండా చేసేందుకు ప్రభుత్వం రెండు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి. అవి: ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ; ప్రభుత్వోద్యోగులు తమ విధులను సామాజిక జవాబుదారీతనంతో నిర్వహించేలా చేయడం. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ తరహాలో 'ప్రభుత్వ అధికారుల' మూల్యాంకన సంస్థ నొకదాన్ని నెలకొల్పాలి.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) కుంభకోణం సూచిస్తున్నదేమిటి? ఉద్యోగివర్గపాలనను సమూలంగా ప్రక్షాళన చేయవల్సిన అవసరాన్నే కాదూ!? మరి ఈ ప్రక్షాళనకు తప్పనిసరిగా రెండు స్థాయిల్లో చర్యలు తీసుకోవల్సివుంటుంది. మొదటి చర్య ప్రభుత్వ పాత్రను తగ్గించి తీరాలి. వస్తువులను ఆర్థిక సిద్ధాంతం రెండు తరగతులుగా వర్గీకరిస్తుంది. ఒకటి– ప్రజోపయోగ వస్తువులు (పబ్లిక్ గూడ్స్– ప్రభుత్వం లేదా స్థానిక అధికార సంస్థలు ఏర్పాటు చేసిన వస్తువులు లేదా సేవలు). రెండు– వ్యక్తిగత (ప్రైవేట్) వస్తువులు. ప్రజోపయోగ వస్తువులను వ్యక్తులు తమ వ్యక్తిగత సామర్థ్యంతో పొందలేరు. ప్రభుత్వం మాత్రమే వీటిని సమకూర్చగలుగుతుంది. రోడ్లు, కరెన్సీ, రక్షణ, పోలీసు, న్యాయ సేవలు మొదలైనవి ప్రభుత్వాలు మాత్రమే సమకూర్చగలిగేవి. పరదేశం దాడి నుంచి ఒక పౌరుడు తన వ్యక్తిగత సామర్థ్యంతో రక్షణ సమకూర్చుకోలేడు కదా. సైన్యాన్ని నిర్మించడం, దాన్ని దేశసరిహద్దుల వెంబడి మొహరించడం ప్రభుత్వం మాత్రమే చేయవల్సిన పని. అలాగే కరెన్సీ నోట్లను ప్రభుత్వం మాత్రమే ముద్రించగలదు. వీటికి భిన్నంగా 'ప్రైవేట్' వస్తువులను ఒక వ్యక్తి తన వ్యక్తిగత సామర్థ్యంతో పొందగలుగుతాడు. విద్య, వైద్యం, గృహ వసతి, బ్యాంకింగ్ మొదలైనవి ఈ కోవలోకి వస్తాయి. ఒక వ్యక్తి తన గ్రామంలోని వడ్డీ వ్యాపారి నుంచి రుణాన్ని తీసుకోగలుగుతాడు.

గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలను విస్తరింపచేసే పేరిట ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయకరణ చేశారు. ఇది అనవసర చర్య. ప్రాధాన్యతారంగాలకు నిర్దిష్ట శాతంలో రుణాలు మంజూరు చేసేలా ప్రైవేట్ బ్యాంకులను రిజర్వ్ బ్యాంకు నిర్దేశిస్తున్న విధంగానే ప్రైవేట్ బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలలో తమ శాఖలను ఏర్పాటు చేసేలా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంటే సరిపోయేది. అయితే ప్రైవేట్ బ్యాంకుల కార్యకలాపాలను క్రమబద్ధీకరించడంలో రిజర్వ్‌బ్యాంక్ విఫలమయింది. బ్యాంకుల జాతీయకరణ ద్వారా ఆ వైఫల్యాన్ని సరిదిద్దడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ప్రభుత్వరంగ బ్యాంకుల (పిఎస్బి) ఉద్యోగిస్వామ్య అరిష్టాన్ని సృష్టించడం జరిగింది. పెనం మీద నుంచి పొయ్యిలోకి దూకినట్లయింది! పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో చోటుచేసుకున్న కుంభకోణం లాంటి వాటిని నివారించడానికి తీసుకోవల్సిన మొదటి చర్య బ్యాంకింగ్ లాంటి వైయక్తిక వస్తువులను సమకూర్చే బాధ్యత నుంచి ప్రభుత్వం ఉపసంహరించుకోవడం. సంక్షేమ రాజ్య బాధ్యతలను ప్రభుత్వం త్యజించాలని చెప్పడంగా దీన్ని అర్థం చేసుకోవల్సిన అవసరం లేదు. సార్వత్రిక మౌలిక ఆదాయ పథకం, విద్యా వైద్య వోచర్లు, ప్రైవేట్ కంపెనీలకు ఉపాధి సబ్సిడీలు మొదలైన వాటి ద్వారా ప్రజలకు మరింత మెరుగ్గా సంక్షేమాన్ని సమకూర్చవచ్చు.

ఇక రెండో స్థాయి చర్య ప్రభుత్వోద్యోగుల సామాజిక జవాబుదారీతనాన్ని పెంపొందించడం. యూపీఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ద్వితీయ పరిపాలనా సంస్కరణల కమిషన్ ఇలా పేర్కొంది: 'ప్రజా జీవితంలో హేతుబద్ధంగా లేని ప్రోత్సాహకాల మూలంగా అవినీతిని తక్కువ రిస్క్‌తో అత్యంత లాభదాయక కార్యకలాపంగా పరిణమించింది. దీన్ని అరికట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. అత్యున్నత రాజ్యాంగ పదవీ బాధ్యతల నిర్వహణపై సామాజిక పర్యవేక్షణకు స్వతంత్ర, విశ్వసనీయ, సాధికారిక సంస్థలను నెలకొల్పాలి'. ఐదవ వేతన సంఘం కూడా ఇలాంటి సిఫారసునే చేయడం గమనార్హం. క్లాస్ 'ఎ' అధికారుల విధి నిర్వహణ తీరుతెన్నులను ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి ప్రభుత్వేతర సంస్థలచే మూల్యాంకనం చేయించాలని ఆ వేతన సంఘం సూచించింది. దురదృష్టవశాత్తు యూపీఏ ప్రభుత్వం గానీ ప్రధాని మోదీగానీ ఈ సిఫారసును పట్టించుకోనేలేదు. అవినీతికి పాల్పడిన ప్రభుత్వాధికారి ఎంత సీనియర్ అయినా సరే ఆతనిపై కఠిన చర్య తీసుకోగలనని మోదీ ఆచరణాత్మకంగా రుజువు చేశారు. సిబిఐ దర్యాప్తులో జోక్యం చేసుకున్నాడనే ఆరోపణపై హోం శాఖ కార్యదర్శి ఒకరిని వేరే శాఖకు బదిలీ చేయడం జరిగింది. మంచిదే. అయితే ఇదే సరిపోదు. వ్యవస్థాగత సంస్కరణలు ఎంతైనా అవసరం. సీనియర్ ప్రభుత్వాధికారుల పనితీరును ప్రజలచేత మూల్యాంకనం చేయించేందుకు మోదీ పూనుకోవాలి. ఐఐఎమ్‌లలో మా అధ్యాపకుల బోధనా సామర్థ్యాన్ని విద్యార్థులు మూల్యాంకనం చేస్తారు. ప్రభుత్వాధికారుల పని తీరును కూడా వారి సేవలను పొందే వినియోగదారులు మూల్యాంకనం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ తరహాలో 'ప్రభుత్వ అధికారుల' మూల్యాంకన సంస్థ నొకదాన్ని నెలకొల్పాలి. క్లాస్ 'ఎ' అధికారుల పనితీరును ఈ సంస్థ రహస్యంగా మూల్యాంకనం చేయాలి. సర్వేల నిర్వహణ, సేవల వినియోగదారులకు రహస్యంగా ప్రశ్నావళి పంపుట, అవినీతి అధికారులపై నిఘా మొదలైన చర్యలతో ఈ సంస్థ తన విధులు నిర్వహించాలి. ఉదాహరణకు విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారులు 1000 మందికి ఒక ప్రశ్నావళిని పంపి ఎక్జిక్యూటివ్, సూరింటెండింగ్ ఇంజనీర్ల పనితీరుపై వారి అభిప్రాయాలు తీసుకోవాలి. విధి నిర్వహణను సమర్థంగా, నిజాయితీగా చేయడం లేదని వినియోగదారులు అభిప్రాయపడిన అధికారులకు తప్పనిసరిగా ఉద్వాసన చెప్పాలి.

అవినీతి అధికారులను పట్టుకొనేందుకు రాజు ఒక పటిష్ఠ నిఘా వ్యవస్థనేర్పాటుచేయాలని కౌటిల్యుడు సూచించారు. గూఢచార వ్యవస్థపై గూఢచర్యం నెరపేందుకు కూడా ఒక ప్రత్యేక గూఢచార వ్యవస్థను నెలకొల్పాలని కూడా ఆ రాజనీతిజ్ఞుడు నిర్దేశించాడు. ప్రస్తుతమున్న అవినీతి నిరోధక దర్యాప్తు సంస్థలన్నీ ప్రతిస్పందనాత్మకమైనవే.

ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే అవి దర్యాప్తునకు దిగడం జరుగుతోంది. అలాకాక నిఘా వ్యవస్థ ముందుస్తు జాగ్రత్తతో వ్యవహరించాలి. ప్రతి ప్రభుత్వోద్యోగి అవినీతిపరుడే అని భావించి, వారి తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తుండాలి. నిజంగా అవినీతికి పాల్పడినవారిని ఏరివేసేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం లాంటివి పునరావృతంకాకుండా చేసేందుకు ప్రభుత్వం రెండు చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలి. అవి: ప్రభుత్వరంగ బ్యాంకుల ప్రైవేటీకరణ; ప్రభుత్వోద్యోగులు తమ విధులను సామాజిక జవాబుదారీతనంతో నిర్వహించేలా చేయడం. ■

శ్రేయోదాయక అభివృద్ధి దిశగా...!

మనదేశంలో ఇద్దరు ప్రసిద్ధ ఆర్థికవేత్తలున్నారు. మొదటివారు అమర్త్య సేన్. ఈయన ప్రమేయంతోనే మానవాభివృద్ధి సూచిక ప్రపంచంలో అమలులోకి వచ్చింది. కేవలం ఆర్థికవృద్ధితోనే అధిక సంఖ్యలోని పేదలకు పెద్దగా ప్రయోజనం చేకూరదని ఈ సూచిక సూచిస్తుంది. మానవాభివృద్ధి సూచిక ప్రకారం తలసరి ఆదాయంతోపాటు ప్రజల విద్య, అందుకు సంబంధించిన సాంకేతిక నైపుణ్యాలు కూడా పెరగాలి. ప్రజలు యెక్కువ సామర్థ్యంతో పనిచేయగలగాలి. అందుకు మంచి ఆరోగ్యం వుండాలి. అందుకని ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించడానికి అందరికీ అందుబాటులో వైద్య సదుపాయాలు కల్పించాలి. ప్రజల తలసరి ఆదాయం పెరుగుతుందంటే ఆర్థిక వృద్ధిరేటు పెరిగి ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తూ వుంటుంది. అందువల్ల ఎక్కువ మంది శ్రామికులకు లాభసాటి ఉద్యోగాలు దొరుకుతాయి. ఆ విధంగా ప్రజల శ్రేయస్సు పెరుగుతూ వుంటుంది. అయితే, అలా జరిగే ఆర్థికవృద్ధి సమ్మిళితమై వుండాలని సేన్‌గారు ఒక మెలిక పెట్టారు. అంటే ఆ వృద్ధి ప్రక్రియ శ్రామికులందర్నీ తనలో ఇముడ్చుకోవాలి. దీనినే సమ్మిళితమైన ఆర్థికవృద్ధిగా ఆయన వర్ణించారు. అలాకాక వృద్ధి పెట్టుబడి సాంద్రత (క్యాపిటల్ ఇంటెన్సివ్)తో కూడి వుంటే అధిక సాంకేతిక నైపుణ్యం కలిగిన కొద్దిమంది శ్రామికులకు మాత్రమే ఉద్యోగాలు కల్పించగలిగితే ఆ వృద్ధిని అసమ్మిళితంగా వర్ణిస్తారు. ఇటువంటి అసమ్మిళిత ఆర్థికవృద్ధి దేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టినప్పటి నుండి ఆచరించబడుతున్నది. దీనివల్ల ఎంతోమంది శ్రామికులు ఆర్థికవృద్ధి ప్రక్రియనుండి బయటకు గెంటివేయబడి దారిద్ర్యంలో మగ్గుతున్నారు. అందుకనే దీనిని 'ఉద్యోగంలేని, సంతోషంలేని' ఆర్థికవృద్ధి (జాయ్‌లెస్ అండ్ జాబ్‌లెస్ గ్రోత్) గా కొంతమంది ఆర్థికవేత్తలు పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితులు భారతదేశంలోనే కాదు ప్రపంచ దేశాలలో ప్రధానంగా అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, ఐరోపా ఖండ దేశాలలో అత్యధికంగా కనిపిస్తున్నాయి. ఇంకొక ఆర్థికవేత్త జగదీష్ భగవతి స్వేచ్ఛా వ్యాపార ప్రాముఖ్యత, ప్రపంచీకరణ ద్వారా అన్ని దేశాలు సమాంతరంగా అభివృద్ధి చెందడం జరుగుతుందని తన జీవిత కాలం ప్రబోధిస్తూనే వున్నారు. కానీ నేడు డోనాల్డ్ ట్రంప్ వంటివారు బోధించే అల్ట్రా జాతీయవాదం, ప్రాంతీయవాదం వల్ల ప్రపంచీకరణ తిరోముఖం పడుతున్నది. దీనివల్ల భారతదేశంలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నిరుద్యోగం యింకా పెరిగి ప్రజలు ఆర్థికంగా యెన్నో యిబ్బందులకు గురవుతారు. ఆటోమేషన్‌తో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పుట్టిన యీ సెక్యులర్ స్టాగ్నేషన్ ప్రపంచమంతా విస్తరించి సరైన విద్య, సాంకేతిక నైపుణ్యం లేని పేద దేశాల ప్రజల కష్టాలు మరింత యెక్కువగా పెరుగుతాయి. దీనిని సమర్థంగా యెదుర్కొనడానికి పేద దేశాల ప్రభుత్వాలు తమ ప్రజలకు చక్కటి సాంకేతిక నైపుణ్యాలు ఎక్కువగా కల్పించాలి. అంతేగాక శ్రామిక సాంద్రత ఎక్కువగా వున్న పరిశ్రమలను స్థాపించి ప్రజలందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి.

ఇక, సేన్ పేరుమీద ప్రచారం పొందిన కేరళ ఆర్థిక వృద్ధి నమూనాలో ప్రథమంగా ప్రజల సామర్థ్యాల (కేపబిలిటీస్)ను పెంచాలని చెప్పారు. అందుకు ప్రభుత్వాలు విద్య, సాంకేతిక నైపుణ్యాలు, ప్రజల ఆరోగ్యాన్ని పెంపొందించే వైద్య సౌకర్యాలపై యెక్కువగా పెట్టుబడి పెట్టాలి. అప్పుడు ప్రజలు మంచి ఆరోగ్యం, నైపుణ్యాలు కలిగి యేదో ఒక పనిచేసి సమర్థవంతంగా జీవించగలరు. ఇంకా పటిష్ఠ పంచాయితీరాజ్ వ్యవస్థలతో ప్రజలు రాజకీయంగా చైతన్యవంతులై సమర్థమైన ప్రభుత్వాన్ని యెన్నుకొని తమ నాయకుల ద్వారా ఆర్థిక అసమానతల్ని పారద్రోలి సంపద పంపిణీ న్యాయాన్ని పొందగలరని సేన్‌గారు అభిప్రాయపడ్డారు. అందుకు అనుగుణంగానే కేరళ రాష్ట్రంలో అధిక శాతం ప్రజలు సామ్యవాద భావాలు కలిగి వుండడం వల్ల ముందు చెప్పిన చాలా వాటిని సాధించగలిగారు. ప్రభుత్వం కూడా విద్య, ఆరోగ్యం, గ్రామీణ పరిపాలన, వ్యవసాయరంగంలో సహకార సంస్థలను యేర్పరచి రైతులకు మంచి గిట్టుబాటు ధరలు లభించేటట్లు చేసాయి. కేరళ ప్రజలు 100 శాతం అక్షరాస్యత సాధించగలిగారు. అభివృద్ధి చెందిన విద్యా వ్యవస్థ ద్వారా మంచి సాంకేతిక నైపుణ్యాలు, పొందగలిగారు. కానీ అలా అభివృద్ధి చెందిన మానవ వనరులకు మంచి ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలను స్థాపించుకోలేకపోయారు. దీనివల్ల ముందుగా సామాజిక రంగాలపై పెట్టుబడి పెట్టి మానవ వనరులను అభివృద్ధి చేసి, వారికి కావాల్సిన ఉద్యోగాలు కల్పించలేకపోతే దాని ఫలితం శూన్యమని తెలుస్తున్నది.



ముందుగా ఆర్థిక వృద్ధి ఎందుకు అవసరమో భగవతి తన గ్రంథం 'వై గ్రోత్ మేటర్స్?'లో వివరించారు. ముందు కొంత ఆర్థిక వృద్ధిని సాధించగలిగితే అప్పుడు పరిశ్రమలు విస్తరించి, అప్పటికే అభివృద్ధి చెందిన మానవ వనరులను వినియోగించుకొని పారిశ్రామిక రంగం విస్తరిస్తుంది. దీనివల్ల పెట్టుబడిదారుల లాభాలు పెరిగి అధికంగా వారు పన్నులు చెల్లించగలరు. అప్పుడు ప్రభుత్వాల ఆదాయాలు పెరిగి, అలా పెరిగిన ఆదాయాలను సామాజిక రంగాలపై పెట్టుబడి పెట్టడానికి అవకాశమేర్పడుతుందని ఆయన చెప్పారు. అప్పటికే గుజరాత్ రాష్ట్రంలో కొంత పారిశ్రామిక అభివృద్ధి జరిగి వున్నందున దానిని ఆదర్శంగా తీసుకొని దేశంలోని మిగతా రాష్ట్రాలు దానిని అనుసరిస్తే మంచి ఫలితాలు వస్తాయని ఆయన చెప్పారు. గుజరాత్ రాష్ట్రం పారిశ్రామికంగా చాలా అభివృద్ధిని సాధించిందని చెప్పడంలో సందేహంలేదు కానీ ఆ విధంగా పెరిగిన రాష్ట్ర ఆదాయ వనరులను తిరిగి సామాజిక రంగాలపై పెట్టుబడులుగా పెట్టలేదు. కేవలం పారిశ్రామికరంగ వృద్ధిపైనే దృష్టి పెట్టింది. ముఖ్యంగా వ్యవసాయరంగం, ప్రజలకు లాభసాటి ఉద్యోగాల కల్పన చాలా హీనదశలోకి దిగజారాయి. గుజరాత్ రాష్ట్ర సామాజిక రంగాల అభివృద్ధి సూచికలు అతిపేద రాష్ట్రమైన బీహార్ రాష్ట్ర సూచికలకన్నా వెనుకబడి వున్నాయని ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థికవేత్తల దృష్టి బీహార్ రాష్ట్ర ఆర్థిక వృద్ధి నమూనా వైపు మళ్ళింది. అక్కడ దీర్ఘకాలం నుండి ముఖ్యమంత్రిగా వున్న నితీశ్‌కుమార్ ముందుగా వ్యవసాయరంగంలో మౌలిక వసతులు కల్పించి ఆ రంగాన్ని పటిష్ఠపరిచారు. సమాంతరంగా మానవ వనరుల అభివృద్ధిపై, పారిశ్రామికరంగపై దృష్టిని కేంద్రీకరించడం జరిగింది. కానీ విదేశీ పెట్టుబడుల్ని పెద్దగా ఆకర్షించలేకపోతున్న నేపథ్యంలో, భారతీయ జనతాపార్టీతో జతకట్టడం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి పారిశ్రామిక పెట్టుబడుల్ని సాధించాలని ఆశిస్తున్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దాదాపుగా బీహార్ ఆర్థిక వృద్ధి నమూనాను అనుసరిస్తున్నారని చెప్పవచ్చు. చంద్రబాబు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విశ్వవిద్యాలయాలను రాష్ట్రంలో స్థాపించబూనుకున్నారు. ప్రజలకు సామాజిక భద్రత కల్పించే యెన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. తన దగ్గర మిగిలిన కొద్ది పైకంతో వ్యవసాయరంగంలో మౌలిక వసతులు, ప్రధానంగా నీటిపారుదల సౌకర్యాలను రాష్ట్రమంతటా కల్పించడానికి పూనుకున్నారు. పట్టిసీమ పథకం కింద కృష్ణాగోదావరి నదుల అనుసంధానం ప్రధాన ప్రయోగంగా చెప్పుకోవచ్చు. గోదావరినదికి వరదలొచ్చినప్పుడూ, వర్షాకాలంలోనూ నది నుండి 3000 టి.ఎమ్.సి.ల నీరు సముద్రంలో వృధాగా కలిసిపోతున్నది. ఆ కాలంలో గోదావరి నుండి పట్టిసీమకు ఎత్తిపోసిన నీరు 100 టి.ఎమ్.సి.లకు మించలేదు. ఈ నీటితో పశ్చిమగోదావరి జిల్లాలోని కొంత భాగం, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 13 లక్షల ఎకరాలకు పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా నీటిని అందించగలిగారు. ఈ సంవత్సరం అక్కడ పుష్కలంగా పంటలు పండాయి. ఆ ప్రాంతంలోని రైతాంగానికి యిది యెంతగానో మేలు చేసింది.

అసలు పోలవరం ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్ర నిధులతో నిర్మించాలి. ఇది చాలా కాలం పట్టవచ్చు. పోలవరం ప్రాజెక్టు ప్రధాన ప్రయోజనం నీటిపారుదల కల్పించడం. ఆ ప్రయోజనం కోసం అంత కాలం వేచి చూడకుండా రైతాంగానికి తక్షణం నీటివసతిని కల్పించే ప్రయోజనం పట్టిసీమ, పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకాల వల్ల ముందుగానే లభిస్తుంది. పురుషోత్తమపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విశాఖపట్నం వరకూ తీసుకొచ్చి యిక్కడివారి దాహార్తిని తీర్చవచ్చు. అంతేకాకుండా విశాఖపట్నానికి తీసుకొచ్చే నీటితో మధ్యలో వున్న లక్షల ఎకరాలకు సాగునీటిని అందించవచ్చు.

ఈ విధంగా చంద్రబాబు బీహార్ ఆర్థిక వృద్ధి నమూనాను అనుసరిస్తూ వ్యవసాయరంగంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రజల సంక్షేమం, విద్య, వైద్య సదుపాయాల్ని సామాజిక రంగాలకు విస్తరించి వృద్ధి చేస్తూ, తన వంతుగా ఆంధ్ర రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని కూడా విస్తరింపజేస్తున్నారు. ప్రభుత్వ రంగంలో కేంద్ర సాయంతో పరిశ్రమలను స్థాపించడం నేటి పరిస్థితులలో సాధ్యం కాకపోవచ్చు. అది గమనించిన చంద్రబాబు తన మేధస్సునూ, అపార అనుభవాల్నీ రంగరించి దేశదేశాలూ తిరిగి విదేశీ పరిశ్రమలను రాష్ట్రంలోకి ఆహ్వానిస్తున్నారు. దక్షిణ కొరియాకు చెందిన 'కియా' కార్ల పరిశ్రమను అనంతపూరు జిల్లాలో స్థాపింపచేయడం ఆయన శిగలో ఒక కలికితురాయి. ఇది కరువు పీడిత అనంతపూరు జిల్లా అభివృద్ధికి యెంతగానో తోడ్పడుతుందని చెప్పడంలో అతిశయోక్తిలేదు. ఆ విధంగా ప్రపంచ దేశాలు తిరిగి విదేశీ పరిశ్రమలనూ, పెట్టుబడులనూ ఆకర్షించడానికి అలుపెరుగని కృషి చేస్తున్నారు.


చంద్రబాబు తనను తాను ఆంధ్ర రాష్ట్రానికి సమర్పించుకున్నారని చెప్పవచ్చు. అలుపులేకుండా ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారు. ఒక విధంగా ఆయన ఒన్ మేన్ ఆర్మీ. ఈ కృషికి తగిన ప్రతిఫలం దక్కాలంటే ద్వితీయశ్రేణి నాయకత్వాన్ని కూడా సన్నద్ధుల్ని చేయాలి. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చెప్పినట్లు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, నాగపూర్‌లతో సహ దక్షిణాది రాష్ట్రాలలో 18 కోట్లకు మించిన తెలుగువారున్నారు. వీరిలో ఎంతోమంది సంపన్నులు కూడా వున్నారు. వీరందరూ ఆంధ్రుల సాంస్కృతిక రాజధాని అమరావతి నిర్మాణానికి తమవంతు కృషి చేయాలి. చంద్రబాబు దీర్ఘకాలం అధికారంలో కొనసాగితే హైదరాబాద్ వంటి నగరాలను ఆంధ్ర రాష్ట్రంలో అనేకం నిర్మించగలరు. విశాఖపట్టణాన్ని ఒక సిలికాన్ వ్యాలీగా మారుస్తారు. అమరావతిని సకల విద్యలకు కాణాచిగా తీర్చిదిద్దుతారు. శ్రీసిటీని ఒక పారిశ్రామిక హబ్‌గా చేస్తారు. అనంతపూరుని అమెరికాలోని డిట్రాయిట్‌లాగ ఆటోమొబైల్ ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధిపరచగలరు. అయితే, ఆయన ప్రణాళికలకు తగిన ఆర్థిక వనరులు ఆయన వద్ద లేవు. అటువంటి ప్రణాళికలను తన వనరులకు అనుగుణంగా తిరిగి రాయడంలో కొంత కాలయాపన జరిగి వుండవచ్చు. అందుకని ఆయన కృషిని తప్పుబట్టలేం. ఏ ప్రభుత్వ వ్యయానికైనా ప్రధానంగా రెండు రంగాలు పట్టుకొమ్మలుగా వుంటాయి. ఒకటి సామాజిక రంగాల అభివృద్ధికి వ్యయం చేయడం. రెండవది పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధిపరచడం. ఈ రెండూ ఒకదానికొకటి విరుద్ధమైనవిగా కాక, ఒకదానిపై ఒకటి పరస్పరం ఆధారపడి వుంటాయి. సామాజిక సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధిలో.. ఏ ఒక్కదాన్నో సాధించినంత మాత్రాన ఆర్థికాభివృద్ధిని సంపూర్ణంగా సాధించలేం. రెండు రంగాలూ మిళితమై ముందుకు సాగాలి. అందుకే కేరళ వృద్ధి నమూనా, గుజరాత్ వృద్ధి నమూనాలను తోసిరాజని బీహార్ రాష్ట్ర ఆర్థిక వృద్ధి నమూనా ఈనాడు అన్ని రాష్ట్రాలకు ఆదర్శవంతమయ్యింది.

సామాజిక సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధిలో.. ఏ ఒక్కదాన్నో సాధించినంత మాత్రాన ఆర్థికాభివృద్ధిని సంపూర్ణంగా సాధించలేం. రెండు రంగాలూ మిళితమై ముందుకు సాగాలి. అందుకే కేరళ వృద్ధి నమూనా, గుజరాత్ వృద్ధి నమూనాలను తోసిరాజని బీహార్ రాష్ట్ర ఆర్థిక వృద్ధి నమూనా ఈనాడు అన్ని రాష్ట్రాలకు ఆదర్శవంతమయ్యింది.

■ ఆచార్య చుంచు సుబ్రహ్మణ్యం
ఆర్థికశాస్త్ర విశ్రాంతాచార్యులు, ఆంధ్రవిశ్వకళాపరిషత్

పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకోవాలంటే వేల రూపాయలు ధారపోయాల్సిన పరిస్థితి.. అదీగాక ఉద్యోగం చేస్తూ ప్రిపేర్ కావాలంటే మనకు కావాల్సిన సమయంలో, ఇంటికి దగ్గరలో కోచింగ్ సెంటర్లు ఉండవు. స్మార్ట్ ఫోన్‌లు, యాప్‌లు ప్రవేశించడంతో ఈ సమస్యలు తొలగిపోయాయి. మీ చేతిలోని స్మార్ట్ ఫోన్‌నే కోచింగ్ సెంటర్‌గా ఉపయోగించుకోవచ్చు. అన్ని రకాల పోటీ పరీక్షలకు మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. మొబైల్ కంపెనీల డేటా ఆఫర్లతో ఫోన్ ద్వారా ఇంటర్నెట్ ఉపయోగించుకోవడానికి పెద్దగా ఖర్చు కూడా కాదు.

పోటీ పరీక్షలకు సంబంధించిన సమస్త సమాచారం ఒకే ఒక్క క్లిక్ ద్వారా మొబైల్‌లో ప్రత్యక్షమవుతుంది. కోచింగ్‌కు వెళ్లకుండా ఇంటర్నెట్ సహాయంతో ఇంట్లో నుంచే ఆయా పరీక్షలకు సన్నద్ధం కావచ్చు. పోటీ పరీక్షార్థులకు అందుబాటులో ఉన్న కొన్ని మొబైల్ యాప్స్ గురించి తెలుసుకుందాం...



డిజిటల్ లెర్నింగ్

పోటీ పరీక్షలకు.. పనికొచ్చే యాప్స్

మ్యాథ్స్ ట్రిక్స్

ప్రస్తుతం అన్ని రకాల పోటీ పరీక్షల్లో మ్యాథమెటిక్స్ సంబంధిత విభాగాలు తప్పనిసరిగా ఉంటున్నాయి. కాలేజీ విద్యలో విద్యార్థులు తమ ఆసక్తి మేరకు సబ్జెక్టులను ఎంచుకుంటారు. ఫలితంగా చాలామంది మ్యాథమెటిక్స్ చదవరు. అయితే చదువు పూర్తయిన తరవాత పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో మ్యాథ్స్‌ను చదవాల్సి వస్తుంది. ఈ సమయంలో కొంత ఇబ్బంది పడుతుంటారు. ముఖ్యంగా సమస్యలను వేగంగా, కచ్చితత్వంతో సాధించడంలో ఇబ్బంది పడుతుంటారు. దీన్ని అధిగమించ డానికి, మ్యాథమెటిక్ నైపుణ్యాలను పెంచుకోవడానికి, లెక్కలను వేగంగా చేయడానికి మ్యాథ్స్ ట్రిక్ అనే యాప్ ఉపయోగపడుతుంది. ఇందులో సింగిల్ గేమ్, మల్టిప్లేయర్, జాయింట్ గేమ్, ట్రైనింగ్ మోడ్, బై హార్ట్ అనే విభాగాలు ఉన్నాయి. సింగిల్ గేమ్ విభాగంలో బిటర్ ఎండ్, మినిట్ ఛాలెంజ్, స్పీడ్ ఛాలెంజ్, నో టైమ్ ఛాలెంజ్ వంటి భాగాలు కనిపిస్తాయి. మల్టిప్లేయర్‌లో వివిధ క్లిష్టత స్థాయిలతో కూడిన సమస్యలు ఉంటాయి. వీటిని సాధించడంతోపాటు ఆన్‌లైన్ మిత్రులను కూడా ఛాలెంజ్ చేయవచ్చు. జాయింట్ గేమ్‌లో స్ప్లిట్ స్క్రీన్ సౌకర్యం ఉంటుంది. తద్వారా ఒకే సమయంలో ఒకే సమస్యను ఇద్దరు ఏకకాలంలో పరిష్కరించే అవకాశం కలుగుతుంది. ట్రైనింగ్ మోడ్‌లో కూడికలు, గుణకారాలు, తీసివేతలు వంటి ప్రక్రియలతో కూడిన సమస్యలు వస్తాయి. ఇందులో మనకు ఆసక్తి ఉన్న సమస్యను ఎంపిక చేసుకోవచ్చు. బైహార్ట్ టేబుల్స్ నేర్చుకోవడానికి ఉపయోగపడుతుంది.

లింక్: https://play.google.com/store/apps/details? id=example.matharithmetics&hl=en

బ్యాంకర్స్ అడ్డా

ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో చేపడుతున్న నియామకాలు మరే రంగంలోనూ జరగడం లేదని కచ్చితంగా చెప్పొచ్చు. క్లరికల్, ప్రొబేషనరీ ఆఫీసర్ (పీఓ), స్పెషలిస్ట్ ఆఫీసర్.. ఇలా వివిధ కేటగిరీల్లో వేలాది పోస్టుల భర్తీ కోసం తరచుగా నోటిఫికేషన్లు వెలువడుతూనే ఉంటాయి. ఐబీపీఎస్ వచ్చిన తరవాత బ్యాంక్ ఉద్యోగాల కోసం పోటీ పడే వారి సంఖ్య లక్షలకు చేరుకుంది. బ్యాంకింగ్ రంగ ఔత్సాహికుల్లో బ్యాంకర్స్ అడ్డా వెబ్‌సైట్‌కు మంచి ఆదరణ ఉంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్‌లో జాబ్స్‌కు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఆశావాహులకు చేరువ చేయాలనే ఉద్దేశంతో బ్యాంకర్స్ అడ్డా మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. ఐబీపీఎస్ / ఎస్‌బీఐ క్లరికల్, పీఓ, స్పెషలిస్ట్ ఆఫీసర్ పరీక్షలకు సన్నద్ధం కావడానికి వీలుగా కరెంట్ అఫైర్స్, స్టడీ మెటీరియల్, వీడియో లెక్చర్స్, మ్యాగజీన్స్, క్విజెస్ వంటి అంశాలు ఉంటాయి. రోజువారీగా కరెంట్ అఫైర్స్‌ను అప్‌లోడ్ చేస్తారు. బ్యాంకింగ్ పరీక్షల్లో అడిగే అన్ని విభాగాల ప్రిపరేషన్‌కు సరిపోయే మెటీరియల్‌ను ఈ యాప్‌లో పొందుపరిచారు. ప్రతి ప్రశ్నకు వివరణతో కూడిన సమాధానం ఉంటుంది. తద్వారా సబ్జెక్ట్ పరిజ్ఞానాన్ని బాగా పెంచుకోవచ్చు. మోడల్ ప్రశ్నపత్రాలు కూడా ఉంటాయి. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఇతర ప్రభుత్వ ఉద్యోగాల ప్రిపరేషన్‌కు కూడా ఉపయోగపడేలా ఈ యాప్‌ను రూపొందించడం విశేషం. తద్వారా ఏకకాలంలోనే పలు రకాల పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అవకాశం లభిస్తుంది. ఈ యాప్‌ను సులభంగా ఉపయోగించవచ్చు. ఆఫ్‌లైన్‌లో కూడా పని చేస్తుంది.

లింక్: https://play.google.com/store/apps/dev?id=7296703954356624571&hl=en

కరెంట్ అఫైర్స్ అండ్ జీకే

ప్రస్తుతం పోటీ పరీక్షల్లో తక్కువ సమయంలో ఎక్కువ మార్కుల సాధనకు కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలు ఉపయోగపడతాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో చోటు చేసుకుంటున్న పరిణామాలను, జనరల్ నాలెడ్జ్ విషయాలను అన్నిటిని ఒకచోట చేర్చి జాగరణ్ జోష్.. డైలీ కరెంట్ అఫైర్స్ అండ్ జీకే బై జాగరణ్ జోష్ అనే మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో లేటెస్ట్ కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలను ఇంగ్లీష్, హిందీ భాషల్లో రోజూ అందిస్తారు. పరీక్షల వారీగా కూడా కరెంట్ అఫైర్స్‌ను పొందుపరచడం ఈ యాప్ ప్రత్యేకత. అంతేకాకుండా ఆయా అంశాల్లో అవగాహనను పరీక్షించే విధంగా క్విజ్‌లను యాప్ ద్వారా నిర్వహిస్తారు. వారం వారం కరెంట్ అఫైర్స్‌ను వీడియోల రూపంలో సైతం అప్‌లోడ్ చేస్తారు. ఆఫ్‌లైన్ మోడ్‌లో కూడా ఈ యాప్ పని చేస్తుంది. ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి వివిధ అంశాలపై చోటుచేసుకున్న పరిణామాలను అలర్ట్స్ రూపంలో ఎస్ఎంఎస్ ద్వారా రోజూ పంపిస్తారు. వివిధ అంశాలపై చర్చించడానికి, విశ్లేషించడానికి కూడా ఈ యాప్‌లో అవకాశం ఉండటం విశేషం.

లింక్: https://play.google.com/store/apps/details?id=com.josh.jagran.android.activity&hl=en

డైలీ కరెంట్ అఫైర్స్ - టెస్ట్ బుక్

కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ అంశాల ప్రిపరేషన్‌కు ఉపయోగపడే యాప్‌లలో అత్యంత ఆదరణ కలిగింది టెస్ట్‌బుక్ సంస్థ రూపొందించిన డైలీ కరెంట్ అఫైర్స్, జీకే క్విజ్. ఐబీపీఎస్, ఎస్‌బీఐ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వేస్, సివిల్ సర్వీసెస్, ఎంబీఏ ప్రవేశ పరీక్షలను దృష్టిలో ఉంచుకొని కరెంట్ అఫైర్స్, జీకే అంశాలను ఈ యాప్‌లో పొందుపరిచారు. ఆయా పరీక్షల క్లిష్టత మేరకు అడిగే ప్రశ్నల స్థాయిని పరిగణనలోకి తీసుకుంటూ కంటెంట్‌ను రూపొందించడం విశేషం. ఈ యాప్ ప్రత్యేకతలు.. హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంది. రోజూ వార్తలను సంక్షిప్తంగా 100 పదాల్లో పొందుపరుస్తారు. ఆయా అంశాలపై అవగాహనను పరీక్షించేందుకు రోజూ క్విజ్‌లు ఉంటాయి. ముఖ్యమైన ఆర్టికల్స్ బుక్‌మార్క్ చేసుకోవడం లేదా తరవాత చదవడం కోసం సేవ్ చేసుకునే అవకాశం కూడా కల్పించారు. కంటెంట్‌ను ఆఫ్‌లైన్‌లో కూడా చదవొచ్చు.

లింక్: https://play.google.com/store/apps/details?id=com.testbook.caapp&hl=en

గ్రేడ్ అప్

ఐబీపీఎస్ పీఓ, ఎస్‌బీఐ క్లర్క్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, గేట్, జేఈఈ మెయిన్, నీట్, సివిల్ సర్వీసెస్, ఆర్‌బీఐ వంటి పరీక్షలకు ప్రిపేరయ్యే వారికి గ్రేడ్ అప్ ఎగ్జామ్ ప్రిపరేషన్ యాప్ చాలా ఉపయోకరంగా ఉంటుంది. ఆయా పరీక్షలకు సంబంధించిన స్టడీ మెటీరియల్, డైలీ టెస్ట్‌లు వంటి అంశాలను పొందుపరిచారు. ఏదైనా పరీక్ష / సబ్జెక్ట్ విషయంలో తలెత్తిన సందేహాలను తీర్చడానికి కూడా నిపుణుల సేవలు అందుబాటులో ఉంటాయి. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షల్లో కీలకంగా ఉండే.. జనరల్ ఇంటెలిజెన్స్, రీజనింగ్, ఇంగ్లీష్, క్వాంటేటివ్ ఆప్టిట్యూడ్ వంటి అంశాల సమగ్ర మెటీరియల్, గత ప్రశ్నపత్రాలను పొందుపరిచారు. అంతేకాకుండా డైలీ కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకే, వొక్యాబులరీ విభాగాలు కూడా ఉంటాయి. గేట్‌లో ఎంఈ, సీఈ, ఈఈ, ఈసీఈ, సీఎస్ బ్రాంచ్‌లు, బార్క్, యూపీఎస్సీ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సబ్ ఇంజనీర్ ఎగ్జామ్ వంటి పరీక్షల ప్రిపరేషన్‌కు ఉపయోగపడే మెటీరియల్‌ను కూడా ఇందులో పొందుపరిచారు. 10+2 విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్ పరీక్షలకు సంబంధించి డైలీ క్విజ్‌లు, మాక్ టెస్ట్, వివరణలతో కూడిన ప్రశ్నలు, గత ప్రశ్నపత్రాలను అప్‌లోడ్ చేశారు. ఎంబీఏ ప్రవేశ పరీక్షలు, ఇన్సూరెన్స్, సెంట్రల్ టీచర్ ఎలిజబిలిటీ టెస్ట్ (సీటెట్) సివిల్ సర్వీసెస్.. ఇలా అన్ని రకాల పోటీల పరీక్షల సన్నదత కోసం దోహదపడే కంటెంట్‌ను పొందుపరచడం ఈ యాప్ ప్రత్యేకత. ఉద్యోగాల భర్తీకి కోసం ఉద్దేశించిన నోటిఫికేషన్స్‌ను అలర్ట్స్ రూపంలో అందిస్తారు.

లింక్: https://play.google.com/store/apps/details?id=co.gradeup.android&hl=en

ఆప్టిట్యూడ్ మాస్టర్ ఎగ్జామ్

క్యాట్, మ్యాట్, జీఆర్ఈ, జీమ్యాట్, శాట్ వంటి పరీక్షల్లో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగం ఉంటోంది. ఈ విభాగంలో మార్కులే విజేతలను నిర్ణయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆప్టిట్యూడ్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకోవడం కీలకం. ఇందుకు ఆప్టిట్యూడ్ మాస్టర్ ఎగ్జామ్ ప్రిపరేషన్ అండ్ ప్రాక్టీస్ అనే యాప్ చాలా ఉపయోగపడుతుంది. ఇందులో వర్డ్ ప్రాబ్లమ్స్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ ప్రశ్నలు వేల సంఖ్యలో (వివరణతో కూడిన సమాధానాలతో సహా) ఉంటాయి. ఈ ప్రశ్నలను నిపుణులతో రూపొందించారు. టైమ్-స్పీడ్, ప్రాఫిట్-లాస్, పర్సంటేజ్, టైమ్-వర్క్, నెంబర్ సిస్టమ్, పర్ముటేషన్ అండ్ కాంబినేషన్స్, ట్రైన్స్, తదితర అంశాల స్టడీ మెటీరియల్‌ను పొందుపరిచారు. సులువైన చిట్కాలు, ఉదాహరణలతో వివరించడం ఈ యాప్ ప్రత్యేకత. రోజువారీగా ప్రాక్టీస్ ప్రశ్నలను పొందుపరుస్తారు. వివిధ పరీక్షల గత ప్రశ్నపత్రాలను కూడా అప్‌లోడ్ చేశారు. ఆఫ్‌లైన్ మోడ్‌లో కూడా పని చేస్తుంది.

లింక్: https://play.google.com/store/apps/details?id=app.aptitude.quiz.craftystudio.aptitude-quiz&hl=en

గమనించాల్సినవి..

- ఏదైనా విభాగానికి సంబంధించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలంటే ముందుగా.. గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి కీ వర్డ్‌ను ఎంటర్ చేయాలి (ఉదాహరణకు కరెంట్ అఫైర్స్ ఫర్ బ్యాంక్ ఎగ్జామ్స్).
- ఎంటర్ చేయగానే పదుల సంఖ్యలో యాప్స్ కనిపిస్తాయి. వీటిల్లో పాఠకుల రేటింగ్, సమీక్షల ఆధారంగా యాప్స్‌ను ఎంచుకోవాలి. ఎక్కువ రేటింగ్ ఉన్న యాప్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేటప్పుడు దానికి సంబంధించిన సమాచారాన్ని క్షుణ్నంగా చదవాలి.
- యాప్ ఎలాంటి డివైజెస్‌ను సపోర్ట్ చేస్తుందనే విషయాన్ని పరిశీలించాలి.
- ఆఫ్‌లైన్‌లో మోడ్‌లో కూడా పని చేసే యాప్స్‌ను ఎంచుకోవడం ప్రయోజనకరం. తద్వారా ఇంటర్నెట్ అందుబాటులో లేకున్నా వీక్షించే అవకాశం ఉంటుంది.
- గూగుల్ ప్లే స్టోర్, సంబంధిత వెబ్‌సైట్ల నుంచి మాత్రమే యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- యాప్‌ను డౌన్‌లోడ్ చేసేటప్పుడు వ్యక్తిగత వివరాలు, డబ్బు చెల్లించమనడం వంటి నిబంధనలు కనిపిస్తే జాగ్రత్తగా వ్యవహరించాలి.

ప్రయోజనాలు ఇవీ..

- పోటీ పరీక్షలకు సంబంధించిన సమస్త సమాచారం ఒకే చోట లభిస్తుంది. ఎలాంటి పరిమితులు లేకుండా, ఏ సమయంలోనైనా ప్రిపరేషన్ సాగించవచ్చు.
- యాక్సెస్ చేసుకోవడం సులభం. డిస్కషన్ బోర్డ్స్ ద్వారా అవగాహన స్థాయిని పెంచుకోవచ్చు.
- ఏవైనా సందేహాలు ఉంటే తీర్చడానికి నిపుణులు అందుబాటులో ఉంటారు.
- ఉద్యోగాల భర్తీకి సంబంధించిన తాజా సమాచారం లభిస్తుంది.
- బ్యాంక్స్, ఇన్సూరెన్స్, సివిల్స్, స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ తదితర ఉద్యోగాలకు సరిపోయే విధంగా కంటెంట్‌ను రూపొందిస్తారు. కాబట్టి ఏకకాలంలో అన్ని రకాల పరీక్షలకు సిద్ధం కావచ్చు.
- డైలీ టెస్ట్‌లు, క్విజ్‌ల ద్వారా అవగాహన స్థాయిని తెలుసుకోవచ్చు.

జాబ్ కార్నర్

కస్టమర్ సర్వీస్ రిప్రజెంటేటివ్

SvcBANK

ముంబైలోని ఎస్‌విసి కో ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ - క్లరికల్ గ్రేడ్ కింద కస్టమర్ సర్వీస్ రిప్రజెంటేటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అర్హత: కనీసం 45 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: మార్చి 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- వేతనం: నెలకు రూ.14,400
- ఎంపిక: అభ్యర్థులకు ముందుగా రాత పరీక్ష నిర్వహిస్తారు. బ్యాంక్ నిర్ణయం ప్రకారం ఇందులో అర్హత పొందినవారికి ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటాయి.
- రాత పరీక్ష వివరాలు: జనరల్ / ఫైనాన్షియల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లీష్, రీజనింగ్ ఎబిలిటీ, కంప్యూటర్ ఆప్టిట్యూడ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు వస్తాయి. నెగెటివ్ మార్కింగ్ ఉంది.
- పరీక్ష కేంద్రాలు: ముంబై, పుణె, బెంగళూరు
- దరఖాస్తు ఫీజు: రూ.600
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: ఫిబ్రవరి 28
- కాల్ లెటర్ డౌన్‌లోడింగ్: మార్చి 29 నుంచి
- రాత పరీక్ష: ఏప్రిల్ 8న
- వెబ్‌సైట్: www.svcbank.com

డైరెక్టర్లు

న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసిఎస్ఎస్ఆర్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **16**
- పోస్టులు: డైరెక్టర్ (రీసెర్చ్ 3, ప్లానింగ్ & అడ్మి నిస్ట్రేషన్ 1, డాక్యుమెంటేషన్ 1), డిప్యూటీ డైరెక్టర్ (రీసెర్చ్ 8, డాక్యుమెంటేషన్ 2, పబ్లికేషన్ 1)
- దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 20
- వెబ్‌సైట్: www.icssr.org

రీసెర్చ్ అసోసియేట్

చిత్తూరు జిల్లా గాదంకిలోని నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (ఎన్ఏఆర్ఎల్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **18**
- పోస్టులు: రీసెర్చ్ అసోసియేట్ / పోస్ట్ డాక్టోరల్ ఫెలో 2, జూనియర్ రీసెర్చ్ ఫెలో 15, రీసెర్చ్ అసోసియేట్ 1
- అర్హత: సంబంధిత విభాగంలో (పిహెచ్‌డి / ఎంఇ / ఎంటెక్ / ఎమ్మెస్సీ) (అట్మాస్ఫియరిక్ సైన్స్ / మెటరాలజీ / స్పేస్ సైన్స్ / ఫిజిక్స్ / మేథమెటిక్స్) పూర్తిచేసి ఉండాలి. నిర్దేశించిన మేర రీసెర్చ్ అనుభవం ఉండాలి. నెట్ / గేట్ / జామ్ / జెస్ట్ అర్హత పొంది ఉండాలి.
- వయసు: దరఖాస్తు నాటికి జెఆర్ఎఫ్‌లకు 30 ఏళ్లలోపు ఉండాలి. మిగిలిన పోస్టులకు 35 ఏళ్లలోపు ఉండాలి.
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఫిబ్రవరి 24 నుంచి
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 25
- హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: మార్చి 30
- చిరునామా: The Administrative Officer, National Atmospheric Research Laboratory, P.B.No.123, S.V.University Campus, Tirupati - 517502
- వెబ్‌సైట్: www.narl.gov.in

యూపీఎస్సీ

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) - కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం ఖాళీలు: **6**
- పోస్టులు: ట్రాన్స్‌లేటర్ (టిబెటన్), అసిస్టెంట్ డైరెక్టర్ - సేఫ్టీ
- ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: మార్చి 15
- వెబ్‌సైట్: www.upsconline.nic.in

భారతదేశంలో వివిధ రకాల అసమానతలు ఉన్నాయి. వాటి వర్గీకరణ గురించి తెలుసుకుందాం...

అసమానతలు.. అనేక రకాలు



పోటీ పరీక్షల ప్రత్యేకం

ఎకానమీ

కుల అసమానతలు - రకాలు

ఆర్థిక అసమానతలు...

- **ఎన్ఎస్ఎస్ఓ సర్వే:** మండల్ కమిషన్ రిపోర్ట్ ప్రకారం దేశంలో ఓబీసీ జనాభా 52 శాతం ఉంది. అయితే 2007లో దేశవ్యాప్తంగా ఓబీసీ జనాభా 41 శాతం మాత్రమే ఉంది.
- **నెలవారీ ఖర్చు:** ఎన్ఎస్ఎస్ఓ అంచనా ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో అత్యంత తక్కువ నెలవారీ ఖర్చు చేసేది ఎస్టీలే. గ్రామాల్లో ఇతరుల ఖర్చే అధికంగా ఉంటుంది. గ్రామాల్లో నెలకు ఎస్టీలు రూ.426, ఎస్సీలు రూ.474, ఓబీసీలు రూ.556, ఇతరులు రూ.685 ఖర్చు చేస్తున్నారు. పట్టణాల్లో ఎస్టీలు రూ.857, ఎస్సీలు రూ.758, ఓబీసీలు రూ.870, ఇతరులు రూ.1306 ఖర్చు పెడుతున్నారు.
- **ఆరోగ్యపరమైన అసమానతలు:** మహందీ & రామ్ నివేదిక ప్రకారం జీవితకాలంపై పేదరికమే ఎక్కువ ప్రభావం చూపుతుంది.

కుల సమూహం	జీవిత కాలం (సం.లలో) 1998 - 99	2005 - 06
నిమ్న కులాలు	61.5	64.6
ఓబీసీ	63.5	65.7
ఉన్నత కులాలు	61.9	62.7
జాతీయ సగటు	63.8	65.5

- **లింగ అసమానతలు:** లింగ పరంగా వనరులను అసమానంగా కేటాయించడం.
- **కుల అసమానతలు:** అనాదిగా కొన్ని కులాలవారు సామాజికంగా ఊరి బయట నివశిస్తున్నారు. దీన్నే సామాజిక మినహాయింపు లేదా వెలి అంటారు. 'సామాజిక మినహాయింపు' అనే పదాన్ని ఉపయోగించిన మొదటి వ్యక్తి రీన్ లెనోయిర్.
- **మతపరమైన అసమానతలు:** వివిధ మతాలకు చెందిన సంస్కృతి, సంప్రదాయాలు వేరుగా ఉండడం వల్ల ఇలాంటి అసమానతలు తలెత్తాయి.
- **జాతిత్వ అసమానతలు:** భిన్నమైన ప్రదేశాల్లో నివసించే పలు జాతులు తమ గుర్తింపు కోసం చేసే ప్రయత్నంలో ఈ అసమానతలు ఏర్పడ్డాయి.
- **ప్రాంతీయ అసమానతలు:** దేశమంతటా ఏకరీతిగా వనరులు విస్తరించలేదు. వనరుల సౌలభ్యం ఎక్కువగా ఉన్న చోట అభివృద్ధి కనిపిస్తుంది. ఇవి లేని ప్రదేశాల్లో అభివృద్ధి కుంటుపడడాన్ని చూడవచ్చు.
- **పేదరిక అసమానతలు:** దేశవ్యాప్తంగా పట్టణాలకు, గ్రామాలకు పేదరికంలో అసమానతలు ఉన్నాయి.
- **మానవాభివృద్ధి అసమానతలు:** విద్య, ఆరోగ్యం అందుబాటులో ఉన్న చోట మానవ వనరులు అభివృద్ధి చెందితే, అవి లేని చోట వెనకబాటుతనం కనిపిస్తుంది.

కుల అసమానతలు

'కాస్ట' అనే స్పానిష్ / పోర్చుగీసు పదం నుంచి Caste అనే ఇంగ్లీష్ పదం వచ్చింది. ఈ పదాన్ని మొదటగా 1563లో గార్సియాడీ డర్టా ఉపయోగించాడు. 'కాస్ట' అంటే తెగ లేదా సంతతి అని అర్థం. దీనికి మూలం వర్ణ వ్యవస్థ అని చెప్పవచ్చు. పరిమిత కుల వ్యవస్థ హిందూ సమాజ ప్రత్యేక లక్షణం. 'పరిమిత సమూహాలు, సన్నిహిత సంబంధాలు గల ప్రజల సమూహాలే కులం' అని ఎం.ఎన్. శ్రీనివాస్ పేర్కొన్నారు.

నిర్వచనాలు: డి.ఎన్ మజుందార్, టి.ఎన్.మదన్‌ల అభిప్రాయంలో కులమనేది ఒక 'బంధిత సమూహం'.

- రిస్లే నిర్వచనం ప్రకారం 'కొన్ని సమూహాలు లేదా కుటుంబాలు కలిపి ఒకే పేరుతో, ఒకే విధమైన వంశానుక్రమంతో వంశపారంపర్యంగా ఒకే పేరుతో వ్యవహారంలో ఉంటాయి. వీరందరూ సాధర్మంతో ఉన్నట్లయితే దాన్నే కులం అంటారు'.
- 'కులం ఒక బంధిత సామాజిక వర్గం. దీనిలో సభ్యత్వం జన్మ ద్వారా లభిస్తుంది. గతి శీలత, అంతస్తు విభేదాల పరంగా చాలా బంధితంగా ఉండే వ్యవస్థే కులం' అని లాండ్‌బర్గ్ నిర్వచించారు.

తిరోగామి వివక్షత: ఒక ప్రాంతంలో అత్యధిక / ఆధిక్య / ప్రబల సమూహానికి వ్యతిరేకంగా నిమ్న / వెనకబడిన సమూహాలకు బాసటగా ఉండే వివక్షతనే తిరోగామి / వ్యతిరేక వివక్షత అంటారు.

అసమానతలకు కారణాలు

కుల అసమానతలకు మూల కారణం వర్ణ వ్యవస్థ అని చెప్పవచ్చు. మనుస్మృతి వర్ణ వ్యవస్థను సమర్థించడంతో ఏర్పడిన కుల వ్యవస్థ బలపడి కొన్ని వర్గాల సామాజిక వెలివేతకు దోహదం చేసింది. వీటితోపాటు కింది కారణాలతో కూడా అసమానతలు పెరుగుతూ వచ్చాయి.

- 1932 ఆగస్టు 16న కమ్యూనల్ అవార్డ్ రూపంలో దళిత రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు ఏర్పడడం.
- పౌర హక్కుల రక్షణ చట్టం (1976), ఎస్సీ ఎస్టీల అత్యాచార నిరోధక చట్టం (1989) రెండూ సక్రమంగా అమలు కాకపోవడం.
- ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ అమల్లో లోపాలు.

సామాజిక జాతి విచక్షణ (Social aparthied)

నిమ్న తరగతులను లేదా వర్గాలను ఆర్థిక స్థితిని అనుసరించి బలమైన సమాజం నుంచి వేరు చేసే లక్షణాన్ని జాతి విచక్షణ అంటారు. ఇది 1948లో మొదటగా దక్షిణాఫ్రికాలో కనిపించింది.

లక్షణాలు, పాత్ర

ఎ.ఎల్ క్రోబర్ అనే నిపుణుడు కుల వ్యవస్థ లక్షణాలను కింది విధంగా వివరించారు.

- **వారసత్వం:** పుట్టుకను, వారసత్వాన్ని బట్టి కులాన్ని నిర్ణయిస్తారు.
- **క్రమశ్రేణి:** వర్ణ వ్యవస్థ అనేది వ్యవస్థీకృతమైంది. కాని కుల వ్యవస్థ కచ్చితంగా, స్పష్టంగా ఉండదు. ప్రతి కులం తన ఆధిక్యాన్ని, ఔన్నత్యాన్ని ప్రకటించడానికే ప్రయత్నిస్తుంది. దీన్నే సాంస్కృతీకరణం అంటారు.
- **అంతర్వివాహాలు - అనులోమ వివాహాలు:** అంతర్వివాహమనేది కుల వ్యవస్థ ముఖ్య లక్షణమని వెస్టర్‌మార్క్ అన్నారు. ఒక కులానికి చెందిన పురుషుడు అదే కులానికి లేదా ఉప కులానికి చెందిన మహిళను పెళ్లాడితే దాన్నే అంతర్వివాహం అంటారు. ఉన్నత వర్ణానికి చెందిన పురుషుడు తమ కంటే తక్కువ వర్ణానికి చెందిన మహిళను వివాహం చేసుకుంటే దాన్నే అనులోమ వివాహం అంటారు. సంప్రదాయ హిందూ సమాజం అనులోమ వివాహాలను అంగీకరించింది.
- **వృత్తిపరమైన సమూహాలు:** ఒక కులానికి చెందిన వ్యక్తులు ఒకే వృత్తిని చేపడతారు. కులానికి ఇచ్చిన స్థానం, వారు చేపట్టే వృత్తిని బట్టి ఉన్నత, నిమ్న తరగతులుగా వర్గీకరించారు.
- **ఆహార పానీయాల నియమావళి:** సాంప్రదాయకంగా మాంసాహారం కంటే శాకాహారం మంచిదని భావించారు. వండిన ఆహారాన్ని తీసుకోవడంలో కొన్ని నియమాలు, నిషేధాలు వాడుకలో ఉన్నాయి. శూద్రుల్లో కొందరు ఉన్నత కులానికి చెందిన వారమని భావించి మిగిలిన శూద్ర కులాలవారు వండిన ఆహారాన్ని తీసుకోరు. ఉత్తర భారతంలో 'హుక్కా'ను తక్కువ కులాలవారికి ఇవ్వరు.
- **దుస్తులు ధరించడం, మాట్లాడే తీరులో కట్టుబాట్లు:** ప్రతి కులానికి ఈ అంశంలో ప్రత్యేకత ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు.
- **పవిత్రం - అపవిత్రం - శుచి, అశుచి:** ఆచార వ్యవహారాలకు సంబంధించి దక్షిణ భారతంలో దృఢమైన భావాలున్నాయి. అందుకే సహపంక్తి భోజనాలను నిషేధించారు.

- లక్ష్మీజ్యోతి ఆర్. అల్లె

బోల్ట్.. ఇక ఫుట్‌బాలర్

జమైకా: పరుగుకు గుడ్‌బై చెప్పిన స్ప్రింట్ దిగ్గజం ఉస్సేన్ బోల్ట్.. సాకర్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాడు. ఈ జమైకా చిరుత తాజాగా ఓ ఫుట్‌బాల్ జట్టుతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ విషయాన్ని బోల్ట్ స్వయంగా ప్రకటించాడు. అయితే, తాను ఆడుతున్న జట్టు ఏమిటన్నదో మీరే తెలుసుకోండంటూ సస్పెన్స్‌లో పెట్టాడు. 'ఫుట్‌బాల్ జట్టుతో ఇప్పుడే ఒప్పందం చేసుకున్నాను. ఆ జట్టు పేరేంటో మంగళవారం (ఫిబ్రవరి 27)లోపు కనుక్కోండి' అని బోల్ట్ ట్విట్టర్‌లో పోస్ట్ చేశాడు.



కామన్వెల్త్ అథ్లెట్లకు 50 లక్షల బీమా


కామన్వెల్త్ క్రీడల జెర్సీలతో భారత అథ్లెట్లు

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో జరిగే కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత క్రీడాకారులు ఒక్కొక్కరికి రూ.50 లక్షల మేరకు బీమా వర్తించనుంది. ఈ మేరకు ఎడల్‌వీస్ టోక్యో లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు భారత ఒలింపిక్ సంఘం (ఐవోఏ) తెలిపింది. కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు 227మంది అథ్లెట్లు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఈఏడాది జరిగే ఆసియా క్రీడలు, 2020 టోక్యో ఒలింపిక్స్‌కు కూడా ఎడల్‌వీస్ భారత క్రీడా బృందానికి స్పాన్సర్‌గా వ్యవహరించనున్నది. 2018, 2019 జాతీయ క్రీడలనుకూడా ఆ సంస్థే స్పాన్సర్ చేస్తోంది. కాగా రేమండ్స్ సంస్థ స్టైలింగ్ భాగస్వామిగా వ్యవహరిస్తుందని, క్రీడాకారులకు అవసరమయ్యే క్రీడా దుస్తులను అందజేస్తుందని ఐవోఏ వెల్లడించింది.

భారత్‌ను క్రీడాపరికరాల తయారీ హబ్‌గా చేస్తాం

భారత్‌ను క్రీడా పరికరాల తయారీ హబ్‌గా చేయడం తన ప్రాథమిక లక్ష్యాలలో ఒకటని కేంద్ర క్రీడా మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ తెలిపారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే భారత అథ్లెట్ల జెర్సీని మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాథోడ్ మాట్లాడుతూ.. 'భారత్‌లో అత్యుత్తమ క్రీడాపరికరాలను తయారు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకు తగిన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం ఈ రంగంలో ప్రయివేట్ సంస్థలే కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇక టార్గెట్ ఒలింపిక్స్ పోడియం, ఖేలో ఇండియా పథకాల పైనే మేము ఎక్కువ దృష్టి కేంద్రీకరించామ'ని ఆయన తెలిపారు.

మెగా ఈవెంట్‌కు దీప దూరం

న్యూఢిల్లీ: భారత స్టార్ జిమ్నాస్ట్ దీపా కర్మాకర్ మోకాలి గాయం కారణంగా కామన్వెల్త్ గేమ్స్‌కు దూరం కానుంది. గతేడాది ఏప్రిల్‌లో దీప మోకాలికి శస్త్ర చికిత్స జరిగింది. గాయం నుంచి పూర్తిగా కోలుకోనందున ఈ మెగా ఈవెంట్‌కు దూరమవక తప్పడం లేదంది. 'కామన్వెల్త్‌కు దూరమవడం బాధగా ఉంది. గత క్రీడల్లో కాంస్యం నెగ్గాను. నేను లేకున్నా భారత జిమ్నాస్టిక్స్ జట్టు మెరుగ్గా రాణిస్తుందని ఆశిస్తున్నా. ఇక జిమ్నాస్టిక్స్ వరల్డ్ కప్‌లో అరుణా రెడ్డి కాంస్య పతకం నెగ్గడం సంతోషంగా ఉంది. కామన్వెల్త్ ఈవెంట్‌లో ఆమె కచ్చితంగా స్వర్ణం గెలుస్తుంద'ని దీప తెలిపింది.

పంజాబ్ కెప్టెన్‌గా అశ్విన్



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ లెవెన్ జట్టుకు ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ నాయకత్వం వహించనున్నాడు. తొలి ఎనిమిదేళ్లు చెన్నై సూపర్ కింగ్స్‌కు ప్రాతినిథ్యం వహించిన అశ్విన్ గత ఏడాది పుణె సూపర్ జెయింట్స్‌కు ఆడాడు. ఈసారి పంజాబ్ జట్టు అశ్విన్‌ను కొనుగోలు చేసి నాయకత్వం కట్టబెట్టింది. యువరాజ్ సింగ్, క్రిస్ గేల్‌వంటి హేమాహేమీలున్న పంజాబ్ జట్టును నడిపించడం కత్తిమీద సామేనని, అయినా కెప్టెన్సీ భారం తన ప్రతిభకు ఆటంకం కాబోదని అశ్విన్ అన్నాడు. జాతీయ జట్టులో స్థానంకోసం అశ్విన్ యువ ఆటగాళ్లతో పోటీపడుతున్నాడు. అశ్విన్ చివరిసారిగా వన్డేను గతేడాది జూన్‌లో, టీ20ని జులైలో వెస్టిండీస్‌పై ఆడాడు.

కెరీర్‌కు మోర్కెల్ గుడ్‌బై



• ఆసీస్‌తో సిరీస్ చివరిదని ప్రకటన


డర్బన్: సౌతాఫ్రికా పేసర్ మోర్నీ మోర్కెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నాడు. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో సిరీస్‌తో కెరీర్‌కు గుడ్‌బై చెప్పనున్నట్టు ప్రకటించాడు. 33 ఏళ్ల మోర్కెల్ కెరీర్‌లో 83 టెస్టులు, 117 వన్డేలు, 44 టీ20లు ఆడాడు. 2006లో భారత్‌తో జరిగిన బాక్సింగ్ డే టెస్టుతో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. కుటుంబంతో ఎక్కువ సమయం గడపాలన్న ఉద్దేశంతోనే రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నట్టు మోర్కెల్ చెప్పాడు. వచ్చే నెల 1 నుంచి ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మధ్య నాలుగు టెస్టుల సిరీస్ మొదలు కానుంది.

కర్ణాటక x సౌరాష్ట్ర

విజయ్ హజారే ఫైనల్ నేడు
ఉదయం 9.00 నుంచి స్టార్ స్పోర్ట్స్ -1లో

న్యూఢిల్లీ: దేశవాళీ మెగా వన్డే లీగ్ విజయ్ హజారే ట్రోఫీని నెగ్గి దశాబ్దకాల నిరీక్షణకు తెరదించాలని సౌరాష్ట్ర.. ఐదేళ్లలో మూడో ట్రోఫీని దక్కించుకోవాలని కర్ణాటక పట్టుదలతో ఉన్నాయి. మంగళవారం జరిగే ఫైనల్లో పటిష్ట కర్ణాటకతో సౌరాష్ట్ర తలపడనుంది. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన కర్ణాటక.. టోర్నీలో ఒక్క మ్యాచ్ మాత్రమే చేజార్చుకుని ఫైనల్‌కు దూసుకెళ్లింది. మరోవైపు సౌరాష్ట్ర కిందామీద పడుతూ టైటిల్ పోరుకు చేరుకుంది. రెండు జట్లనూ పోల్చితే కర్ణాటక బలంగా కనిపిస్తున్నా.. కీలక సమయాల్లో పుంజుకుని ఫైనల్ చేరిన సౌరాష్ట్రను ఏమాత్రం తక్కువగా అంచనా వేయలేం. సెమీస్‌లో మహారాష్ట్రను కర్ణాటక చిత్తు చేస్తే.. టోర్నీలో అజేయంగా సెమీస్ చేరిన ఆంధ్రకు సౌరాష్ట్ర చెక్ చెప్పింది. కాగా, సౌరాష్ట్ర సారథి చటేశ్వర్ పుజారా ఆశించిన మేరకు స్కోరును పరుగులు పెట్టించడంలో విఫలమవుతున్నాడు. జడేజా పొదుపుగా బౌలింగ్ చేయడం సౌరాష్ట్రకు సానుకూలం కానుంది.

రింగ్‌లో నెగ్గి.. జీవితంలో ఓడి!



లండన్: బ్రిటీష్ బాక్సర్ స్కాట్ వెస్ట్‌గార్త్ హెవీ వెయిట్ బాక్సింగ్ పోటీలో నెగ్గినా.. జీవితంలో మాత్రం ఓడిపోయాడు. శనివారం జరిగిన ఇంగ్లిష్ టైటిల్ ఫైట్‌లో వెస్ట్‌గార్త్ పాయింట్ తేడాతో ప్రత్యర్థి డెక్ స్పెల్‌మన్‌పై విజయం సాధించాడు. అయితే బౌట్ ముగిసిన తర్వాత ఇంటర్వ్యూ ఇస్తూ స్కాట్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతణ్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించినా ప్రాణాలు మాత్రం దక్కలేదు.

గ్రెగ్‌కు సోదరుడే వ్యతిరేకి...



కోల్‌కతా: గతంలో భారత క్రికెట్ జట్టుకు గ్రెగ్ చాపెల్‌ను కోచ్‌గా ఎంపిక చేయడంపై అతని సొంత సోదరుడు ఇయాన్ చాపెలే వ్యతిరేకంగా మాట్లాడాడని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తన జీవిత చరిత్ర 'ఏ సెంచరీ ఈజ్ నాట్ ఇనఫ్'లో రాసుకున్నాడు. గ్రెగ్ చాపెల్‌ను భారత కోచ్‌గా తాను సమర్థించినపుడు మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్‌తోపాటు, ఇయాన్ చాపెల్ కూడా ప్రతికూల సూచనలు చేశారన్నాడు. అయినా తాను వాటిని లెక్కచేయక గ్రెగ్‌ను సమర్థించానని, అదే తన జీవితంలో పెను మార్పులు తెస్తుందని ఏమాత్రం ఊహించలేదన్నాడు.

ఇక మహిళల ఐపీఎల్!

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఎంతగా హిట్టయిందో అందరికీ తెలిసిందే. దీని స్ఫూర్తితో మహిళలకూ ఒక లీగ్‌ను నిర్వహించాలని బీసీసీఐ కసరత్తు చేస్తోంది. అందులో భాగంగానే ఈ ఏడాది ఐపీఎల్ సందర్భంగా నాకౌట్ దశలో కొన్ని మహిళల టీ20 మ్యాచ్‌లు నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమైంది. పాలనా వ్యవహారాల కమిటీ(సీఓఏ) ఛైర్మన్ వినోద్ రాయ్ ఈ విషయాన్ని వివరిస్తూ ఈ ఏడాది ఐపీఎల్ సందర్భంగా ప్రయోగాత్మకంగా కొన్ని మహిళల టీ20 మ్యాచ్‌లను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. మహిళా క్రికెట్ ఉన్నతికి ఒక లీగ్ ఎంతో అవసరమని రాయ్ అన్నారు. గత అక్టోబర్‌లో జరిగిన సమావేశంలో ఈ విషయమై చర్చించామని, అందుకు అవసరమైన నియమ నిబంధనలు రూపొందించేందుకు నిర్ణయించామన్నారు. మహిళల లీగ్‌తోపాటు జూనియర్ క్రికెటర్లకుకూడా ఒక లీగ్ నిర్వహించే ఆలోచన ఉందన్నారు. సీఓఏ మహిళా సభ్యురాలైన డయానా ఎడుల్జీకూడా దీనిని సమర్థిస్తూ ఇందుకు ఎంతో గ్రౌండ్‌వర్క్ చేయాల్సి ఉందన్నారు.

సచిన్‌తో ప్రియా వారియర్...



కొచ్చి: కనుసైగలతో సంచలనం రేపిన మలయాళ భామ ప్రియా వారియర్ తన అభిమాన ఆటగాడు, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌ను కలుసుకుంది. ఇండియన్ సూపర్ లీగ్ సందర్భంగా కొచ్చిలో జరిగిన కార్యక్రమానికి హాజరైన సచిన్ టెండూల్కర్, అభిషేక్ బచ్చన్‌లను ప్రియా వారియర్ తన సహనటుడు రోషన్ రవూఫ్‌తోపాటు కలుసుకున్నది. తన జీవితంలో ఇది మరపురాని సంఘటనగా నిలిచిపోతుందని తెలిపింది. సచిన్‌తో కలిసి దిగిన ఫొటోలను ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది. ఈ సందర్భంగా కేరళ బ్లాస్టర్స్ సహయజమాని అయిన సచిన్.. జట్టు టీషర్ట్‌ను ఆమెకు బహూకరించాడు.



మాటకు 'ముందు చూపు'



1994 ఎన్నికలకు కొంతకాలం ముందు! తెలుగుదేశం పార్టీ విపక్షంలో ఉంది. రాజకీయంగా వేధిస్తున్న అధికారపక్షం! ఇలాంటి సమయంలో చంద్రబాబు తిరుపతిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అధికారులు తమపై కక్ష సాధిస్తున్నారని, పరిస్థితి దారుణంగా ఉందని సహచర నేతలు చెప్పారు. దీంతో, "అధికారుల ఆగడాలు ఇలాగే ఉంటే ఊరుకోం. మేం అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తాం" అని చంద్రబాబు హెచ్చరించారు. కానీ... ఆ వెంటనే ఆయన ఆ భావోద్వేగాల నుంచి బయటపడి అసలు విషయం ఆలోచించారు. 'చిన్న సవరణ' అంటూ అప్పటికప్పుడు స్పందించారు. "ఉద్యోగుల్ని నిందించడం సరికాదు. ఆ మాటలను ఉపసంహరించుకుంటున్నా. ఎవరు అధికారంలో ఉంటే వాళ్లు చెప్పినట్లుగా అధికారులు వింటారు. వారిదేం తప్పు లేదు. ఆ అధికారుల్ని మాపైకి ఉసిగొల్పుతున్న నాయకుల పని మేం అధికారంలోకి వచ్చాక చూస్తాం!" అన్నారు.

చిన్నవారినీ పెద్దగానే చూస్తారు!

'ప్రత్యర్థిని తక్కువ అంచనా వేయొద్దు'... ఇది చంద్రబాబు అనుసరించే రాజకీయ సూత్రం. ఆయన పోటీచేసే కుప్పం రాష్ట్రంలోనే మారుమూల ప్రాంతం. అక్కడ పెద్దగా బలమైన రాజకీయ నాయకులు కూడా లేరు. అయినప్పటికీ... తనపై పోటీ చేసే ప్రత్యర్థులను చంద్రబాబు ఎప్పుడూ చిన్నగా చూడరు. పైగా వారినీ పార్టీలోకి ఆహ్వానించేస్తారు. మొదట్లో తనపై పోటీచేసే దొరస్వామి నాయుడిని తెలుగుదేశంలో చేర్చేసుకున్నారు. మొన్నటి ఎన్నికల్లో తనపై పోటీ చేసిన వైసీపీ అభ్యర్థి సుబ్రమణ్యంరెడ్డి కూడా ఇటీవల టీడీపీలో చేరారు. దీంతో విపక్ష పార్టీలు కుప్పంలో ఎప్పటికప్పుడు కొత్త అభ్యర్థులను వెతుక్కుంటుంటాయి. రాష్ట్రస్థాయి వరకు చంద్రబాబు అనుసరించే వ్యూహం ఇదే!




థింక్ బిగ్...

'థింక్ గ్లోబల్లీ... యాక్ట్ లోకల్లీ' అనేది ఆంగ్లంలో ఒక నానుడి. పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకుని... అందుబాటులో ఉన్న వనరులతో వాటిని సాకారం చేసుకోవాలన్నది దీని అంతఃసూత్రం! చంద్రబాబు దీనినే పాటిస్తారు. ఒకప్పుడు విజన్ 2020అంటే అంతా నవ్వారు. రాష్ట్ర బడ్జెట్ లక్షకోట్లు అవుతుందని విజన్ డాక్యుమెంట్‌లో చెప్పినప్పుడు... అసెంబ్లీలో విపక్షనేతలు హేళనగా మాట్లాడారు. కానీ కొన్నేళ్లకే బడ్జెట్ లక్షకోట్లు దాటింది.

'హైటెక్ సిటీ'పైనా...

అప్పట్లో హైదరాబాద్‌లోని మాదాపూర్ ప్రాంతం నిర్జన ప్రదేశం. కొండలు, గుట్టలతో నిండిన చోటు! 'ఇక్కడ హైటెక్ సిటీ నిర్మిస్తాం. ఈ ప్రాంతం దశ తిరుగుతుంది' అని చంద్రబాబు చెప్పినప్పుడు 'ఇదంతా అయ్యేదా... పొయ్యేదా' అని అందరూ అనుకున్నారు. కానీ... చివరికి ఆయన చెప్పిందే జరిగింది. హైదరాబాద్, సికింద్రాబాద్ అనే జంట నగరాలకు 'సైబరాబాద్' అనే కొత్త నగరం తోడయింది. "గత అనుభవాలను బట్టి చూస్తే... పోలవరం, అమరావతిలోనూ ఆయన చెప్పింది చేసి చూపించడం ఖాయం!" అని టీడీపీ సీనియర్ నేత ఒకరు అన్నారు.



మొబైల్ విప్లవం...

దేశంలో టెలికాం విప్లవం వస్తుందని... ఆ రంగంలోకి అడుగుపెట్టాలని 1990లలోనే రిలయన్స్ అధినేత ధీరూబాయ్ అంబానీకి చంద్రబాబు సూచించారు. "చంద్రబాబు సలహా రిలయన్స్‌ను, దేశ సమాచార వ్యవస్థను మలుపు తిప్పింది" అని ముఖేశ్ అంబానీ ఇటీవల స్వయంగా చెప్పారు.

చంద్ర చక్రం

జాతీయ రాజకీయాలపై బాబు ప్రభావం

దేవెగౌడ, గుజ్రాల్ ఎంపికలో కీలకపాత్ర

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఆయన 'కింగ్'! కేంద్రంలో ప్రధానమంత్రులను ఎంపిక చేసిన 'కింగ్ మేకర్'! కాంగ్రెసేతర పార్టీలను కూడగట్టడం, కేంద్రంలో ప్రభుత్వాలను ఏర్పరచడంలో చంద్రబాబు కీలకపాత్ర పోషించారు. జాతీయ రాజకీయాలపై చంద్ర ముద్ర వేశారు. 1995లో చంద్రబాబు సీఎం అయ్యాక... 1996 లోక్‌సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలకు పెద్ద సంఖ్యలో సీట్లు వచ్చాయి. దీనిని అవకాశంగా తీసుకొని చంద్రబాబు ఇతర ప్రాంతీయ పార్టీల నేతలతో సంప్రదింపులు జరిపి కేంద్రంలో మొదటిసారి కాంగ్రెస్, బీజేపీలు లేని తృతీయ ఫ్రంట్ ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. దీనికి బయట నుంచి దీనికి మద్దతు ఇచ్చేలా కాంగ్రెస్ పార్టీని ఒప్పించారు. ఇందులో భాగంగా దేవెగౌడ ప్రధాని అయ్యారు. ఆ తర్వాత... దేవెగౌడను మార్చాలని కాంగ్రెస్ పట్టుపట్టడంతో, తదుపరి ప్రధానిగా ఐకే గుజ్రాల్ ఎంపికలో చంద్రబాబు ప్రముఖ పాత్ర పోషించారు. ఈ రెండు సందర్భాల్లో వామపక్షాలు, ఇతర ప్రాంతీయ పార్టీలను ఐక్యంగా ఉంచడానికి జాతీయ కన్వీనర్‌గా చంద్రబాబు బాగా శ్రమించారు. నిజానికి... ఆ రెండుసార్లూ చంద్రబాబునే ప్రధానిని చేయాలని ఆయా పార్టీలు ప్రయత్నించాయి. కానీ... సొంత బలం లేకుండా మరెవరి మద్దతుతోనే పదవి తీసుకొంటే ఎక్కువ కాలం ఉండలేమని గుర్తించి సున్నితంగా నిరాకరించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసును ప్రధానిగా చేస్తే ప్రభుత్వం ఎక్కువ కాలం మనగలుగుతుందని భావించి ఆ దిశగా ప్రయత్నం చేశారు. కానీ... సీపీఎం అందుకు నిరాకరించి 'చారిత్రక తప్పిదం' చేసింది.


చౌతాలా, జయలలిత, ములాయంసింగ్, అమర్‌సింగ్ తదితర నేతలతో చంద్రబాబు (ఫైల్)

కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించడంతో రెండేళ్లలోనే ఆ ప్రభుత్వం పడిపోయి... లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ పుంజుకుంది. టీడీపీ కేవలం పన్నెండు సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. అదేసమయంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పాటుకు ఇతరుల మద్దతు అవసరమైంది. కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడానికి ఇష్టపడక చంద్రబాబు తొలిసారి బీజేపీకి అండగా నిలిచారు. కేంద్రంలో మంత్రి పదవులు తీసుకోలేదు. స్పీకర్‌గా ఎర్రన్నాయుడికి అవకాశం కల్పించారు. 1999లో లోక్‌సభ మధ్యంతర ఎన్నికల్లో బీజేపీతో కలిసి టీడీపీ పోటీచేసింది. 33 ఎంపీ సీట్లు సాధించి బీజేపీకి మద్దతిచ్చింది. ఎన్డీయేకి 2004 వరకూ చంద్రబాబు జాతీయ కన్వీనర్‌గా ఉన్నారు.

ఇద్దరు రాష్ట్రపతుల ఎంపికలో...

రాష్ట్రపతిగా దళితవర్గానికి చెందిన నారాయణన్ ఎంపికకు చంద్రబాబు చొరవ తీసుకొన్నారు. ఆయన తర్వాత ముస్లిం వర్గానికి చెందిన వారికి రాష్ట్రపతి పదవిని ఇవ్వాలని వాజపేయి భావించారు. ఆ సమయంలో శాస్త్రవేత్తగా ఉన్న అబ్దుల్ కలాం పేరును చంద్రబాబే ప్రతిపాదించారు. కలాం ఒప్పుకోరేమోనని వాజపేయి సందేహం వ్యక్తం చేశారు. కలాంకు చంద్రబాబు ఫోన్ చేసి మాట్లాడారు. శాస్త్రవేత్తలు రాష్ట్రపతి అయితే యువతరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందని నచ్చచెప్పి ఒప్పించారు. ఏపీకి గవర్నర్‌గా చేసిన కృష్ణకాంత్‌ను ఉపరాష్ట్రపతి చేయడంలో కూడా చంద్రబాబు పాత్ర ఉంది. ఇక... రాజకీయ సంప్రదాయానికి భిన్నంగా, ఆర్థికవేత్త రంగరాజన్‌ను చంద్రబాబు గవర్నర్‌గా వేయించుకొన్నారు.

స్వర్ణ చతుర్భుజికి ఇలా శ్రీకారం

చంద్రబాబు మలేషియా వెళ్లినప్పుడు అక్కడ ఆ చివర నుంచి ఈ చివరి వరకూ విశాలంగా నిర్మించి ఉన్న జాతీయ రహదారులను చూసి ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత ప్రధాని వాజపేయిని కలిసి మన దేశంలో కూడా అటువంటి రహదారులను నిర్మించాలని కోరారు. డబ్బులెక్కడివని ప్రధాని ప్రశ్నించారు. పీపీపీ పద్ధతిలో రోడ్లు వేయిద్దామని, రోడ్లు బాగుంటే టోల్ ఫీజు కట్టడానికి ఎవరూ వెనుకాడరని చంద్రబాబు వివరించారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం 'స్వర్ణ చతుర్భుజి' పేరుతో నాలుగు మూలలా జాతీయ రహదారుల విస్తరణ, అభివృద్ధి చేపట్టింది.

హలో... హలో!

1997, 98 వరకూ బీఎస్ఎన్ఎల్ మాత్రమే ఫోన్ కనెక్షన్లు ఇచ్చేది. విదేశాల్లో మాదిరిగా ప్రైవేటు కంపెనీలు సెల్‌ఫోన్లు ప్రవేశపెట్టేందుకు అనుమతించాలని వాజపేయికి చంద్రబాబు సూచించారు. కేంద్రం ఓకే అనడంతో రెండేళ్లలోనే దేశంలోకి సెల్‌ఫోన్లు వచ్చి వేగంగావిస్తరించాయి.


నాటి ప్రధాని వాజపేయితో సీఎం చంద్రబాబు

సంక్షోభాలకే సవాలు

ప్రతిదీ అవకాశంగా మార్చుకునే నైజం

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

"సంక్షోభం వచ్చిందని కుంగిపోవద్దు! దానిని అవకాశంగా మార్చుకుని... కసిగా పని చేద్దాం!" రాష్ట్ర విభజన నేపథ్యంలో వచ్చిన కష్టాలను ఉద్దేశించి చంద్రబాబు పదేపదే చెప్పే మాట ఇది! ఇప్పుడే కాదు... తన ప్రజా జీవితంలో ఎదురైన ప్రతి సంక్షోభాన్నీ ఆయన సమర్థంగా ఎదుర్కొన్నారు. అది ప్రకృతి వైపరీత్యమైనా, రాజకీయ పరమైనదైనా... వాటి పరిష్కారంలో చంద్రబాబు వినూత్నంగానే ఆలోచిస్తారు. సంక్షోభాలను ఎదుర్కొన్న ప్రతిసారీ ఆయన మరింత బలోపేతమయ్యారు. ఆయా సందర్భాలను ఒక్కసారి చూస్తే...

ఎన్టీఆర్ కోసం మహోద్యమం: 1984లో నాదెండ్ల భాస్కరరావు తిరుగుబాటుతో ఎన్టీఆర్ పదవీచ్యుతుడయ్యారు. నాడు ప్రధానిగా ఉన్న ఇందిరాగాంధీ పరోక్షంగా నాదెండ్లకే ఆశీస్సులు అందించారు. ఎన్టీఆర్ అప్పుడే అమెరికాలో గుండె శస్త్ర చికిత్స చేయించుకొని వచ్చారు. తెలుగుదేశం పార్టీకి ఎదురైన తొలి సంక్షోభం ఇది. ఈ సమయంలో ఎన్టీఆర్ శిబిరం తరపున మొత్తం వ్యూహరచన బాధ్యతను చంద్రబాబు తన నెత్తిన వేసుకున్నారు. ఎన్టీఆర్‌పట్ల ఉన్న జనాదరణను సంఘటితం చేస్తూ... ప్రజోద్యమం నడిపారు. కేంద్రం మెడలు వంచారు. నెల రోజుల వ్యవధిలోనే ఎన్టీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. ఈ సంక్షోభ సమయంలోనే చంద్రబాబు చాకచక్యం, వ్యూహ రచనా శక్తి బయటి ప్రపంచానికి తెలిసింది.

తొలిసారి సీఎం అయ్యాక: 1995లో చంద్రబాబు సీఎం అయ్యేనాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలంగా ఉండేది. కరెంటు కోతల గురించి చెప్పాల్సిన పనే లేదు. ఇలాంటి సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు సంస్కరణలు ప్రవేశపెట్టక తప్పదని ఆయన గ్రహించారు. ఆర్థిక పరిస్థితిని గాడినపెట్టి... విద్యుత్తులో మిగులు సాధించారు.

ప్రకృతి వైపరీత్యాలు: కోనసీమ... పచ్చదనాల సీమ! కొబ్బరి చెట్లతో కళకళ! కానీ... 1996లో వచ్చిన తుఫానుకు ఈ ప్రాంతం అతలాకుతలమైంది. ఈ సమయంలో చంద్రబాబుతోపాటు యంత్రాంగం మొత్తం రాజమండ్రిలో మకాం వేసింది. ఆ ప్రాంతం మళ్లీ కోలుకున్నాకే చంద్రబాబు తిరిగి హైదరాబాద్ వెళ్లారు. అన్నిరకాల పరిహారాలతో పాటు... కొబ్బరి మొక్కలను కూడా పంపిణీ చేశారు. ఇక... 2003లో మరో పెను తుఫాను ఉత్తరాంధ్రను ముంచెత్తనుందన్న వార్త రావడంతో చంద్రబాబు సర్కారు అప్రమత్తమైంది. అన్నిరకాల సహాయ సామగ్రి, సిబ్బందిని సిద్ధంగా ఉంచింది. కానీ... ఆ తుఫాను ఒడిసాను కుదిపేసింది. 'మనం సేఫ్' అని చంద్రబాబు ఊరుకోలేదు. అప్పటికే సిద్ధంగా ఉన్న సిబ్బందిని, సామగ్రిని ఒడిసాకు తరలించారు. అప్పుడు ఆ రాష్ట్ర సీఎంగా ఉన్న గిరిధర్ గమాంగ్ ఏపీ నుంచి వెళ్లిన శాటిలైట్ ఫోన్ అందిన తర్వాతే... బయటి ప్రపంచంతో కనెక్ట్ కాగలిగారు. ఇక... మూడేళ్ల క్రితం వచ్చిన హుద్‌హుద్ తుఫాను సమయంలోనూ చంద్రబాబు ఏకంగా పది రోజులు అక్కడే... కలెక్టరేట్ ఆవరణలో బస్సులో పడుకుని సహాయ కార్యక్రమాలు పర్యవేక్షించారు. దెబ్బతిన్న విశాఖను కొద్దికాలంలోనే మళ్లీ, మరింత సుందరంగా మార్చారు.

రాష్ట్ర విభజన: విభజన తర్వాత ఏపీకి రాజధాని, ఆదాయం, మౌలిక సదుపాయాలు లేవు! నవ్యాంధ్రకు ఇదో పెద్ద సంక్షోభం! దీనినీ అవకాశంగా మార్చుకుని 'అమరావతి' పేరిట సరికొత్త రాజధాని నగరానికి శ్రీకారం చుట్టారు.

సమ్మర్ జ్యూస్



వాటర్ మెలన్ స్లష్

కేవలం మూడంటే మూడు పదార్థాలతో ఐదు నిమిషాల్లో రుచికరమైన చల్లటి సమ్మర్ జ్యూస్ రెడీ చేసుకోవచ్చు.

కావలసినవి:

పుచ్చకాయ ముక్కలు (గింజలు తీసేసి)- ఐదు కప్పులు, పంచదార - రెండు టేబుల్ స్పూన్‌లు, నిమ్మకాయ - ఒకటి (రసం). నిమ్మరసం ఇష్టం లేకపోతే వాడకపోయినా పర్వాలేదు.

తయారీ:

- పుచ్చకాయ ముక్కలు, పంచదార, నిమ్మరసాలను బ్లెండర్‌లో వేయాలి. వీటితో పాటు ఒక కప్పు ఐస్ ముక్కలు కూడా వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఇది నలుగురికి సరిపోతుంది.
- వెంటనే తాగితే చల్లగా, హాయిగా ఉంటుంది.

ప్రత్యేకం



నేను పలానా మతంలో పుట్టాను, నాది పలానా కులం అని తమ అస్థిత్వాన్ని గొప్పగా చెప్పుకుంటారు ఎవరైనా. తమ పేర్ల వెనుక వాటిని తగిలించుకుంటారు కూడా. కొన్ని ప్రయోజనాల కోసం తాను పలానా అని కొందరు అబద్ధం కూడా చెప్పుకోవచ్చు. కానీ, 1500 రూపాయల పింఛను కోసం వీళ్ళలో ఎవరైనా నేను హిజ్రాని అని చెప్పుకుంటారా? నిరంతరం వెంటాడే వివక్ష, వేధింపులు, హేళన.. వీటిని భరిస్తారా? ఒక హిజ్రా మాత్రమే తాను హిజ్రా అని చెప్పుకోగలరు. స్వయం ప్రకటననే హిజ్రా గుర్తింపు ధృవీకరణగా నిర్ణయించాలి. 'హిజ్రా అనేది శరీరానికే పరిమితమైన అంశం కాదు, అది ఒక మానసిక స్థితి' అంటున్నారు హిజ్రా సమీర. రేషన్ కార్డుల కోసమో, ఇతర సంక్షేమ ప్రయోజనాల కోసమో తాను హిజ్రా అని ఎవరూ ఎందుకు చెప్పుకోరో దృష్టాంతంగా తన కథ చెబుతున్నారు సమీర. ఇది ఒక హిజ్రా ఆత్మకథ...

నా పేరు సమీర
నేను హిజ్రాని

మాది కడపజిల్లా జమ్మలమడుగు. పేద ముస్లిం కుటుంబం. మా అమ్మానాన్నలకు ముగ్గురు మగ పిల్లలు, ఇద్దరు ఆడబిడ్డలు. ముగ్గురు మగపిల్లల్లో నేనూ ఒకడిని. నాకు సమీర్ అని పేరు పెట్టారు. మొదట్లో ఆడపిల్లలు పుట్టక ముందు మా అమ్మ నన్ను అమ్మాయిలా అలంకరించి ఆనందపడేది. నాకు కూడా చిన్నప్పటి నుంచీ అమ్మాయిలా ఉండడమే ఇష్టంగా ఉండేది. ఆడపిల్లలు ఆడుకునే ఆటలే ఆడేవాడిని. అమ్మాయిల బట్టలే వేసుకోవాలనిపించేది. అబ్బాయిలతో పెద్దగా కలిసేవాడిని కాదు. నా నడక, మాట తీరు కూడా అమ్మాయిలా ఉండేవి. ఎందుకో నాకూ తెలీదు కానీ నేను అమ్మాయినే అనిపించేది. మా నాన్నకి ఇది నచ్చేది కాదు. ఎందుకు సమీర్ ఆడపిల్లలా ప్రవర్తిస్తున్నాడు? అని అమ్మతో కోపంగా అనేవాడు. చుట్టు పక్కల వాళ్ల కూడా నన్ను గేలి చేస్తూ మాట్లాడేవారు. మా పెద్దన్నకి ఇదంతా అవమానంగా ఉండేది. తన స్నేహితుల ముందు తలెత్తుకు తిరగలేకపోతున్నానని అనేవాడు. అన్నని చూస్తే భయంగా ఉండేది. అన్న ఇంట్లో అడుగుపెట్టగానే నేను బయటకు వచ్చేసేవాడిని. అమ్మ ఒక్కతే నన్ను అర్థం చేసుకునేది. నన్ను ఎగతాళి చేసేవాళ్ళందరినీ తప్పుపట్టేది. ఎవరిని చూసినా నాకు భయంగా ఉండేది. అమ్మని చూస్తే మాత్రం ధైర్యంగా ఉండేది.

ఇటువంటి సంఘర్షణలోనే నా చదువంతా సాగింది. పదో తరగతికి వచ్చేప్పటికి నేను మగపిల్లాడిని కాదు, ఆడపిల్లనే అనిపించేది. ఆడపిల్లలాగే నా ఆలోచనలు కూడా ఉండేవి. నా పేరు సమీర్ కాదు సమీర అని చెప్పుకునేవాడిని. క్లాసులో ఆడపిల్లల మధ్యలో కూర్చోవడమే బావుండేది. టెన్త్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాను. మా ఇళ్ళలో టెన్త్ మొదటిసారి పాసైనవారే లేరు. బాగా చదువుకుని డాక్టర్ కావాలని నా కోరిక. రైల్వేకోడూరు ప్రభుత్వ కాలేజీలో ఇంటర్ బైపీసీ చేరాను. మగ పిల్లల్ని ఎదుర్కోవడం చాలా కష్టంగా ఉండేది. మాటలూ చేతలూ నన్ను హింసించేవి. క్లాసులో అడుగు పెట్టగానే పెళ్లున నవ్వులు. నేను ఎక్కడ కనిపించినా చప్పట్లు చరిచేవాళ్లు. పాఠాల మీద మనసు పెట్టే వాతావరణమే ఉండేది కాదు. దు:ఖం పొంగుకొచ్చేది. క్లాసులో డౌట్స్ అడిగితే టీచర్లు కూడా చెప్పేవాళ్లు కాదు. అమ్మాయిలు అడిగినా చెబుతారు, అబ్బాయిలు అడిగినా చెబుతారు. నేను అడిగితే మాత్రం విననట్టే ఉండేవాళ్ళు. అర్థం అవుతోందా లేదా అని పాఠం మధ్యలో నా చుట్టూ ఉన్నవాళ్ళని ప్రశ్నలు అడిగే సార్‌లు నావైపు చూసేవాళ్ళు కూడా కాదు. ఇంటర్‌లో సెకండ్ క్లాసు మార్కులకే పరిమితం కావాల్సి వచ్చింది. కడపలో బీఎస్సీ చేరాను. అక్కడా అనుక్షణం అవమానాలే. నా పక్కన ఎవరూ కూర్చునేవాళ్లు కాదు. నాతో ఎవరూ మాట్లాడేవాళ్లు కాదు. ఎవరైనా పలకరిస్తే వాళ్లూ నాలాగే అయిపోతారని భయపెట్టేవాళ్లు. దాన్ని బాధ అని కూడా చెప్పలేను. అంతకన్నా పెద్ద మాట ఏదైనా ఉంటే బావుండును. కాలేజీలో మేడమ్స్, అమ్మాయిలు కాస్త దయగా ఉండేవాళ్లు. అమ్మాయిలు తమ బెంచీల్లో కూర్చోనిచ్చేవాళ్ళు. బాగా చదువుకోవాలనే ఉన్నా, నా మానాన నన్ను చదువుకోనిచ్చేవారు కాదు. ఇది నా ప్రపంచం కాదు అనిపించేది. పారిపోవాలనిపించేది. బీఎస్సీ సెకండ్ ఇయర్‌తో చదువు ఆగిపోయింది. నాలాగా ఉండే వాళ్ళని వెతుక్కుంటూ ఇల్లు వదిలి వచ్చేశాను.

ముంబయి ప్రయాణం

నాలాంటి కొందరు పరిచయం అయ్యారు. సమీరగా నన్ను గుర్తించేవాళ్లు. తిరుపతిలో చాలా మంది కలుసుకునేవాళ్ళం. మనలాంటి వాళ్లకి ఈ భూప్రపంచంలో ఒక స్వర్గం ఉంది అని చెప్పారు. వెతుక్కుంటూ ముంబయికి చేరుకున్నాను. అప్పుడు నాకు పదిహేడేళ్లు. అది స్వర్గం కాదు అని త్వరగానే అర్థమైపోయింది. తెల్లవారుజామున మూడున్నరకే లేవాలి. రైలెక్కి ఒక్కొక్కరూ ఒక్కో ప్రాంతానికి భిక్షాటనకు వెళ్ళాలి. అదంతా నాకు నచ్చలేదు. మా గురువు అర్థం చేసుకున్నారు. 'సమీర ..నువ్వు ఇక్కడ ఉండలేవు. తిరిగి ఇంటికి వెళ్లిపో' అని చెప్పారు. అయినా నేను వెనక్కి బయలుదేరలేదు. వాళ్ళ ఆచారాలూ పద్ధతులూ నాకు నచ్చకపోయినా ఎందుకో అక్కడ బావున్నట్టే అనిపించేది. నావాళ్ల మధ్య ఉన్నానని అనిపించేది. సూటిపోటి మాటలూ, ఎగతాళి ఉండవు. హిజ్రాలకు ఆపరేషన్‌లు చేస్తారని తెలిసి నేను కూడా ఆపరేషన్ చేయించుకోవాలను కున్నాను. ఆపరేషన్ ఖర్చుతో కూడుకున్నది. సిలికాన్ తొడుగులు, హార్మోన్ల ద్వారా హిజ్రాలు అందంగా తయారవుతారు. ఆరునెలలు అక్కడ ఉన్నాను. రంజాన్ పండగకి ఇంటికి వెళ్ళి వస్తానని చెప్పి బయటకు వచ్చేశాను. నన్ను రైలు ఎక్కించేందుకు ఒకరు నాతో పాటూ రైల్వేస్టేషన్‌కి వచ్చారు. ముంబయి రైల్వే స్టేషన్‌లో హిజ్రాలు కనిపిస్తే పోలీసులు పట్టుకునేవాళ్లు. మమ్మల్నీ పట్టుకున్నారు. నాతో పాటూ ఉన్న హిజ్రా, పోలీసుల కాళ్ళావేళ్ళా పడి విడిపించింది. తిరిగి మా ఊరికి చేరుకున్నాను.



ఉత్తరాది వ్యాపారులు మా ఆశీర్వాదం కోసం ఎదురు చూస్తుంటారు. అదొక నమ్మకం. అక్కడ అంతగా ఆదరిస్తున్నారు కాబట్టే ఎక్కువ మంది మావాళ్లు ముంబయి, ఢిల్లీల్లో ఉంటున్నారు. మేం అర్థనారీశ్వరులతో సమానం కాబట్టి మమ్మల్ని గౌరవిస్తుంటారు.

ఇల్లు చేరినా... ఎందుకో ఆ ఇల్లు నన్ను, నన్నుగా స్వీకరించడంలేదు అనిపించేది. నాన్న కరెంటు ఆఫీసులో లైన్‌మాన్‌గా పనిచేసేవాడు. కేన్సర్‌తో ఆయన చనిపోయాడు. ఐటీఐ చదువుకుంటే నాన్న ఉద్యోగం నాకు వస్తుందని చెప్పారు. ఐటీఐలో చేరాను. నా రూపమే నాకు శాపం. నా వల్ల మా కుటుంబం అంతా వేదనకు గురయ్యేది. అన్నలు, పెళ్ళి కాని చెల్లెళ్లు. నా వల్ల అందరూ ఇబ్బంది పడుతున్నారు. నా బతుకు నేను బతుకుదామని మరోసారి ఇల్లు వదిలి వచ్చేశా.

'విన్స్'తో ముందడుగు

తిరుపతిలో ఉన్న 'విన్స్' సంస్థ గురించి తెలిసింది. దాని నిర్వాహకురాలు మీరా మేడంని కలిశాను. హెచ్ఐవీ బాధితుల కోసం వాళ్లు పనిచేస్తున్నారు. నన్ను కూడా ఆ పనిలో చేరమన్నారు. 2002లో విన్స్‌లో చేరాను. హెచ్ఐవీకి ఎక్కువగా గురయ్యేది సెక్స్ వర్కర్లు, ఈ వృత్తిలో ఉండే హిజ్రాలు. వీరు నిరంతరం హింసకు గురయ్యేవారు. హెచ్ఐవీ గురించి వీళ్ళకి అవగాహన కలిగించే పనిలో భాగం అయ్యాను. 2005లో హెచ్ఐవీ పాజిటివ్స్ మీద ప్రత్యేకంగా పనిచేశా. హెచ్ఐవీ సోకినవారిని గుర్తించి వారికి అవగాహన కల్పించడం. వారి జీవన ప్రమాణాలు పెంచడం, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోమని చెప్పడం, ఏఆర్టీ మందులు క్రమం తప్పకుండా వినియోగించేలా చూడడం... ఇదీ మా పని. ఇండియన్ నేషనల్ నెట్‌వర్క్ ద్వారా యాక్ట్ ప్రాజెక్ట్‌తో చేసేదానిని. ఏపీ సాక్స్ నన్ను గుర్తించి నాకు కొన్ని ప్రాజెక్టులు ఇచ్చింది. తల్లినుంచి బిడ్డకు హెచ్ఐవీ రాకుండా ఉండే మందుల గురించి కడప జిల్లాలో హెచ్ఐవీ పాజిటివ్స్‌కు విస్తృతంగా అవగాహన తీసుకొచ్చాం. 'సేవ్' అనే సంస్థను స్థాపించి ఇప్పుడు పని చేస్తున్నాను. హిజ్రాల కోసమే కాదు, అపసవ్యంగా ఉన్న ఈ సమాజంలో చాలా రంగాల్లోనే పని చేయాలని అర్థమైంది. ఈ పనే నాకు ఆత్మవిశ్వాసం ఇస్తోంది. కుంగిపోకుండా నిలబెడుతోంది. నడిపిస్తోంది. ఇప్పుడు మా కుటుంబం కూడా నన్ను అర్థం చేసుకుంది. అనారోగ్యంతో ఉన్న అమ్మని నేనే చూసుకుంటున్నాను. అన్నలూ, చెల్లెళ్లూ, వాళ్ల పిల్లలూ కూడా నా పట్ల అభిమానంగా ఉంటారు. ఇదంతా నేను చేస్తున్న పని వల్ల లభించిన గౌరవం అనుకుంటున్నాను.

ఇదీ మా బతుకు

సమాజం వెంటబడుతూ ఉంటే తప్పనిసరి పరిస్థితుల్లోనే హిజ్రాలు ఇంటి నుంచి పారిపోతారు. ఒక్కసారి గడప దాటిన తర్వాత తిరిగి ఇల్లు చేరరు. హిజ్రాలు గురువులను నమ్ముతారు. వారు ఏం చెబితే అదేచేస్తారు. గురుశీల పరంపర మాకు ఎంతో పవిత్రమైంది. ఎందుకంటే మాకు వాళ్లే మార్గదర్శకులు. ఆపరేషన్ చేసుకుంటేనే హిజ్రాగా ఉంటావని నన్నెవరూ బలవంతం చేయలేదు. హిజ్రా బాధ సాటి హిజ్రాకే తెలుస్తుంది. జూన్, జూలైలో ముంబై, ఢిల్లీల్లో హిజ్రాల జాతర జరుగుతుంది. అప్పుడు అందరూ అక్కడ కలుసుకుంటారు. తమ సంతోషాలనీ, బాధలనీ కలబోసుకుంటారు. కొందరు హిజ్రాలు ఆరోగ్యం క్షీణించి సొంత ఊళ్ళకు చేరుకుంటారు. ఇల్లు వాళ్ళని అక్కున చేర్చుకోదు. ఊరు ఎగతాళి చేస్తుంది. మరీ హెచ్ఐవీ సోకిన హిజ్రాల పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఊరిలోకి రానివ్వరు. దూరంగా తరిమేసేవారు. చచ్చిపోతే చాపలో చుట్టేసి కాల్చేసేవారు. ఇదంతా నేను చూసాను. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు కాస్త మార్పు వచ్చింది.

హిజ్రాలు జులుం చేస్తారా?

హిజ్రాలను ఎవరూ ఏ పనిలోనూ చేర్చుకోరు. ఎలా బతకాలి. అందుకే ఎక్కువ మంది అడుక్కుంటారు. కొంత మంది హిజ్రాలు జులుం చేసిన సంఘటనలూ ఉంటాయి. హిజ్రాలే కాదు సాధారణ వ్యక్తులు కూడా జులుం చేస్తుంటారు. ఆ పని హిజ్రాలు చేస్తే మాత్రం పెద్ద ప్రచారం అయిపోతుంది. మా గురువులు ఎవ్వరూ దాడులు చేయమని ఎన్నడూ చెప్పరు. ఎవ్వరినీ ఇబ్బంది పెట్టమని చెప్పరు. అలా చేయడం తప్పనే చెబుతుంటారు. కొద్ది మంది వ్యసనాలకు బానిసై అలా చేస్తుంటారు. మా సమావేశాల్లో ఇలా చేయవద్దని ఎవరినీ వేధించవద్దని హెచ్చరిస్తూ ఉంటాం.

మరణం తర్వాత...

నేను జెండర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకోలేదు. నేను మానసికంగా హిజ్రాను. ముస్లిం కుటుంబంలో పుట్టాను. జెండర్ ట్రాన్స్‌ప్లాంట్ ఆపరేషన్‌ను మా మతం అంగీకరించదు. కాదని చేసుకుంటే నా మరణం తర్వాత ముస్లిం సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు చేయరు. అందుకనే నేను ఆపరేషన్ చేసుకోలేదు.

ఆపరేషన్ చేసుకుంటేనే హిజ్రాలు కారు

సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలతో హిజ్రాలకు విడి అస్తిత్వం లభించింది. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతిగా వారిని గుర్తించాలనీ, చదువుల్లో ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలనీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ఇందుకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటీవల హిజ్రాలకు రేషన్ కార్డులు జారీ చేసింది. నెలకి 1500 రూపాయల ఫించను ప్రకటించింది. ఈ ప్రకటన మా హిజ్రాల్లో సంతోషం నింపింది. అయితే ఈ సంక్షేమ ఫలాలు అందుకునేందుకు అర్హులైన హిజ్రాలను ఎంపిక చేసే ప్రక్రియ మాత్రం సరిగా లేదు. నేను హిజ్రా అని చెప్పుకోవడానికి మించిన ధృవీకరణ ఎందుకు? వైద్య పరీక్ష పేరుతో మమ్మల్ని బట్టలు విప్పమంటారా. ఇది మళ్ళీ మమ్మల్ని అవమానించడమే. ఆపరేషన్ చేసుకున్నవాళ్ళు మాత్రమే హిజ్రాలు కారు. హిజ్రాల్లో 16 రకాల వాళ్ళున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వీళ్ళందరినీ గుర్తించింది. ఫించను కోరుకునే హిజ్రాలు అడుక్కోకూడదు, సెక్స్‌వర్కర్లుగా ఉండకూడదు అంటున్నారు. నెలకి 1500 రూపాయలతో ఎవరినైనా బతికి చూపించమనండి. మేము ఏమి కోరుకుంటున్నామంటే మమ్మల్ని మనుషులుగా గుర్తించండి. చదువుకోనివ్వండి. చెయ్యడానికి పనులివ్వండి. మా బతుకు మేం బతుకుతాం. మా ఉనికిని భరించేలా సమాజంలో మార్పు తీసుకురండి చాలు. ఇంతకాలానికి మమ్మల్ని గుర్తించారు. అయితే మార్గదర్శకాల పేరుతో మాత్రం మళ్లీ అవమానించకండి. స్క్రీనింగ్ కమిటీల్లో హిజ్రాలను చేర్చండి. ఒక హిజ్రా బాధ మరొక హిజ్రాకి మాత్రమే తెలుస్తుంది.

• ఆర్ఎం ఉమామహేశ్వరరావు
• పి. నరేంద్ర
ఫోటోలు: షేక్ మౌలానా, కడప

మరో కోణం



శ్రీ రంగులకల!

అతిలోకసుందరి శ్రీదేవి గొప్ప నటిగానే చాలామందికి తెలుసుగానీ ఆమె పెయింటింగ్స్ కూడా వేస్తుందనే విషయం చాలా కొద్దిమందికి మాత్రమే తెలుసు. పెళ్లయిన తర్వాత నటనకు దూరమై, తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూ బిజీగా మారిన శ్రీదేవికి పెయింటింగ్ కాలక్షేపంగా మారింది. ప్రతిరోజూ కొంత సమయాన్ని కాన్వాసు ముందు గడిపేది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె వేసిన పెయింటింగ్స్‌తో భారీ ఎత్తున ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసేందుకు కూడా సన్నాహాలు ప్రారంభించారు. ఆమె ఇప్పటిదాకా వేసిన చిత్రాలను తొలిసారిగా ప్రదర్శనకు పెట్టాలనుకున్నారు.


చాలాకాలం క్రితమే శ్రీదేవి పెయింటింగ్ వైపు దృష్టి సారించి కాన్వాసుపై బొమ్మలు వేయడం ప్రారంభించింది. అయితే ఈ విషయం ఇంట్లోవారికి తప్ప బయటి ప్రపంచానికి తెలియదు. శ్రీదేవి ఇంట్లో గోడలకు ఆమె వేసిన పెయింటింగ్స్ వేలాడుతూ కనిపిస్తాయి. అంతేకాదు కుటుంబసభ్యుల (వాటిలో కూతుళ్లు జాహ్నవి, ఖుషీ పెయింటింగ్స్ ఉన్నాయి) పోర్ట్రెయిట్స్ కూడా వేసినప్పటికీ వాటిని ఇప్పటిదాకా ఎవరికీ ప్రజెంట్ చేయలేదు. కానీ అనిల్‌కపూర్ కూతురు సోనమ్‌కపూర్ పెయింటింగ్‌ను మాత్రం ఆమె పుట్టినరోజు సందర్భంగా బహుమతిగా అందచేసింది. మరో సందర్భంలో కండలవీరుడు సల్మాన్‌ఖాన్ జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత ఆయనకు కూడా ఒక పెయింటింగ్ బహుమతిగా అందించింది. ప్రసిద్ధ ఫ్యాషన్ డిజైనర్ మనీష్ మల్హోత్రా దగ్గర కూడా శ్రీదేవి స్వయంగా ప్రజెంట్ చేసిన ఓ పెయింటింగ్ ఉంది.






శ్రీదేవి ఇప్పటిదాకా చాలా పెయింటింగ్స్ వేసినప్పటికీ వాటిలో సోనమ్‌కపూర్, మైఖేల్‌జాక్సన్ పెయింటింగ్స్ మాత్రం ప్రచారంలోకి వచ్చాయి. ఒక ఛారిటీ షో కోసం వీటిని త్వరలో దుబాయిలో వేలం వేయాలనుకున్నారు. ఆమె పెయింటింగ్స్‌తో ఒక పెద్ద షో ఏర్పాటుచేయాలని అంతర్జాతీయ సంస్థ ఒకటి 2010లోనే శ్రీదేవిని సంప్రదించింది. కానీ శ్రీదేవి అప్పట్లో అంగీకరించలేదు. అయితే ఇటీవలే ఆ డీల్ కూడా పూర్తయిందనే వార్తలు వచ్చాయి. ఈ వార్త నిజమేనని ఆమె భర్త బోనీకపూర్ కూడా ఇటీవల ధ్రువీకరించారు. "శ్రీ పెయింటింగ్స్‌ను 'థాట్స్' పేరిట ఆక్షన్‌లో పెట్టి, వచ్చిన మొత్తాన్ని ఛారిటీకి ఇచ్చేందుకు ఒక ఇంటర్నేషనల్ ఆర్ట్ హౌస్‌తో ఒప్పందం కుదిరిన మాట వాస్తవమే. షో ఏప్రిల్‌లో జరుగుతుంది. తొలిసారిగా ఆమె వేసిన పెయింటింగ్స్‌ను అంతా చూడబోతున్నారు. ఆమె ఈ మధ్య ఆధ్యాత్మిక చిత్రాలు గీస్తున్నారు" అన్నారాయన. ఇంటిపనులన్నీ ముగిసిన తర్వాత సాయంత్రం శ్రీదేవి తనదైన ప్రపంచంలోకి వెళ్తుంది. ప్రతిరోజూ తప్పకుండా నాలుగైదు గంటలపాటు సీరియస్‌గా పెయింటింగ్స్ వేస్తుంది. "పిల్లలు, నా తర్వాత శ్రీదేవికి అత్యంత ఇష్టమైన పనంటే పెయింటింగే. తొలుత బొమ్మలు కొంత అమెచ్యూర్‌గా ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె ప్రొఫెషనల్ పెయింటర్ మాదిరిగా వేస్తోంది. మార్కెట్లో వాటికి మంచి 'విలువ' ఉంటుందనే నమ్మకం కలిగింది" అని బోనీ ఒక ఇంటర్వ్యూలో అన్నారు. ఇప్పుడు శ్రీదేవి భౌతికంగా మనమధ్య లేకపోయినా... ఇన్నేళ్లుగా కాన్వాసుపై ఆమె వేసిన అనేక పెయింటింగ్స్ గదిలో భద్రంగా ఉన్నాయి. ఇప్పటిదాకా వెండితెరపై శ్రీదేవి హావభావాలను మాత్రమే చూసి 'ఫిదా' అయిన అభిమానులు త్వరలో ఆమె 'రంగుల కల'ను చూసే అవకాశం లేకపోలేదు.





వి'చిత్రం'



35 ఏళ్ల తర్వాత... బాలీవుడ్‌లో 'ఫేట్' మార్చిన సినిమా విడుదల రోజే శ్రీదేవి కన్నుమూయడం వి'చిత్రం'. దక్షిణాదిలో టాప్ హీరోయిన్‌గా పేరుతెచ్చుకున్న శ్రీదేవి 1978లో 'సోల్వా సావన్'తో బాలీవుడ్‌లోకి ప్రవేశించినప్పటికీ ఐదేళ్ల తర్వాత 'హిమ్మత్‌వాలా'తో తొలిహిట్‌ను తన ఖాతాలో వేసుకుంది. జితేంద్ర హీరోగా దర్శకుడు కె.రాఘవేంద్రరావు తీసిన ఈ సినిమా 1983 ఫిబ్రవరి 25న విడుదలైంది. తొలుత ఈ సినిమాలో హీరోయిన్‌గా రేఖను అనుకున్నప్పటికీ చివరి నిమిషంలో శ్రీదేవి ఎంటరైంది. ఆ సినిమా సూపర్‌హిట్ కావడంతో జితేంద్ర, శ్రీదేవిలు వెనక్కి తిరిగిచూసుకోలేదు. యష్‌చోప్రా తీసిన 'చాందిని'లో కూడా తొలుత రేఖనే అనుకున్నప్పటికీ ఆ పాత్ర చివరికి శ్రీదేవికి దక్కడం విశేషం. 'ఆఖ్రీ రాస్తా'లో శ్రీదేవికి డబ్బింగ్ చెప్పింది రేఖనే కావడం మరో వి'చిత్రం'.

గుడ్ ఫుడ్



మొలకలు చేసే మేలెంతో...

మొలకలు తింటే ఒంటికి మంచిది అనగానే 'అబ్బా...' అని ముఖం వేలాడేసేవాళ్లు చాలామంది ఉంటారు. కానీ ఇది నిజం. వీటిని తినడం వల్ల శరీరానికి బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. తరచూ మొలకలు తినడం ఆరోగ్యానికే కాదు అందానికి, శిరోజాల సంరక్షణకు కూడా ఎంతో మంచిది. డైట్‌లో పచ్చిమొలకలను తింటేనే మంచిది. ఎందుకంటే మొలకలను వేడి చేస్తే వాటిలోని పోషకాలు పోతాయి. ఇంతకూ వీటి ప్రయోజనాలు ఏమిటంటే...

- జీర్ణశక్తికి మొలకలు చాలా మంచివి.
- ఇవి జీవక్రియను పెంచుతాయి.
- వీటి వల్ల ఎంజైముల పనితీరు బాగుంటుంది.
- రక్తహీనత తగ్గుతుంది.
- బరువు తగ్గుతారు. వెయిట్ మేనేజ్‌మెంట్ సులభం.
- కొలెస్ట్రాల్‌ను, రక్తపోటును తగ్గిస్తాయి.
- పిల్లల్లో న్యూరల్ ట్యూబ్స్ సమస్యలుంటే నివారిస్తాయి.
- కాన్సర్ రాకుండా నిరోధిస్తాయి.
- స్పష్టమైన కంటిచూపుకు కూడా మొలకలు తినడం ఎంతో మంచిది.
- రోగనిరోధకశక్తిని పెంచుతాయి.
- మొలకల్లోని విటమిన్లు, ఖనిజాలు, ఆర్గానిక్ కాంపౌండ్లలో పోషకవిలువలతో పాటు వైద్యానికి ఉపయోగపడే లాభాలు కూడా ఎన్నో దాగున్నాయి.
- మొలకల్లో డైటరీ ఫైబర్, విటమిన్-కె, ఫొలేట్, విటమిన్-సి, ఎ, రిబోఫ్లేవిన్ వంటివెన్నో ఉన్నాయి. మినరల్స్ పరంగా మాంగనీసు, జింక్, కాపర్, మెగ్నీషియం, ఐరన్, కాల్షియం వంటి వి వీటిల్లో చాలా ఉన్నాయి.
- మొలకలు తింటే శరీరంలో రక్త ప్రసరణ బాగా జరుగుతుంది.
- గుండెజబ్బుల నివారణకు కూడా ఉపయోగపడతాయి.
- ఎలర్జిక్ రియాక్షన్లపై బాగా పనిచేస్తాయి. ముఖ్యంగా బ్రొకోలీ మొలకలులాంటివి ఆస్తమా లాంటి ఎలర్జిక్ రియాక్షన్స్‌ను తగ్గిస్తాయి. మొలకల విషయంలో శుభ్రతను మాత్రం తప్పనిసరిగా పాటించాలి.

చైల్డ్ హెల్త్

బొడ్డు తాడు కోస్తున్నారా?

ప్రశ్న: మాది పల్లెటూరు. ఇంట్లోనే ప్రసవం చేయించేస్తూ ఉంటారు. కానీ, నాకేమో పిల్లల బొడ్డు తాడు ఎలా కోస్తారో? సరైన పద్ధతిలో కోయకపోతే పసికందు ఆరోగ్యం దెబ్బ తింటుందేమోనని భయంగా ఉంది? ఏం చేయమంటారు?

ఇంట్లో ప్రసవం జరిగినా, బొడ్డు తాడు కోసే పద్ధతి సక్రమంగా పాటిస్తే బిడ్డకు ఎలాంటి ప్రమాదం ఉండదు. ఇందుకోసం ప్రసవం జరిగిన వెంటనే తల్లిని బిడ్డను కలిపి ఉంచే బొడ్డుతాడు మధ్యలో క్లిప్ పెట్టి రక్త ప్రసారం ఆపేయాలి. తర్వాత బిడ్డ బొడ్డు నుంచి కొన్ని అంగుళాల మేర వదిలి బొడ్డు తాడును స్టెరిలైజ్ చేసిన కత్తెరతో కత్తిరించుకోవాలి. ఆ తర్వాత బిడ్డ బొడ్డుకు అతుక్కున్న బొడ్డు తాడును ముడి వేయాలి. ఈ తాడు వారం రోజుల్లోగా ఎండి ఊడి, పడి పోతుంది. ఇలా జరగకుండా నీరు కారుతున్నా, రక్తం కలిసిన నీరు స్రవించినా వైద్యుల్ని సంప్రదించాలి. కొన్ని సార్లు బొడ్డుతాడు ఊడిన చోట గాయంలా తయారవుతుంది. ఈ గాయం మానకపోయనా ఆలస్యం చేయకుండా వైద్యులకు చూపించాలి.



డాక్టర్ దినేశ్ కుమార్ చిర్ల,
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, బంజారాహిల్స్, హైదరాబాద్.

ఫుడ్ ఫ్యాక్ట్



పచ్చిగానా? ఉడికించా?

ఎక్కువ మంది దృష్టి ఎంత సేపూ ఖరీదైన పండ్ల మీదికే వెళుతుంది. అంతే తప్ప చాలా చవకగా లభించే టొమాటోల వంటి వాటి మీదికి వెళ్లదు. నిజానికి ఏ పండుకూ తీసిపోని విటమిన్లు, లవణాలు టొమాటోలో సమృద్ధిగా ఉన్నాయి. వాటి గురించి ఎంతో కొంత తెలిసిన వాళ్లు ఇటీవలి కాలంలో టమేటాలను విరివిగానే వాడుతున్నారు. కాకపోతే, టొమాటొలను ఉడికించి తినాలా? పచ్చిగా తినాలా? అన్న సందేహం ఇప్పటికీ చాలా మందినే వెంటాడుతోంది. టొమాటొలను ఉడికించినప్పుడు వాటిలోని ఆరోగ్యకారకమైన లైకోపిన్ అనే యాంటీఆక్సిడెంట్ రెట్టింపు అవుతుందనేది వాస్తవమే. అలా తయారుచేసిన టమేటా సూప్ అత్యత్వర గా శక్తినిస్తుందనేది కూడా చాలా మందికి తెలిసిందే. అందుకే బాగా అనారోగ్యానికి గురైన వారికి గానీ, లేదా శరీర శ్రమ వల్ల బాగా అలసిపోయిన వారికి టొమాటొ సూప్ ఇవ్వడం పరిపాటిగా ఉంటోంది. కాకపోతే, ఉడికించడం వల్ల టొమాటొల్లోని విటమిన్ - సి, ఇంకా కొన్ని ఇతర పోషకాలు నశించిపోతాయి. ఈ కోణంలోంచి చూస్తే ఉడికించడం వల్ల కలిగే నష్టం కూడా ఉంది. అందువల్ల ఈ రెండు రకాలా పోషకాలు శరీరానికి పూర్తి స్థాయిలో అందాలంటే రెండు పద్ధతులనూ అనుసరించాలి. అంటే, ఒకసారి ఉడికించి, మరోసారి పచ్చిగా అంటే సలాడ్స్‌లో భాగంగా కూడా తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల రెండు ప్రయోజనాలూ నెరవేరతాయి.


ఆయుర్వేదం

కీళ్ల వాతానికి దూసరి తీగ



◆ ఆకులను దంచి రసం తీసి, అందులో చక్కెర కలిపి అరగంట ఉంచితే, గడ్డగా మారుతుంది. దీన్ని ప్రతి రోజూ ఒక స్పూను చొప్పున 15 రోజుల పాటు తింటే, తెల్లబట్ట త గ్గడంతో పాటు బహిష్టు సమయంలో వచ్చే కడుపు నొప్పి నివారణ అవుతుంది. ఇది శరీరానికి చలువ చేస్తుంది కూడా.
◆ దూసరి తీగె చెట్టు ఆకుల రసంలో చక్కెర కలిపి కొద్ది రోజులపాటు సేవిస్తే, మూత్ర సంబంధ సమస్యలు, చురుకు, పోటు, మంట తగ్గి మూత్ర విసర్జన సాఫీగా సాగుతుంది. పైగా ఈ వైద్యం వల్ల వీర్యపుష్టి కలుగుతుంది.
◆ ఈ చెట్టు వేళ్ల కషాయానికి సమానంగా ఆవు పాలు కలిపి సేవిస్తే మధుమేహం అదుపులో ఉంటుంది.
◆ వేళ్ల కషాయంలో 20 మిరియాల పొడి కలిపి, అందులో 200 మి. లీ. మేక పాలు కలిపి ప్రతి ఉదయం పరగడుపున తాగుతూ ఉంటే కీళ్ల వాతం హరిస్తుంది.
◆ దీని దుంపను మెత్తగా దంచి తగు మాత్రం పటిక బెల్లం కలిపి సేవిస్తే గనేరియా తగ్గిపోతుంది.

గుండె పదిలం



అందం కోసం.. ఆగనివ్వద్దు!

థైరాయిడ్‌తో గుండెకు నష్టం లేదు!

థైరాయిడిజమ్ సమస్యలు ప్రతి ఇద్దరు మహిళల్లో ఒకరికి సహజం. థైరాయిడ్ హార్మోన్ తగుపాళ్లలో తయారుకాని 'హైపో థైరాయిడిజమ్', అవసరానికి మించి హార్మోన్ ఉత్తత్తయ్యే 'హైపర్ థైరాయిడిజమ్'...ఈ రెండు సమస్యలనూ నోటి మాత్రలతోనే అదుపు చేయొచ్చు. ఈ సమస్యలున్నంత మాత్రాన వీటి ప్రభావం గుండె మీద ఉండదు.

ముందస్తు అప్రమత్తత తప్పనిసరి

కార్డియాక్ అరెస్టుకు గురవకుండా ఉండాలంటే...35 ఏళ్లు దాటిన ప్రతి మహిళా తన గుండె ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండాలి. అలాగే, ముందస్తు గుండె సంబంధ పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకుంటా ఉండాలి.

▼ 35 ఏళ్లు దాటిన ప్రతి మహిళా ఏడాదికోసారి గుండె పరీక్షలు చేయించుకోవాలి. గుండె రక్తనాళాల్లో ఒకవేళ సూక్ష్మ అడ్డంకులు ఉంటే ఈ పరీక్షల్లో బయల్పడతాయి కాబట్టి వాటిని మందులతోనే తొలగించుకునే వీలుంటుంది.
▼ పూర్తి హెల్త్ చెకప్ చేయించుకుని శరీరంలోని హార్మోన్లు, ప్రధాన అంతర్గత అవయవాల పనితీరును పర్యవేక్షించుకుంటూ ఉండాలి.
▼ వీలైనంత వరకూ సౌందర్య చికిత్సలకు దూరంగా ఉండాలి.
▼ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి.
▼ సమతులాహారం తీసుకుంటూ, మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలి.
▼ కొవ్వు కలిగిన ఆహారం, ధూమపానం, రక్తపోటు, మధుమేహం, అధిక బరువు తగ్గించాలి.

బాత్రూమ్ డేంజర్!


ఎక్కువశాతం గుండె పోట్లు, కార్డియాక్ అరెస్ట్‌లు బాత్రూముల్లో, ఉదయం వేళల్లో చోటు చేసుకుంటూ ఉంటాయి. ఇందుకు బలమైన కారణాలు లేకపోలేదు. అవేంటంటే...

స్నానం చేసే పద్ధతి: మనలో ఎక్కువ మందికి తల మీద నుంచి నీళ్లు పోసుకునే అలవాటు ఉంటుంది. ఇలా నీళ్లు పోసుకోవటం వల్ల శరీరం ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించుకోలేదు. ఉష్ణోగ్రతను సమం చేసుకునే ప్రయత్నంలో రక్తం తల వైపు పరుగులు తీస్తుంది. ఈ వేగానికి రక్తంలో అప్పటికే ఏవైనా అడ్డంకులు ఉంటే అవన్నీ గుండె వైపు ప్రవహించి ప్రధాన రక్తనాళాల్లో అడ్డంకులుగా మారతాయి. దాంతో రక్తప్రసరణకు ఆటంకం ఏర్పడి గుండె పోటు, కార్డియాక్ అరెస్ట్ రావొచ్చు. వీటికి చికిత్స ఆలస్యమైతే పక్షవాతం, ప్రాణహాని జరగొచ్చు. కాబట్టి ఇలా జరగకుండా ఉండాలంటే ముందుగా తలను కాకుండా కాళ్లను తడుపుకోవాలి. తల మీద నుంచి పాదాల వైపు కాకుండా, పాదాల నుంచి తల వైపుగా శరీరాన్ని తడపాలి.

మలవిసర్జన తేలికగా!: మల విసర్జన సమయంలో ఒత్తిడి ఏర్పడితే దాని ప్రభావం, గుండె దగ్గరుండే 'వేగస్' నరం మీద పడుతుంది. ఈ నరానికి గుండె వేగాన్ని తగ్గించే శక్తి ఉంటుంది. అప్పటికే ఆ వ్యక్తికి గుండె సమస్య ఉంటే, వేగస్ నరం ఒత్తిడికి గురవటం మూలంగా గుండెలో విద్యుత్తు ప్రసారం తగ్గి, ఫలితంగా కార్డియాక్ అరెస్ట్ సంభవించవచ్చు. అంతేకాకుండా మల విసర్జన సమయంలో ముక్కటం వల్ల రక్తనాళాల్లో ఉన్న అడ్డంకులు గుండె వైపు ప్రవహించి, గుండె పోటుకు దారి తీసే ప్రమాదం ఉంది.

బొటాక్స్ సైడ్ ఎఫెక్ట్స్

బొటాక్స్ ఇంజెక్షన్‌తో తక్షణం కనిపించే స్వల్ప ఇబ్బందులతోపాటు, దీర్ఘకాలంలో గుండెకు హాని కలిగించే ప్రమాదాలూ ఉన్నాయి. బొటాక్స్ ఇంజెక్షన్ దుష్ప్రభావాల్లో మొదట కనిపించేది తలనొప్పి, జ్వరం, నొప్పులు. కొన్ని సందర్భాల్లో ఈ ఇంజెక్షన్ వికటిస్తే కనురెప్పలు వాలిపోయి శాశ్వతంగా అలాగే ఉండిపోతాయి కూడా! కొన్ని సందర్భాల్లో బొట్యులినం టాక్సిన్ నేరుగా కేంద్ర నాడీ వ్యవస్థ మీద దాడి చేసి, దీర్ఘకాలిక నష్టాన్ని కూడా కలిగించవచ్చు. కొంతమందికి బొటాక్స్ ఇంజెక్షన్ తీసుకున్న తర్వాత ఆహారం మింగటం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులూ తలెత్తుతాయి. గుడ్డు అలర్జీ ఉన్నవాళ్లు బొటాక్స్ ఇంజెక్షన్ తీసుకోవటం ప్రమాదకరం. ఈ ఇంజెక్షన్ తయారీ ఆల్బ్యుమిన్ (గుడ్డు) వాడతారు కాబట్టి ఎగ్ అలర్జీ ఉంటే బొటాక్స్ తీసుకోకూడదు. అలాగే గర్భిణులూ బొటాక్స్ తీసుకోకూడదు.



గుండెపోటు అనగానే అది పురుషులకే పరిమితం అనుకుంటాం! కానీ, ప్రముఖ నటి శ్రీదేవి హఠాన్మరణం, 'కార్డియాక్ అరెస్ట్' అనే ఆరోగ్య సమస్య మీద చర్చకు తెరలేపింది. ఇది ఎలా, ఎప్పుడు, ఎవరి మీద దాడి చేస్తుంది? మహిళల్లో ఈ సమస్య పెరగటానికి కారణాలేంటి? కార్డియాక్ అరెస్ట్ గురించి లోతుగా విశ్లేషిస్తే....



అందంగా, యౌవనంగా కనిపించాలనే ఆతురత, ఆశ సహజమే! అయితే సెలబ్రిటీల విషయంలో ఇది ఆశతోనే ఆగిపోదు. దాన్ని నిజం చేసుకు తీరాల్సిన ఒత్తిడి, పరిస్థితి తలెత్తవచ్చు. గ్లామరస్‌గా వేవేల నీరాజనాలందుకున్న సౌందర్యాన్ని కలకాలం నిలుపుకోవాలనే తాపత్రయంతో, వేరే దారి లేక సౌందర్య చికిత్సలను ఆశ్రయించవచ్చు. అయితే దీర్ఘకాలంపాటు తీసుకునే సౌందర్య చికిత్సలు, వాటిలో వాడే బొటాక్స్ ఇంజెక్షన్లు, సర్జరీల ప్రభావం గుండె మీద కచ్చితంగా ఉంటుంది. కార్డియాక్ అరెస్ట్‌లో అంటే... గుండె ఆగిపోయి, ప్రాణాలు కోల్పోయిన మహిళల్లో ఎక్కువమంది బొటాక్స్ ఇంజెక్షన్లు తీసుకున్నవాళ్లే ఉంటున్నారని అధ్యయనాల్లో తేలింది. మరీ ముఖ్యంగా 40 నుంచి 55 ఏళ్ల లోపు మహిళలే సడెన్ కార్డియాక్ అరెస్ట్‌తో మృత్యువాత పడుతున్నారు. 2018 ఫిబ్రవరి 3, ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన ఓ సర్వేలో బొటాక్స్ ఇంజెక్షన్ దుష్ప్రభావాలకు లోనైన 30,301 మంది మహిళల్లో 27 మంది కార్డియాక్ అరెస్ట్‌తో ప్రాణాలు కోల్పోయారని రుజువైంది.

బొటాక్స్ అంటే?

'బొట్యులినం టాక్సిన్'... దీన్నే బొటాక్స్ అని ముద్దుగా పిలుచుకుంటాం! గత పదేళ్లగా సౌందర్య చికిత్సలో మారుమోగిపోతున్న బొటాక్స్‌కు వైద్య చికిత్సల్లో 50 ఏళ్ల చరిత్ర ఉంది. దీన్ని పూర్వం ఆరోగ్య చికిత్సల్లో వాడేవారు. ప్రారంభంలో 'లేజీ ఐ' (కిందికి వాలిపోయిన కనురెప్పలు) సరి చేయటానికి, 'బ్లెఫరోస్పాస్మ్' (అన్ని వైపులకు కను రెప్పలను తిప్పలేకపోవటం) లాంటి సమస్యల చికిత్సల్లో బొటాక్స్ ఇంజెక్షన్ వాడేవారు. అయితే దీనికున్న ప్రత్యేక గుణాల వల్ల క్రమేపీ సౌందర్య చికిత్సల్లో వాడటం మొదలుపెట్టారు వైద్యులు. చర్మం మీద ముడతలు ఏర్పడకుండా ఉండాలంటే కండరాలకు సంబంధిత నరాలకు మధ్య కనెక్షన్ కట్ చేయాలి. బొటాక్స్ ఇంజెక్షన్లు చేసే పని ఇదే! బొటాక్స్ ఇంజెక్షన్ చేయటం వల్ల కండరాలు ముడుచుకునే గుణం కోల్పోతాయి. దాంతో ముడతలు ఏర్పడవు. బొటాక్స్ ఇంజెక్షన్లు సాధారణంగా ముఖం మీదే ఉపయోగిస్తూ ఉంటారు. మరీ ముఖ్యంగా క్రోస్ ఫీట్ (కళ్ల చివర్లలో ఏర్పడే గీతలు), లాఫింగ్ లైన్స్ (నవ్వినప్పుడు పెదవుల పక్కన కనిపించే ముడతలు), ఫ్రౌన్ లైన్స్ (భృకుటి ముడిచినప్పుడు కనిపించే ముడతలు), ఫోర్‌హెడ్ లైన్స్ (నుదుటి మీద అడ్డంగా ఏర్పడే గీతలు)....వీటిని బొటాక్స్‌తో తగ్గించే వీలుంది. అయితే, సూర్యరశ్మి వల్ల తలెత్తే ముడతలు, గీతలు, భూమ్యాకర్షణ ఫలితంగా కిందకు సాగిన చర్మాన్ని బొటాక్స్ ఇంజెక్షన్లు సరి చేయలేవు. ఏదేమైనా, సౌందర్యాన్ని కాపాడుకునే క్రమంలో వాడే బొటాక్స్ ఇంజెక్షన్లు దీర్ఘకాలంలో గుండె మీద కూడా ప్రభావం చూపిస్తాయి. కాబట్టి వీటి వాడకాన్ని నియంత్రించుకోవటం ఎంతో అవసరం.

మహిళల్లో అరుదే! అయినా...

సాధారణంగా పురుషులతో పోలిస్తే, మహిళల్లో గుండె సమస్యలు చాలా తక్కువ. పైగా పురుషులకు, మహిళలకు గుండె సమస్యలు వచ్చే వయః పరిమితిలో పదేళ్ల తేడా ఉంటుంది. పురుషులకు 50 ఏళ్ల వయసులో గుండె సమస్యలు తలెత్తితే, మహిళల్లో పదేళ్లు ఎక్కువ వయసులో...అంటే 60 ఏళ్ల వయసులో ఆ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉంటాయి. ఇది మహిళలకు అనుకూలించే విషయమే! అయితే, దీన్లో ఉన్న ప్రతికూలత ఏంటంటే... మహిళలకు సానుకూలమైన గుండె సమస్య వస్తే, అది పురుషుల కంటే తీవ్రంగా, ప్రాణాంతకంగా ఉంటుంది. బ్రతికించుకునేంత వ్యవధి ఉండదు.

ప్రాణాలు హరించేంత తీవ్రం

గుండె సమస్యలకు సంబంధించి గుండె పోటు, హార్ట్ ఫెయిల్యూర్ లాంటివే ఎక్కువ మందికి తెలుసు. కానీ కార్డియాక్ అరెస్ట్ అనే సమస్య ఈ రెండింటి కంటే తీవ్రమైనది, భిన్నమైనది. మిగతా గుండె సమస్యలన్నీ ముందస్తు లక్షణాలు, సమస్యలు, చికిత్సలతో అంతో ఇంతో రోగిని అప్రమత్తంగా ఉంచుతాయి. పైగా ఈ గుండె సమస్యల్లో రోగిని బ్రతికించుకునే అవకాశాలు ఎక్కువ. కార్డియాక్ అరెస్ట్ ఇందుకు పూర్తి భిన్నం. లక్షణాలు ఒకదాని వెంట మరొకటిగా అలల్లా పోటెత్తి, కారణమేంటో అర్థం చేసుకునేలోపే, ప్రాణాలు హరిస్తాయి. కేవలం గంట వ్యవధిలోనే అంతా అయిపోతుంది.

'కార్డియాక్ అరెస్ట్'లో ఏం జరుగుతుంది?

గుండె లబ్‌డబ్ అంటూ కొట్టుకోవటానికి అవసరమైన ప్రేరణ... ఎలక్ట్రికల్ సిగ్నల్స్! ఈ విద్యుత్తు సంకేతాలు గుండెను సమమైన వేగంతో కొట్టుకునేలా చేస్తాయి. గుండెలోని ఈ ఎలక్ట్రికల్ సిగ్నల్స్‌లో ఏదైనా లోపం తలెత్తితే, గుండె అకస్మాత్తుగా ఆగిపోతుంది. ఇదే...'కార్డియాక్ అరెస్ట్'. ఇలా జరిగినప్పుడు గుండె నుంచి శరీరం మొత్తానికి రక్త ప్రసరణ ఆగిపోతుంది. మెదడుకు కూడా రక్తం అందదు. రక్తం ద్వారా అందాల్సిన ఆక్సిజన్ అందకపోవటం వల్ల మెదడు పనిచేయటం మానేస్తుంది. దాంతో హఠాత్తుగా కుప్ప కూలిపోయి, స్పృహ కోల్పోతారు. ఊపిరి ఆగిపోతుంది.

లక్షణాలు ఇవే!

కార్డియాక్ అరెస్ట్‌లో లక్షణాలు కనిపించేంత వ్యవధి ఉండదు. కొన్ని సందర్భాల్లో గుండె పోటే కార్డియాక్ అరెస్ట్‌కు దారి తీయొచ్చు. గుండె పోటులో తల తిరుగుడు, నీరసం, ఛాతీలో నొప్పి, శ్వాస అందకపోవటం, వాంతులు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇవి కనిపించిన వెంటనే చికిత్స అందించగలిగితే గుండె పోటును, తదనంతర కార్డియాక్ అరెస్ట్‌ను నియంత్రించవచ్చు. అయితే గుండెపోటుతో సంబంధం లేకుండా ఏకంగా కార్డియాక్ అరెస్ట్ ఎలాంటి ముందస్తు హెచ్చరిక లేకుండా అకస్మాత్తుగా దాడి చేస్తుంది.

కారణాలు ఉన్నాయి!

ఎటువంటి వ్యాధులూ లేకుండా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న వ్యక్తి కూడా కార్డియాక్ అరెస్ట్‌కు గురి కావొచ్చు. అయితే ఈ సమస్యకు కొన్ని ఆరోగ్యపరమైన అంశాలు దోహదపడతాయి. అవేంటంటే....

❑ **దీర్ఘకాలిక గుండె సమస్యలు:** పదేళ్లకు మించి, పరీక్షల్లో బయటపడకుండా, చాప కింద నీరులా పాకే గుండె జబ్బులు ఉన్నాయి. ఎలాంటి లక్షణాలు, ఇబ్బందులు లేకుండా ఒకేసారి ఈ వ్యాధులు విశ్వరూపం దాల్చి కార్డియాక్ అరెస్ట్‌గా బయల్పడతాయి.
❑ **గుండె పోటు:** గుండె పోటు కొన్ని సందర్భాల్లో కార్డియాక్ డెత్‌కు దారి తీయొచ్చు.
❑ **మైక్రో వాస్క్యులర్ యాంజైనా:** గుండె రక్త నాళాల్లో సూక్ష్మమైన అడ్డంకులు ఏర్పడి, కొన్ని సంవత్సరాలకు అవే పెద్ద బ్లాకేజ్‌గా మారి హఠాత్తుగా కార్డియాక్ అరెస్ట్ డెత్‌కు దారి తీయొచ్చు. అడ్డంకులు సూక్ష్మంగా ఉండటం మూలంగా గుండె పరీక్షల్లో బయట పడకపోవచ్చు.
❑ **బొటాక్స్ ఇంజెక్షన్లు:** సౌందర్య చికిత్సల్లో భాగంగా తీసుకునే బొటాక్స్ ఇంజెక్షన్లు, నొప్పి తగ్గించే టైలినాల్ లాంటి పెయిన్ కిల్లర్స్ ప్రభావం గుండె మీద కచ్చితంగా ఉంటుంది. ఈ మందులు అప్పటికప్పుడే గుండె మీద ప్రభావం చూపించకపోయినా, దీర్ఘకాలంలో కార్డియాక్ అరెస్ట్ రూపంలో బయల్పడవచ్చు.
❑ **అస్తవ్యస్త జీవనశైలి:** శారీరక వ్యాయామం లేకుండా సెడెంటరీ లైఫ్ స్టయిల్ గడుపుతూ, ఆరోగ్య, ఆహార నియమాలు పాటించకుండా, వ్యాయామం చేయకుండా ఉండే మహిళలు గుండె జబ్బులకు లోను కావొచ్చు. ఈ జబ్బులే గతి తప్పి, కార్డియాక్ అరెస్టుకు దారి తీయొచ్చు.
❑ **ఒత్తిడి:** మానసిక ఒత్తిడి, ఆందోళనలతో కూడుకున్న జీవితాన్ని గడిపే వ్యక్తుల గుండె కాలక్రమేణా బలహీనపడటం ఖాయం. ఈ స్థితి కూడా కార్డియాక్ అరెస్టుకు దారి తీయొచ్చు.
❑ **జన్యుపరంగా:** గుండె జబ్బులు వంశపారంపర్యం. తల్లి తండ్రుల్లో ఒకరు 50 ఏళ్లలోపు గుండె జబ్బుతో మరణిస్తే, పిల్లలు అప్రమత్తంగా ఉండాలి.



ఇలా చేస్తే బతికించొచ్చు!

కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్)....గుండెకు ఫస్ట్ ఎయిడ్. గుండె ఏ కారణం చేత ఆగినా దాన్ని తిరిగి పని చేయించటం కోసం చేసే ప్రథమ చికిత్స ఇది. సాధారణంగా గుండె సమస్యతో ఎవరైనా కుప్పకూలిపోతే, ఆ వ్యక్తి చుట్టూ గుమిగూడటం, మాట్లాడించటానికి ప్రయత్నం చేయటం చేసిన తర్వాత అతన్ని ఆస్పత్రికి తరలిస్తాం! కానీ గుండె సమస్యలో ప్రతి సెకన్ కాలమూ విలువైనదే! ఎంత త్వరగా చికిత్స అందించగలిగితే గుండె అంత త్వరగా, మెరుగ్గా కోలుకుంటుంది. మరీ ముఖ్యంగా కార్డియాక్ అరెస్ట్ లాంటి సమస్యల్లో తక్షణ చికిత్స అత్యవసరం. సడెన్ కార్డియాక్ అరెస్ట్‌లో గుండె ఆగిపోతుంది. కాబట్టి దాన్ని తిరిగి కొట్టుకునేలా చేయటం కోసం తక్షణమే సిపిఆర్ చేయాలి. అంటే...శ్వాస ఆగిపోయి, గుండె నిశ్చలంగా మారి పడిపోయిన వ్యక్తిని వెల్లకిలా పడుకోబెట్టి, ఛాతీ మధ్య నుంచి ఎడమ వైపు భాగంలో, పక్కటెముకల కింద...రెండు అర చేతులతో ప్రెషర్ ఇవ్వాలి. ఇలా చేయటం వల్ల గుండెకు ఎలక్ట్రికల్ సిగ్నల్స్ అంది తిరిగి కొట్టుకోవటం మొదలు పెడుతుంది. గుండె కొట్టుకోవటం మొదలవగానే సాధ్యమైనంత త్వరగా ఆస్పత్రికి తీసుకువెళ్లగలిగితే ప్రాణాలు నిలబడతాయి. కార్డియాక్ అరెస్ట్‌లో సిపిఆర్ సహాయంతో రోగి బ్రతికే అవకాశాలను 50% మేర పెంచుకోవచ్చు. కాబట్టి కుటుంబంలో కనీసం ఒకరికైనా సిపిఆర్ చేసే పద్ధతి తెలిసి ఉండటం ఎంతో అవసరం.



డాక్టర్ సాయి సుధాకర్,
చీఫ్ కార్డియాక్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్,
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్,
గ్లెనిగెల్స్ గ్లోబల్ హాస్పిటల్స్,
హైదరాబాద్.


సెక్సువల్ హెల్త్



ఆ అలవాటు మాన్పేదెలా?

ప్రశ్న: మా వారికి 'యానల్ సెక్స్' అంటే ఆసక్తి. ఈ విషయంలో నన్ను ఇబ్బంది పెడుతూ ఉంటారు. ఎంత చెప్పినా వినడం లేదు. ఆయనకి నచ్చజెప్పేదెలా?

మల ద్వారం గుండా అంగం, వేళ్లు, సెక్స్ టాయ్స్, వైబ్రేటర్లు జొప్పించటాన్నే యానల్ సెక్స్ అంటారు. లైంగిక క్రీడలో కొత్త కొత్త ప్రయోగాల పట్ల ఆసక్తి కలిగిన పురుషులు యానల్ సెక్స్ కూడా ప్రయత్నించటానికి ఇష్టపడుతూ ఉంటారు. కానీ ఈ ప్రయత్నం ఆరోగ్యకరమైనది కాదు. ఇతర లైంగిక క్రీడలకంటే యానల్ సెక్స్ ద్వారా లైంగిక వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఎక్కువ. పైగా మల ద్వారం లోపలి లైనింగ్ ఎంతో పలుచగా ఉంటుంది. ఏమాత్రం ఒరిపిడి కలిగినా డ్యామేజ్ అవుతుంది. ఇలా డ్యామేజ్ అయితే ఇన్‌ఫెక్షన్లు తేలికగా సోకుతాయి. యానల్ సెక్స్ ద్వారా క్లమీడియా, జెనైటల్ హెర్పిస్, జెనైటల్ వార్ట్స్, గొనేరియా, హెపటైటిస్ బి, సిఫిలిస్, హెచ్ఐవి సంక్రమిస్తాయి. ఇవేకాకుండా యానల్ సెక్స్ ద్వారా హెపటైటిస్ ఎ, లేదా ఇ. కొలై అనే ఇన్‌ఫెక్షన్లు కొన్ని రకాల బ్యాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్లు కూడా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తాయి. మల ద్వారంలో వేళ్లు జొరపటం ద్వారా ఒకరి నుంచి మరొకరికి లైంగికపరమైన వ్యాధులు సంక్రమిస్తాయి. యానల్ సెక్స్‌లో కండోమ్ వాడటం కూడా సురక్షితం కాదు. ఆరోగ్యకరంగా ఉండే ఇద్దరు వ్యక్తుల మధ్య కూడా యానల్ సెక్స్ ఆరోగ్యకరం కాదు. ఈ చర్య ద్వారా స్త్రీల మల ద్వారం లోపలి పొర చిరిగి రక్తస్రావమవుతుంది. మొలలు ఉంటే సమస్య రెట్టింపవుతుంది. మల ద్వారంలో ఉండే సూక్ష్మక్రిముల వల్ల పురుషులకూ ఇన్‌ఫెక్షన్లు వస్తాయి. కాబట్టి యానల్ సెక్స్ దుష్ప్రభావాల గురించి వివరించి మీ వారి మనసు మార్చండి.



డా షర్మిలా మజుందార్,
చీఫ్ సెక్సాలజిస్ట్ అండ్ సైకోఅనలిస్ట్,
Email :mili77@gmail.com
(కన్సల్టేషన్ కోసం)

వాసన ఎందుకు తెలియదు?

మీకు తెలుసా?



ప్రతి అవయవం దేనికది సక్రమంగా పనిచేస్తున్నప్పుడు ఏమీ తెలియదు గానీ, ఏదో ఒక అవయవం అసలే పనిచేయకుండా పోయినప్పుడు మాత్రమే ఆ బాధేమిటో తెలుస్తుంది. అయితే స్పర్శ, రుచి తెలియకుండా పోయినట్లే, కొందరికి ఒక్కోసారి వాసన తెలియకుండా పోతుంది. దీనివల్ల వీళ్లకు పూలతోటలో ఉన్నా, ఎడారిలో ఉన్నా, తేడా అనిపించదు. కాకపోతే ఈ సమస్య మొదలైన ఎంతో కాలం దాకా చాలా మందికి తమకు ఆ జబ్బుఉన్నట్లే తెలియదు. ఈ లోపం వల్ల మునుముందు రాబోయే జబ్బుల గురించి ముందే తెలుసుకునే స్థితిని కోల్పోతారు. ఒక్కోసారి ఇదో పెద్ద ప్రమాదానికి దారి తీయవచ్చు. ఉదాహరణకు ఇంటి లోపల ఎక్కడైనా, నిప్పు అంటుకుని కాలి బూడిద అవుతున్నా వీళ్లకు తెలియదు., మామూలుగా అయితే వయసు పైబడిన వారిలోనే ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఆ మాటకొస్తే వయసుతో ప్రమేయం లేకుండా కూడా కొందరిలో ఈ సమస్య తలెత్తుతుంది, మౌలికంగా మనకు వాసన తెలియడం అనేది ముక్కులోపలి పొర ఆరోగ్యం మీద, వాసనను గుర్తించే ఆల్ఫ్యాక్టరీ నరాలు సక్రమంగా పనిచేయడం మీద ఆధారపడి ఉంటుంది. వాటిల్లో ఎక్కడైనా కాస్త తేడా వస్తే వాసన తెలియకుండా పోతుంది, వాసన తెలియకుండా పోవడానికి ముక్కులో బొడిపెలు ఏర్పడటం, సైనస్ సమస్యలతో పాటు ఆయా రుతువుల్లో వచ్చే అలర్జీలు కూడా కారణం కావచ్చు, దీనికి తోడు వాసన తెలియకపోవడానికి కొందరిలో అల్జీమర్, పార్కిన్‌సన్ వంటి నరాల జబ్బులు కూడా కారణం కావచ్చు., అందుకే నాలుగు వారాల దాకా వాసన తెలియని పరిస్థితి ఏర్పడితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం చాలా అవసరం.

ఫిట్‌నెస్

పొత్తి కడుపు చదునుగా!

పొత్తి కడుపు దగ్గర పేరుకునే కొవ్వును కరిగించాలంటే క్రంచెస్ చేయక తప్పదు. వీటిలోనూ కొద్దిగా కష్టమనిపించే లెగ్ రైజ్ క్రంచెస్ చేస్తే, తక్కువ సమయంలోనే ఎక్కువ కొవ్వును కరిగించవచ్చు. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే?

❑ నేల మీద కాళ్లు చాపి కూర్చోవాలి.
❑ చేతులతో రెండు కిలోల డంబెల్ తీసుకోవాలి.
❑ ఇప్పుడు కాళ్లను రెండు అడుగుల ఎత్తుకు లేపి గాల్లో ఉంచి, చేతులతో డంబెల్ పట్టుకుని, కుడి వైపుకు, ఎడమ వైపుకు తిరగాలి.
❑ ఇలా 20 రిపీట్స్, 3 సెట్స్ చేయాలి.



హెల్త్ వెల్త్

చిగుళ్లు బలంగా ఉండాలంటే..



శస్త్రచికిత్స లేకుండానే.....

నాలుక కింద, బుగ్గల లోపలి భాగంలో, చిగుళ్ల మీద, గొంతులో నోటిలో ఎక్కడైనా ఒక చోట గానీ, ఎక్కువ చోట్ల గానీ ఏర్పడే పుండ్లను అల్సర్లు అంటారు. ఇతర వైద్య విధానంలో వీటన్నింటికీ యాంటీబయాటిక్స్ వాడతారు. వ్యాధి యాంటీబయాటిక్స్‌కు లొంగనప్పుడు, నయం చేసే మరో మార్గమేదీ లేదనిపించినప్పుడు శస్త్ర చికిత్సకు సిద్ధమవుతారు. అయితే శస్త్రచికిత్సల వల్ల దంతాలను స్థిరంగా ఉంచే చిగుళ్లు కిందికి జారిపోతాయి. ఈ క్రమంలో చిగుళ్లను, పళ్లను, పట్టి ఉంచే పునాది ఎముకలు మరింత బలహీనపడే అవకాశం ఉంది. చిగుళ్లను, ఎముకలను తమ తమ ఔషధాలతో కాపాడలేనప్పుడు ఇక శస్త్ర చికిత్స ఒక్కటే మార్గమనుకుంటారు. అయితే సకాలంలో మూలికా వైద్యులను సంప్రదిస్తే, ఈ శస్త్ర చికిత్సల అవసరమే ఉండదు.

❒ పంటినొప్పి కాస్త తీవ్రం కాగానే ఆ పన్నును తీసివేసే విధానాన్నే చాలా మంది అనుసరిస్తున్నారు. లేదా రూట్ కెనాల్ చికిత్సలు చేస్తున్నారు. అయితే ఈ రూట్ కెనాల్ చికిత్సల వల్ల అనేక రుగ్మతలు వస్తున్నట్లు పశ్చిమదేశాల వైద్యులే ఒప్పుకున్నారు. ప్రత్యేకించి, గుండె, మూత్రపిండాలు, కాలేయం, గాల్‌బ్లాడర్ (పిత్తాశయం) వీపు, మెడ, భుజం నొప్పులు, కొన్ని రకాల చర్మ వ్యాధులు ఈ రూట్‌కెనాల్ చికిత్సల వల్లే వస్తున్నట్లు వారు గుర్తించారు. అయితే, మూలికా వైద్యం పూర్తిగా భిన్నమైనది. ఇది, పంటి చిగుళ్ల, పంటి ఎముకల వ్యాధులను పూర్తిగా నయం చేయడమే కాకుండా, చిగుళ్ల సమస్యలు, దంత వ్యాధులు అసలే ఉత్పన్నం కాకుండా చేసే ఔషధాలు ఈ మూలికా వైద్యంలో ఉన్నాయి.

నోరు, జీర్ణవ్యవస్థకు ముఖ ద్వారం. అందుకే నోటినోని ఏ భాగం వ్యాధిగ్రస్తమైనా దాని ప్రభావం, మన జీర్ణవ్యవస్థ మీద తప్పనిసరిగా పడుతుంది. చిగుళ్ల మీద పుండ్లు ఏర్పడి బ్యాక్టీరియాతో వ్యాధిగ్రస్తమై చీము పట్టినా, పళ్లల్లో రంధ్రాలు ఏర్పడినా, పళ్లు పుచ్చిపోయినా, ఇలా నోటిలోని ఏ భాగంలో అల్సర్లు ఏర్పడినా జీర్ణవ్యవస్థ అంతా కలుషితమవుతుంది. దీనికి తోడు నోటిలో లాలాజలం సరిగా స్రవించకపోయినా, లాలాజలంలో వివిధ జీర్ణ రసాయనాలు సరైన నిష్పత్తిలో లేకపోయినా, జీర్ణశక్తి కుంటుపడుతుంది.

ఈ వ్యాధుల వెనుక

❒ నిజానికి, చిగుళ్ల సమస్యలు, దంత వ్యాధులు తలెత్తడానికి గల అసలు కారణం మన ఆహార పానీయాల అలవాట్లు, దంత దావనం, నోటి ప్రక్షాళనలోని లోపాలే కారణం. రాత్రి నిద్రపోయే ముందు బ్రష్ చేసుకోకపోవడం, ఔషధ మిళిత మౌత్‌వాష్‌లతో పుక్కిలించడం మాట అలా ఉంచి, సాధారణ నీళ్లతోనైనా నోరు శుభ్రం చేసుకోకపోవడం మౌలిక కారణాలుగా ఉంటున్నాయి. దీనివల్ల ఆహార పదార్థాల అవశేషాలు, పళ్ల మధ్య ఇరుక్కుపోయి కుళ్లడం, ఇవన్నీ దంతాలు, చిగుళ్ల తరుచూ వ్యాధిగ్రస్తం కావడానికి కారణమవుతున్నాయి.

ఇవీ జాగ్రత్తలు

చిగుళ్లు, దంతాలు వ్యాధిగ్రస్తం కాకుండా ఉండడానికి, ఆహారం, ఇతర పానీయాలు తీసుకున్న ప్రతిసారీ టంగ్ క్లీనర్‌తో నాలుకను శుభ్రం చేసుకోవాలి. దీనికి తోడు చిగుళ్లను వేళ్లతో గట్టిగా నొక్కి, ఆ తర్వాత చిగుళ్లతో పాటు, దంతాలను మిగతా భాగాలను శుభ్రం చేసుకోవడం చాలా అవసరం.

❒ చిగుళ్ల, దంతాల్లో బ్యాక్టీరియా తీవ్రత పెరిగినప్పుడు ఇతర వైద్య విధానంలోని ఎంతో శక్తివంతమైన యాంటీబయాటిక్స్ కూడా పనిచేయలేకపోతాయి. అంతిమంగా ఇది దంతక్షయానికి దారి తీస్తుంది.

మూలికావైద్యం

నిజానికి, జామ, బోడతరం, మారేడు, వెలగ, సర్ప సుగంధి, దబ్బ చెట్ల ఆకులు నోటి బ్యాక్టీరియాను నిర్మూలించగలవు. ఈ ఆకుల రసాన్ని ఒక్కోసారి 8 నిమిషాల చొప్పున పుక్కిలిస్తే, రెండు వారాల లోపుగానే నోటిలోని బ్యాక్టీరియా పూర్తిగా నశిస్తుంది. ఆ తర్వాత చిగుళ్ల, దంతాలు గట్టిపడటానికి, మామిడి, మర్రి, జువ్వి, రావి, మేడి చెట్ల ఆకుల రసాన్ని రోజుకు మూడుసార్లు, ప్రతిసారీ 5 నిమిషాల చొప్పున పుక్కిలిస్తే సరిపోతుంది. మౌలికంగా, దంత సమస్యల వెనుక చాలా వరకు విటమిన్ - సి లోపం ఉంటుంది. నోరు, ముక్కులోని మ్యూకస్ మెంబ్రేన్ బలహీనపడినప్పుడు నోటిలోని భాగాలన్నీ బ్యాక్టీరియా బారిన పడుతుంటాయి. ఆ విటమిన్ లోపాన్ని పూరించుకోవడం ద్వారా ఆ సమస్యల్ని అధిగమించవచ్చు కాకపోతే, అపరిశుభ్రత వల్ల తలెత్తే చిగుళ్ల, దంత వ్యాధులను విటమిన్ - సి నయం చేయలేదు. అలాంటి యాంటీబయాటిక్స్‌కు లొంగని చిగుళ్ల, దంతాల సమస్యలను సైతం మూలికా వైద్యం సమర్థమంతంగా నయం చేస్తుంది.



- డాక్టర్ జి. లక్ష్మణ రావు
మూలికా వైద్యులు, ఆస్ట్రేలియన్ హెర్బల్ క్లినిక్, హైదరాబాద్.

నేచర్ క్యూర్

మధుమేహానికి చెక్!



మన శరీరం కోటానుకోట్ల జీవకణాల సముదాయం. మౌలికంగా ఈ కణాల అవసరాలను తీర్చడమే శరీర కనీస లక్ష్యం. నిజానికి కణాల అవసరాలే శరీర అవసరాలు. కణాల అవసరాలు సక్రమంగా తీరినప్పుడే శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. కణాల ఆరోగ్యం బాగుంటేనే రోగ నిరోధక శక్తి కూడా బాగుంటుంది. మధుమేహం రావడానికి ఈ కణాలు కలుషితం కావడమే ప్రధాన కారణం. క్లోమగ్రంథి సరిపడా ఇన్సులిన్ ఉత్పత్తి చేయలేకపోవడానికీ, అందులోని బీటా కణాలు దెబ్బ తినడానికీ ఈ మలినాలే మూలం. ఈ పరిస్థితికి ప్రకృతి విరుద్ధమైన, అనారోగ్యకరమైన అలవాట్లే కారణం. ఇవి శరీరంలో ఒక అసహజ స్థితిని ఏర్పరుస్తాయి. కణాలు సరిగా గ్లూకోజును సరిగా గ్రహించలేకపోవడానికి కూడా శరీరంలో ఏర్పడిన ఈ అసహజ స్థితే మూలమవుతుంది.

మందులు ఏం చేస్తాయి?

వాస్తవానికి, ఎన్ని రకాల మందులు వాడినా కణజాలంలోని అసహజత్వం పోదు. అందుకే మధుమేహం వస్తే జీవితంలో ఎప్పటికీ పోదు అంటూ ఉంటారు. కానీ, శరీరాన్ని తిరిగి సహజస్థితికి తెచ్చుకునే శక్తి ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. అందుకు కణాల అవసరాలను, లేదా శరీర అవసరాలను తీర్చడం ఒక్కటే మార్గం. ఇదే మధుమేహ వ్యాధికి అసలైన మందు. అలా కాకుండా, చాలామంది మందులు, మాత్రలతోనే సరిపెడదామనుకుంటారు. ఈ మాత్రల వల్ల షుగర్ నియంత్రణలో ఉన్నట్లు అనిపించినా లోలోపల జరిగే నష్టం జరుగుతూనే ఉంటుంది. ముఖ్యంగా కళ్లు దెబ్బ తినడం, కిడ్నీలు పాడవడం, కాళ్ల ఇబ్బందులు, గుండె జబ్బులు మొదలవుతాయి. కొంత మందికి మందులు వేసుకోవడం ప్రారంభించిన నాలుగైదు ఏళ్లలోనే రెట్టింపు మాత్రలు వేసుకోవలసి వస్తే మరికొందరికి ఇన్సులిన్ తీసుకునే అవసరం కూడా రావచ్చు. ఏమైనా, ఈ విధానాల్లో మధుమేహం తగ్గడం మాత్రం ఉండదు. నిజంగానే మధుమేహం నుంచి విముక్తం కావాలంటే శరీర అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చాలి. అదే సహజమైన విధానం. శరీర అవసరాలు తీర్చే ప్రకృతి జీవన విధానాల్లో 5 ప్రధాన ధర్మాలు ఉంటాయి.

✿ **నీటి ధర్మం:** రోజుకు 5 లీటర్ల నీరు తాగాలి. ఆ నీటిని ఒక క్రమపద్ధతిలో, శరీరానికి అనుకూలమైన సమయాల్లో తాగాలి. ఈ నీటి వల్ల కణజాల శుద్ధి జరిగి శరీరంలో మంచి వాతావరణం ఏర్పడుతుంది.
✿ **ఆహార ధర్మం:** ప్రతి రోజూ కనీసం 50 శాతం ప్రకృతి సిద్ధమైన అంటే పండ్లు, కూరగాయలు, మొలకెత్తిన గింజల వంటి ఉడికించని ఆహారం తీసుకోవాలి. మిగతా 50 శాతం ఉడికించినవి తీసుకోవచ్చు. వంటకాల్లో ఉప్పు, నూనె బాగా తగ్గించాలి. ఎంత ఎక్కువ శాతం ప్రకృతి సిద్ధ ఆహారం తింటే అంత త్వరగా శరీరం సహజత్వాన్ని పొందుతుంది.
✿ **వ్యాయామ ధర్మం:** శారీరక శ్రమ లేని వారు ప్రతి రోజూ ఆసనాలు, ప్రాణాయామం తప్పనిసరిగా చేయాలి. దీనివల్ల శరీరంలోని మలినాలు బయటికి వెళ్లిపోయి. శరీరంలో ఒక ఆరోగ్యవంతమైన వ్యవస్థ ఏర్పడుతుంది.
✿ **విశ్రాంతి ధర్మం:** రాత్రంతా శ్రమించి, పగలంతా నిద్రించడం కాకుండా, పగటి వేళ శ్రమించి, రాత్రి వేళ నిద్రించాలి. దీనివల్ల వ్యాధినిరోధక వ్యవస్థ మెరుగుపడుతుంది. సాయంత్రం 7 గంటల లోపే భోజనం ముగించాలి.
✿ **విసర్జక ధర్మం:** మలమూత్ర విసర్జన సక్రమంగా జరిగేలా చూడాలి. రోజుకు రెండు మూడు సార్లు మల విసర్జన జరగాలి. తాగిన నీటిలో 3 లీటర్లు మూత్రం ద్వారా, 2 లీటర్లు చెమట ద్వారా విసర్జన జరిగేలా మన పానీయాలు ఉండాలి. ఆరోగ్యం బాగా లేనప్పుడు ఉపవాసాలు చేయాలి.

ఈ ఐదు ధర్మాలను నిరంతరం ఆచరిస్తే, శరీర అవసరాలు ఐదూ తీరతాయి. దీనివల్ల కొద్ది నెలల్లోనే మధుమేహం అదుపులోకి వస్తుంది. ఆ తర్వాత పూర్తిగా త గ్గిపోతుంది, మధుమేహం తగ్గడంతో పాటు శరీరంలో అప్పటికే ఉన్న పలురకాల జబ్బులు నయమవుతాయి. అందుకే వెంటనే ప్రకృతి సిద్ధ జీవనం సాగించడానికి సిద్ధం కావడం ఉత్తమం.

- డాక్టర్ టి,. కృష్ణమూర్తి
సూపరింటెండెంట్,
యోగా అండ్ నేచర్ క్యూర్ హాస్పిటల్, హైదరాబాద్.

పరిశీలన

సెకండ్ ఒపీనియన్ మేలే!



వ్యాధి నిర్ధారణ విషయంలో గానీ, సర్జరీ అవసరం అన్నప్పుడు గానీ, ఒక్కోసారి సందిగ్ధం ఏర్పడవచ్చు. అలాంటి సమయంలో మరో డాక్టర్ అభిప్రాయం కోసం వెళ్లడం కొన్ని సార్లు అవసరమవుతుంది. ఈ స్థితి ఒక్కోసారి పేషంట్ కారణంగానూ ఏర్పడవచ్చు. మరికొన్నిసార్లు డాక్టర్ కారణంగానూ ఏర్పడవచ్చు. ఎందుకంటే పేషంట్ ఒక్కోసారి తనకున్న సమస్యల గురించిన పూర్తి వివరాలు ఆ డాక్టర్‌కు చెప్పలేకపోయి ఉండవచ్చు. లేదా అతి ముఖ్యమైన విషయాన్ని చెప్పడం మరిచిపోయి అంత ప్రాధాన్యత లేని విషయాన్నే చెప్పి ఆగిపోవచ్చు ఇలాంటి సమయాల్లో మరో డాక్టర్‌ను కలిసినప్పుడైనా అంతకు ముందు చెప్పలేని విషయాలు చెప్పే అవకాశం ఉంటుంది. సర్జరీ విషయంలో అయితే, సర్జరీ నిజంగానే అవసరమా? వ్యాధి, మందులతోనే తగ్గిపోయే అవకాశం ఉందా? ఇలాంటి సమాచారం మరో డాక్టర్‌ను సంప్రదించినప్పుడు లభించే అవకాశం ఉంది. కొన్ని సర్జరీల విషయంలో డాక్టర్లకు భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. ఏవో కొద్దిపాటి తేడాలే తప్ప ప్రధాన అంశంలో ఏకాభిప్రాయమే ఉంటే, అప్పుడు ఒక నిర్ణయానికి రావచ్చు. ఒకవేళ ఇద్దరి అభిప్రాయాలూ పూర్తి విరుద్ధంగా ఉంటే అప్పుడు మూడో అభిప్రాయానికి కూడా వెళ్లవలసి రావచ్చు. కాకపోతే అలాంటి సందర్భం చాలా అరుదుగానే వస్తుంది. ఒక డాక్టర్‌ను కలిశాక మరో డాక్టర్ అభిప్రాయానికి వెళ్లడం వల్ల మొదటి డాక్టర్ మనస్తాపానికి గురికావడం అనేది ఈ రోజుల్లో లేదు. మరో డాక్టర్ కూడా అదే అభిప్రాయానికి వస్తే, పేషంట్‌కు తన మీద మరింత నమ్మకం ఏర్పడుతుందని డాక్టర్ భావిస్తారు అందుకే, ఒక్కోసారి డాక్టర్లే స్వయంగా మీరు మరో డాక్టర్ అభిప్రాయం కూడా తీసుకోవచ్చని చెబుతుంటారు. ఇది ఇటు పేషంట్‌కూ, అటు డాక్టర్‌కూ పాజిటివ్ విషయమే అవుతుంది.

ప్రకృతి వరం

జ్ఞాపకశక్తికి 'ఆలివ్' నూనె

వయసు పెరిగే కొద్దీ శరీరంలోని వివిధ భాగాలు క్షీణించడం సహజ పరిణామమే. అయితే, ఆ పరిణామాన్ని పూర్తి స్థాయిలో నియంత్రించడం ఎవరి వల్లా కాదు. కాకపోతే ఆ క్షీణించే వేగాన్ని బాగా తగ్గించే అవకాశాలు మాత్రం ఉన్నాయి. ప్రకృతి సిద్ధమైన కొన్నింటి ఆధారంగా ఆ నియంత్రణ సాధించవచ్చు. మెదడు కణాల క్షీణతా వేగాన్ని తగ్గించే శక్తి, ఆలివ్ నూనెలో పుష్కలంగా ఉంది. నూనె అనగానే కొవ్వు, కొలెస్ట్రాల్ పెరిగిపోతాయంటూ, చాలా మంది వాటికి దూరంగా ఉండాలనుకుంటారు. ఒకవేళ ఆ కారణంగా ఎవరైనా వంటల్లో నూనె వాడకాన్ని బాగా తగ్గించివేస్తే, నరాలన్నీ పెళుసుబారిపోయే ప్రమాదం ఉంది. ఆ క్రమంలో కేంద్ర నాడీ వ్యవస్థ అంటే మెదడు కూడా క్షీణిస్తుంది. ఇతర నూనెల మాట ఎలా ఉన్నా, ఈ క్షీణతా వేగాన్ని తగ్గించడం మాత్రం ఆలివ్‌నూనెతో సాధ్యమవుతుంది. ఎందుకంటే మెదడు ఆరోగ్యంగా ఉండడానికి దాదాపు 60 శాతం ఆరోగ్యవంతమైన ఫ్యాట్స్ అవసరం. ఇవి ఆలివ్ నూనెలో సమృద్ధిగా ఉన్నాయి. గింజధాన్యాలు, అవకాడో, నువ్వులనూనెలోనూ ఈ ఫ్యాట్స్ ఉన్నాయి, కాకపోతే ఆలివ్ నూనెలోని ఫ్యాట్స్‌కు కణజాలాల్లోకి వెళ్లే శక్తి చాలా ఎక్కువ. ఈ ఫ్యాట్స్‌కి మెదడు కణాల మెంబ్రేన్ దెబ్బ తినకుండా నిలబెట్టే శక్తి ఉంది. ప్రత్యేకించి, వార్ధక్యం కారణంగా మెదడు కణాలు క్షీణించి, జ్ఞాపకశక్తి దెబ్బతినే పరిస్థితి నుంచి ఈ ఫ్యాట్స్ బాగా రక్షిస్తాయి. ఇటీవల విడుదల అయిన 'టాక్సికాలజీ అండ్ అప్లైడ్ ఫార్మకాలజీ' అనే జర్నల్‌లో ఈ విషయాలు తెలిపే ఒక వ్యాసం ప్రచురితమైంది,. మెదడులోని న్యూరాన్లను దెబ్బ తీయడం ద్వారా అల్జీమర్ వ్యాధి కారకమయ్యే హానికారక ప్రోటీన్‌ల నుంచి ఆలివ్‌నూనెలోని ఆలియోకాంథల్ అనే మూలకం కాపాడుతుందని ఆ జర్నల్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.



డైలీ సుడోకు -116



ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లోనూ 9 గళ్లు ఉంటాయి.

నిలువుగానూ, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి.

ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 115 సమాధానం



శ్రీదేవి... కొన్ని జ్ఞాపకాలు



శ్రీదేవికి మార్గదర్శి రేఖ!


రేఖతో శ్రీదేవి

ప్రాంతం కొత్త. వ్యక్తులు కొత్త. భాషా కొత్త. అలాంటప్పుడు ఎవరైనా 'మన' అనుకునేవారు కనిపిస్తే ఎంత ఆనందంగా ఉంటుంది. అందులోనూ వాళ్లు మనల్ని ఆప్యాయంగా పలకరిస్తే ఇంకెంత సంబరపడిపోతాం.. శ్రీదేవి కూడా ఒక విషయంలో అలాగే సంతోషంలో తేలియాడారు. ఆమె అలా ఆనందాన్ని పొందడానికి కారణం రేఖ. శ్రీదేవి 'హిమ్మత్‌వాలా'లో నటించే సమయానికే రేఖ బాలీవుడ్‌లో పేరు ప్రఖ్యాతులున్న నటి. శ్రీదేవి కుటుంబానికి చెన్నైలో జెమిని గణేశన్ కుటుంబంతో సత్సంబంధాలు ఉండేవి. జెమిని గణేశన్ కుమార్తె రేఖ అనే సంగతి తెలిసిందే. చిన్నప్పటి నుంచే శ్రీదేవి అంటే రేఖకు ఇష్టం. ఆ ఇష్టం, ఆ పరిచయం శ్రీదేవికి బాలీవుడ్‌కి వెళ్లినప్పుడు బాగా ఉపయోగపడ్డాయి. 'కనుబొమ్మల్ని ఎలా తీర్చిదిద్దుకోవాలి? లిప్‌స్టిక్ విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? హెయిర్ స్టైల్స్, చీరకట్టు ఎలా ఉంటే బావుంటుంది..' అనే విషయాలతో పాటు కాంటాక్ట్ లెన్స్ ఏవి మంచివి? వాటిని ఎలా ఉపయోగించాలి? కనురెప్పలు ఒత్తుగా కనిపించడానికి ఏం చేయాలి?... వంటి విషయాలన్నిటినీ రేఖ దగ్గరుండి శ్రీదేవికి నేర్పించేవారు.

సింగర్‌గా...



శ్రీదేవిలో అందాన్నే కాదు ఆమెలో మంచి గాయని ఉందని తెలుగు ప్రేక్షకులకు పరిచయం చేశారు దర్శకుడు రాంగోపాల్ వర్మ. వెంకటేశ్ సరసర ఆమె నటించిన 'క్షణక్షణం' చిత్రంలో 'కో అంటే కోటి' పాటను శ్రీదేవితో పాడించారు వర్మ. అంతకుముందే హిందీ 'సద్మా'(1983) చిత్రంలో కమల్‌హాసన్‌తో కలిసి 'ఏక్ దఫా ఏక్ జంగిల్‌తా' పాటను, 'చాందిని'(1989) చిత్రంలో 'చాందిని ఓ మెరీ చాందిని' పాటను ఆమె పాడారు. ఈ మూడు పాటలూ ప్రేక్షకాదరణ పొందినవే.

ఆ పాటకు దక్కిన గౌరవం

కె.రాఘవేంద్రరావు దర్శకత్వం వహించిన 'అడవిరాముడు' చిత్రంలోని 'ఆరేసుకోబోయి పారేసుకున్నాను' పాటతో వెండితెరపై నాణాలు విసరడం మొదలైంది. మళ్లీ 'జగదేకవీరుడు అతిలోకసుందరి'లో అబ్బనీతియ్యనీ దెబ్బ ఎంత కమ్మగా ఉందిరో అబ్బ' పాటను తెరపై చూసి పరవశించి పోయి, ప్రేక్షకులు పువ్వులు, నాణాలు విసిరారు. ఆ పాటను 12 గంటల్లో ఇళయరాజా కంపోజ్ చేస్తే, ఒకటిన్నర రోజుల్లో ఆ పాటని చిరంజీవి, శ్రీదేవిపై చిత్రీకరించి తన ప్రతిభ చాటుకున్నారు రాఘవేంద్రరావు. నృత్య దర్శకుడు సుందరం ఒకరోజు పాట చిత్రీకరించి వెళ్లిపోతే.. ఆయన తనయుడు ప్రభుదేవా ఆ పాటని పూర్తి చేశారు. కేవలం ఆ పాట కోసమే మూడుసార్లు సినిమా చూసిన వాళ్లున్నారు. ఒకసారి చిరంజీవి డాన్స్ చూడటం కోసం, మరోసారి శ్రీదేవి డాన్స్ చూడటం కోసం, మూడోసారి వీళ్లిద్దరూ కలిసి చేసిన డాన్స్ కోసం.. ఇలా మూడుసార్లు చూశామని చెప్పినవాళ్లూ ఉన్నారు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. తను నటించిన 'శివాజీ' చిత్రంలో రజనీకాంత్, శ్రియతో కలిసి 'అబ్బనీ తియ్యనీ దెబ్బ' పాటలో నర్తించడం, చిరంజీవి, శ్రీదేవి వేసుకున్న డ్రెస్‌నే వేసుకోవడం ఆ పాటకు దక్కిన అరుదైన గౌరవం.

ఆ నలుగురితో...


'వేటగాడు'లో ఎన్టీఆర్‌తో...


'శ్రీరంగనీతులు'లో అక్కినేనితో...


'బంగారుబావ'లో కృష్ణతో...


'జగదేకవీరుడు -అతిలోకసుందరి'లో చిరంజీవితో...


శ్రీదేవి

ఫస్ట్ - లాస్ట్

శ్రీదేవి ఐదు భాషల్లో నటించారు. ప్రతి భాషలోనూ మొదటి, ఆఖరి చిత్రాల వివరాలు...

తమిళంలో తొలి చిత్రం: తునైవన్ (1969)
తమిళంలో హీరోయిన్‌గా తొలి చిత్రం: మూండ్రు ముడిచ్చు (1976)
తమిళంలో ఆఖరి చిత్రం: పులి (2015)


హిందీలో బాల నటిగా తొలి చిత్రం : రాణీ మేరానామ్ (1972)
హిందీలో హీరోయిన్‌గా తొలి చిత్రం: సోల్వా సావన్ (1979)
హిందీలో పేరు తెచ్చిన చిత్రం : హిమ్మత్‌వాలా (1983)
హిందీలో విడుదలైన ఆఖరి చిత్రం: మామ్ (2017)
హిందీలో విడుదల కావాల్సిన ఆఖరి చిత్రం: జీరో (2018)

కన్నడంలో తొలి చిత్రం: భక్త కుంబారా (1974)
కన్నడంలో చివరి చిత్రం : ప్రియ (1979)

తెలుగులో తొలి చిత్రం: మానాన్న నిర్దోషి (1970)
తెలుగులో హీరోయిన్‌గా తొలి చిత్రం: అనురాగాలు (1976)
తెలుగులో ఆఖరి చిత్రం: ఎస్.పి.పరశురామ్ (1994)

మలయాళంలో తొలి చిత్రం: కుమార సంభవం (1969)
మలయాళంలో ఆఖరి చిత్రం: దేవరాగం (1996)

దేవదేవి శ్రీదేవి?


'భక్త కుంబర'లో ఓ దృశ్యం

కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ నటించిన చిత్రాల్లో 'భక్త కుంబర' (1974) ఒకటి. 13-14 శతాబ్దానికి చెందిన గోరా కుంబర్ జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకొంది. సాధువుగా మారిన కుమ్మరి కథ ఇది. హున్సూర్ కృష్ణమూర్తి దర్శకత్వంలో ఎన్.ఆర్. అనూరాధాదేవి ఈ చిత్రం నిర్మించారు. ఈ సినిమాలో ముక్తాబాయిగా శ్రీదేవి నటించారు. పదకొండేళ్ల శ్రీదేవికి ఇదే తొలి కన్నడ సినిమా. ఇదే చిత్రాన్ని అక్కినేని హీరోగా 'చక్రధారి' (1977) పేరుతో వి.మధుసూదనరావు దర్శకత్వంలో నిర్మించారు అనూరాధాదేవి. అయితే తెలుగు వెర్షన్‌లో మాత్రం శ్రీదేవి నటించలేదు. నిర్మాత అనూరాధాదేవి పెద్ద కూతురు స్వప్న ఆ పాత్ర పోషించారు. రాజ్‌కుమార్‌కు ఓ కోరిక ఉండేది.. అక్కినేని నటించి పేరు తెచ్చుకొన్న 'విప్రనారాయణ' చిత్రాన్ని కన్నడంలో చేయాలని. శ్రీదేవిని బాలనటిగా తనే కన్నడ చిత్రరంగానికి పరిచయం చేయడంతో, ఆమెను హీరోయిన్‌గా కూడా తనే ఇంట్రడ్యూస్ చేయాలనీ , 'దేవదేవి' పాత్రకు ఆమెను తీసుకోవాలనీ రాజ్‌కుమార్ ఆలోచించారు. శ్రీదేవి తల్లి రాజేశ్వరితో మాట్లాడారు కూడా. కానీ ముందే ఇతర నిర్మాతలకు కాల్షీట్లు ఇచ్చెయ్యడంతో 'విప్రనారాయణ'కు డేట్స్ కేటాయించలేకపోయారు శ్రీదేవి. ఆమె పరిస్థితి అర్థం చేసుకొన్న రాజ్‌కుమార్ ఆమెపై ఒత్తిడి చేయలేదు. మరో హీరోయిన్‌ని ఎంపిక చేయకుండా చివరకు 'విప్రనారాయణ' చిత్రాన్నే విరమించుకొన్నారు. 'భక్త కుంబర' తర్వాత 'బాల భారత', 'సంపూర్ణ రామాయణ', 'హెన్ను సంసారద కన్ను' 'యశోదా కృష్ణ' తదితర కన్నడ చిత్రాల్లో శ్రీదేవి నటించారు. 1979లో వచ్చిన 'ప్రియ' సినిమాలో అంబరీశ్ సరసన కథానాయికగా నటించారు. రజనీకాంత్ మరో కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం 175 రోజులు విజయవంతంగా ప్రదర్శితమైంది.

ఆమె కమిట్‌మెంట్ అదీ!



హీరో కృష్ణ, శ్రీదేవి కాంబినేషన్‌లో వచ్చిన హిట్ చిత్రాల్లో 'పచ్చని కాపురం' ఒకటి. ఈ సినిమాకు మొదట అనుకొన్న కథ వేరు. గుహనాథన్ చెప్పిన కథ నచ్చడం, కృష్ణ, శ్రీదేవి కాల్షీట్లు అందుబాటులో ఉండటంతో వెంటనే షూటింగ్ ప్రారంభించారు నిర్మాత మిద్దే రామారావు. తాతినేని రామారావు దర్శకుడు. అప్పటికి స్క్రిప్ట్ వర్క్ పూర్తి కాకపోయినా మొదట రెండు పాటలు తీసేశారు. కొన్ని సీన్లు కూడా చిత్రీకరించారు. అయితే అనుకొన్నరీతిలో స్క్రిప్ట్ సంతృప్తికరంగా రాకపోవడంతో ఆ కథను పక్కను పెట్టి మరో కథ కోసం వెదకడం ప్రారంభించారు. ఆ సమయంలోనే మిథున్ చక్రవర్తి, పద్మినీ కొల్హాపురి జంటగా నటించిన 'ప్యార్‌జుక్తా నహీ' (1985) సినిమా విడుదలై విజయం సాధించింది. ఫ్యామిలీ సబ్జెక్ట్‌తో రూపొందిన ఆ సినిమాను శోభన్‌బాబు హీరోగా తెలుగులో తీద్దామని రీమేక్ హక్కులు కొన్నారు అట్లూరి పూర్ణచంద్రరావు. అయితే ఆయన దగ్గరకు వెళ్లి తన పరిస్థితి వివరించి, హక్కులు తనకు ఇవ్వమని మిద్దే రామారావు అడగటంతో అట్లూరి పూర్ణచంద్రరావు సరేనన్నారు. కృష్ణకు హిందీ సినిమా చూపిస్తే ఆయనకు నచ్చడంతో ఓకే చెప్పేశారు. నిజానికి ఫ్యామిలీ హీరోగా పేరు తెచ్చుకొన్న శోభన్‌బాబుకు 'ప్యార్ జుక్తా నహీ' యాప్ట్ సబ్జెక్ట్. అయినా అటువంటి కథ కృష్ణతో తీస్తే వెరైటీ అవుతుందని దర్శకనిర్మాతలు ఫీలయి, ప్రొసీడయ్యారు. అయితే 'పచ్చని సంసారం' చిత్రం మూడు షెడ్యూల్స్ పూర్తయిన తర్వాత కానీ అదే కథతో శోభన్‌బాబు, విజయశాంతి జంటగా మరో సినిమా తయారవుతున్నట్లు నిర్మాత మిద్దే రామారావుకు తెలియలేదు. ఒకే కథతో రెండు సినిమాలు విడుదలైతే ఇన్నాళ్లూ తను పడిన కష్టం వృథా అవుతుందనే టెన్షన్ దర్శకుడు తాతినేని రామారావులో మొదలైంది. అందుకే వారం రోజుల పాటు రాత్రి, పగలు అనే తేడా లేకుండా వర్క్ చేశారు. శ్రీదేవి డబ్బింగ్ మాత్రం మిగిలింది. అప్పటికే ఆమె హిందీ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఒక్క రోజు కూడా ఖాళీ దొరకని పరిస్థితి. మిద్దే రామారావు పరిస్థితి వివరించగానే 'సరే.. నేను మీకు నైట్ డబ్బింగ్ చెబుతాను. ఏర్పాట్లు చేసుకోండి' అని అభయం ఇచ్చారు. ఆ మాట ప్రకారం ముంబైలో షూటింగ్ ప్యాకప్ చేసుకొని రాత్రి ఏడు గంటలకు చెన్నై ఫ్లైయిట్ ఎక్కారు శ్రీదేవి. విమానం దిగగానే ఎయిర్‌పోర్ట్ నుంచి సరాసరి డబ్బింగ్ థియేటర్ చేరుకొన్నారు. అలా రాత్రి తొమ్మిది గంటలకు డబ్బింగ్ మొదలుపెట్టి తెల్లారి ఐదు గంటల వరకూ ఏకధాటిగా చెప్పి, పూర్తి చేశారు. ఒక గంట మాత్రం రెస్ట్ తీసుకొని మళ్లీ ఏడు గంటలకు ముంబై ఫ్లైయిట్ ఎక్కారు శ్రీదేవి.

ఆ విషయాన్ని తన స్థానంలో ఉండి ఆలోచించమంది!

- కుట్టి పద్మిని



"శ్రీదేవి కఠినాత్మురాలు కాదు. కానీ ప్రతి విషయంలోనూ తనకు కచ్చితమైన అభిప్రాయాలు ఉంటాయి. ఒకసారి అనుకోకుండా ఫ్లైట్‌లో కలిశాం. 'పెళ్లైన వ్యక్తిని పెళ్లి చేసుకోవడం అంత అవసరమా?' అని అడిగాను. దానికి తను చెప్పిన జవాబు నాకు ఇప్పటికీ బాగా గుర్తుంది" అని అన్నారు కుట్టిపద్మిని. శ్రీదేవితో కుట్టిపద్మినికి చిన్నప్పటి నుంచి అనుబంధం ఉంది. తమిళంలో 'నమ్ నాడు', 'కవి కుయిల్', మలయాళంలో 'ఆలింగనం', 'ఆ నిమిషం'తో పాటు పలు చిత్రాల్లో కలసి నటించారు ఇద్దరూ. వారి అనుబంధం గురించి కుట్టి పద్మిని మాట్లాడుతూ "శ్రీదేవి నాకన్నా చాలా చిన్నది. తను పరిశ్రమలోకి రాకమునుపే నేను సినిమాల్లో ఉన్నాను. తను చాలా సాఫ్ట్‌గా ఉండేది. తను అమ్మాయని, తనకు అబ్బాయిలాగా చొక్కాలు వేస్తున్నారని కూడా తెలుసుకోలేని ప్రాయం తనది. 'కెమెరా వైపు ఇటు చూడాలి' అని నాకు వచ్చిన విద్యను నేను నేర్పితే 'సరే అక్కా' అని నెమ్మదిగా చెప్పేది. నేను, కమల్‌హాసన్ చెట్లు, పుట్టలు ఎక్కి అందరి చేతా దెబ్బలు తినేవాళ్లం. కానీ తను మాత్రం సెట్లో వాళ్ల అమ్మ పక్కనే కూర్చుని ఉండేది. ఆ తర్వాత తన హీరోయిన్‌గా, నేను కేరక్టర్ ఆర్టిస్టుగా బిజీ అయ్యాం. ఎన్నో వ్యక్తిగత విషయాలను పంచుకునేది. తను తెలుగు పరిశ్రమకీ, బాలీవుడ్‌కీ మా మధ్య కాస్త దూరం పెరిగింది. అనుకోకుండా ఒకసారి ఫ్లైట్‌లో కలిశాం. చాలా ఆప్యాయంగా పలకరించింది. అదీ ఇదీ మాట్లాడిన తర్వాత పెళ్లి మాట నేనే తీశాను. 'అది మాటల్లో చెప్పలేని భావోద్వేగం. నా స్థానంలో ఉంటే తప్ప, ఒక పెళ్లయిన మగాడిని నేనెందుకు చేసుకుంటున్నానో మీకు ఎవరికీ అర్థం కాదు అక్కా.. ఆ విషయం వదిలెయ్' అని గట్టిగా చెప్పింది. నేనేదో మాట్లాడబోతే తను పుస్తకం తీసుకుని చదవసాగింది. అంతే.. ఇంక నేనేం మాట్లాడలేదు" అని అన్నారు. శ్రీదేవి డ్యాన్సుల గురించి చెబుతూ "ఎంతటి క్లిష్టమైన స్టెప్పులనైనా తను ఇట్టే చేసేయగలిగేది. డైలాగులు కూడా చాలా సులభంగా గుర్తుపెట్టుకునేది. సినిమానే ఆశగా, శ్వాసగా భావించింది కాబట్టి ఆమె ఏ రంగంలో అడుగుపెట్టినా అక్కడ టాప్ ఆర్టిస్ట్‌గా మారింది" అని అన్నారు.

ఆ తర్వాత మళ్లీ కలవలేదు

- రోజారమణి



బాలనటిగా రాణించి, ఆ తర్వాత కథానాయికగానూ ప్రేక్షకుల్ని అలరించిన తారల్లో రోజారమణి, శ్రీదేవి పేర్లను ప్రముఖంగా చెప్పవచ్చు. ఈ ఇద్దరిలో కొన్ని పోలికలు కనిపిస్తాయి. ఇద్దరూ పౌరాణిక చిత్రాలతోనే తమ కెరీర్ ప్రారంభించారు. టీనేజ్ వచ్చాక ఇద్దరూ మలయాళ సినిమాలతోనే హీరోయిన్లుగా పరిచయమయ్యారు. మొత్తం 23 మలయాళ చిత్రాల్లో నటించిన శ్రీదేవితో తనకున్న అనుబంధాన్ని రోజారమణి 'చిత్రజ్యోతి'కి వివరించారు. 'మలయాళంలో సుప్రసిద్ధ దర్శకుడైన బి.కె.పట్టేకాడ్ దర్శకత్వంలో నేనూ, శ్రీదేవి కీలక పాత్రల్లో 'పూంపట్ట'(1971) సినిమా చేశాం. మా ఇద్దరి కలయికలో వచ్చిన తొలి సినిమా అది. తనేమో శారద పాత్రలో, నేను సుమతి పాత్రలో స్నేహితులుగా నటించాం. హీరోహీరోయిన్లు ఎవరూ లేకుండా సినిమా మొత్తం మా ఇద్దరి మీదే నడుస్తుంది. అప్పుడు నా వయసు తొమ్మిదేళ్లు, శ్రీదేవికి ఐదారేళ్లు ఉంటాయి. ప్రతి షాట్‌లో ఇద్దరం కలిసే ఉంటాం. చిన్నోళ్లం కాబట్టి సరదాగా ఆడుతూపాడుతూ పనిచేశాం. చెన్నైలో ఉండేవాళ్లం కాబట్టి ఇద్దరికీ తమిళ్ వచ్చుకానీ మలయాళ భాష అస్సలు తెలీదు. సెట్‌లో తెలుగే మాట్లాడుకునేవాళ్లం. దర్శకనిర్మాతలేమో 'మలయాళం మాట్లాడండి.. తెలుగు వద్దు' అని గోల చేసేవారు. అయినా వాళ్ల మాట వినేవాళ్లం కాదు. అయితే మలయాళంలో డైలాగులు మాత్రం తడుముకోకుండా చెప్పేవాళ్లం. 'పూంపట్ట' సినిమా విజయవంతమై మా ఇద్దరికీ పేరు తెచ్చింది. ఇక టీనేజ్‌లోకి వచ్చాక మేమిద్దరం కలసి నటించిన చిత్రం 'శివప్పు కల్ మూకుత్తి'. ఇందులో మాతో పాటు కమల్‌హాసన్ కూడా నటించారు. చెన్నైల్లో ఉన్నంత కాలం ఏదో ఒక వేడుకలో కలుస్తూనే ఉండేవాళ్లం. కొంతకాలానికి శ్రీదేవి ముంబై వెళ్లి హిందీ సినిమాల్లో నటించి స్టార్‌డమ్ తెచ్చుకుంది. అక్కడికెళ్లాక ఇద్దరం కలవడం జరగలేదు. చాలా గ్యాప్ తర్వాత 2011లో ఇంటర్‌నేషనల్ చిల్డ్రన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో శ్రీదేవిని, మా అబ్బాయి తరుణ్‌ని సత్కరించారు. ఆ కార్యక్రమం కోసం ఆమె హైదరాబాద్ వచ్చిన సమయంలో కలిసి మాట్లాడుకున్నాం. అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి చేతులమీదుగా నా స్నేహితురాలితో కలిసి మా వాడు సత్కారం అందుకోవడం ఆనందంగా అనిపించింది. ఆ తర్వాతి రోజు తను ముంబై వెళ్లిపోయింది. 'ఈసారి కలిసినప్పుడు ఎక్కువసేపు మాట్లాడుకుందాం' అని ఇద్దరం అనుకున్నాం. మళ్లీ కలవడమే జరగలేదు. చిన్న వయసులోనే మరణించడం, వేరే గడ్డ మీద కన్ను మూయడం చాలా బాధగా ఉంది. తన కూతురు జాన్వీ మొదటి సినిమా చూసి ఉండుంటే బావుండేది. తన కోరిక నెరవేరేది. అది తలచుకుంటే చాలా బాధ వస్తోంది'.

ఏమాత్రం సంశయించని కథానాయిక

- టి.సుబ్బరామిరెడ్డి



'శ్రీదేవి' హఠాన్మరణం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. అతిలోకసుందరి గురించి నమ్మలేని వార్త ఇది. నాలుగు దశాబ్దాలుగా మా కుటుంబానికి ఎంతో సన్నిహితురాలు. ఎన్నో సినీ వేడుకలకు మా ఆహ్వానాన్ని మన్నించి దంపతులిద్దరూ వచ్చారు. బాలీవుడ్‌లో యశ్‌చోప్రా కలిసి రూపొందించిన 'చాందిని', 'లమ్హే' చిత్రాలు శ్రీదేవి నటజీవితానికి ఎంతో వన్నె తెచ్చాయి. ఇటీవల 'మామ్'గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె హఠాత్తుగా మరణించడం అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఏదన్నా సన్నివేశం ఇస్తే ఇలా చేయాలా? అలా చేయాలా? అని రిహార్సల్స్ చేసుకోకుండా అలా పాత్రను అర్థం చేసుకుని సహజంగానే నటించేస్తారామె. అందుకే శ్రీదేవి స్థానాన్ని మరెవ్వరూ భర్తీ చేయాలేరని అంటుంటారు. శ్రీదేవి అప్పటి యువ కథానాయకులతో నటిస్తూనే సీనియర్ నటులతోనూ చేసేందుకు ఏమాత్రం సంశయించలేదు. 'బడిపంతులు' చిత్రంలో ఎన్టీఆర్ మనవరాలిగా చేసిన శ్రీదేవి.. ఆయన పక్కన హీరోయిన్‌గా అదరగొట్టేశారు. ఏఎన్నార్‌తో పలు చిత్రాల్లో నటించిన ఈ 'అతిలోక సుందరి' నాగార్జునతో కూడా నటించడం గమనార్హం. నటనకు వయసు ప్రమాణికం కాదని అప్పట్లోనే తేల్చి చెప్పారు శ్రీదేవి. ఆమె మరణం భారతీయ చలనచిత్ర రంగానికి తీరని లోటు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను" అని అన్నారు.

హోలీ పార్టీ కేన్సిల్!



ప్రముఖ నటి శ్రీదేవి కన్నుమూయడంతో యావత్ సినీ పరిశ్రమ దుఃఖ సంద్రంలో మునిగిపోయింది. షూటింగ్‌లు, సినిమాలు, పండుగల మీద ఎవరికీ దృష్టి పోవడం లేదు. మార్చి 2న తన నివాసంలో జరుపుకోవాల్సిన హోలీ పండుగను కేన్సిల్ చేస్తున్నట్టు బాలీవుడ్ నటి షబానా ఆజ్మి పత్రికా ప్రకటన జారీ చేశారు. "మా జానకి కుటీర్‌లో మార్చి 2న హోలీ వేడుకలను నిర్వహించాలని భావించాం. కానీ శ్రీదేవి మమ్మల్ని వదిలివెళ్లిన దుఃఖం నుంచి ఇంకా తేరుకోలేకుండా ఉన్నాం. అందుకే ఈ సారి హోలీ వేడుకలను రద్దు చేస్తున్నాం" అని అందులో తెలిపారు. శ్రీదేవి మరణ వార్త తెలియగానే అనిల్ కపూర్ గృహానికి వెళ్లి పరామర్శించారు షబానా అజ్మి.

రాష్ట్రంలో గార్మెంట్స్ తయారీ సంస్థ

▸▸ గ్రామీణ మహిళలకు అంతర్జాతీయ డిజైన్లలో శిక్షణ

రాష్ట్రంలో అంతర్జాతీయ డిజైన్లపై గ్రామీణ మహిళలకు శిక్షణ ఇచ్చే సంస్థను ఏర్పాటు చేసేందుకు ఆకాష్ ఇంపెక్స్ భాగస్వామి చారులత మూర్జాణీ ముందుకు వచ్చారు. భాగస్వామ్య సదస్సు ప్రాంగణంలోని సిఎం చాంబర్‌లో సోమవారం ఆమె చంద్రబాబును కలిశారు. గ్రామీణ ప్రాంతాల్లో గార్మెంట్ మాన్యుఫాక్చరింగ్‌ను అభివృద్ధి చేస్తామని, అక్కడి మహిళలకు అంతర్జాతీయ డిజైన్లలో మెళకువలు నేర్పుతామని వివరించారు. దీనికోసం ఒక అద్భుతమైన గార్మెంట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల మహిళల్లో అంతర్గతంగా ఉన్న నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని ఆమెకు సిఎం సూచించారు. వారిలోని సృజనాత్మకతను వెలికితీస్తే రాష్ట్రంలో గార్మెంట్ రంగం వృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు.

ఇన్నోవేషన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్

ఈ దఫా రూ.4.3 లక్షల కోట్ల పెట్టుబడులు.. రికార్డు స్థాయిలో 734 ఎంఒయులు.. 11 లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం

▸▸ పెట్టుబడిదారుల నమ్మకం వమ్ముచేయను

▸▸ భాగస్వామ్య సదస్సుపై 92శాతం మంది సంతృప్తి

▸▸ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు



ఎలక్ట్రానిక్ రంగంపై నిర్వహించిన సదస్సులో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): 'నవ్యాంధ్ర మంచి నేల. దేశంలో వినూత్నంగా ఆలోచించేవారిలో ఆంధ్రులు ముందు వరుసలో ఉంటారు. భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ వ్యాలీ అవుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సన్‌రైజ్ ఆంధ్రప్రదేశ్ పేరుతో సోమవారం ముగిసిన సిఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు సభలో సిఎం మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడి వాతావరణంపై సదస్సులో పాల్గొన్న ప్రతినిధుల్లో 92 శాతం మంది సంతృప్తి వ్యక్తంచేశారని తెలిపారు. 'మీ ఫీడ్ బ్యాక్ మాకు చాలా ముఖ్యం. లోటుపాట్లుంటే భవిష్యత్‌లో సరిదిద్దుకునేందుకు, మంచి సేవలు అందించడానికి వీలు కలుగుతుంది. లోపాలుంటే మన్నించండి' అని కోరారు. ఈసారి రికార్డు స్థాయిలో రూ.4.3 లక్షల కోట్ల పెట్టుబడులకు వీలు కల్పించే 734 అవగాహనా ఒప్పందాల(ఎంఒయు)పై సంతకాలు జరగడంపై సిఎం సంతోషం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడులతో రాష్ట్రంలో 11లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. భాగస్వామ్య సదస్సుపై 92 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు.

అమల్లోకి రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడులు

తమ మూడున్నరేళ్ల పాలనలో 31 లక్షల మందికి ఉపాధి కల్పించేలా రూ.30.54 లక్షల కోట్ల పెట్టుబడులకు వీలు కల్పించే 1,946 ఎంఒయులు కుదుర్చుకున్నట్టు సిఎం తెలిపారు. ఇందులో రూ.1.29 లక్షల కోట్ల పెట్టుబడితో ఇప్పటికే 531 యూనిట్లు ఉత్పత్తి దశలో ఉన్నట్టు చెప్పారు. వాటి ద్వారా 2.64 లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన వారి నమ్మకాన్ని వమ్ము చేయనని హామీ ఇచ్చారు.

21 రోజుల్లో అనుమతులు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే కంపెనీలు సవివరణ ప్రాజెక్టు నివేదికలు (డిపిఆర్) సమర్పిస్తే 21 రోజుల్లో అన్ని అనుమతులిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. పారిశ్రామికవేత్తలు 22వ రోజు నుంచే పనులు ప్రారంభించవచ్చన్నారు. ఈ సదస్సు సందర్భంగా గూగుల్, రిలయన్స్, అదానీ, మహీంద్రా, లులూ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఎంఒయులు కుదరడంపై సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది కూడా విశాఖలోనే భాగస్వామ్య సదస్సు జరుగుతుందని సిఎం స్పష్టం చేశారు. వ్యాపార విస్తరణకు ఎపిని కేంద్రంగా చేసుకోవాలని సిఎం ఆహ్వానించారు.

ఎలక్ట్రానిక్స్‌లో ఏపి వాటా పెంచుతాం

దేశ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ వాటాను ప్రస్తుత 20 శాతం నుంచి 80 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సిఎం చెప్పారు. ఎలక్ట్రానిక్స్ హార్డ్‌వేర్ కేంద్రంగా ఎపిని మలిచేందుకు పెట్టుబడులతో తరలి రావాలని కంపెనీలను ఆహ్వానించారు. 'నేడు వ్యక్తిగత మరుగుదొడ్డి లేని వారున్నారు గానీ సెల్‌ఫోన్ లేనివారు లేరు. పిల్లలు కూడా బొమ్మలతో ఆడడం మాని సెల్‌ఫోన్‌తో ఆడుకుంటున్నారు. ఒక స్మార్ట్‌ఫోన్ ఉంటే ఏ పనైనా ఉన్నచోట నుంచే చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి వచ్చింది. రాష్ట్ర పరిపాలనలో కూడా ఇన్నోవేషన్ టెక్నాలజీతోపాటు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌ను కూడా విస్తృతంగా వినియోగిస్తున్నాం. తద్వారా డెలివరీ వ్యవస్థ మెరుగుపడడమే కాక.. వనరులు, నిధులు గణనీయంగా ఆదా అవుతున్నాయి' అన్నారు.

హార్డ్‌వేర్‌దీ కీలక పాత్ర

ఉపాధి అవకాశాల కల్పనలో సాఫ్ట్‌వేర్‌తోపాటు హార్డ్‌వేర్ పరిశ్రమ కూడా కీలకపాత్ర వహిస్తుందని సిఎం అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకునే రాష్ట్రంలో సెల్‌ఫోన్‌లు, సెట్‌టాప్ బాక్స్‌లు, వాషింగ్ మెషీన్‌లు తదితర పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా రూ.30,100 కోట్ల పెట్టుబడులకు వీలు కల్పించే ఎంఒయులను సిఎం, ఐటి మంత్రి లోకేశ్ సమక్షంలో అధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులు పరస్పరం మార్చుకున్నారు.

రండి.. రాజధానిలో భాగస్వాములుకండి

▸▸ పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు పిలుపు

రాజధాని అమరావతి నగర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలు, వ్యాపారవర్గాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు ఇచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడుల సానుకూల వాతావరణం ఉన్నందున వర్తక, వాణిజ్యాన్ని విస్తరించుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌ను కేంద్రంగా చేసుకోవాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. సోమవారం భాగస్వామ్య సదస్సు ముగింపు సభలో చంద్రబాబు ప్రసంగించారు. ప్రపంచంలోని అత్యుత్తమ విధానాలను పరస్పరం తెలుసుకోవడానికి, వాణిజ్య బంధాలను దృఢం చేసుకోవడానికి ఈ సదస్సు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. 60 దేశాల నుంచి 280 మంది ప్రతినిధులు, 3,673 మంది భారతీయ పారిశ్రామికవేత్తలు, 500 మంది బిజినెస్ స్కూల్ విద్యార్థులు... మొత్తంగా 4,453 మంది హాజరయ్యారని చంద్రబాబు వివరించారు. 55 ద్వైపాక్షిక సమావేశాలు జరిపామని, గూగుల్, అదానీ, రిలయన్స్ వంటి సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో తయారైన 'కియా' తొలి కారు వచ్చే ఏడాది బయటకు రానున్నదని చంద్రబాబు ప్రకటించారు. అందరూ ఆశించినట్లుగానే సింగపూర్ కన్సార్షియం... రాజధాని అమరావతి అభివృద్ధిలో పాలుపంచుకుంటుందని ఆయన చెప్పారు. రానున్న కాలంలో అమరావతి ప్రపంచంలోని 5 అత్యుత్తమ నగరాల్లో ఒకటిగా రూపుదాల్చుతుందన్నారు. భాగస్వామ్య సదస్సుకు హాజరైన పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలందరూ అమరావతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సిఎం కోరారు.

పేదరికం లేని ఎపి.. ఎంతో దూరంలో లేదు

▸▸ పెట్టుబడులకు రాష్ట్రం ఎంతో అనుకూలం

▸▸ చక్కటి పాలనకు ప్రజల సంతృప్తే కొలమానం

▸▸ 'వికాస్ కా నారా...ఆంధ్రప్రదేశ్ హమారా..'

▸▸ విశాఖ సదస్సులో గవర్నర్ వ్యాఖ్యలు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏం చేసినా అంతిమంగా ప్రజల ఆనందం కోసమేనని గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ స్పష్టం చేశారు. ప్రజా సేవలో నాలుగు దశాబ్దాలు పూర్తిచేసుకున్న సిఎం చంద్రబాబుకు ఈ సందర్భంగా సభాముఖంగా అభినందనలు తెలిపారు. దీంతో ప్రాంగణం మొత్తం కరతాళధ్వనులతో మార్మోగింది. ఇన్నేళ్ల శ్రమ ఫలితాన్ని రాబోయే దశాబ్దంలో అందుకోనున్నారని చెప్పారు. భాగస్వామ్య సదస్సు ముగింపు సభలో గవర్నర్ ప్రసంగించారు. తనకు చంద్రబాబుతో మూడు దశాబ్దాల అనుబంధం ఉందన్నారు. చక్కటి పాలనకు ప్రజల సంతృప్తే కొలమానమని తెలిపారు. పేదరికం లేని సమాజ స్థాపన జరగాలన్నారు. రాష్ట్రంలో పేదరికం రూపుమాసిపోయే రోజు ఎంతో దూరంలో లేదని చెప్పారు. 'ఎపిలో పెట్టుబడులకు అవసరమైన అన్ని మౌలిక వనరులు ఉన్నాయి. రోడ్డు, జల, వాయు మార్గాలు ఉన్నాయి. రెండో ప్రధానాంశం



కమ్యూనికేషన్. అది ఎపిలో ఎంతో చక్కగా ఉంది. సెక్యూరిటీ కమ్యూనికేషన్ కూడా ఉంది. మూడో అంశం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. ఇవి పెట్టుబడులకు కీలకం. రాష్ట్రంలో స్నేహపూర్వక వాతావరణం, పెట్టుబడులకు తగినంత భద్రత ఉన్నాయని రాష్ట్ర ప్రథమ పౌరుడిగా హామీ ఇస్తున్నాను' అని పెట్టుబడిదారులకు తెలిపారు. అన్నివిధాలుగా భద్రత కల్పించే ఈ రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రావాలని కోరారు. '24 గంటల విద్యుత్ అందుబాటులో ఉంది. సౌర విద్యుత్‌లో పెట్టుబడులకు ఎన్నో అవకాశాలున్నాయి. అందుకే ఇది సన్‌షైన్ స్టేట్ అయింది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) గురించి నేడు చర్చ జరుగుతోంది. దేశంలో మానవ మేధస్సు సూపర్ కంప్యూటర్‌కన్నా వేగంగా పనిచేస్తోంది. మానవ వనరులకు సాంకేతికత ఎన్నడూ ప్రత్యామ్నాయం కాదు. టెక్నాలజీ సాయంతో అద్భుతాలు చేయవచ్చన్నారు. చివరలో 'వికాస్ కా నారా... ఆంధ్రప్రదేశ్ హమారా..' అంటూ గవర్నర్ తన ప్రసంగాన్ని ముగించారు.

రెండు ప్రాజెక్టుల్లో రూ.4,500 కోట్ల పెట్టుబడి



గతంలో ఎపి ప్రభుత్వంతో ఎంఒయులు చేసుకున్నాం. ఆయా ప్రాజెక్టుల్లో ప్రభుత్వ స్పందన మళ్లీ పెట్టుబడులు పెట్టేలా ఆకర్షించింది. సకాలంలో పారదర్శకంగా అనుమతులు సింగిల్ విండోలో లభిస్తుండడం మంచి పరిణామం. చిత్తూరులో నైస్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రూ.500 కోట్ల పెట్టుబడులకు ఎంఒయు కుదుర్చుకున్నాం. అలాగే కోనసీమ ఫెర్టిలైజర్స్ పేరిట రూ.4,000 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాం. అనువైన స్థలాలు కేటాయించడంలోనూ ఎపి ముందుంది.

- రోహిత్ కుమార్, జిఎం, కోనసీమ ఫెర్టిలైజర్స్

నున్నలో ఎలక్ట్రిక్ కార్ల తయారీ పరిశ్రమ



అమరావతిలో గ్రీన్ వెహికల్స్‌ను మాత్రమే వినియోగించాలని సిఎం చంద్రబాబు నాయుడు అంటున్నారు. కృష్ణా జిల్లా నున్నలో రూ.200 కోట్ల అంచనాలతో 60 ఎకరాల్లో అవేరా ఎలక్ట్రికల్ కార్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఎంఒయు చేసుకున్నాం. మాలాంటి యువ పారిశ్రామికవేత్తలకు, స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రంలో మంచి ప్రోత్సాహం లభిస్తోంది. ఉగాది నాటికి ఎలక్ట్రికల్ కార్ల తయారీ పరిశ్రమ పనులు పూర్తిచేస్తామనే నమ్మకం ఉంది.

- వెంకట రమణ, చందన ఐటి కార్పొరేషన్

ఎయిర్ కార్స్ ప్రాజెక్టు గురించి వివరించా...



ప్రపంచవ్యాప్తంగా అనేక అభివృద్ధి దేశాల్లో అందుబాటులోకి రానున్న ఎయిర్ కార్స్ గురించి సదస్సులో వివరించేందుకు వచ్చాను. నిర్దేశించిన రూట్‌లో ఇద్దరిని గమ్యానికి చేరవేయగల సామర్థ్యముండే ఎయిర్ కార్లు యూరప్ కంట్రీస్‌లో త్వరలో లాంచ్ కాబోతున్నాయి. అమరావతి నుంచి విజయవాడ వరకు ఎయిర్ కార్ల వినియోగంపై డెమో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాను. భాగస్వామ్య సదస్సులో పాల్గొనడం సంతోషంగా ఉంది.

- జార్జ్ ఓ నీల్, కో-ఫౌండర్, కార్‌మన్.కామ్, యుఎస్ఎ



నరెడ్కో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అడ్డదారులొద్దు.. నిజాయితీగా వ్యాపారం చేయండి

రియల్ ఎస్టేట్ కౌన్సిల్ సభలో సిఎం చంద్రబాబు

రియల్ ఎస్టేట్ రంగంలో విశ్వసనీయత ప్రధానమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) ఆంధ్రప్రదేశ్ శాఖను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డబ్బు సంపాదనకు అడ్డదారులొద్దని, 100 మందిలో 90 మంచివారు ఉంటారని, ఓ ఐదు శాతం తప్పుచేస్తారని... అటువంటి వ్యక్తులను దూరం పెట్టాలని సూచించారు. లిటిగేషన్స్‌తో వ్యాపారం వద్దని, నమ్మకం కలిగించేలా వ్యవహరిస్తే మంచి పేరొస్తుందని చెప్పారు. ప్రస్తుతం అమరావతిలో రాజధాని, తరువాత విశాఖపట్నం, తిరుపతిలో నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయని, ఇంకా 13 స్మార్ట్ నగరాలను గుర్తించామని తెలిపారు. గతంలో తొలితరం పారిశ్రామికవేత్తలను తయారు చేశానని, ఇప్పుడు సెకండ్ జనరేషన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ తయారు కావాలన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త, ఐటి నిపుణుడు రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధిలో భాగంగా ఎపిలో లక్ష హోటల్ గదులు, విశాఖలో 25 నుంచి 30 వేల గదులు నిర్మాణం జరగాలని అన్నారు. దుబాయ్ వంటి చిన్న దేశంలో 1.15 లక్షల హోటల్ గదులు ఉన్నాయన్నారు. రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సభ్యులకు వర్క్‌షాపు ఏర్పాటు చేస్తే తాను హాజరవుతానన్నారు. మంత్రులు గంటా శ్రీనివాసరావు, అమర్‌నాథ్ రెడ్డి, పి నారాయణ, అయ్యన్నపాత్రుడు, జాతీయ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు, జాతీయ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చలపతిరావు పాల్గొన్నారు.

సిమెంట్ రంగంలో భారీ పెట్టుబడులు

▸▸ రూ.8,627 కోట్లతో కొత్త యూనిట్ల ఏర్పాటు

▸▸ 5,400 మందికి ప్రత్యక్ష ఉపాధి

▸▸ గనుల శాఖ కార్యదర్శి శ్రీధర్



రాష్ట్రంలో మరిన్ని సిమెంట్ ప్లాంట్ల ఏర్పాటు కోసం విశాఖ భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు కుదిరాయి. అల్ట్రాటెక్, ప్రిజమ్, రామ్‌కో సంస్థలు... కర్నూలు జిల్లా కొలిమిగుండ్లలో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్టు గనుల శాఖ కార్యదర్శి బి శ్రీధర్ వెల్లడించారు. ఈ మూడు కంపెనీలు రూ. 7,500 కోట్ల పెట్టుబడితో మూడు యూనిట్లు ఏర్పాటు చేస్తాయన్నారు. ఇందులో రామ్‌కో గ్రూప్ ఒక్కటే రూ.2,000 కోట్లు పెట్టుబడి పెట్టబోతోంది. కర్నూలు జిల్లా కొలిమిగుంట్లలో రూ.1,160 కోట్ల పెట్టుబడితో 35 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఉండే ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. దీనికి తోడు జగ్గయ్యపేట సమీపంలోని ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 38 లక్షల టన్నుల నుంచి 50 లక్షల టన్నులకు, విశాఖ జిల్లా నరసింగబిల్లి ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్నీ ప్రస్తుత తొమ్మిది లక్షల టన్నుల నుంచి 18 లక్షల టన్నులకు విస్తరిస్తారు. ఈ రెండు ప్లాంట్ల విస్తరణ కోసం కంపెనీ మొత్తం రూ.930 కోట్లు ఖర్చు చేయనుంది. ఇతర కంపెనీలను కూడా కలుపుకుంటే రూ.8,627 కోట్ల పెట్టుబడులకు వీలు కల్పించే 30 ఒప్పందాలు కుదిరినట్టు శ్రీధర్ చెప్పారు. ఈ యూనిట్ల ఏర్పాటుతో నేరుగా 5,400 మంది, పరోక్షంగా 8,300 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. సిమెంట్ తరువాత కర్నూలు, కడప, అనంతపురం, నెల్లూరు, కృష్ణా, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో సిలికా, క్వార్జ్ మాంగనీస్, ఎం శాండ్ ఉత్పత్తి చేసే ప్లాంట్లు రాబోతున్నాయన్నారు.

మందకొడిగా సిమెంట్ డిమాండ్

ప్రస్తుతం దేశంలో సిమెంట్‌కు డిమాండ్ మందకొడిగా ఉందని విశాఖ భాగస్వామ్య సదస్సుకు హాజరైన రాంకో సిమెంట్ కంపెనీ సలహాదారు బి గోపాలకృష్ణ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో అన్నారు. అయితే 2020కల్లా డిమాండ్ పుంజుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తంచేశారు. దేశంలో సాలీనా 3.30 కోట్ల టన్నుల సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటే, ప్రస్తుతం డిమాండ్ 2.40 కోట్ల టన్నులు మించడం లేదన్నారు. దేశంలో సిమెంట్ తలసరి వినియోగం తక్కువగా ఉండడం కూడా ఇందుకు కారణమన్నారు. చైనాలో సగటున తలసరి వినియోగం 740 కిలోలు ఉంటే మన దేశంలో ప్రస్తుతం అది 130 నుంచి 140 కిలోలు మాత్రమేనన్నారు. తలసరి వినియోగం చైనా స్థాయికి పెరిగితే మన దేశంలోనూ సిమెంట్‌కు డిమాండ్ పెరుగుతుందన్నారు.



మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ఒప్పంద పత్రాలు అందుకుంటున్న సతీష్ చంద్ర

మంగళగిరిలో 'అజ్నా నెట్‌వర్క్స్'

▸▸ రూ.5 కోట్ల పెట్టుబడితో 60 మందికి ఉపాధి

గుంటూరు జిల్లా మంగళగిరిలో సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటుకు అజ్నా నెట్‌వర్క్స్ సంస్థ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు సోమవారం ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సతీష్ చంద్ర కోగంటి, ప్రభుత్వ ఐటి కార్యదర్శి విజయానంద్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. రూ.5 కోట్ల పెట్టుబడితో 60 మందికి ఉపాధి కల్పించేలా, ఆరు నెలల నుంచి ఏడాదిలోపే సంస్థ కార్యకలాపాలు ప్రారంభిస్తామని సతీష్ చంద్ర వివరించారు.

రూ. 39 వేల కోట్లతో ఇంధన ప్రాజెక్టులు

సంసిద్ధత వ్యక్తం చేసిన సాఫ్ట్‌బ్యాంక్

ఇంధన రంగంలో రూ.39 వేల కోట్ల పెట్టుబడితో నాలుగు ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు సాఫ్ట్‌బ్యాంకు యాజమాన్యం సంసిద్ధత వ్యక్తం చేసింది. భాగస్వామ్య సదస్సులో భాగంగా సిఎం చంద్రబాబుతో సాఫ్ట్‌బ్యాంక్ ప్రతినిధుల బృందం భేటీ అయింది. కాకినాడ సెజ్‌లో 4 గిగావాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ఎనర్జీ ప్లాంటును ఏర్పాటు చేస్తామని, 200 ఎకరాల్లో ఏటవాలుగా ఏర్పాటు చేసే పోలిసిలికాన్ సోలార్ ప్యానల్ ఏర్పాటు వల్ల ఇంధన ఉత్పత్తి సామర్థ్యం అత్యధికంగా ఉంటుందని ఈ బృందం వివరించింది. రాష్ట్రంలో మరో భాగస్వామ్య సంస్థతో కలిసి సోలార్, విండ్ ఎనర్జీ ప్లాంటుకు బ్యాటరీ స్టోరేజీ ప్లాంటును ఏర్పాటు చేస్తామని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 20 గిగావాట్ స్టోరేజీ ప్లాంటును ఏర్పాటు చేస్తున్నామని, తాము చేపట్టే ఈ ప్రాజెక్టును వివిధ రాష్ట్రాల్లో విస్తరించాలని నిర్ణయించామని పేర్కొంది. దీనిలో భాగంగా రాజస్థాన్, ఎపిలో 5 గిగావాట్ చొప్పున ప్లాంట్లు ప్రారంభిస్తామని వివరించింది.

విశాఖలో ఐవీ ఫ్లూయిడ్స్ ప్లాంట్

▸▸ రూ.100 కోట్లతో ఏర్పాటు

రోగులకు అత్యవసరంగా కావలసిన ఐవి ఫ్లూయిడ్స్ తయారీ ప్లాంట్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్నట్టు వీకో లాబ్స్ మేనేజింగ్ డైరెక్టర్ రేపాల హనుమంతరావు తెలిపారు. సుమారు రూ.100 కోట్ల పెట్టుబడితో రోజుకు 3 లక్షల బాటిళ్ల ఉత్పత్తి చేసే ప్లాంట్‌ను నెలకొల్పనున్నట్టు చెప్పారు. భాగస్వామ్య సదస్సులో సోమవారం ప్రభుత్వంతో వీకో కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటుకు 10 ఎకరాలు అవసరమని, ఇందుకు ఆరిలోవ ప్రాంతంలోని సెంట్రల్ జైలు సమీపంలో స్థలం పరిశీలించామన్నారు. ఫార్మా సిటీలో పరిస్థితులు ఐవీఫ్లూయిడ్స్‌కు అనుకూలంగా ఉండవని చెప్పారు. ఈ ప్లాంట్ వల్ల నేరుగా 650 మందికి, పరోక్షంగా 700 మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

రూ. 80 కోట్లతో 'శ్రీజ' పరిశ్రమలు

▸▸ నెల్లూరు, విజయనగరంలో ఏర్పాటు

విజయనగరంలో లోకాస్ట్ మాంగనీసు, నెల్లూరులో సిలికా శాండ్ పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు శ్రీజ మెటల్ శాండ్ మేనేజింగ్ డైరెక్టర్ పివి రమణ బాబు తెలిపారు. సుమారు రూ.40 కోట్లతో విజయనగరం జిల్లా గరివిడి సమీపంలో పరిశ్రమ ఏర్పాటుకు పరిశీలిస్తున్నామని తెలిపారు. మరో రూ.40 కోట్లతో నెల్లూరులో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. గతేడాది సదస్సులో చేసుకున్న ఒప్పందం మేరకు విశాఖ జిల్లా రావికమతం సమీపంలో మాన్యుఫాక్చరింగ్ శాండ్ ప్లాంట్ ఏర్పాటు చేశామని, త్వరలో ఉత్పత్తి మార్కెట్లోకి విడుదల చేస్తామని తెలిపారు. నదుల్లో లభ్యమయ్యే ఇసుకకు ప్రత్యామ్నాయంగా ఈ మాన్యుఫాక్చరింగ్ శాండ్ వినియోగించవచ్చని వివరించారు.

ఎపిలో యుపిఎస్ లాజిస్టిక్ సెంటర్

రాష్ట్రంలో లాజిస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు యుపిఎస్ ఇండియా ముందుకొచ్చింది. భాగస్వామ్య సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆ సంస్థ ఎండి రిచిట్ ఫెర్గాటి, జనరల్ మేనేజర్ శ్రీరంగ్ బాపట్ సోమవారం సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా 222 దేశాల్లో తమ సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తోందని, ఎపిలో తమ వ్యాపార విస్తరణకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వివరించారు.

పర్యాటకాభివృద్ధికి సహకరించండి

▸▸ శ్రీలంక ప్రతినిధులను కోరిన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకాభివృద్ధికి సహకరించాలని శ్రీలంక పరిశ్రమల శాఖ మంత్రి రిషద్ బతీయుద్దీన్‌ను చంద్రబాబు కోరారు. భాగస్వామ్య సదస్సులో భాగంగా రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. హోటల్, ఫార్మా, గ్లాస్ తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తితో ఉన్నామని బృంద సభ్యులు తెలిపారు. ఎపిలో పారిశ్రామికాభివృద్ధి కోసం చంద్రబాబు చేస్తున్న కృషిని ప్రశంసించిన బృందం.. రాష్ట్రానికి మరిన్ని శ్రీలంక ప్రాజెక్టులను తీసుకువస్తామని పేర్కొంది. తమ దేశ పర్యటనకు రావాలని చంద్రబాబును రిషద్ బృందం ఆహ్వానించింది.

రూ.10 వేల కోట్ల పెట్టుబడి పెడతాం : బడ్వే గ్రూప్

రాష్ట్రంలో రోబోటిక్స్ మెషినరీ తయారీ సంస్థ ఏర్పాటు చేస్తామంటూ ఆటోమొబైల్, గృహోపకరణాల తయారీ సంస్థ బడ్వే మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్ బడ్వే... పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా, రాష్ట్రంలో భారీ స్థాయిలో రూ.10 వేల కోట్ల వరకూ పెట్టుడులు పెట్టేందుకు బడ్వే గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఇటీవల ముంబైలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి ఎన్ అమర్నాథరెడ్డి, సిద్ధార్థ జైన్.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ ఆహ్వానించగా బడ్వే సానుకూలంగా స్పందించింది. ద్విచక్ర వాహనాలతో పాటు పలు ఆటోమొబైల్ కంపెనీలకు పరికరాలను సరఫరా చేయడంలో కీలక భూమిక పోషిస్తున్న ఈ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే కియా ఆటోమొబైల్‌కు దీటుగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పరిశ్రమల వర్గాలు భావిస్తున్నాయి.



యూనివర్స్ ఆఫ్ స్టార్టప్స్ సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి లోకేశ్

విశాఖలో ఐటి ట్విన్ టవర్స్

▸▸ ఐటి శాఖతో వుడా ఒప్పందం

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖలోని మధురవాడలో 19.6 ఎకరాల్లో ఐటి ట్విన్ టవర్లను నిర్మించనున్నారు. ఈ మేరకు విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (వుడా), రాష్ట్ర ఐటి శాఖతో సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మొత్తం 10లక్షల చదరపు అడుగుల స్థలాన్ని ఐటి సంస్థలకు కేటాయించాలి. మొదటి ఐదేళ్లకు చదరపు అడుగుకు నెలకు రూ.30 చొప్పున ఐటి శాఖ అద్దెకు తీసుకోనుంది. ఐటితో పాటు షాపింగ్ మాల్, స్టార్ హోటల్, ఇతర మౌలిక వసతులను కల్పించడానికి రూ.200 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమక్షంలో ఐటి కార్యదర్శి విజయానంద్‌తో వుడా విసి బసంత్‌కుమార్ ఒప్పందాలపై సంతకాలు చేశారు.



వుడా ఉపాధ్యక్షుడు బసంత్‌కుమార్‌కు ఒప్పంద పత్రాలు అందజేస్తున్న సిఎం చంద్రబాబు

అమరావతిలో చిప్ డిజైన్ వర్సిటీ

▸▸ ఒక స్టార్టప్‌లా నవ్యాంధ్ర అభివృద్ధికి కృషి

▸▸ 'ద యూనివర్స్ ఆఫ్ స్టార్టప్స్' సెమినార్‌లో మంత్రి లోకేశ్

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్‌ను ఒక స్టార్టప్ కంపెనీలా భావించి అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అమరావతిలో త్వరలో చిప్ డిజైన్ తయారీ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్రంలో నూతన పోర్టులు, ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. భాగస్వామ్య సదస్సు మూడో రోజు 'ద యూనివర్స్ ఆఫ్ స్టార్టప్స్' అంశంపై జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే కొత్తగా ఏర్పడిన ఎపిలో తలసరి ఆదాయం తక్కువగా ఉందని చెప్పారు. 2021 నాటికి ఎపిని దేశంలోనే అభివృద్ధి చెందిన మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా, 2029 నాటికి నంబర్ వన్‌గా నిలపాలన్నదే తమ లక్ష్యంగా పేర్కొన్నారు. 2050 నాటికి ప్రపంచ దేశాలతో పోటీపడాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలంటే 15 శాతం వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబు సారథ్యంలో కేవలం మూడున్నరేళ్లలో 12శాతం వృద్ధి సాధించామని చెప్పారు. చెన్నై, బెంగళూరు కారిడార్‌ను ఉపయోగించుకొని ఎలక్ట్రానిక్ తయారీ రంగాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌ఎకు చెందిన ఎమర్జెట్ వెంచర్స్ మేనేజింగ్ పార్టనర్ అంకుర్ జైన్, ఆగ్జిలనీ వెంచర్స్ ఛైర్మన్ ఎస్ గోపాలకృష్ణ, నెదర్లాండ్స్‌కు చెందిన ప్లాంట్స్-ఇ ఫౌండర్, సిఇఒ మార్జోలిన్ హెల్డర్, ఆస్ట్రేలియాకు చెందిన జాప్రైస్ కంపెనీ కో-ఫౌండర్ దీపంచ్ మంచంద్, నీతిఆయోగ్ మిషన్ డైరెక్టర్ ఆర్ రమణన్ పాల్గొన్నారు.

ప్రజా ప్రయోజనమే టెక్నాలజీ లక్ష్యం కావాలి

▸▸ కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): ఆధునిక టెక్నాలజీ సమాజానికి లబ్ధి చేకూర్చే విధంగా ఉండాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు అన్నారు. భాగస్వామ్య సదస్సు మూడో రోజు 'కనెక్టివిటీ, కమ్యూనికేషన్ రంగాల్లో మౌలిక సదుపాయాలు, ఆర్థికాభివృద్ధి' అనే అంశంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు కనెక్టివిటీ, కమ్యూనికేషన్ రంగాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు.

అభివృద్ధికి సరైన విధానాలు అవసరమని, అవి సమగ్రంగా లేకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు రావన్నారు. ప్రస్తుతం భారత్‌లో విమానయాన రంగం అభివృద్ధి దిశలో పయనిస్తోందని, సేవలను మరింత విస్తరించేందుకు కొత్త విధానాల అమలుకు కృషి జరుగుతోందన్నారు. విమానయాన రంగం అభివృద్ధితో భవిష్యత్తులో దేశం ఆర్థికంగా ముందుకు వెళ్లడమే కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు.

ఎపిలో కూడా విమానయాన రంగాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్తున్నామన్నారు. టెక్నాలజీ వినియోగంలో ఎపి ముందు వరుసలో ఉందని తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగంపై సర్వే నిర్వహిస్తున్నామన్నారు.

కమ్యూనికేషన్ రంగంలో 2022 నాటికి 10 కోట్ల ఉద్యోగాలు

కేంద్ర కమ్యూనికేషన్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎన్ శివ మాట్లాడుతూ.. 2022 నాటికి దేశంలో 5జి సేవలు అందుబాటులోకి రావచ్చన్నారు. ప్రముఖ సాంకేతిక విశ్వవిద్యాలయాలతో కలిసి టెస్ట్ బెడ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమ్యూనికేషన్ రంగంలో 2022 నాటికి 10 కోట్ల ఉద్యోగాలు పుట్టుకురావచ్చని ఆయన అంచనా వేశారు.

జిడిపి అంచనాల బూస్ట్

▸▸ సెన్సెక్స్ మరో 300 పాయింట్లు అప్



ముంబై : భారత ఆర్థిక వ్యవస్థ రికవరీ బాట పట్టవచ్చునన్న ఆశలు పెరగడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి కూడా సానుకూల సంకేతాలు ఆసరాగా సోమవారం స్టాక్‌మార్కెట్ మరింత ముందుకు దూసుకుపోయింది. వరుసగా రెండో సెషన్‌లో కూడా మంచి లాభాలతో ముగిసింది. సెన్సెక్స్ మూడు వారాల గరిష్ఠ స్థాయిలో 34445.75 పాయింట్ల వద్ద క్లోజ్ కాగా నిఫ్టీ కీలక స్థాయి 10550కన్నా పైనే క్లోజయింది. ఆర్థిక వ్యవస్థలో రికవరీ వేగం అందుకుంటున్నదని, మూడో త్రైమాసికం జిడిపి 7 శాతం వరకు ఉండవచ్చునని మోర్గాన్ స్టాన్లీ విడుదల చేసిన అంచనా నివేదిక ఇన్వెస్టర్ సెంటిమెంట్ బలపడడానికి దోహదపడిందని మార్కెట్ వర్గాలన్నాయి. శుక్రవారం వాల్‌స్ట్రీట్ లాభాలతో ముగియడంతో పాటు యూరోపియన్, ఆసియా దేశాల నుంచి బలమైన సంకేతాలు వెలువడడం కూడా సెంటిమెంట్‌కు బలం ఇచ్చిందని వారన్నారు. ఈ ఉత్సాహంలో సెన్సెక్స్ 303.60 పాయింట్లు లాభపడింది. ఈ నెల ఐదో తేదీన నమోదు చేసిన గరిష్ఠ స్థాయి 34757.16 పాయింట్ల తర్వాత సెన్సెక్స్ నమోదు చేసిన గరిష్ఠ స్థాయి ఇదే. నిఫ్టీ 91.55 పాయింట్ల వృద్ధితో 10582.60 పాయింట్ల వద్ద ముగిసింది.

సామ్‌సంగ్ నుంచి గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్



బార్సిలోనా (స్పెయిన్): దక్షిణ కొరియాకు చెందిన టెక్నాలజీ దిగ్గజం సామ్‌సంగ్ సరికొత్త గెలాక్సీ ఎస్9, ఎస్9 ప్లస్ స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. ఇక్కడ జరిగే మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌కు ముందు ఈ ఫోన్లను ఆవిష్కరించడం విశేషం. డ్యూయల్ అపర్చ్యూర్, స్లో మోషన్ వీడియో వంటి ఫీచర్లు ఈ ఫోన్‌లో ఉన్నాయి. ఐఫోన్ ఎక్స్, గూగుల్ పిక్సెల్ 2 సిరీస్‌కు పోటీగా ఈ ఫీచర్లను జోడించారు. డ్యూయల్ స్టీరియో స్పీకర్లు, డాల్బి అట్మాస్ సరౌండ్ సౌండ్ వంటి ఫీచర్లు ఈ ఫోన్లలోని మరిన్ని ఆధునిక సదుపాయాలు. ఈ ఫోన్లలోని కెమెరాల ద్వారా మొబైల్ వినియోగదారులు మరింత అద్భుతమైన ఫొటోలు, వీడియోలు తీసుకునే అవకాశం ఉంటుందని సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ ప్రెసిడెంట్, ఐటి, మొబైల్ కమ్యూనికేషన్స్ డివిజన్ హెడ్ డిజె కో తెలిపారు.

ఫీచర్లు..

- గెలాక్సీ ఎస్ 9లో 4జిబి రామ్, 64 జిబి, 128 జిబి, 256 జిబి ఇంటర్నల్ మెమరీ ఆప్షన్లు, 400 జిబి వరకు స్టోరేజ్‌ను పెంచుకునే సదుపాయాలు కల్పించారు.
- గెలాక్సీ ఎస్ 9 ప్లస్‌లో 6జిబి రామ్, 64జిబి, 128 జిబి, 256 జిబి మెమరీ ఆప్షన్లు, 400జిబి వరకు మెమెరీ పెంచుకునే స్లాట్‌ను ఇచ్చారు.
- కెమెరా యాప్‌లో లైవ్ ఆటోమెటిక్ ట్రాన్స్‌లేటర్ సదుపాయాన్ని ఇన్‌బిల్ట్‌గా ఆచ్చారు. ఇది 50కి పైగా భాషలను ట్రాన్స్‌లేట్ చేస్తుంది. వీటిలో తెలుగు, హిందీ, ఉర్దూ వంటి భాషలు కూడా ఉన్నాయి.
- రెండు ఫోన్లలోనూ ఆండ్రాయిడ్ 8 ఒరియో ఆపరేటింగ్ సిస్టమ్ ఉంది.
- చాటింగ్ సమయంలో తమ మొహంతో కూడిన ఇమోజీలను యూజర్లు క్రియేట్ చేసుకోవచ్చు.
- ఎస్9లో 3,000 ఎంఎహెచ్ బ్యాటరీ, 5.8 అంగుళాల స్క్రీన్ ఉంది. ఎస్9 ప్లస్‌లో 3,500 ఎంఎహెచ్ బ్యాటరీ, 6.2 అంగుళాల స్క్రీన్ ఉంది.
- రెండు ఫోన్లలోనూ 8 మెగాపిక్సెల్ ముందు కెమెరా, 12 మెగాపిక్సెల్ వెనుక కెమెరాలున్నాయి. వైర్‌లెస్ చార్జింగ్ సదుపాయం ఉంది.
- ఈ ఫోన్ల ప్రారంభ ధరనే 50 వేల రూపాయలకు మించి ఉండవచ్చని పరిశ్రమవర్గాలు అంచనా వేస్తున్నాయి.

మెర్సిడెస్ బెంజ్ 'బిఎస్ 6' కారు

ఎస్ 350 డి కొత్త వెర్షన్ విడుదల.. ధర రూ.1.33 కోట్లు



న్యూఢిల్లీ : జర్మనీ లగ్జరీ కార్ల కంపెనీ మెర్సిడెస్ బెంజ్ మరిన్ని ఫీచర్లను జోడించి సరికొత్త ఎస్ క్లాస్ ఎస్ 350 డి డీజిల్ వెర్షన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. దీంతోపాటు ఎస్ 450 పెట్రోల్ కారును కూడా తెచ్చింది. ఎస్ 350 డి ధర 1.33 కోట్ల రూపాయలుండగా.. ఎస్ 450 పెట్రోల్ వెర్షన్ ధర 1.37 కోట్ల రూపాయలుందని కంపెనీ పేర్కొంది. భారత్ స్టేజ్ (బిఎస్) 6 ప్రమాణాలకు అనుగుణంగా భారత్‌లో అందుబాటులోకి వచ్చిన తొలి కారు ఎస్ క్లాస్ 350 డి అని కంపెనీ తెలిపింది. భారత మార్కెట్ కోసం దేశీయంగానే ఈ కారును తయారు చేసినట్టు పేర్కొంది. బిఎస్ 6 ప్రమాణాలు అమల్లోకి రావడానికి రెండేళ్ల ముందే ఈ కారును తెచ్చినట్టు మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండి, సిఇఒ రోలాండ్ ఫోల్గర్ తెలిపారు. ఈ కారుతో కార్ల తయారీదారులకు కొత్త బెంచ్‌మార్క్‌ను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు.

విమానంలోనూ హైస్పీడ్ డేటా

▸▸ గ్లోబల్ కన్సార్షియంతో ఎయిర్‌టెల్ జట్టు

న్యూఢిల్లీ: ప్రైవేట్ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్.. అంతర్జాతీయ కన్సార్షియంతో జట్టుకట్టింది. ఈ భాగస్వామ్యం ద్వారా విమానాల్లో ప్రయాణిస్తున్నప్పుడు తమ నెట్‌వర్క్ యూజర్లకు నిరంతరాయ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించనున్నట్లు సంస్థ వెల్లడించింది. శాటిలైట్ టెక్నాలజీ సహాయంతో అందించే వేగవంత డేటా సేవలను ఎప్పటి నుంచి ప్రారంభిస్తారనే విషయంలో మాత్రం ఎయిర్‌టెల్ స్పష్టతనివ్వలేదు. ప్రస్తుతం బార్సెలోనాలో జరుగుతున్న 'మొబైల్ వరల్డ్ కాంగ్రెస్ 2018'లో ప్రకటించిన ఈ గ్లోబల్ కన్సార్షియాన్ని ఎయిర్‌టెల్‌తోపాటు వన్‌వెబ్, ఎయిర్‌బస్, డెల్టా, స్ప్రింట్ ఇంకా పలు సంస్థలు కలిసి ప్రారంభించాయి.

వై-ఫై ద్వారా విమానాల్లో ఇంటర్నెట్ యాక్సెస్ చేసేందుకు ఇప్పటికే పలు దేశాలు అనుమతిస్తున్నాయి. మన దేశంలోనూ దేశీయ, అంతర్జాతీయ విమానాల్లో ఇంటర్నెట్ కనెక్టివిటీ కల్పించేందుకు అనుమతించాలని గతనెలలో టెలికాం నియంత్రణ మండలి 'ట్రాయ్' ప్రభుత్వానికి ప్రతిపాదించింది. అంతేకాదు, విమానం 3 వేల అడుగుల ఎత్తుకు చేరుకున్నాక ప్రయాణికులు కాల్స్ చేసుకునేందుకూ అనుమతించాలని సూచించింది.

విమానంలోనూ నిరంతరాయంగా డేటా సేవలందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటైన ఈ సృజనాత్మక వేదికలో తామూ భాగస్వాములవడం సంతోషంగా ఉందని అని భారతీ ఎయిర్‌టెల్ (ఇండియా, దక్షిణాసియా) సిఇఒ గోపాల్ విఠల్ అన్నారు. ఎయిర్‌టెల్ గ్లోబల్ నెట్‌వర్క్‌లోని 37 కోట్ల మంది కస్టమర్లు విమాన ప్రయాణంలోనూ నిరంతరాయంగా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు పొందగలుగుతారని అన్నారు.

ఐప్యాడ్‌ల కోసం ఎయిర్ ఇండియా బిడ్ల ఆహ్వానం

సంస్థ విమానాల్లో పాడైన వీడియో స్క్రీన్ల స్థానంలో భర్తీ చేసేందుకు 150 ఐప్యాడ్‌ల కొనుగోలుకు ఎయిర్‌ఇండియా బిడ్లను ఆహ్వానించింది. వీటిని బ్యాకప్ ఆప్షన్‌గా ఉపయోగించుకోనున్నట్లు, ప్రీమియం క్లాస్ ప్యాసింజర్ల కోసం వీటిని కొనుగోలు చేయనున్నట్లు సంస్థ అధికారి ఒకరు తెలిపారు.

కేజీ బేసిన్‌లో రూ.40,000 కోట్ల పెట్టుబడి

▸▸ రిలయన్స్ ప్రతిపాదనకు ప్రభుత్వ ఆమోదం

▸▸ పంతం నెగ్గించుకున్న ముకేశ్ అంబానీ సంస్థ



న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ఎట్టకేలకు తన పంతం నెగ్గించుకుంది. ప్రభుత్వం ప్రకటించిన అధిక ధరతో కేజీ బేసిన్‌లో మరో మూడు క్షేత్రాల్లో గ్యాస్ వెలికితీతకు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రిలయన్స్, దాని భాగస్వామ్య సంస్థలు బ్రిటిష్ పెట్రోలియం (బిపి), నికో రీసోర్సెస్ సంస్థలు సమర్పించిన 400 కోట్ల డాలర్ల (సుమారు రూ.40,000 కోట్లు) అభివృద్ధి ప్రణాళికకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ (డిజిహెచ్) ఆమోదం తెలిపింది. డిజిహెచ్‌కు చెందిన మేనేజ్‌మెంట్ కమిటీ (ఎంసి) సోమవారం ఇందుకు ఆమోదముద్ర వేసింది. 2022నాటికి పూరయ్యే ఈ మూడు క్షేత్రాల ద్వారా కేజీ బేసిన్ నుంచి అదనంగా రోజూ మూడు నుంచి మూడున్న కోట్ల ఘనపు మీటర్ల గ్యాస్ ఉత్పత్తి అవుతుందని అంచనా. కేజీ బేసిన్‌లోని ప్రస్తుత క్షేత్రాల్లో గ్యాస్ ఉత్పత్తి పడిపోతున్న నేపథ్యంలో రిలయన్స్ కొత్త క్షేత్రాల అభివృద్ధికి సిద్ధమవడం విశేషం.

కావాలనే ఆలస్యం

నిజానికి ఈ క్షేత్రాల్లో భారీగా గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎప్పుడో కనుగొంది. అయితే లోతట్టు సముద్ర జలాల్లో ప్రతికూల పరిస్థితుల్లో ఈ క్షేత్రాలు ఉన్నందున ఇక్కడ ఉత్పత్తి చేసే గ్యాస్‌కు అధిక ధర కావాలని డిమాండ్ చేసింది. ఈ బేసిన్‌లోని ప్రస్తుత క్షేత్రం నుంచి ఉత్పత్తి చేసే గ్యాస్‌లానే మిలియన్ బ్రిటిష్ థర్మల్ యూనిట్ (ఎంఎంబిటియు)కు 2.89 డాలర్లకు మించి చెల్లించేది లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆ ధర ఏ మాత్రం గిట్టుబాటు కాదని రిలయన్స్, దాని భాగస్వామ్య పక్షాలు ఇప్పటి వరకు అక్కడ గ్యాస్ ఉత్పత్తి చేపట్టకుండా కావాలని జాప్యం చేశాయి. అయితే నిపుణులు కమిటీ సిఫారసుతో ప్రభుత్వం కొత్త క్షేత్రాల నుంచి ఉత్పత్తి చేసే ప్రతి ఎంఎంబిటియు గ్యాస్‌కు 6.3 డాలర్ల చొప్పున చెల్లించేందుకు అంగీకరించింది. దీంతో కేజీ బేసిన్‌లోని మూడు కొత్త క్షేత్రాలను గ్యాస్ ఉత్పత్తికి అనుగుణంగా అభివృద్ధి చేసేందుకు గత ఏడాది జూన్‌లో రూ.40,000 కోట్లతో ప్రణాళికను డిజిహెచ్‌కు సమర్పించింది. ఈ ప్రతిపాదను డిజిహెచ్ ఆమోదం తెలపడంతో కేజీ బేసిన్ నుంచి మరింత గ్యాస్ అందుబాటులోకి రానుంది.

బులియన్



బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	31,600	31,560	---	31,500	30,740
క్రితం ముగింపు	31,510	31,450	31,590	31,450	30,670
22 క్యారెట్లు	29,260	29,300	---	29,150	29,270
క్రితం ముగింపు	29,180	29,150	29,060	29,090	29,210
వెండి (కిలో)	39,800	40,000	---	39,900	41,700
క్రితం ముగింపు	39,600	40,000	39,700	39,600	41,500

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	70.00	విజయవాడ	75.00
కరీంనగర్	71.00	గుంటూరు	74.00
వరంగల్	70.00	ఒంగోలు	77.00
మహబూబ్‌నగర్	70.00	చిత్తూరు	67.00
కర్నూలు	71.00	నెల్లూరు	68.00
విశాఖపట్నం	83.00	అనంతపురం	65.00
గోదావరి	75.00		

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 4.15 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	355.00	చిత్తూరు	388.00
వరంగల్	357.00	చెన్నై	395.00
విజయవాడ	348.00	నమక్కల్	380.00
గోదావరి	348.00	బెంగళూరు	385.00
విశాఖపట్నం	350.00	ముంబై	400.00

ఫారెక్స్ (థామస్‌కుక్ రేట్లు) (రూపాయల్లో..)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
యుఎస్ డాలర్	58.83	68.21
పౌండ్	82.38	95.53
యూరో	72.43	84.00
ఆస్ట్రేలియా డాలర్	46.26	53.51
బ్రెహెయిన్ దినార్	159.32	183.57
కువైట్ దినార్	178.44	222.12
ఒమని రియాల్	156.02	178.49
సౌదీ రియాల్	15.64	18.54
సింగపూర్ డాలర్	44.63	52.86
యుఎఇ దిరమ్	16.01	18.71

తదుపరి నిరోధం 10630

టెక్ వ్యూ

నిఫ్టీ 10500 పాయింట్ల పైన పాజిటివ్‌గా ప్రారంభమైఇ డే గరిష్ఠ స్థాయిలో పటిష్ఠంగా క్లోజయింది. ఇది సానుకూల ట్రెండ్ సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ మైనర్ అప్‌ట్రెండ్‌లో ఉంది. ఇప్పుడు మరోసారి స్వల్పకాలిక ట్రెండ్ నిర్ణయ స్థాయిల్లో పరీక్షకు సమాయత్తం అవుతోంది. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం ఇక్కడ బలం ప్రదర్శించడం తప్పనిసరి. నిఫ్టీ ఇప్పటికీ 20, 50 డిఎంఏల కన్నా దిగువనే ఉంది.

- తదుపరి నిరోధం 10630. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన బలంగా క్లోజ్ కావాలి. ప్రధాన నిరోధం 10700. ఇక్కడ కన్సాలిడేట్ అయిన తర్వాతే స్వల్పకాలిక అప్‌ట్రెండ్ ఏర్పడుతుంది.
- ప్రధాన మద్దతు స్థాయి 10500. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది.
- బ్యాంక్ నిఫ్టీ నిరోధ స్థాయి 25800 చేరువలో పటిష్ఠంగా ముగిసింది. ఇక్కడ బలంగా క్లోజ్ కావడం తప్పనిసరి.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 10630 **మద్దతు :** 10500

■ వి.సుందర్ రాజా

ద్వితీయార్ధం మెరుగు

ఆస్ట్రో వ్యూ

తిథి : ఫాల్గుణ శుద్ధ ద్వాదశి **నక్షత్రం :** పుష్యమి

భరణి, పుబ్బ, పూర్వాషాఢ నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

నిఫ్టీ : 10582.60 (+91.55)

ట్రెండ్ మార్పు వేళలు : ఉదయం 11.27 గంటలు

ధోరణి : గ్రహగతులను బట్టి నిలకడ/నిస్తేజంగా ప్రారంభమై 11 నుంచి 1.10 గంటల వరకు నిస్తేజంగా ట్రేడవుతూ తదుపరి ముగింపు వరకు మెరుగ్గా మారే ఆస్కారం ఉంది.

ట్రేడింగ్ వ్యూహం...

నిఫ్టీ ఫ్యూచర్స్ ఉదయం 11 గంటల సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని ఒంటి గంట సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 1.15 తర్వాత ఎటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం : 10625, 10660

మద్దతు స్థాయిలు : 10545, 10510

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

గమనిక : ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి www.thefinancialastrologer.blogspot.in


బిఎస్‌ఇలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు (BSE)

ACI INFOCOM 4.84(4.84)25
ADITYA SPIN. 7.9(8.2)700
AGRO TECH FO 631.85(630.3)766
ALPHAGEO (I) 805.4(814.05)2040
ALU FLUORIDE 114.2(110.6)5780
AMAR RAJA BA 818.15(814.45)26604
ANDHRA BANK 45.85(45.95)148670
ANDHRA CEMEN 11.23(11)18786
ANDHRA PETRO 57.8(58.4)100500
ANJANI PORTL 192.85(191.5)1933
ASTRA MICRO 94.95(93.95)118735
AUROB.PHARMA 615.15(601.85)166192
AVANTEL LTD 538.5(521.85)14264
AVANTI FEEDS 2456.05(2413.45)10167
B.N.RATHI SE 41.75(41.55)2614
BALAJI AMINE 668(666.7)10158
BAMBINO AGRO 243(238.05)471
BARTRONICSIN 13.61(13.57)22291
BHAGIRA.CHEM 300(297)657
BHAGYA INL 42.1(41.6)21529
BHARATFIN 1031.7(998.15)35936
BNR UDYOG 32.5(30.7)97
CAMBRIDGE 73.8(72.4)1754
CCHHL 13.9(13.8)10228
CCL PRODUCTS 294(287.7)7043
CELESTIAL 17.65(17.4)7169
CIL SECURITS 30.4(29.8)2040
COROM INTER 542.65(552.3)50717
CUBEX TUBING 25.4(25.7)4366
CYBERMATE 3.32(3.16)56929
CYIENT 636.3(622.3)13712
DANLAW TECH. 72(69.65)2285
DECAN CEMENT 576.8(585.5)30
DECCAN POLYP 3.01(3)3
DHAN ROTO SP 55.85(55.9)6140
DIAMONPOWER 13.65(13.75)46065
DIVI'S LAB. 1036.15(1049.55)147387
DQ ENT 14.65(14.7)1724949
DR.REDDY'S 2194.15(2169.25)91280
EMPEE SUGARS 4.03(4.08)1980
EVEREST ORG. 139.95(139.75)251
FACOR ALLOYS 3.12(3.24)263138
FIRSTOBJ 14.85(14.15)1760
GATI LTD. 114.2(113.3)74720
GAYATRI BIO 9.65(9.5)72
GAYATRI PROJ 212(212.45)9114
GENNEX LAB 4.43(4.58)220441
GMR INFRASTR 19.05(18.75)2742948
GODAVARI DRU 35.65(34)1200
GOLDST INFRA 214.7(195.85)184885
GOLDSTONE EN 14.05(13.4)5936
GRANULES (I) 119.4(117.45)96567
GVK POWERINF 17.15(17.5)1081786
HBL P SYS 57.25(57.55)56389
HERITGFOOD 678.4(677.2)822
HIND.FLUROCA 13.3(14)1501
I.C.S.A. IND 3.3(3.22)11339
IKF TECHNO .65(.68)204734
INCAP LTD. 93(89.25)3
IPAPPM 316.35(319)2400
IVRCL LTD 4.46(4.55)61442
KAKATIYA CEM 297.05(292.95)3315
KALLAM SPG. 31.2(30.75)93658
KAVERI SEED 502.9(494.2)60376
KCP LTD 131.9(130.9)8019
KERNEX MICRO 45.5(44.45)4563
KNR CONST 303.25(294.9)11803
KREBS BIOCHM 161.5(159.85)998
LANCO INFRA 1.38(1.32)544389
LOKESH MACH 67.8(67.55)4997
LOTUS CHOC 50(49.05)1496
MADHUCON PRJ 27.6(27.4)11468
MOLD-TEK TEC 61.05(60)402203
MOSCHIP SEMI 32.1(33.1)39681
MSR INDIA 49.7(51.45)17602
NC L IND. 228.85(230.7)6854
NACLIND 44.2(43.4)20235
NATCO PHARM 775.05(778.4)42475
NCC 126.05(125.3)281013
NEHA INTER. 7.06(7.57)10351
NETTLINX LTD 78.05(79.75)9156
NEULAND LAB. 705.5(706.7)1911
NILE LTD. 814.1(808.9)3753
NTL 3.88(3.95)5831
OIL COUNTRY 43.15(43.3)4603
PADMALAYA TE 4.74(4.79)7294
PALRED 92.2(94.5)5989
PANYAM CEMEN 47.7(48.55)16156
PENNAR STEEL 61.55(59.4)78406
PFL INFOTECH 8.41(8.79)3374
PHYTOCHEM I. 62.65(62.45)4441
PITTI LAMIN. 90.75(92.6)12012
POKARNA LTD 212.65(206.85)2321
PRAJAY ENGS. 13(13.25)25597
PREMIER EXPL 392.95(391.35)736
PRISM CEMENT 127.35(126.1)74668
RAIN 395.15(382.9)453345
RAJ PACKAGIN 38.95(39.25)1793
RAJVIR IND 43.75(48.5)579
REG.CERAMIC 5.66(5.73)1405
RESTILE CER. 7.25(7)8281
SAGAR CEM. 972.9(967.7)151
SAMKRG PIST. 304(302.25)12598
SAMPRE NUTRI 53.1(53.45)2722
SANGHI IND. 120.9(115.2)43355
SATVAH.ISPAT 22.35(21.7)7083
SAVEN TECHNO 24(20)42454
SIBAR AUTO 22.75(22.35)8798
SMPL 1.42(1.42)9950
SMS PHARMACE 89.4(88.85)6500
SREE RAYALA 170.45(168.35)2023
STEEL EXCH 31(29.55)39402
SUJANA INDUS .9(.94)29075
SURANATP 5.26(5.21)6433
SURYACHAKRA 1.04(1.09)88626
SURYAMBA SP 72.8(72.5)96
SURYAVA SPIN 6.1(6.31)203
SURYLAK.COTT 78.8(80.5)47910
SUVEN LIFE S 191.85(189.7)25689
TAJ GVK HOTL 168.05(167.85)2776
TANLA 32.35(31.45)38392
TCI INDUS. 940(935.55)150
TRANSCORP IN 34.4(34)1603
TRANSGENE BI 2.39(2.39)50
TRANSPORT CO 279.4(282.5)2446
USHER AGRO 6.51(6.35)5074
VICEROY HOTE 15.8(15.8)39480
VIJAY TEXTIL 56.5(56.55)770
VIMTA LABS 205(209.95)2796
VIRAT CRANE 51(51.8)1289
VIRINCHI 120.55(118)62531
VISAKA IND. 690.55(680)4327
VISTA PHARMA 44.8(42.55)48760
VIVIMED LABS 78.15(76.75)216036
VST INDUS. 3208.55(3251)136
WATERBASE 311.35(317.15)157575
XLENERGY 2.83(2.97)6421
YBRANTDIGI 5.27(5.37)147432
ZEN TECH 118.5(117.85)29464
ZENOTECH 43.9(43.75)62778

దేవతకు ఏమైంది?



శ్రీదేవి మరణం ప్రమాదమే!



స్పృహ కోల్పోయి నీట మునిగారు.. పోస్టుమార్టం నివేదికలో వెల్లడి

దుబాయ్, ఫిబ్రవరి 26: శ్రీదేవి మరణం అనుమానాస్పదంగా మారింది. సోమవారం దుబాయ్ ప్రభుత్వం సోమవారం శ్రీదేవి పోస్టుమార్టం నివేదికను వెల్లడించింది. ఆమె స్పృహ కోల్పోయి, ప్రమాదవశాత్తు బాత్ టబ్‌లో మునిగి చనిపోయారని అందులో పేర్కొన్నారు. ప్రమాద వశాత్తు మునకకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతుందని దుబాయ్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు గల్ఫ్ న్యూస్‌కు తెలిపారు. మరణ ధ్రువీకరణ పత్రంలో 24వ తేదీ శనివారం మరణించినట్లు పేర్కొన్నారు. ఫోరెన్సిక్ నివేదికలో డ్రౌనింగ్ బదులు డ్రానింగ్ అని అచ్చుతప్పుగా ప్రచురితం అయ్యింది. అచ్చుతప్పుల నివేదికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చెప్పిందిదీ.. జరిగిందిదీ..

శ్రీదేవి మరిది సంజయ్‌కపూర్..



"అవును, నటి శ్రీదేవి ఇకలేరు. శనివారం రాత్రి 11.00-11.30 గంటల సమయంలో ఆమె చనిపోయారు. ఇప్పుడే దుబాయ్ నుంచి ముంబై చేరుకున్నా. మళ్లీ దుబాయ్ వెళ్తున్నా. శ్రీదేవికి గతంలో ఎలాంటి హృదయసంబంధిత అనారోగ్యాలూ లేవు. గుండెపోటు వచ్చిన సమయంలో ఆమెహోటల్ బాత్‌రూమ్‌లో ఉన్నారు"

ఫోరెన్సిక్ నివేదిక చెప్పింది ఇది..

శ్రీదేవి స్పృహ కోల్పోయి, ప్రమాదవశాత్తు బాత్ టబ్‌లో మునిగి (యాక్సిడెంటల్ డ్రౌనింగ్) చనిపోయారు.



To whom it may consern

This is to inform that

Name: SREEDEVI BONEY KAPOOR AYYAPPAN

Gender: FEMALE

Nationality: INDIA

Passport No: IND- Z 4231524

Died on: 24 / 2 / 2018

Due to: ACCIDENTAL DRAWNING

For/ 26/2/2018

Director of Preventive Medicine Dubai

ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక

అదేం నివేదిక... తప్పుల తడక

దుబాయ్, ఫిబ్రవరి 26: శ్రీదేవి మరణానికి సంబంధించి సోమవారం దుబాయ్ ప్రభుత్వం విడుదల చేసిన పోస్టుమార్టం నివేదిక తప్పుల తడకగా ఉంది. ఫోరెన్సిక్ నివేదికలో డ్రౌనింగ్ బదులు డ్రానింగ్ అని అచ్చుతప్పుగా ప్రచురితం అయ్యింది. ఇది దుబాయ్ ప్రభుత్వ వైద్యులు రూపొందించిన నివేదికేనా అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దుబాయ్ అధికారులు వాడిన 'యాక్సిడెంటల్ డ్రౌనింగ్' పదం మరింత అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా ఇలా నీటిలో మునిగిపోయి చనిపోయిన కేసు వచ్చినప్పుడు డ్రౌనింగ్ అనే పదం వాడవచ్చు. అలాకాకుండా విచారణ ఇంకా జరుగుతుండగానే 'యాక్సిడెంటల్ డ్రౌనింగ్' అనే పదం వాడటంతో క్లీన్‌చిట్ ఇచ్చినట్లవుతుంది. అయితే ఇలా ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందనే దానిపై కూడా అనుమానాలున్నాయి. ఎవరైనా నీటిలో మునిగిచనిపోయినప్పుడు వారి ఊపిరితిత్తుల్లో నీటి శాతం ఎంత ఉన్నది? ఫోరెన్సిక్ నివేదిక ద్వారా తెలుసుకునే అవకాశముంది. కెమికల్, విస్రాలను(పెద్దపేగులో ఉండే పదార్థం) పరీక్షలకు పంపిస్తారు. కడుపులో ఉన్న పదార్థాలేంటి? ఊపిరితిత్తుల్లో ఎంత మేరకు నీరుంది? మరణించినవారు ఆల్కాహాల్ ఏమైనా తీసుకున్నారా? కెమికల్ కంటెట్స్ ఏమున్నాయి? అనే విషయాలు నిర్ధారణ చేసుకునే అవకాశాలున్నాయి. అవన్నీ పూర్తి చేసిన తర్వాతే పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అవేవీ కాకుండా డెత్ సర్టిఫికెట్లో మాత్రం 'యాక్సిడెంటల్ డ్రౌనింగ్' అనే పదం వాడటం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనికితోడు నివేదికపై రేడియాలజిస్టు సంతకం పెట్టడంతో అనుమానాలు రేకెత్తాయి. నిజానికి పాథాలజిస్టు మాత్రమే పోస్టుమార్టం నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. రేడియాలజిస్టు సంతకం మాత్రమే చేశారని, పోస్టుమార్టం ప్రక్రియ పాథాలజిస్టు నేతృత్వంలోనే జరిగిందని ప్రభుత్వ వర్గాలు వివరణ ఇచ్చాయి

ఎంబామింగ్ అంటే?

పార్థివ దేహం చెడిపోకుండా కొన్ని రోజులపాటు యధాస్థితిలో ఉండేట్టుగా కొన్ని రసాయనాలను నింపి భద్రపరచే ప్రక్రియను 'ఎంబామింగ్' అంటారు. ఫార్మాల్డిహైడ్, గ్లుటరాల్డిహైడ్, మిథనాల్‌తో పాటు తేమ కోల్పోకుండా ఉపయోగపడే పదార్థాలు, నీటితో ఎంబామింగ్ ఫ్లూయిడ్‌ను తయారు చేస్తారు. పార్థివ దేహంలోని ఫ్లూయిడ్స్‌ను తొలగించి ఈ ఎంబామింగ్ ఫ్లూయిడ్‌ను శరీరంలోకి ఎక్కిస్తారు. పార్థివ దేహానికి 24 గంటల్లోపు అంతిమ సంస్కారాలు జరిపినా, శీతలీకరణ చేసినా 'ఎంబామింగ్' అవసరం ఉండదు. మిగతా అన్ని సందర్భాల్లోనూ ఈ ప్రక్రియ తప్పనిసరి. ఈ పద్ధతిలో కొన్ని ఏళ్ల పాటు పార్థివ దేహాన్ని భద్రపరచవచ్చు.



ఎలా నిర్ధారిస్తారు?

- ఆల్కహాల్ శాతమేదీ?
- నివేదికను తప్పుబట్టిన నిపుణులు

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవి పోస్టుమార్టం నివేదిక లోపభూయిష్టంగా ఉందని హైదరాబాద్‌కు చెందిన ఫోరెన్సిక్ నిపుణులు, వైద్యులు చెబుతున్నారు. ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో పడ్డారా, కావాలనే ఎవరైనా అందులోకి నెట్టారా అనేది పోలీసులు దర్యాప్తులో తేల్చాల్సి ఉండగా, దుబాయ్ వైద్యులు ఏకంగా యాక్సిడెంటల్ డ్రానిన్(డ్రౌనింగ్ అని ఉండాలి) అని ముందే తీర్పు ఇచ్చేశారని ఫోరెన్సిక్ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "ఫోరెన్సిక్ సైన్స్‌లో యాక్సిడెంటల్ డ్రౌనింగ్ అనే పదమే లేదు. ఉద్దేశ పూర్వకంగా నీళ్లలో ముంచితే 'యాంటీ మార్టమ్ డ్రౌనింగ్' కిందకు వస్తుంది. ప్రమాదవశాత్తూ నీళ్లలో పడితే దాన్ని 'డ్రౌనింగ్' అని ఫోరెన్సిక్ సైన్స్ పరిభాషలో అంటారు. ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగానే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తారు. దర్యాప్తులో ప్రమాదవశాత్తా.. ఉద్దేశపూర్వకంగా ఎవరైనా చంపారా అనేది తేలుతుంది. ముందే ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి చనిపోయారని చెప్పడం సరికాదు" అని ఫోరెన్సిక్ నిపుణుడు డాక్టర్ వెంకన్న 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. మరణానికి ముందు శ్రీదేవి ఆల్కహాల్ నిజంగానే తీసుకుందా? ఒక వేళ తీసుకుంటే బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ ఎంత మొత్తంలో ఉంది? లాంటి వివరాలన్నీ నివేదికలో స్పష్టంగా తెలుస్తాయన్నారు. "మద్యం మత్తులో బాత్‌టబ్ వద్దకు వెళ్లినప్పుడు అపస్మారక స్థితిలోకి వెళితే అందులో పడే అవకాశం ఉంది. పడగానే క్షణాల్లో ఊపిరితిత్తులోకి నీరు వెళుతుంది. దీంతో శ్వాస సరిగా ఆడకపోతే మరణించే అవకాశం ఉంటుంది. డ్రౌనింగ్ కేసుల్లో ఊపిరితిత్తుల శాంపిల్స్‌ని కూడా విశ్లేషించాల్సి ఉంటుంది. చనిపోయే ముందు ఊపిరితిత్తుల శ్వాసను అంచనా వేయొచ్చు. శ్రీదేవి కేసులో పూర్తి నివేదికను పరిశీలించిన తర్వాతే ఒక అంచనాకు రావాల్సి ఉంటుంది" అని గాంధీ ఆస్పత్రి ఫోరెన్సిక్ వైద్యుడు విక్రమాదిత్య అన్నారు.

శ్రీదేవి ఎప్పుడూ మద్యం తాగలేదు

- అమర్ సింగ్



శ్రీదేవి రక్తంలో మద్యం ఆనవాళ్లు ఉన్నాయన్న దుబాయ్ ఫోరెన్సిక్ శాఖాధికారుల వ్యాఖ్యల్ని ఆమె కుటుంబ స్నేహితుడు, రాజ్యసభ సభ్యుడు అమర్ సింగ్ తిప్పికొట్టారు. అసలు ఆమెకు హార్డ్ లిక్కర్ తాగే అలవాటే లేదని స్పష్టం చేశారు. ఏవైనా కార్యక్రమాలు ఉన్నపుడు వైన్ మాత్రం తాగేవారని చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'శ్రీదేవిగారు ఎప్పుడూ మద్యం సేవించలేదు. కొన్ని కార్యక్రమాల్లో వైన్ మాత్రమే తాగేవారు.' అని చెప్పారు. అబుదాబీ షేక్ అల్ నహ్యాన్‌తో మాట్లాడానని, అన్ని లాంఛనాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

ఏం జరిగింది బోనీ..?

18 గంటల పాటు ఇంటరాగేషన్.. నేడు మళ్లీ ప్రశ్నించనున్న దుబాయ్ పోలీస్

- శ్రీదేవితో జరిగిన చివరి సంభాషణపై ఆరా
- పొంతనలేని జవాబులిచ్చిన బోనీ

దుబాయ్, ఫిబ్రవరి 26: అందాల తార శ్రీదేవి మరణం వెనుక మిస్టరీకి ఇపుడు స్వయానా ఆమె భర్త బోనీకపూరే కేంద్రబిందువయ్యారు. ఎందుకంటే ఆమెతో చివరిసారిగా మాట్లాడినదీ, ఆసుపత్రికి తీసుకెళ్లినదీ ఆయనే.. దాంతో ఆయన వాంగ్మూలం కీలకంగా మారింది. దుబాయ్ పోలీసులు- సోమవారం నాడు ఆయనను ఏకంగా పద్దెనిమిది గంటల పాటు వివిధాంశాలపై ప్రశ్నించారు. భారత్‌కు తిరిగివెళ్లి - ఎందుకు తిరిగి దుబాయ్ వచ్చారని ప్రశ్నించినట్లు సమాచారం. లక్నోలో ఉత్తరప్రదేశ్ పెట్టుబడుల సదస్సులో పాల్గొనేందుకు ఆయన వెళ్లినట్లు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. అయితే- శ్రీదేవితో చివరిసారిగా ఏం మాట్లాడారు, ఆమె మానసిక స్థితి ఏంటి, ఆమె అలవాట్లెలాంటివి.. మొదలైన అంశాలపై పోలీసులు బోనీని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అంతేకాక- అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను తిరిగి చైతన్యపర్చడానికి ఏం చేశారు, 6 గంటలకు చనిపోతే -9 గంటల వరకూ ఎందుకు ఆసుపత్రికి తీసికెళ్లలేదు.. ఇత్యాది విషయాలపైనా ప్రశ్నించారు.

బోనీని శనివారం రాత్రి, ఆదివారం ఉదయమంతా కూడా పోలీస్ ప్రధాన కార్యాలయంలోనే ఉంచి ఇంటరాగేట్ చేశారు. కానీ అనేక ప్రశ్నలకు బోనీ కపూర్ పొంతనలేని జవాబులిచ్చినట్లు అభిజ్ఞవర్గాల సమాచారం. టైమింగ్స్‌ను వివరించే క్రమంలో ఆయన తడబడ్డారని తెలుస్తోంది. రషీద్ ఆసుపత్రికి బోనీతో పాటు వెళ్లిన మరో ముగ్గురు స్నేహితుల వాంగ్మూలాలు కూడా పోలీసులు తీసుకొన్నారు. వారు చెప్పిన దానితో బోనీ సమాధానాలను సరిచూస్తున్నట్లు సమాచారం. శ్రీదేవిని తీసుకొచ్చిన తరువాత ఆమెకు జరిపిన పరీక్షలపై కూడా ఆసుపత్రి డాక్టర్లను ప్రశ్నించారు.

- బోనీ కపూర్‌కి దుబాయ్‌లో చాలా మంది స్నేహితులున్నారు. వారంతా సినీ రంగానికి చెందిన వారే. కానీ ఈ వ్యవహారం ఇంత జరుగుతున్నా వారెవరూ కలవడానికి కూడా రాకపోవడం అనుమానాలకు తావిస్తోంది.
- ఇంటరాగేషన్ మరో దఫా మంగళవారం జరిగే అవకాశం ఉంది. విచారణకు సహకరించండని ఆయనను దుబాయ్ పోలీసులు కోరారు. మరణం వెనుక ఏం జరిగిందో తెలియాలన్న అంశాన్ని భారత కాన్సులేట్ జనరల్‌కు కూడా దుబాయ్ పోలీసులు తెలియపర్చినట్లు, ఇందుకు భారత అధికారులు అంగీకరించినట్లు చెబుతున్నారు.
- 48 గంటలు గడిచినా- ఒకప్పటి భారతదేశపు అగ్రతార, లేడీ సూపర్‌స్టార్ అయిన శ్రీదేవి పార్థివదేహం దుబాయ్ మార్చురీలోనే ఉందంటే- మరణం వెనుక తేలాల్సిన నిజాలుండే ఉంటాయని దుబాయ్ పత్రికలు రాశాయి. బోనీని అంత నిశితంగా ప్రశ్నించడం కూడా ఖచ్చితమైన సమాచారం రాబట్టడానికేనని పేర్కొన్నాయి. బోనీ కపూర్‌ను మార్చురీలోకి అనుమతించలేదు. ఫోరెన్సిక్ పరీక్షలు పూర్తయి, ఎంబామింగ్ కోసం పంపడానికి ముందు మాత్రం ఓ కుటుంబ సభ్యుడిని, ఓ కాన్సులేట్ అధికారిని అనుమతించారు.

బోనీ చిన్నపిల్లాడిలా ఏడుస్తున్నారు!

దుబాయ్, ఫిబ్రవరి 26: శ్రీదేవి ఇకలేరని, తిరిగిరాదన్న బాధతో ఆమె భర్త బోనీ కపూర్ చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నారని, ఆయన రోదనను ఆపడం ఎవరితరం కావడం లేదని పాక్ నటుడు, మామ్ చిత్రంలో శ్రీదేవితో కలిసి నటించిన అద్నన్ సిద్దిఖీ చెప్పారు. 'ప్రస్తుతం నేను దుబాయ్‌లో ఉన్నాను. బోనీసాబ్‌ను కలిశాను. ఆయన చిన్న పిల్లాడిలా ఏడుస్తున్నారు. ఆయన్ను ఓదార్చడం ఎవరి వల్లా కావడం లేదు.' అని అన్నారు. శ్రీదేవికి భారత్‌లోనే కాదు, పాకిస్థాన్, అమెరికా, యూకే ఇంకా చాలా దేశాల్లోనూ అభిమానులు ఉన్నారన్నారు. 'నాలుగు రోజుల క్రితం మోహిత్ పెళ్లికి నేను కూడా హాజరయ్యా. అప్పుడు శ్రీదేవి ఎంతో అందంగా, సంతోషంగా కనిపించారు' అని అద్నన్ తెలిపారు.



క్షణాక్షణం

- అసలు ఆ రోజు ఏం జరిగింది?
- ఫిబ్రవరి 21న ఇండియాకు బోనీ
- భార్యకు సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు మళ్లీ దుబాయ్‌కి
- 24 సాయంత్రం 5.30కి హోటల్‌కి చేరిక
- 6.25కే బాత్‌టబ్‌లో అచేతనంగా శ్రీదేవి?
- రాత్రి 9 గంటలకు పోలీసులకు సమాచారం!

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

లెజండరీ నటి, లేడీ సూపర్‌స్టార్ శ్రీదేవి హఠాన్మరణం మొదలు.. ఫోరెన్సిక్ రిపోర్టు మరణం వరకూ అన్నీ ట్విస్ట్‌లే. నిమిషానికో ట్విస్ట్ వెలుగు చూస్తుండడంతో కోట్లాది మంది అభిమానులు అసలేం జరుగుతోందో తెలియక ఆందోళన చెందుతున్నారు. ఈ కేసుకు సంబంధించి శ్రీదేవి భర్త బోనీ కపూర్ చెబుతున్న కథనంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన చెబుతున్నదాని ప్రకారం.. వివాహ వేడుకలు ముగిశాక బోనీకపూర్ కుటుంబం దుబాయ్‌లోని జుమేరియా హోటల్లో దిగింది. ఫిబ్రవరి 21న బోనీకపూర్ తన స్నేహితుడి కుమార్తె పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు ఇండియాకి వెళ్లి.. శ్రీదేవికి సడన్ సర్‌ప్రైజ్ ఇచ్చేందుకు 24వ తేదీన సాయంత్రం 5.30 గంటల సమయానికి దుబాయ్‌కు చేరుకున్నారు.



హోటల్ గదిలోకి వెళ్లి తన భార్యను నిద్ర లేపారు. ఇద్దరూ 15 నిమిషాలు మాట్లాడుకుని, డిన్నర్‌కు వెళ్దామనుకున్నారు. బయటకు వెళ్లడానికి తగినట్టుగా సిద్ధమయ్యేందుకు ఆమె బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. పావుగంట గడిచినా ఆమె బయటకు రాకపోవడం.. లోపల ఎలాంటి అలికిడీ వినపడకపోవడంతో బోనీ బాత్‌రూమ్ తలుపులు తట్టాడు. లోపల నుంచి ఎలాంటి స్పందనా లేకపోయేసరికి తలుపులు బలవంతంగా తెరిచి లోపలికి వెళ్లాడు. అప్పటికి సమయం 6.25 గంటలు అయినట్టు సమాచారం. లోపలికి వెళ్లి చూసేసరికి.. నీళ్లు నిండిన బాత్‌టబ్‌లో శ్రీదేవి అపస్మారక స్థితిలో కనిపించింది. బోనీ ఆమెను ఎంతగా లేపే ప్రయత్నం చేసినా కదలిక లేకపోయింది. వెంటనే అతడు తన స్నేహితుడికి ఫోన్ చేశాడు. స్నేహితుడి సలహా మేరకు రాత్రి 9 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందించారు. వైద్యులు చూసేసరికి ఆమె ప్రాణాలు విడిచింది.

మిస్టరీ ..ఇండియా!



మొదటి పేజీ తరువాయి

తొలిచేస్తోంది. ఆమెది సహజ మరణమో, ప్రమాదమో కాదనే అనుమానాలు బలపడుతున్నాయి. ముఖ్యంగా ఆమె మరణానికి ముందు, తర్వాత భర్త బోనీకపూర్ ప్రవర్తన కూడా అనుమానాలకు తోడైంది. శ్రీదేవి మరణ సమయానికి సంబంధించి ప్రత్యక్ష సాక్షిగా ఆయన చెబుతున్న కథనాల్లో పొంతన లేకుండా పోయింది. దీంతో ఫోరెన్సిక్ నివేదికతో తమ పాత్ర ముగియలేదని, ప్రమాదవశాత్తు మునకకు దారితీసిన పరిస్థితులపై దర్యాప్తు కొనసాగుతుందని దుబాయ్ పోలీసు ఉన్నతాధికారి ఒకరు గల్ఫ్ న్యూస్‌కు తెలిపారు. ఫోరెన్సిక్ నివేదిక వెలువడగానే పోలీసులు కేసును ప్రాసిక్యూటర్(అల్ నయూబ్)కు అప్పగించారు. అనంతర ప్రక్రియను ఆయన కొనసాగిస్తారు. నేరమేమీ జరగలేదని, ఇది ప్రమాదం లేదా సహజ మరణం మాత్రమేనని ఆయన సంతృప్తి చెందితేనే శ్రీదేవి భౌతిక కాయాన్ని భారతదేశానికి తరలించడం వీలవుతుంది. ఆయన ఫోరెన్సిక్ నివేదికతో సంతృప్తి చెందనట్లు తెలుస్తోంది. అందుకే ఆయన శ్రీదేవి భర్త బోనీకపూర్‌ను, హోటల్ సిబ్బందిని ప్రశ్నించాలని నిర్ణయించారు. శ్రీదేవి ఫోన్‌కాల్ రికార్డులతో పాటు హోటల్ సీసీటీవీ ఫుటేజ్ మొత్తం తనకు అప్పగించాలని ఆదేశించారు. దాంతో శ్రీదేవి భౌతికకాయం తరలింపు మరింత ఆలస్యమవుతుందని భావిస్తున్నారు.

అంతా రహస్యం

గల్ఫ్ చట్టాల ప్రకారం విచారణలో ఉన్న అంశాలను అధికారులు, దౌత్యవేత్తలు, కనీసం మీడియా కూడా బయటకు వెల్లడించడానికి వీల్లేదు. దాంతో కేసుకు సంబంధించిన అంశాలేవీ బయటకు రావడం లేదు. భారతీయ మీడియా చిలవలు పలవల కథనాలు కూడా మరింత గందరగోళం సృష్టిస్తున్నాయి. సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు అమర్‌సింగ్ దుబాయ్‌లో సంఘటన గురించి అబుధాబి షేక్‌తో మాట్లాడినట్లు చెప్పుకోవడం చూసి దుబాయ్ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దుబాయి, అబుధాబి పోలీసు, అధికార, రాజ వ్యవస్థలు వేర్వేరు. బోనీకపూర్‌కు దుబాయ్‌లో స్నేహితులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. అయితే, కేసు తీవ్రత దృష్ట్యా ఆయనతో ఫోన్లో మాట్లాడేందుకు కూడా ఎవరూ సాహసించడం లేదు.

పక్కకుపోయిన గుండెపోటు కోణం

ఖలీజ్ టైమ్స్ పత్రిక శ్రీదేవి శరీరంలో మద్యం ఆనవాళ్లున్నట్లు ఫోరెన్సిక్ పూర్తి నివేదికలో పేర్కొన్నారని తెలిపింది. మద్యం మత్తులో ఆమె తూలి బాత్‌టబ్‌లో పడి మునిగిపోయి మరణించి ఉండవచ్చని వ్యాఖ్యానించింది. ఈ వాదనను బాలీవుడ్ తీవ్రంగా ఖండించింది. ఆమెకు అప్పుడప్పుడు లైట్‌గా వైన్ తీసుకొనే అలవాటు తప్ప నీట మునిగి చనిపోతున్నా తెలియనంత తప్పతాగే అలవాటు లేదని సినీ పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం మీద గుండెపోటుతో మరణించారన్న కోణం పూర్తిగా పక్కకు వెళ్లిపోయింది. శ్రీదేవి మరణం వెనుక నేరపూరిత కారణాలు ఉన్నాయని దుబాయ్ పోలీసులు భావించడం లేదు. కానీ, శ్రీదేవి అపస్మారక స్థితిలో కనిపించినపుడు భర్త బోనీకపూర్ హోటల్ వైద్యుడిని పిలవకుండా తన మిత్రుడికి ఎందుకు ఫోన్‌చేసి పిలిచారన్నది పోలీసులు తేల్చుకోవాలనుకుంటున్నారు. ఇద్దరి మధ్యా గొడవలేమైనా ఉన్నాయేమో తేల్చుకొనేందుకు చివరిసారిగా ఆమె చేసిన కాల్స్ డేటా మీద పోలీసులు దృష్టి సారించారు. తాజా పరిణామాల నేపథ్యంలో శ్రీదేవి భౌతిక కాయాన్ని చెడిపోకుండా 'ఎంబామింగ్' ప్రక్రియ నిర్వహించి, మరికొన్ని రోజులు దుబాయ్ మార్చురీలోనే ఉంచాలని నిర్ణయించారు. ఎన్‌బామింగ్ మంగళవారం మధ్యాహ్నం చేస్తారని భావిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలోని అంశాల కారణంగానే శ్రీదేవి భౌతిక కాయాన్ని భారత్‌కు పంపించే ప్రక్రియ మరింత ఆలస్యం కానుందని సమాచారం. సాధ్యమైనంత త్వరగా శ్రీదేవి భౌతికకాయాన్ని భారతదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తున్నామని యూఏఈలోని భారతీయ రాయబారి నవ్‌దీప్ సూరి వెల్లడించారు. ప్రాథమిక దర్యాప్తు పూర్తయ్యే వరకు శ్రీదేవి భర్త బోనీ కపూర్‌ను కూడా దుబాయ్‌లోనే ఉండమని కోరే అవకాశం ఉంది. ఇప్పటికే పబ్లిక్ ప్రాసిక్యూటర్ బోనీకపూర్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించారని మీడియా కథనాలు వెలువడ్డాయి.

సాంకేతిక కారణాలు అడ్డంకి కాదు..

శ్రీదేవి 24వ తేదీ శనివారం మరణించినట్లు మరణ ధ్రువీకరణ పత్రంలో పేర్కొన్నారు. అందులో ఆమె పేరును శ్రీదేవి బోనీకపూర్ అయ్యప్పన్ అని పేర్కొన్నారు. అంటే, మరణానికి సంబంధించిన కారణాలు తప్ప ఆమె భౌతిక కాయాన్ని తరలించడానికి ఇతర సాంకేతిక కారణాలేవీ అడ్డం కాదని తేలిపోయింది. దుబాయ్ ప్రాసిక్యూషన్ వ్యవస్థ గల్ఫ్ దేశాల్లోకెల్లా శక్తివంతమైనది కావడంతో ఆషామాషీగా పోస్టుమార్టం తంతు ముగించుకొని బయటపడటం కుదరదు. ఇక్కడ దేశానికి రాజు కూడా జోక్యం చేసుకోలేరు.

దేవతకు ఏమైంది?



ఎంత విషాదం.. ఎంత భయంకరం: రామ్‌గోపాల్ వర్మ



'నేను శ్రీదేవిని ద్వేషిస్తున్నా. ఆమెను చంపినందుకు దేవుడ్ని కూడా ద్వేషిసున్నా.' అంటూ తనలోని బాధను వ్యక్తపరిచిన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ.. తాజాగా ఆమె మృతిపై వస్తున్న వార్తలపైనా అదే విధంగా స్పందించారు. "ప్రజలు ఎప్పుడూ శ్రీదేవి అందం, ఆమె శరీరం, హావభావాలు, పెదాలు, నడుము గురించే మాట్లాడుకునేవారు. కానీ, ఇప్పుడు ఆమె రక్తంలో మద్యం ఉందని, ఊపిరితిత్తుల్లో నీళ్లు ఉన్నాయని, పొట్టలో ఏవేవో ఉన్నాయని అంటున్నారు. ఓ దేవుడా!!! ఎవరి జీవితమన్నా ఘోర విషాదంగా, అతి భయంకరంగా ముగుస్తుందా? శ్రీదేవి మరణవార్తను ఇన్ని రకాలుగా వినాల్సి రావడం అత్యంత బాధాకరం. నన్ను నేనే చంపుకోవాలన్నంత కోపం వస్తోంది.' అని ట్వీట్ చేశారు.

మీ లోటు పూడ్చలేనిది: మోహిత్



శ్రీదేవి మృతిపై ఆమె మేనల్లుడు, నటుడు మోహిత్ మార్వా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఇంగ్లిష్ వింగ్లిష్ సినిమాలోని శ్రీదేవి ఫొటోను షేర్ చేస్తూ 'గొప్పవాళ్ల కంటే గొప్పవాళ్లు మీరు. మీ స్థానం ఎప్పటికీ భర్తీ చేయలేనిది.' అని పోస్ట్ చేశారు. మోహిత్-అంతారాల పెళ్లి కోసం దుబాయ్ వెళ్లిన అతిలోక సుందరి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.




ఆస్తి గొడవే బలిగొందా?

మోహిత్ మార్వా పెళ్లి వేడుకలో రాజుకున్న రగడ



- తొలి భార్య పిల్లలతో సఖ్యంగా మెలగిన బోనీ
- తన పిల్లల భవిష్యత్తుపై శ్రీదేవి ఆందోళన
- మానసిక ఒత్తిడికి లోనైన శ్రీదేవి!





దుబాయ్, ఫిబ్రవరి 26: ఇప్పటి వరకూ లభిస్తున్న ఆనవాళ్లు, సమాచారం ప్రకారం శ్రీదేవిది సహజమరణం కాదు. కానీ ఆమె మృతికి బలమైన కారణాలుండే ఉంటాయని యావద్భారతం నమ్ముతోంది. దుబాయ్‌లో అభిజ్ఞవర్గాల సమాచారం ప్రకారం దీనికి బీజం మోహిత్ మార్వా పెళ్లిలోనే పడింది. ఆ పెళ్లిలో శ్రీదేవి నృత్యం, నవ్వుతూ ఎంజాయ్ చేసిన బోనీ కపూర్‌ల దృశ్యాలే ప్రపంచానికి తెలుసు. కానీ ఆ సందడి మాటున, ఆ సంతోష తరంగాల ముసుగులో ఓ ఈసునసూయల దావాగ్ని చెలరేగింది.

మోహిత్ మార్వా- బోనీ కపూర్ మొదటి భార్య మోనా తరఫు బంధువు. మోనా 2012లోనే చనిపోయింది.. కానీ ఈ పెళ్లికి ఆమె తరఫు వారంతా తరలి వచ్చారు. శ్రీదేవి కూడా భర్తను, చిన్న కూతురు ఖుషీని తీసుకెళ్లి పాల్గొంది. అయితే- పెళ్లిలో బోనీకపూర్ ఎక్కువగా వారితోనూ, మోనా పిల్లలు అర్జున్ కపూర్, అన్షులాలతో గడపడం శ్రీదేవికి నచ్చలేదు. ఆ విషయమే ఆమె బోనీని ప్రశ్నించినట్లు సమాచారం. 'మీకు అర్జున్, అన్షులాలే పిల్లలా? ఖుషీ కాదా? ఆమె ఈ పెళ్లిలో ఏకాకిగా మిగిలిపోయింది.. నా పిల్లలు నీకు పిల్లలు కారా?' అని నిలదీసినట్లు తెలుస్తోంది.

దీనికి బోనీ సూటిగా బదులివ్వలేకపోయారు గానీ ఈ విషయం చిలికి చిలికి గాలివానయ్యింది. ఆస్తిలో సగభాగం మొదటి భార్య సంతానానికి కూడా చెందితే తన బిడ్డల గతేం కాను అని శ్రీదేవి చాలా ఆందోళనపడ్డట్లు తెలుస్తోంది.

తొలి భార్య పిల్లలతో బోనీ సఖ్యతపై శ్రీదేవి చాలా ఆగ్రహంగా స్పందించినట్లు, ఇది పెళ్లినాటి ప్రమాణాలకు విరుద్ధమని ఆమె గట్టిగా చెప్పినట్లూ తెలుస్తోంది. 'నీ మొదటి భార్యతో ఆర్థిక సంబంధాలు తెంచుకుంటేనే మన వివాహ బంధం మొదలవుతుంది' అని 1996లో పెళ్లి సమయంలో బోనీకి శ్రీదేవి పెట్టిన షరతు. అప్పటికి సరేనన్న బోనీ ఆ తరువాత మళ్లీ తొలి భార్యతో సంబంధాలు కొనసాగించారని, చివరకు శ్రీదేవి కూడా సమాధానపడ్డారని తెలుస్తోంది. అయితే ఇపుడు బోనీ - మళ్లీ అర్జున్ వైపు చూస్తుండడంతో ఆమెకు కొత్త సమస్య మొదలయ్యింది. ఒక పక్క జాన్విని మంచి నటిగా నిలబెట్టాలని తాను తాపత్రయపడుతూంటే బోనీ మాత్రం తన పుత్రరత్నం వైపు మనసు పెట్టడం ఆమెలో కల్లోలాన్ని రేపింది.

బోనీకి ఏమీ లేని స్థితిలో ఆమె ఆయనను పెళ్లి చేసుకుని- తన ఆస్తినంతా ఆయన పరం చేసి జీవితం గడుపుతూ వచ్చింది. ఓ రకంగా ఇన్నేళ్లూ బోనీ అనుభవిస్తున్నదంతా శ్రీదేవి సంపాదించిన ఆస్తే. ఇపుడా ఆస్తిని బోనీ- తన తొలి భార్య పిల్లలకు కట్టబెడితే చూస్తూ ఊరుకోడానికి శ్రీదేవి ఇష్టపడడం లేదు. జాన్వి, ఖుషీల భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దాలని ఆరాటపడింది. జాన్వి తొలి సినిమా ధడక్ ను ఖరారు చేసి సెట్స్ దాకా తీసికెళ్లింది కూడా శ్రీదేవే.

ఆమె దుబాయ్‌లో ఉండిపోయిన కారణం .. మారుతున్న బోనీ వైఖరి గురించి ఆలోచించడానికేనని, జాన్వికి షాపింగ్ అన్నది కేవలం ఒక సాకు మాత్రమేనని అభిజ్ఞవర్గాలు వివరించాయి. ఆస్తి పంపకంపై ఆమె చాలా మానసిక ఒత్తిడికి గురయినట్లు, బోనీతో ఫోన్లోనే గొడవపడ్డట్లు కూడా బయటకు పొక్కింది. అయితే ఈ విషయాల్ని నిర్ధారణగా చెప్పదగినవాడు బోనీ ఒక్కరే...!

వయ్యారి భామలు వగలమారి భర్తలు

సెకండ్ ఇన్నింగ్స్‌కు కారణాలెన్నో!.. భయం భయంగానే తారా జీవితం.. అవసరాలే అన్నింటికీ కారణం

సినిమా హీరోయిన్లంటే ఎంతో మంది అభిమానులకు కలల రాణులు. అలాంటి అందగత్తెలు పెళ్లి విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు పెడదారి పడుతున్న దృష్టాంతాలెన్నో! ధరించే దుస్తులు, పెట్టుకునే నగలు, ముస్తాబయ్యే మేకప్ కిట్‌ల విషయంలో ఒకటికి వెయ్యిసార్లు ఆలోచించే తారామణులు.. జీవితాంతం కలిసి ఉండాల్సిన వ్యక్తి విషయంలో ఎందుకు 'నాదారి రెండో దారి' అన్నట్టు ప్రవర్తిస్తున్నారు? తన మెడలో పడే మొదటి ముడి.. అవతలి వ్యక్తి వేసే నాలుగో ముడి కావడానికి ఎందుకు ఆస్కారమిస్తున్నారు? అందాల నటి శ్రీదేవి.. నిర్మాత బోనీకపూర్‌ని వివాహం చేసుకున్నప్పుడు అందరూ ఆశ్చర్యపోయారు. అంతటి పేరుంది. పరపతి ఉంది. డబ్బులున్నాయి. అభిమానించడానికి జనకోటి ఉంది. మరి శ్రీదేవి రెండో పెళ్లి వాడిని ఎందుకు చేసుకోవాల్సి వచ్చింది? ఇదీ అనేకమంది ప్రశ్న. శ్రీదేవి చిన్ననాటి స్నేహితురాలు కుట్టి పద్మిని ఒకరోజు ఎయిర్‌పోర్టులో నేరుగా ముఖం మీదే అడిగేశారు. అందుకు శ్రీదేవి చెప్పిన సమాధానం 'నా స్థానంలో ఉండి ఆలోచించాలి. ఆ విషయాన్ని మీకు చెప్పినా అర్థం కాదు' అనేది. ఏమిటా పరిస్థితి? ఎందుకు అర్థం కాదు?

రెండో పెళ్లివారిని ఎందుకు కట్టుకున్నారంటే అందుకు సవాలక్ష కారణాలుంటాయి. శతకోటి ఇబ్బందులూ ఉంటాయి. పెళ్లికి ముందు హీరోయిన్లకు, ఆ మాటకొస్తే హీరోలకు కూడా చాలా ఎఫైర్లున్నట్లు అనేకానేక కథనాలొస్తాయి. వాటిని తాను చేసుకోబోయేవాడు నమ్ముతాడా అన్న భయం, తనను సరిగా చూసుకుంటాడా అనే సందేహం కలుగుతాయి. ఆ నటుడి లేక నటి తొలి వివాహ భాగస్వామి నుంచి, వారి సంతానం నుంచి ఈసడింపులు ఎలా తట్టుకోవాలన్నది మరో ప్రశ్న. ఈ రెండో, మూడో పెళ్లిళ్లన్నింటికీ కేవలం ప్రేమే కారణమని చెప్పలేం. అవసరాలు, డబ్బు.. ఇలా ఇతర కారణాలనేకం ఉంటాయి.





ఈ తరం నాయికల గురించి ప్రస్తావన రాగానే అందరికీ రేణూదేశాయ్ పేరు గుర్తుకొస్తుంది. అప్పటికే పెళ్లయి విడాకుల కోసం ఎదురుచూస్తున్న పవన్ కల్యాణ్‌తో ఆమె సహజీవనం చేసి ఓ కొడుక్కి జన్మనిచ్చారు. ఆ తర్వాత కొన్నేళ్లకు పవన్‌కు అన్నా లెజినవోతో పరిచయం ఏర్పడింది. దీంతో పవన్-రేణూదేశాయ్ విడిపోయారు.

సహ జీవనం పేరుతో కొన్నేళ్ల పాటు కలిసున్న జంట కమల్‌హాసన్, గౌతమిది. ఎంతో అన్యోన్యంగా సాగిన వీరిద్దరూ గతేడాది విడిపోయారు.

బాలీవుడ్‌లోనూ..

సంజయ్‌దత్‌ని మాన్యత, ఆమిర్ ఖాన్‌ని కిరణ్‌రావు, ఆదిత్యా చోప్రాను రాణీముఖర్జీ, సైఫ్ అలీ ఖాన్‌ని కరీనాకపూర్ వివాహం చేసుకున్నారు. వీరందరూ పెళ్లి చేసుకున్న జంటలు. కానీ వైవాహిక బంధం లేకపోయినప్పటికీ



సావిత్రి నుంచి..



అంతకుముందే పెళ్లి అయిన జెమిని గణేశన్‌ను సావిత్రి పెళ్లాడారు. అయితే ఆమెను ఇబ్బందుల పాలు చేశాడని, ఆలనాపాలనా చూడలేదనే విషయాన్ని ఇప్పటికీ పలువురు కథలుగా చెబుతుంటారు. అయితే అందరూ అలాగే ఉండాల్సిన అవసరం లేదు. సూపర్‌స్టార్ కృష్ణకి అప్పటికే పెళ్లయినప్పటికీ విజయనిర్మలను రెండో పెళ్లి చేసుకున్నారు. మొదటి భార్య ఇందిరను, రెండో భార్య విజయనిర్మలను ఇప్పటికీ ఆయన సమానంగానే చూస్తారు. తమిళనటుడు విజయ్‌కుమార్‌ని వివాహం చేసుకుని మంజుల చక్కటి జీవితాన్ని ఆస్వాదించారు. రాధిక పెళ్లి చేసుకున్న శరత్‌కుమార్‌కి కూడా అంతకుముందే పెళ్లయింది. నిర్మాత శ్రీకాంత్ నహతను పెళ్లి చేసుకున్న జయప్రదకు ఆయన ద్వారా పిల్లలు లేరు. వారిద్దరికీ పిల్లలు కలగకూడదనే ఆంక్షతోనే ఆయన తొలి భార్య ఈ వివాహానికి ఒప్పుకొన్నారని అప్పట్లో వదంతులు వచ్చాయి. కృష్ణ ద్వారా విజయనిర్మలకు కూడా సంతానం లేదన్నది గమనించాల్సిన విషయం. అక్కినేని నాగార్జునకు అమల రెండో భార్య. అన్యోన్యంగా సాగుతున్న వీరి దాంపత్యానికి గుర్తు వారి కుమారుడు అఖిల్.

బాత్‌టబ్‌లో మునిగి చనిపోవడం సాధ్యమేనా?

అందాల నటి శ్రీదేవి ప్రమాదవశాత్తూ బాత్‌టబ్‌లో మునిగి చనిపోయారని ఫోరెన్సిక్ విభాగం ఇచ్చిన నివేదికను యూఏఈ ఆరోగ్యశాఖ వెల్లడించింది. 5 అడుగుల 6 అంగుళాల ఎత్తు ఉన్న శ్రీదేవి..2 అడుగుల లోతు కూడా ఉండని బాత్‌టబ్‌లో మునిగి చనిపోయిందా? అది సాధ్యమేనా? అన్న అనుమానాలు కల్గుతున్నాయి.

ఏ బాత్‌టబ్.. ఎన్ని అడుగుల లోతు?

ప్రపంచంలో ఏ స్టార్ హోటల్ అయినా బాత్‌టబ్‌ల ఏర్పాటులో కొన్ని ప్రమాణాలు, కొలతలను అనుసరిస్తుంది. బాత్‌టబ్‌లు సాధారణంగా సగటున 14 నుంచి 17 అంగుళాల లోతు ఉంటాయి. అంటే దాదాపు 1.4 అడుగుల లోతన్నమాట! యూరోపియన్ స్టైల్ బాత్‌టబ్‌లు 18 ఇంచ్‌ల లోతు కల్గి ఉంటాయి. అంటే 1.5 అడుగుల లోతు ఉంటాయి. ఇక జపనీస్ లేదా గ్రీక్ స్టైల్ బాత్‌టబ్‌లు 22 అంగుళాల కంటే ఎక్కువ లోతుంటాయి. అంటే జపాన్ బాత్‌టబ్‌లు 1.8 అడుగుల కంటే ఎక్కువ లోతు ఉంటాయన్నమాట! 'డ్రాప్ ఇన్' రకమైనా, 'స్టాండ్ ఎలోన్' వెరైటీ అయినా బాత్‌టబ్‌లు అటు ఇటుగా ఒకే రకమైన కొలతలు కల్గి ఉంటాయి. ఓవల్ ఆకారంలోని బాత్‌టబ్‌లు 20- 24 అంగుళాల లోతు ఉంటాయి. అదే వర్ల్‌పూల్ బాత్‌టబ్‌లు దాదాపుగా 18 ఇంచ్‌ల లోతు ఉంటాయి. ఒక మనిషి ఎంత మద్యం మత్తులో ఉన్నా.. అపస్మారక స్థితిలో మునిగిపోయే పరిస్థితి ఎదురైనప్పుడు.. పైకి లేవడం కష్టం కాదంటున్నారు నిపుణులు! మరి 5.6 అడుగుల ఎత్తున్న శ్రీదేవి..బాత్‌టబ్‌లో మునిగిపోయి చనిపోయారన్న దుబాయ్ ఫోరెన్సిక్ నివేదిక అభిమానుల్లో అనేక అనుమానాలు కల్గిస్తోంది. ఫోరెన్సిక్ నివేదిక నిజమైతే..హోటల్ గదిలో ఏం జరిగింది? బాత్రూమ్‌లో ఆమె గుండెపోటుతో కుప్పకూలిపోయారా? మరే ఇతర కారణాలున్నాయా? ఇలా శ్రీదేవి మరణంపై మిస్టరీ కొనసాగుతోంది.





బాత్‌టబ్‌లో మరణం.. డౌటే!

- దుబాయ్ పోలీసుల దర్యాప్తు ముమ్మరం

శ్రీదేవి ప్రమాదవశాత్తూ (బాత్‌టబ్‌లో) మునిగి చనిపోయినట్టు ఫోరెన్సిక్ నివేదికలో ఉంది. అదెలా సాధ్యం? సామాన్యులకు కూడా వచ్చే సందేహం ఇది. దుబాయ్ పోలీసులకు రావడంలో ఆశ్చర్యమేముంది. వారికీ వచ్చింది. దీంతో ఆ దిశగా వారు తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో వారు ఆ రోజు జరిగిన ఘటనలను.. ఒకదాని తర్వాత ఒకటిగా పక్కాగా పేర్చే ప్రయత్నాల్లో ఉన్నారు. బోనీకపూర్ చెబుతున్నదానికి వారి దర్యాప్తులో తేలే అంశాలకు మధ్య ఏవైనా తేడాలుంటే వాటిపై మరింత దర్యాప్తు చేసి కేసు ఛేదించనున్నారు.

ఆరోగ్యవంతులు అనుకోకుండా బాత్‌టబ్‌లో పడరు: తస్లీమా



శ్రీదేవి గుండెపోటుతో చనిపోలేదని, అనుకోకుండా బాత్‌టబ్‌లో మునిగిపోయి చనిపోయారని దుబాయ్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ప్రముఖ రచయిత తస్లీమా నస్రీన్ ట్విటర్‌లో.. 'ఆరోగ్యవంతులు అనుకోకుండా బాత్‌టబ్‌లో పడి చనిపోరు.' అని తెలిపారు. ఆ వెంటనే ఆరోగ్యవంతులైన మహిళలు 'అనుకోకుండా' బాత్‌టబ్‌లో పడతారా? అని ప్రశ్నించారు.

అనుమానమొస్తే ఎవర్నీ వదలరు!

పక్కాగా దర్యాప్తు చేయాల్సిందే

- దేశాధినేతలు చెప్పినా వినరు
- దుబాయ్‌లో కఠిన చట్టాలు

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: దుబాయ్‌లో ఎవరు చనిపోయినా.. ఎలా చనిపోయినా.. నిబంధనలు మాత్రం కఠినంగానే ఉంటాయి! సెలబ్రిటీలైనా.. సామాన్యులైనా.. కచ్చితంగా వాటిని పాటించాల్సిందే! సహజంగా, ప్రమాదంలో, అనుమానాస్పదంగా.. ఎలా మరణించినా సరే పోలీసులకు సమాచారం ఇవ్వాల్సిందే! ఆస్పత్రుల్లో చనిపోతే ఆటోమేటిక్ సమాచారం వెళ్లిపోతుంది. పోలీసులొచ్చి బలాఖ్ అల్ వఫాత్ (మరణ సమాచారాన్ని)ను నమోదు చేస్తారు. మృతదేహాన్ని అల్ రాషేద్ ఆస్పత్రి లేదా అల్ ఖుసేస్ మార్చురీకి తరలిస్తారు. చికిత్స పొందుతూ మరణిస్తే ఆస్పత్రుల మార్చురీల్లో భద్రపరుస్తారు. ఫోరెనిక్స్ నిపుణులు మృతదేహాన్ని పరీక్షించి పోస్టుమార్టం చేస్తారు. అనుమానాస్పద కేసుల్లో పూర్తిస్థాయిలో పరీక్షలు చేస్తారు. ఆ తర్వాత మరణానికి కారణాలను విశ్లేషిస్తూ నివేదిక జారీ చేస్తారు. ప్రఖ్యాత నటి శ్రీదేవి మృతి విషయంలోనూ ఇదే జరిగింది! ఆమె పార్థివ దేహాన్ని సత్వరమే భారత్‌కు పంపాలంటూ దేశంలోని అత్యున్నత వర్గాలు దుబాయ్ అధికారులను కోరినా ప్రయోజనం లేకపోయింది. కారణం అత్యంత కఠినమైన దుబాయ్ చట్టాలే! శ్రీదేవి విషయంలో ఇది మరోసారి రుజువైంది. ఫోరెన్సిక్ పరీక్షలు పూర్తయిన తర్వాతే ఆమె పార్థివ దేహాన్ని అప్పగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. ఉదాహరణకు.. గతంలో దక్షిణాదికి చెందిన ఓ సీఎం అబుదాబిలో ఉన్న తన రాష్ట్ర వాసుల మృతదేహాలను త్వరగా స్వస్థలాలకు పంపాలని అక్కడి అధికారులను కోరారు. వారు అలాగేనని తలూపారు. మృతదేహాల డీఎన్ఏ పరీక్షలు, ఇతర ప్రక్రియ మొత్తం పూర్తయిన తర్వాత అంటే.. నాలుగు నెలలకు పంపారు. అంటే కిందస్థాయిలో ఉండే నాయిబ్‌కు వారు ఎలాంటి ఆదేశాలూ ఇవ్వరూ. చట్టప్రకారం పనిచేసుకోవడానికి స్వేచ్ఛనిస్తారు.



చాలా మంది తారల జీవితాల్లో మాదిరిగానే శ్రీదేవి వివాహం కూడా చాలా నాటకీయ ఫక్కీలో జరిగింది. 1993లో హిమ్మత్ వాలా సినిమాతో బాలీవుడ్‌లో ప్రవేశించిన శ్రీదేవి- చాలా తొందర్లోనే హిందీ సినీ అభిమానులను సంపాదించుకున్నారు. ఇక 1987లో వచ్చిన మిస్టర్ ఇండియా సినిమా ఆమెను అగ్రస్థానంలో నిలబెట్టింది. అందులో హీరో అనిల్ కపూర్.. ఆయన సోదరుడే బోనీ కపూర్. బోనీకి అప్పటికే పెళ్లయింది. భార్య పేరు మోనా. వారికి పుట్టిన వారే- అర్జున్ కపూర్, అన్షులా.

రాక్షసులూ.. ఆత్మపరిశీలన చేసుకోండి: ఏక్తాకపూర్



విపరీతమైన కాస్మెటిక్ శస్త్రచికిత్సలే శ్రీదేవి మృతికి కారణమంటూ నెటిజన్లు కామెంట్లు పెట్టడంపై బాలీవుడ్ నిర్మాత ఏక్తాకపూర్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సమయంలో రాక్షసుల్లా ఆ వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని మందలించింది. ట్విటర్ వేదికగా 'రాక్షసుల్లా మాట్లాడకండి. ఇప్పటికైనా ఆత్మ పరిశీలన చేసుకోండి. నాకు తెలిసిన వైద్యుడు చెప్పిన వివరాల ప్రకారం.. ఎలాంటి గుండె సంబంధిత వ్యాధుల్లేకుండా, సంపూర్ణ ఆరోగ్యం కలిగిన వారిలో 1 శాతం మందికి గుండె పోటు వచ్చే అవకాశం ఉంది. ఇది విధి రాత. తప్పుడు వార్తలు ఎలా ప్రచారం చేస్తారు!' ఘాటుగా వ్యాఖ్యానించింది. మరో ట్వీట్‌లో 'శక్తివంతమైన మహిళ గుండె కూడా కొన్నిసార్లు బలహీనమవుతుంది. శ్రీదేవి ఆత్మకు శాంతి కలగాలి' అని పేర్కొంది.

దేవతకు ఏమైంది?



ముందు రాఖీ... తరువాత ఇష్ట సఖి

చెల్లీ అంటూ తల్లిని చేశాడు.. ఇది బోనీ కపూర్ శైలి.. శ్రీదేవి పెళ్లి కూడా సినీ ఫక్కీయే!



ముంబై, ఫిబ్రవరి 26: బాలీవుడ్‌లో అడుగుపెట్టాక శ్రీదేవి మొదట ప్రేమలో పడినది మిథున్ చక్రవర్తితో అని ఓ ప్రచారం ఉండేది. 1985లో వారి వివాహం రహస్యంగా జరిగినట్లు, తొలి భార్య యోగిత బెదిరించడం వల్ల శ్రీదేవి ఆ పెళ్లిని రద్దు చేసుకున్నట్లు బాలీవుడ్ టాక్. ఆ సమయంలోనే శ్రీదేవి.. బోనీ జీవితంలోకి అడుగుపెట్టింది. బోనీ నివాసంలోనే మోనా దగ్గర కొన్నాళ్ల పాటు ఉంది! బోనీని ఆమె సోదరుడిగా భావించేదని, ఒకానొక సందర్భంలో ఆయనకు రాఖీ కట్టిందని మోనా సేవీ అనే పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. బోనీతో ఈ పరిచయం కాస్తా ప్రేమకు దారితీసింది. 1987లో తాను ప్రకటించిన భారీ బడ్జెట్ సినిమా 'రూప్ కీ రాణీ.. చోరోం కా రాజా'ను బోనీ కపూర్ తన డబ్బంతా వెచ్చించి అనిల్ కపూర్, శ్రీదేవిలతో తీశాడు. ఆ సినిమా మధ్యలో డైరెక్టర్ మారడం, ఇతర కారణాల రీత్యా చిత్రీకరణ ఆలస్యమయ్యింది. 1993లో రిలీజైన ఆ సినిమా బాక్సాఫీసు వద్ద బోల్తా కొట్టింది. అట్టర్ ఫ్లాపైన సినిమాతో బోనీ పరిస్థితి రోడ్డుపైకొచ్చేసింది. అపుడాయనకు శ్రీదేవి ఓ బంగారు బాతులా కనిపించింది. ఆ సమయంలో శ్రీదేవి కొన్ని వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొన్నారు. మిథున్‌తో చెడిన బంధం ఒక పక్క బాధపెడుతుండగా ఆమె తల్లి రాజేశ్వరి అనారోగ్యానికి గురై మరణించింది. ఆస్తి విషయంలో చెల్లెలు శ్రీలత చేసిన మోసం ఆమెను కలచివేసింది. ఆ పరిస్థితుల్లో తానున్నానంటూ బోనీ ఆమెకు నమ్మబలికారు.. రాజేశ్వరి కూడా తననే అల్లుడిగా కోరుకున్నారని శ్రీదేవిని నమ్మించారు. చివరకు 3 నెలల తరువాత బోనీతో సాన్నిహిత్యం పెంచుకున్న శ్రీదేవి ఆ క్రమంలో పెళ్లి కాకుండానే గర్భం దాల్చినట్లు బాలీవుడ్‌లో గుప్పుమంది..ఈ విషయం మోనా కపూర్‌కు తెలిసి ఆమె భగ్గుమంది. "నా కంటే బోనీ పదేళ్లు పెద్దవాడు.. అయినా పెళ్లి చేసుకున్నాను. ఇద్దరు పిల్లలు కలిగారు. అపుడు శ్రీదేవి ప్రవేశించింది.. నేనేమైనా చేద్దామనుకుంటే ఆమె అప్పటికే గర్భిణి.." అని మోనా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే తనతో ఉండాలంటే మోనాను వదిలేసి రావాలని శ్రీదేవి షరతులు పెట్టినట్లు కథనం. ఆ మేరకు బోనీ మోనాను, ఇద్దరు పిల్లలను వదిలేసి శ్రీదేవి వద్దకు వచ్చేశారు. చేతిలో చిల్లి గవ్వలేని దుస్థితిలో తప్పనిసరి అని ఆయన ఆ సమయంలో భావించారని, అయితే 1997లో జాన్వి, 2000లో ఖుషి పుట్టాక మళ్లీ మోనాతో సంబంధాలు పునరుద్ధరించుకున్నారని తెలిసిన వారంటారు. 'ఒకటి మాత్రం నిజం. శ్రీదేవి దుర్బల స్థితిలో బోనీతో పెళ్లికి అంగీకరించింది. పెళ్లయ్యాక ఆయనతోనే నిబద్ధతతో ఉన్నారు. కుమార్తె కెరీర్‌కు అన్నింటికంటే ప్రాధాన్యమిచ్చారు' అని బాలీవుడ్ సాంకేతిక నిపుణుడొకరు వ్యాఖ్యానించారు.





శ్రీదేవి ఇంటి బయట వేచి ఉన్న అభిమానులు

అనిల్ కపూర్ ఇంటికి తరలివచ్చిన తారాలోకం

ముంబై: వెండితెర జాబిల్లి శ్రీదేవి ఇక లేరనే వార్త సినీలోకాన్ని విషాదంలోకి నెట్టింది. ఆమె కూతుళ్లు జాన్వి కపూర్, ఖుషీ కపూర్‌నైతే ఓదార్చడం ఎవరితరం కాలేదు. దర్శకుడు, నిర్మాత కరణ్ జోహార్ వాళ్లను ఓదార్చుతూ ధైర్యాన్ని నూరిపోసి జుహూలోని అనిల్ కపూర్ ఇంటికి తీసుకెళ్లారు. ఆ అక్కాచెల్లెళ్లను ఓదార్చేందుకు తారాలోకం కదలి వచ్చింది. జయప్రద, వెంకటేశ్, రజనీకాంత్, టబూ, రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా, రేఖ, రాణీముఖర్జీ, రణ్‌వీర్‌సింగ్, దీపిక పదుకొనే,శృతి హాసన్.. జాన్వి, ఖుషీలను ఓదార్చారు.

చివరి చూపు కోసం...

తమ అభిమాన నటి శ్రీదేవికి అంతిమ వీడ్కోలు పలికేందుకు తెలంగాణ నుంచి అభిమానులు పెద్ద ఎత్తున ముంబైకి తరలివచ్చారు. శ్రీదేవి అకస్మాత్తు మరణం తమను తీవ్రంగా కలచివేసిందని, చివరి చూపు చూసేందుకు వచ్చామని కన్నీటి సంద్రమయ్యారు.



అత్యాధునిక ఫోరెన్సిక్ ల్యాబ్!

- కచ్చితమైన పరీక్షలు.. నివేదికలు
- వాటి ఆధారంగానే దుబాయ్ పోలీసుల నిర్ణయం
- 'శ్రీదేవి' రిపోర్టులూ ఇక్కడ్నుంచే..

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)


దుబాయ్ పోలీసులు సోమవారం శ్రీదేవి భౌతిక కాయాన్ని ఎంబామింగ్‌కు ఇచ్చారంటే.. దర్యాప్తు పూర్తయినట్లేనా? మృతదేహాన్ని స్వదేశానికి తరలించేందుకు అనుమతి ఇచ్చినంత మాత్రాన కేసులో విచారణ ముగిసినట్లేనా..? అంటే కాదు. ఎందుకంటే దుబాయ్ పోలీసులకు అత్యాధునిక పరికరాలు, అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ అందుబాటులో ఉంది. ఇది ప్రపంచంలోని ఏ ల్యాబ్‌కూ తీసిపోనివిధంగా ఉంటుంది. అమెరికా లాంటి అగ్రదేశాల్లో ఉండే అధునాతన పరికరాలన్నీ ఈ ల్యాబ్‌లో ఉంటాయి. అత్యంత కచ్చితమైన, అగ్రశ్రేణి విచారణ జరుపుతుందన్న రికార్డు కూడా ఉంది. కొన్ని కేసులను గంటల్లోనే ఛేదించిన సందర్భాలూ ఉన్నాయి. దుబాయ్‌లోని బుర్జ్‌ఖలీఫా స్ట్రీట్‌లో ఉన్న ఈ అత్యాధునిక ఫోరెన్సిక్ ల్యాబ్ అక్కడి పోలీసులకు పెద్ద ఆస్తిలాంటిది. ఎంతటి క్లిష్టమైన కేసులనైనా ఫోరెన్సిక్ పరీక్షల సాయంతో ఇట్టే తేల్చేస్తారు. ఈ ల్యాబ్‌లో రసాయన, పేలుడు పదార్థాలు, నార్కోటిక్స్ పరీక్షలు, అత్యాధునికమైన పరికరాలతో నేరం జరిగిన ప్రాంతంలో ఆధారాల సేకరణ, వేలిముద్రలు, కంప్యూటర్ ఫోరెన్సిక్స్, డీఎన్‌ఏ పరీక్షలు, ఆడియో, వీడియోల పరిశీలన వంటి అన్నిరకాల పరీక్షలూ చేస్తారు. అంతేకాదు అతితక్కువ సమయంలోనే కచ్చితమైన నివేదికలు అందజేస్తారు. వీటి ఆధారంగానే పోలీసులు తదుపరి దర్యాప్తు చేస్తారు. ఇక శ్రీదేవి మృతి విషయానికొస్తే.. ఫోరెన్సిక్ నివేదికను పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయానికి పంపుతారు. అక్కడ కేసులోని లోటుపాట్లను అంచనా వేసి తదుపరి విచారణపై నిర్ణయం తీసుకుంటారు. శ్రీదేవి అసలు బాత్‌టబ్‌లో ఎలా మునిగిందన్న అనుమానం వస్తే.. 'ఆమె రక్తంలోని ఆల్కహాల్ శాతం లేదా బాత్‌టబ్ పూర్తిగా నీటితో నింపి ఉండడానికి కారణమేంటి? లేదా బోనీకపూర్ హోటల్ డాక్టర్‌కు, సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా స్నేహితుడికి ఎందుకు ఫోన్ చేశారు?' వంటి అన్ని అంశాలపైనా విచారణ చేపడతారు. సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తారు. అంతమాత్రాన ఎవరూ నేరం చేసినట్లు లేదా అనుమానితులని అర్థం కాదు. ఇది కేవలం దర్యాప్తు ప్రక్రియ మాత్రమే. ఆయా ప్రశ్నలకు సమాధానాల వల్లే స్పష్టత వస్తుంది. చిన్నపాటి అనుమానం వచ్చినా కేసుకు సంబంధించిన వ్యక్తులను దేశం విడిచి వెళ్లనివ్వరు. మొత్తంమీద వైద్య నివేదిక ఇచ్చి, మృతదేహాన్ని ఎంబామింగ్‌కు ఇచ్చినంత మాత్రాన కేసు దర్యాప్తు పూర్తయినట్లు కాదు. పోలీసుల తదుపరి చర్యలకు వీటితో సంబంధం ఉండదని సీనియర్ పాత్రికేయులు, నిపుణులు చెబుతున్నారు. శ్రీదేవి ఆకస్మిక గుండెపోటుతో మరణించారంటూ భారత మీడియా హడావుడిగా నిర్ధారించి, పరిణతి లేకుండా వ్యవహరించడంతోనే గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. దుబాయ్ పోలీసుల విచారణ పూర్తయ్యే వరకు ఊహాగానాలు ఆపితే మంచిదని సూచిస్తున్నారు.

బాలీవుడ్ టు హాలీవుడ్ అంతా మిస్టరీనే!

హత్యో.. ఆత్మహత్యో తేలని సెలబ్రిటీల మరణాలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్.. ఎక్కడైనా సెలెబ్రిటీలకు సంబంధించిన వార్తలు సంచలనమే! అది మరణ వార్త అయితే మరింత హాట్ టాపిక్ అవుతుంది. అనేక ఊహాగానాలు.. లెక్కలేనన్ని సందేహాలు! ప్రఖ్యాత నటి శ్రీదేవి మృతిపై కూడా అనేక సందేహాలు వెల్లువెత్తాయి. తొలుత ఆమె గుండె పోటుతో మరణించిందని వార్తలు వెలువడగా.. ఆమె ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో మునిగి చనిపోయిందని పోస్టుమార్టం నివేదిక చెబుతోంది. దీంతో శ్రీదేవి మృతిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి. అసలు ఆమెది సహజమరణమేనా.. లేదంటే ఏమైనా కుట్ర దాగుందా? అంతా మిస్టరీ. శ్రీదేవి మరణం ఒక్కటే కాదు.. టాలీవుడ్ నుంచి కోలీవుడ్ దాకా, బాలీవుడ్ నుంచి హాలీవుడ్ దాకా అనేకమంది సెలెబ్రిటీల మరణాలు మిస్టరీగా మిగిలాయి. ఆ జాబితాను ఒకసారి పరిశీలిస్తే..

కునాల్ సింగ్



'ప్రేమికుల రోజు' సినిమాతో వెండితెరపై జిగేల్‌మని మెరిసిన యువ నటుడు కునాల్ సింగ్. అతడు తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కునాల్ తండ్రి ఇది ఆత్మహత్య కాదని హత్య అని ఆరోపించాడు.



నఫీసా జోసెఫ్

ప్రఖ్యాత మ్యూజిక్ చానెల్‌లో వీడియో జాకీగా రాణిస్తున్న నఫీసా జోసెఫ్ ప్రేమ వైఫల్యం కారణంగా ఆత్మహత్యకు పాల్పడింది. ప్రాణంగా ప్రేమించిన గౌతమ్ ఖండూజా అంతకుముందే వేరొక అమ్మాయిని పెళ్లాడాడని, అయితే ఆమెకు విడాకులు ఇచ్చేశానని అబద్ధం చెప్పడంతో తట్టుకోలేక చనిపోయినట్టు వార్తలొచ్చాయి.

పర్వీన్ బాబీ

ప్రఖ్యాత టైమ్ మేగజైన్ కవర్‌పేజీపై ఎక్కిన తొలి మహిళా నటిగా గుర్తింపు పొందిన పర్వీన్ బాబీ మరణం అనేక సందేహాలను మిగిల్చింది. ఒకానొక దశలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన ఆమె తన ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఆమే బలవంతంగా ప్రాణం తీసుకుందని పోస్టుమార్టంలో తేలింది.





దివ్య భారతి


చిన్న వయసులోనే టాప్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న దివ్య భారతి మృతి కూడా ఓ మిస్టరీనే. తాను నివాసం ఉండే అపార్ట్‌మెంట్ ఐదో అంతస్తు నుంచి కిందకు దూకి ఆమె చనిపోయింది. ఇది ఆత్మహత్య అని పోలీసులు అప్పట్లో తేల్చారు. కానీ.. దివ్య భారతి మృతికి ఆమె భర్త సాజిద్‌నే కారణమని ఆరోపణలు ఉన్నాయి.

ప్రత్యూష మరణం కూడా..



తెలుగు సినీరంగంలోనూ వర్ధమాన నటి ప్రత్యూష మరణం మిస్టరీనే. ప్రత్యూష తెలుగు, తమిళ సినిమాల్లో హీరోయిన్‌గా నిలదొక్కుకుంటున్న సమయంలో హత్యకు గురైంది. కానీ దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రత్యూషపై ఆమె బాయ్‌ఫ్రెండ్ సిద్ధార్థ్, మరికొంత మంది కలిసి అత్యాచారం చేసి చంపారని ఆరోపణలున్నాయి. పోస్ట్ మార్టమ్ రిపోర్టులోనూ ఆమె రేప్‌కు గురైనట్టు తేలింది.

బాబ్ క్రేన్



అమెరికాకు చెందిన ప్రఖ్యాత నటుడు బాబ్ క్రేన్ 1978లో ఆరిజోనాలోని తన ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొలుత ఆత్మహత్యగానే భావించి ఈ కేసును వదిలిపెట్టినా క్రేన్ ఫ్రెండ్ అయిన జాన్ హెన్రీ కార్పెంటర్‌పై ఆరోపణలు రావడంతో 1990లో కేసును తిరగదోడారు. నాలుగేళ్ల విచారణ అనంతరం హెన్రీని నిర్దోషిగా వదిలిపెట్టారు.

శిఖా జోషి



మోడల్‌గా, నటిగా బాలీవుడ్‌కు సుపరిచితమైన శిఖా జోషి ముంబైలోని వెర్సోవాలోని తన ఫ్లాట్‌లో ఆత్మహత్య చేసుకుంది. మూడేళ్ల క్రితం జరిగిన ఈ ఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. చివరిగా 'బీఏ పాస్' అనే సినిమాలో నటించిన ఆమె సినిమాల్లో అవకాశాలు తగ్గిపోవడంతో నిరాశకు గురై ఆత్మహత్య చేసుకుందని వార్తలొచ్చాయి. కానీ.. ఆమె మృతి వెనుక అసలు కారణం తెలియలేదు.

మన్మోహన్ దేశాయ్




అమర్.. అక్బర్.. ఆంటోనీ, కూలీ, ధరమ్ వీర్ వంటి క్లాసిక్ సినిమాల దర్శకుడు మన్మోహన్ దేశాయ్‌ది కూడా విషాదాంతమే. దేశాయ్ ఇంటి బాల్కనీ లోంచి కిందపడి చనిపోయాడు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందని చెబుతున్నా.. కెరీర్‌లో అపజయాలు రావడంతో ఒత్తిడికి గురై అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని సన్నిహితులు చెప్పారు. కొందరేమో వెన్నునొప్పిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడని చెబుతారు.

జియా ఖాన్



రామ్‌గోపాల్‌వర్మ 'నిశ్శబ్ద్' సినిమాతో సంచలనంగా మారిన జియా ఖాన్ మృతి మిస్టరీగానే మిగిలింది. 2013లో తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని జియా ప్రాణం తీసుకుంది. తల్లి రబియా ఖాన్ తన కుమార్తెది ఆత్మహత్య కాదని, అది హత్యని అప్పట్లో ఆరోపించింది. జియా మృతికి ఆమె బాయ్ ఫ్రెండ్ సూరజ్ పాంచోలి కారణమని చెప్పింది. అందుకు సంబంధించి జియా ఖాన్ డైరీలోని కొన్ని పేజీలను కూడా ఆమె సమర్పించింది.

గురుదత్



దర్శకుడు, నటుడు, నిర్మాత అయిన గురుదత్ అతిగా మద్యం సేవించి, నిద్రమాత్రలు తీసుకొని చనిపోయాడు. ప్యాసా, సాహిబ్ బీబీ ఔర్ గుల్హామ్ వంటి విజయవంతమైన చిత్రాలను అందించిన ఆయన మానసిక ఒత్తిడి కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిసింది.

సిల్క్ స్మిత



శృంగార తారగా గుర్తింపు పొంది న సిల్క్ స్మిత కూడా ఆత్మహత్య చేసుకొని తనువు చాలించింది. అసలు పేరు వడ్లపాటి విజయలక్ష్మి. సిల్క్ స్మితగా అందరికీ సుపరిచితురాలైన ఆమె 1996లో మరణించింది. అతిగా మద్యం సేవించడం, ఆర్థిక ఇబ్బందులు ఆమె జీవితాన్ని అంధకారంలోకి నెట్టేశాయి. దీంతో కుంగుబాటుకు గురై ఆత్మహత్య చేసుకుంది.



ఏపీ బ్రాండ్‌కు ఆయనే అంబాసిడర్

సాహసంతో సై

లక్ష్మీ పార్వతి ప్రవేశంతో టీడీపీలో, ఎన్టీఆర్ కుటుంబంలో తలెత్తిన సంక్షోభం నేపథ్యంలో రామారావు స్థానంలో చంద్రబాబు 1995లో సీఎం పదవి చేపట్టారు. ఎన్టీఆర్ అంతటి మహా నాయకుడిని కాదని తనను నమ్మి పీఠంపై కూర్చోబెట్టిన ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణుల అభిమానాన్ని నిలుపుకోవడం, చీలిక పరిణామాల్లో పార్టీని కాపాడుకోవడం ఆయనకు సవాళ్లుగా మారాయి. వీటిని అధిగమించి పార్టీని బలమైన రాజకీయ శక్తిగా నిలపగలిగారు. మద్య నిషేధం, రూ.2కే కిలో బియ్యం వంటి సంక్షేమ పథకాల అమలుతో నాడు ఖజానా కుంగిపోయింది. ప్రతి నెలా ఉద్యోగుల జీతాలకు డబ్బులు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఆ సమయంలో ఆయన సంపూర్ణ మద్య నిషేధాన్ని సడలించి, దానిని సారా నిషేధానికి పరిమితం చేశారు. రేషన్ బియ్యం ధరను రూ.మూడున్నర చేశారు. ఇది రాజకీయంగా దుస్సాహసమే! అయితే... చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై ముందుగా శ్వేత పత్రాలు విడుదల చేశారు. వాటిపై విస్తృతంగా చర్చలు నిర్వహింపజేశారు. ప్రత్యామ్నాయ మార్గాలపై సలహాలు, సూచనలు తీసుకున్నారు. వీటి ఫలితంగా కఠిన నిర్ణయాలకూ కొంత వరకూ ప్రజామోదం పొంది రాజకీయంగా మరీ పెద్ద వ్యతిరేకత రాకుండా చూసుకోగలిగారు.



నాయకుడు @40

NARA CHANDRABABUNAIDU

దేశం ఇచ్చిన నేత

40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఘనతలు

- సుదీర్ఘ కాలం సీఎం, విపక్ష నేతగా చరిత్ర.. నవ్యాంధ్ర తొలి సీఎంగా కొత్త చరిత
- ఉమ్మడి రాష్ట్ర సీఎంగా చెరగని ముద్ర.. తెలుగు నాట ఎగరేసిన ఐటీ బావుటా
- విద్యా సంస్థలతో చదువులు-కొలువులు.. సంస్కరణల పథంలో నడిచే సాహసం
- వ్యతిరేకత వస్తుందని తెలిసినా వెరవని వైనం.. ప్రజలను ఒప్పించే కఠిన నిర్ణయాలు



'దేశానికి ఏ విదేశీ రాజకీయ ప్రముఖుడు వచ్చినా... ఢిల్లీ తర్వాత నేరుగా హైదరాబాద్ వచ్చి చంద్రబాబును కలుస్తారు' అని ఉమ్మడి రాష్ట్ర సీఎంగా చంద్రబాబు ఎంతో పేరు తెచ్చుకున్నారు. ఆయనను కలవాలనే తన భారత పర్యటనలో హైదరాబాద్‌ను చేర్చానని బిల్ గేట్స్ బహిరంగంగా చెప్పారు.


వాజపేయి ప్రభుత్వ హయాంలో జరిగిన అణు పరీక్షలపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ప్రపంచ దేశాలు భారతదేశంపై అనేక ఆంక్షలు విధించాయి. ప్రపంచ ఆర్థిక సంస్థల నుంచి దేశానికి ఇవ్వాల్సిన రుణాలు, గ్రాంట్లు కూడా నిలిపివేశాయి. కానీ, చంద్రబాబుపై సానుకూలతతో కొంతకాలం తర్వాత ఆ సంస్థలు దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌కు ఆ ఆంక్షల నుంచి మినహాయింపు ఇస్తూ రుణాలు విడుదల చేశాయి. ఆ తర్వాత మరికొంత కాలానికి మొత్తం దేశంపై ఆ ఆంక్షలు ఎత్తివేశారు.

హైదరాబాద్‌లో డెవలప్‌మెంట్ సెంటర్ పెడుతున్నామన్న మైక్రోసాఫ్ట్ ప్రకటన ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. చాలా అంతర్జాతీయ సంస్థలు ఈ నగరం ఎక్కడ ఉందని అప్పట్లో మ్యాపుల్లో వెతికాయి. మైక్రోసాఫ్ట్ తర్వాత ఒరాకిల్, సన్ మైక్రో సిస్టమ్స్ వంటి ప్రఖ్యాత సంస్థలు హైదరాబాద్‌కు వచ్చాయి. 'సైబరాబాద్'కు ప్రాణం పోశాయి.

రోడ్ల వెడల్పు చేయడానికి ఇళ్లు కూల్చితే ప్రజల్లో వ్యతిరేకత వస్తుందేమోనని అందరూ భయపడే రోజులవి. మంచి పరిహారం ఇస్తే ఏ ఇబ్బందీ రాదంటూ చంద్రబాబు అడుగు ముందుకు వేశారు. హైదరాబాద్ నగరం సహా అనేక నగరాలు, పట్టణాల్లో రోడ్ల విస్తరణ చేపట్టి వాటి రూపురేఖలు మార్చారు. ఉమ్మడి రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ కూడా అప్పుడే జరిగింది.



చంద్రబాబుతో తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న గవర్నర్ కృష్ణకాంత్



చిన్నారి నారా లోకేశ్‌తో చంద్రబాబు

పనిలో రాక్షసుడు!

లక్ష్యాల విషయంలో అందరికీ 'అందని వాడు'

రాజకీయ ప్రత్యర్థులకు ఆయన 'కొరకరాని కొయ్య'!

ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఉన్న 'బిరుదు'లు ఇవి! ఆయన వయసు 66 ఏళ్లు! అందులో అచ్చంగా 40 ఏళ్ల రాజకీయ అనుభవం! 1978 ఫిబ్రవరి 27న చిత్తూరు జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యేగా చంద్రబాబు గెలుపును నిర్ధారిస్తూ అధికారిక ఫలితం వెలువడింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా... కాలం గడిచేకొద్దీ ఆయన ఖాతాలో చెరిగిపోని ఘనతలు నమోదవుతూనే ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రాన్ని అత్యధిక కాలం పాలించిన ముఖ్యమంత్రి! పదేళ్లు ప్రతిపక్ష నేతగా పని చేసిన ఏకైక నాయకుడు! నవ్యాంధ్రకు తొలి సీఎం! ఒక ప్రాంతీయ పార్టీని 23ఏళ్లుగా విజయవంతంగా నడిపిస్తున్న నాయకుడు! మూస రాజకీయ ఆలోచనలకు భిన్నం! పాతకాలపు రాజకీయాలకూ విభిన్నం. అందుకే ఏపీ అనే బ్రాండ్‌కు అంబాసిడర్‌గా మారారు!

సంస్కరణలకు సై

ఆర్థిక సంస్కరణల అవసరాన్ని, అనివార్యత గురించి బహిరంగంగా మాట్లాడటానికి జంకుతున్న రోజుల్లో... చంద్రబాబు ఆ నిశ్శబ్దాన్ని ఛేదించారు. వాటి గురించి పదేపదే మాట్లాడి ప్రజల్లో సానుకూలత పెంచడానికి ప్రయత్నించారు. దేశంలో సంస్కరణలకు ఆద్యుడు పీవీ నరసింహారావు. అయితే.. సంస్కరణల గురించి బయట మాట్లాడితే ప్రజల్లో చెడ్డ అయ్యే పరిస్థితి ఉందని ఆయనే ఒక సందర్భంలో చంద్రబాబుతో చెప్పారు. అయినా చంద్రబాబు ఈ సంప్రదాయ ఆలోచనలకు భిన్నమైన దారిలో నడిచారు. ఐటీ కొలువులకు సమాంతరంగా రాష్ట్రంలో సాంకేతిక విద్యావకాశాలు విస్తృతంగా పెరగడానికి కూడా కృషి చేశారు. దిగువ మధ్య తరగతి కుటుంబాల వారు కూడా ఇంజనీరింగ్ చదవగలిగే అవకాశం ఏర్పడింది. తెలుగు వారు నలు దిక్కులా ఐటీ బావుటా ఎగరేయడానికి అప్పుడే పునాది పడింది. ఇప్పుడు నవ్యాంధ్ర తొలి సీఎంగా చంద్రబాబు నాలుగో పారిశ్రామిక విప్లవాన్ని అందుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, సెన్సర్ టెక్నాలజీస్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వంటి నూతన సాంకేతిక ఆవిష్కరణలతో ఈ నాలుగో విప్లవం వస్తోంది.

ఐటీ... మేటి!

1997లో బిల్‌గేట్స్ ఢిల్లీకి వచ్చారు. అప్పటికి ఆయనను కలిసిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబు. "ఒక రాజకీయ నాయకుడికి నాతో ఏం పని' అని బిల్‌గేట్స్ నాడు ఆశ్చర్యపోయారు. ఆయనతో తొలి భేటీలోనే హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్ పెట్టడానికి చంద్రబాబు ఒప్పించారు. అనేకసార్లు ఆయన వెంటపడి అది సాకారమయ్యేలా చేశారు. ఆ సంస్థ అమెరికా బయట మొట్టమొదట హైదరాబాద్‌లోనే తన డెవలప్‌మెంట్ సెంటర్ నెలకొల్పింది. ఆ వెనుకనే అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు రావడంతో అతికొద్ది వ్యవధిలోనే హైదరాబాద్ ఐటీ శిఖరంగా మారిపోయింది. పెద్ద సంఖ్యలో తెలుగు యువతకు ఐటీ కొలువులు వచ్చాయి. అనేక మంది తెలుగువారు అమెరికా చేరి అక్కడ కూడా ఐటీ రంగంలో నిలదొక్కుకొన్నారు. వ్యవసాయాధారిత రాష్ట్రంలో, ప్రభుత్వ ఉద్యోగాలు తప్ప మరేమీ దొరకని రోజుల్లో ఒక తరం కొత్త దారిలో వెళ్లడానికి చంద్రబాబు ముందు చూపు ఉపయోగపడింది.

- అమరావతి - ఆంధ్రజ్యోతి




బిల్‌గేట్స్‌తో సీఎం కరచాలనం

"అమెరికా పర్యటనలో సమావేశాలు అయ్యేసరికి రాత్రి పన్నెండు దాటిపోయేది. హోటల్‌కు తిరిగొచ్చాక ఆయన మర్నాడు చేయాల్సిన పనేమిటో మాతో చర్చించాకే విశ్రాంతి తీసుకునేవారు. మళ్లీ మర్నాడు సిద్ధమై ఉండేవారు. ఆయన నిజంగా పని రాక్షసుడు" ..ఇటీవల బాబుతో పర్యటనలో పాల్గొన్న ఒక ఐఏఎస్ అధికారి చేసిన వ్యాఖ్యలు ఇవి!

అరవైలో ఇరవై..

- మైమరిపించే మాట లేదు
- సమ్మోహన రూపం కాదు
- పని ఒక్కటే తారక మంత్రం
- వ్యూహ రచన, ఆచరణే బాటలు



ఎన్టీఆర్‌లాగా సమ్మోహన రూపం కాదు! వాక్పటిమ లేదు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో ఆటుపోట్లు! అయినా... చంద్రబాబు ముందుకు సాగుతూనే ఉన్నారు. ప్రణాళికాబద్ధమైన కృషి, వ్యూహాత్మక అడుగులు, ఘనమైన లక్ష్యాలు, వాటిని సాకారం చేసే దిశగా సాగే చర్యలు! ఇవే... ఆయన విజయానికి కారణాలు! ఆరు పదులు దాటిన తర్వాత కూడా ఇప్పటికీ రోజుకు 18 గంటలు ఏకబిగిన పని చేస్తారు. కొత్తగా ఎమ్మెల్యేలుగా గెలిచిన యువకులు కూడా ఆయన మాదిరిగా పనిచేయడం తమ వల్ల కాదని చేతులెత్తేస్తుంటారు. అర్ధరాత్రి 12 గంటల వరకు సమావేశాలు నిర్వహించినా మొహంలో అలసట, గొంతులో నీరసం కనిపించనీయరు. చంద్రబాబు హైదరాబాద్‌లో ఉన్నప్పుడు సతీమణి భువనేశ్వరి రాత్రి తొమ్మిది గంటలకు ఆయనకు ఫోన్ చేసి సమయం గుర్తు చేసి త్వరగా ముగించాలని ఒత్తిడి చేసేవారు. ఆమె ఒత్తిడితో ఆ సమయానికి పని ముగించడానికి ప్రయత్నించేవారు. ఆయన విజయవాడ వచ్చాక ఒక్కరే ఉంటున్నారు. దీంతో రాత్రి 11, 12 గంటల వరకూ సమావేశాలు, ఫోన్లు నడిపిస్తున్నారు. ఎన్టీఆర్ సాహచర్యంలో చంద్రబాబుకు తెల్లవారుజామున లేవడం అలవాటైంది. కానీ, రాత్రి పొద్దుపోయేవరకూ పనిలో గడపడం ఆయన లక్షణం. అధికారంలో ఉన్నా... ప్రతిపక్షంలో ఉన్నా ఆయన దినచర్యలో మార్పు లేదు. ఆయన అరవైలో ఉన్న ఇరవై ఏళ్ల యువకుడని టీడీపీ నేతలు సరదాగా వ్యాఖ్యానిస్తుంటారు.

విలక్షణం... 1978 బ్యాచ్

- 202 మంది మొదటిసారిగా సభలోకి.. వెంకయ్య, బాబు, వైఎస్, అశోక్ తొలిసారి ఎమ్మెల్యేలు
- రాష్ట్రంలో ఇందిరా కాంగ్రెస్ ప్రభంజనం.. మూడేళ్లపాటు అటూఇటూ జంపింగ్‌లు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లకు ఒక 'బ్యాచ్' ఉంటుంది! రాజకీయాల్లో మాత్రం ఒకే ఒక్క స్పెషల్ బ్యాచ్ ఉంది. అదే... 1978 బ్యాచ్! ఇది రాష్ట్ర చరిత్రలోనే కాదు... దేశ చరిత్రలోనే విలక్షణం! సరిగ్గా నలభై ఏళ్లక్రితం... 1978 ఫిబ్రవరి 27వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. మొత్తం 294 స్థానాల్లో 202 మంది కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన వారే గెలిచారు. వీరిలో చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, అశోక్ గజపతి రాజు, వెంకయ్య నాయుడు, కేఈ కృష్ణమూర్తి ఇలా అనేకమంది ఉన్నారు. ఆ ఎన్నికల నాటికి దేశవ్యాప్తంగా రాజకీయ అలజడి నెలకొంది. ఎమర్జెన్సీ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నిలువునా చీలిపోయింది. ఇందిరాగాంధీ తన పేరుతో కాంగ్రెస్(ఐ) పార్టీ పెట్టారు. జనతా పార్టీ గాలి బలంగా వీస్తోంది. మహామహులంతా జనతా, జాతీయ కాంగ్రెస్‌వైపు ఉన్నారు. ఇందిర పార్టీకి అభ్యర్థులు కూడా దొరకని పరిస్థితి. దీంతో 20 శాతం సీట్లు నవ యువకులకు ఇస్తామని ఆమె ప్రకటించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్(ఐ) 175స్థానాలు సాధించి అధికారంలోకి వచ్చింది. జనతా పార్టీ 60 స్థానాలు, కాంగ్రెస్ పార్టీ 30స్థానాల్లో గెలిచింది. ఎన్నికల అనంతరం కాంగ్రెస్(ఐ) ముఖ్యమంత్రిగా మర్రి చెన్నారెడ్డిని అధిష్ఠానం ఎంపిక చేసింది. ఆ తర్వాత రెండు మూడేళ్లు రాజకీయంగా అంతా గజిబిజీ. ఎటుచూసినా ఆయారాం గయారాంలే! క్రమంగా కాంగ్రెస్(ఐ) బలపడడంతో చాలామంది అటువైపు వచ్చేశారు. జనతాపార్టీ తరఫున 60మంది గెలిచినా... చివరకు మిగిలింది 16మందే. ఇక కాంగ్రెస్‌లో 30కి గాను ముగ్గురే మిగిలారు. నాడు వైఎస్ జాతీయ కాంగ్రెస్ (రెడ్డి కాంగ్రెస్) తరఫున గెలిచినా... ఆ తర్వాత ఆయన కూడా కాంగ్రెస్(ఐ)లో చేరారు. మొత్తంగా చూస్తే 1978 బ్యాచ్‌లో ఎమ్మెల్యేలు అయిన వారు అనేకమంది రాజకీయాల్లో ప్రముఖులుగా ఎదిగారు. వెంకయ్య నాయుడు కేంద్రంలో అనేక మంత్రి పదవులు నిర్వహించి ఇప్పుడు ఉప రాష్ట్రపతిగా ఉన్నారు. అశోక్ గజపతిరాజు కూడా జనతా పార్టీ టికెట్‌పై 1978లో ఎమ్మెల్యేగా గెలిచారు.




1978 బ్యాచ్‌లోని వెంకయ్య, అశోక్‌గజపతి రాజు

ముగ్గురం ఒకేసారి...

'చంద్రబాబు, వైఎస్, నేను సమకాలీకులం. 1978 లో ముగ్గురం ఒకేసారి అసెంబ్లీలో అడుగు పెట్టాం. మా మధ్య పరిచయాలు పెరిగాయి. నేను వైఎస్‌తో కలిసి అసమ్మతి కార్యక్రమాలను కొనసాగించాను. నాడు చంద్రబాబుకు అసమ్మతి నచ్చేది కాదు. చెన్నారెడ్డి సీఎం నుంచి దిగిపోయాక 1980లో టంగుటూరి అంజయ్య మంత్రి వర్గంలో ముగ్గురం మంత్రులమయ్యాం. 1984లో ఎన్టీఆర్ సూచనల మేరకు చంద్రబాబు, పి.ఉపేంద్ర మా ఇంటికి వచ్చి ఆహ్వానించడంతో టీడీపీలో చేరాను. 1985లో ఎన్టీఆర్ కేబినెట్‌లో భారీ నీటి పారుదల శాఖ దక్కింది. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరినా.. 1994లో చంద్రబాబు సమక్షంలో మళ్లీ టీడీపీలోకి వచ్చేశాను."

- కేఈ కృష్ణమూర్తి, ఉప ముఖ్యమంత్రి





వైఎస్, గులాంనబీ ఆజాద్, చంద్రబాబులతో కేఈ

ఆ విధంగా ముందుకు!



- భూసమీకరణ నుంచి పట్టిసీమ దాకా
- వినూత్న ఆలోచనలతో విజయాలు

పాలనలో సృజనాత్మక నిర్ణయాలకు చిరునామా చంద్రబాబు! పాత దారిలో వెళ్లకుండా ఎంత కష్టమైనా కొత్త దారిని వెతుకుతారు. ఈ తపనే ఆయనను తన సహచరుల్లో అగ్రస్థానంలో నిలిపింది.

భూసమీకరణ...

వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ ప్రభుత్వాలకు పెను సవాలుగా మారిన నేటి రోజుల్లో 'భూ సమీకరణ' అనే కొత్త విధానాన్ని ఎంచుకున్నారు. రాజధాని కోసం రైతుల నుంచి 33 వేల ఎకరాల భూమిని సమీకరించగలిగారు. బెంగాల్‌లో టాటా నానో కార్ల ప్రాజెక్టుకు భూ సేకరణ వ్యవహారం అగ్గిలాగా రాజుకొని రాజకీయ సమీకరణాలను మార్చేసిన అనుభవాలు ఉన్న సమయంలో... ఏకంగా 33 వేల ఎకరాలను సమీకరించగలగడం మొత్తం దేశాన్ని నివ్వెరపరిచింది.

కాల్వలకు సార్థకత

కాల్వలు చాలా వరకు సిద్ధంగా ఉన్నాయి. నీరు అందుబాటులో ఉంది. ప్రాజెక్టు మాత్రం పూర్తి కాలేదు. ఎవరైనా సరే... వీలైనంత త్వరగా ప్రాజెక్టు నిర్మించాలనే భావిస్తారు. చంద్రబాబు మాత్రం... 'శరవేగంగా ప్రాజెక్టు నిర్మిద్దాం. అయితే, ఈలోపు కాల్వలను ఎందుకు ఉపయోగించుకోకూడదు!' అని ఆలోచించారు. ఆ ఆలోచన ఫలితమే... పట్టిసీమ. గోదావరి వచ్చి కృష్ణలో కలిసింది. సాగర్ గేట్లు తెరుచుకోకున్నా... కృష్ణా డెల్టాలో పంట పండింది. అదే సమయంలో కృష్ణా డెల్టాకు ఇవ్వాల్సిన జలాలతో రాయలసీమ నేల తడిసింది. కరువు సీమ అనంతపురం జిల్లా చెరువుల్లో జల కళ ఉట్టిపడుతోంది. పట్టిసీమ విజయం నదుల అనుసంధానంపై చర్చను రేకెత్తించింది. గోదావరి జలాలను తమిళనాడులోని కావేరీ డెల్టా వరకూ ఇవ్వడంపై కేంద్రం దృష్టి సారించింది. ఉమ్మడి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో.. నల్లగొండ జిల్లాలో మాధవరెడ్డి ఎత్తిపోతల పథకంలో ఆయన వినియోగించిన టెక్నాలజీ ఆ తర్వాత అనేక భారీ ఎత్తిపోతలకు మార్గం సుగమం చేసింది.

కోతల నుంచి మిగులుకు

చంద్రబాబు ఉమ్మడి సీఎం అయిన తొలినాళ్లలో తీవ్రమైన విద్యుత్ కోతలు ఉండేవి. సంస్కరణల ద్వారా సరఫరా వ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు ఉత్పత్తిని కూడా పెంచి... తాను దిగిపోయే సమయానికి ఆయన రాష్ట్రాన్ని విద్యుత్ మిగులు రాష్ట్రంగా తీర్చిదిద్దారు.

స్వచ్ఛ భారత్‌కంటే ముందు...

ఇప్పుడు దేశమంతా జరుగుతున్న 'స్వచ్ఛ భారత్'ను 1999లోనే క్లీన్ అండ్ గ్రీన్ పేరుతో చంద్రబాబు పెద్ద ఎత్తున అమలు చేశారు. ప్రతి నెలా రెండో శనివారం ప్రత్యేకంగా ఈ కార్యక్రమంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించేవారు. రైతులు తాము పండించిన కూరగాయలు నేరుగా వినియోగదారులకు అమ్మడానికి పెట్టిన రైతు బజార్లు మంచి ప్రజాదరణ పొందాయి. అధికారులే గ్రామాలకు వెళ్లి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించే జన్మభూమి కార్యక్రమం కూడా చంద్రబాబు ఆలోచనలో నుంచి పుట్టిందే.



మృత్యుంజయుడు

అలిపిరిలో నక్సల్స్ మందుపాతర.. అంతకుముందు రెండు ప్రమాదాలు

(తిరుపతి, అమరావతి - ఆంధ్రజ్యోతి)

2003 అక్టోబరు 2వ తేదీ... బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి హోదాలో శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు చంద్రబాబు తిరుమల బయలుదేరారు. ఘాట్ రోడ్డు ఎక్కుతుండగా అలిపిరి తొలి మలుపులోనే భారీ పేలుడు! అది... నక్సల్స్ పేల్చిన మందుపాతర! పేలుడు ధాటికి చంద్రబాబు ప్రయాణిస్తున్న కారు గాలిలోకి ఎగిరి... బోర్లాపడిపోయింది. అది బుల్లెట్ ప్రూఫ్ అంబాసిడర్ కారు! ఆ కారులోనే మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు రెడ్డివారి రాజశేఖరరెడ్డి, చదలవాడ కృష్ణమూర్తి కూడా ఉన్నారు. బొజ్జల అపస్మారక స్థితిలో ఉన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు షాక్‌లో... నిశ్చేష్టులుగా మిగిలారు. చంద్రబాబు తన చేతిని పైకి చాపి సెక్యూరిటీ సాయంతో పైకి వచ్చారు. మృత్యువును అతి దగ్గరి నుంచి చూశారు.



ముఖ్యమంత్రికాక ముందు చంద్రబాబు బెంగుళూరు నుంచి చిత్తూరుకు కారులో వెళ్తున్నారు. తొలుత వెనుక సీటులో ఎడమవైపు చివర కూర్చుకున్నారు. అక్కడ అంత సౌకర్యంగా అనిపించక... కాసేపటికి డ్రైవర్ సీటు వెనక్కి మారారు. కొంత దూరం ప్రయాణించగానే ముందు వెళ్తున్న లారీ ఆకస్మాత్తుగా ఆగింది. ఆ కుదుపునకు లారీలో ఉన్న పెద్ద జాకీ బయటకు దూసుకువచ్చి చంద్రబాబు వెళ్తున్న కారు డోర్ అద్దంలో నుంచి లోపలికి వచ్చి సీటును గుద్దుకొంది. చంద్రబాబు అక్కడే ఉంటే... నేరుగా ఆయనను తాకేది. మరోసారి... ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు విజయనగరం జిల్లా పర్యటన నుంచి వస్తుండగా... హెలికా హెలికాప్టర్ ల్యాండింగ్ బ్రేక్స్ విఫలమయ్యాయి. నేలకు రాసుకుంటూ వెళ్లి ఆగే పద్ధతిలో (క్రాష్ ల్యాండింగ్) హెలికాప్టర్‌ను దించారు. ఈ ఘటనలో చిన్న గాయాలతో చంద్రబాబు బయటపడ్డారు.

కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు!

చంద్రబాబు పఠించిన యువ మంత్రం

- యువతతో కలిసి ఊరికి ఉపకారం
- ఇతర గ్రామాల యువతకు స్ఫూర్తి
- మండలస్థాయి నేతగా తొలి పదవి
- అచిరకాలంలోనే రాష్ట్రవ్యాప్త గుర్తింపు
- నాటినుంచి నేటిదాకా యువతపై ముద్ర

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

అది 1975వ సంవత్సరం. తిరుపతి నుంచి భీమవరం వరకు రంగంపేట, నారావారిపల్లె మీదుగా ఆర్ఎంఎస్ బస్సు నడిచేది. రోజుకు సింగిల్ ట్రిప్పు మాత్రమే. ఉదయం భీమవరం నుంచి తిరుపతికి వెళితే, మళ్లీ రాత్రి తిరుపతి నుంచి భీమవరం వెళ్లేది. ముఖ్యంగా వానాకాలంలో బస్సు వచ్చేదే కాదు. రంగంపేట, నారావారిపల్లె మధ్య జోడు బావులు అనే ప్రాంతం ఉండేది. ఇక్కడ రోడ్డు మరీ భయంకరం! అర కిలోమీటరు పొడవునా... అడుగడుగునా మోకాలి లోతు గుంతలు. వానాకాలం వస్తే బస్సు కూరుకుపోయేది. తిరుపతిలో చదువుకుంటున్న ఆ ఊరి యువకుడు ఇదంతా గమనించాడు. పరిష్కారం గురించి ఆలోచించాడు. రోడ్డు బాగు చేయాలని నిశ్చయించుకున్నాడు. అందుకోసం యువతను సంఘటితం చేశాడు. 'వినాయక యువజన సంఘం' ఏర్పాటు చేశాడు. యువతను చైతన్యపరిచి పలుగూ పారపట్టుకొని జోడుబావుల వద్దకు బయలుదేరాడు. జనం తొలుత చోద్యం చూశారు. మధ్యాహ్నానికి అందరూ కదిలి వచ్చారు. తలో చేయి వేశారు. జోడుబావుల గుంతలను పూడ్చారు. ఇంత చేశాం... ఈ కాసింత ఎందుకు వదలాలి అనే పట్టుదల పెరిగింది. రంగంపేట నుంచి నారావారిపల్లె వరకు అర కిలోమీటరు దూరం మొత్తం గుంత అనేది కనిపించకుండా గుల్లమట్టితో పూడ్చేశారు. రంగంపేట, నారావారిపల్లె రోడ్డులో మళ్లీ ఆర్ఎంఎస్ బస్సు హారన్ వినిపించింది. అలా ఆ ఊరిని నడిపించిన యువకుడు... చంద్రబాబు నాయుడు!

మరింత ముందుకు...

రహదారి బాగుతో ఊరి యువతలో ఏదో సాధించామనే గర్వం కనిపించింది. ఇంకేదో చేయాలనే తపన పెరిగింది. అప్పటి వరకు పూడికతీత ఎరుగని బాపన కాలువ, కోమిటి కాలువలకు మోక్షం వచ్చింది. శేషాపురం, కందులవారిపల్లె, నారావారిపల్లె యువకులు ఈ కాలువల పూడిక తీశారు. ఆఖరు కయ్యవరకు ఊట నీటిని అందించారు. ఈ స్ఫూర్తితో చుట్టుపక్కల అనేక ఊళ్లలో యువజన సంఘాలు మొదలయ్యాయి. ఇలా విస్తరిస్తున్న యువజన సంఘాలను చంద్రబాబు సమన్వయం చేస్తూ వచ్చారు. ఆ క్రమంలోనే పులిచెర్ల సమితి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చంద్రబాబుకు బాధ్యతలు అప్పగించారు.

కట్నం తీసుకోం!

అది... 1976. చిత్తూరులోని రంగనాథ భవన్! అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు అధ్యక్షతన చిత్తూరు కాంగ్రెస్ కమిటీ సమావేశం జరుగుతోంది. పులిచర్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రబాబు నాయకత్వంలో వందలాది మంది యువకులు సందడిగా సమావేశ స్థలికి వచ్చారు. వేదికపై ఉన్న జిల్లా నాయకుల వద్దకు చంద్రబాబు వెళ్లి చెవిలో ఏదో చెప్పారు. ఆ నాయకులు అదే సమాచారాన్ని జలగం వెంగళరావుకు అందించారు. ఆమోదం తెలుపుతున్నా అన్నట్టుగా ఆయన తలూపారు. వెంటనే వందలాది మంది యువకులు సైన్యంలా సభా ప్రాంగణంలో బారులుతీరి నిలబడ్డారు. "మేము వరకట్నానికి వ్యతిరేకం. మేము వరకట్నం తీసుకోము. వరకట్నానికి వ్యతిరేకంగా పోరాడతాం. గ్రామగ్రామాన యువతను చైతన్యపరుస్తాం" అని వందలాది మంది ప్రమాణం చేశారు. ఇది పెద్ద సంచలనమైంది. యువ నాయకుడిగా చంద్రబాబు పేరు ప్రచారంలోకి వచ్చింది. తమ గ్రామ పరిధిలో తామూ నాయకులుగా ఎదగాలనే స్ఫూర్తిని నింపాయి. ఊరూరా యువజన సంఘాల స్థాపన మొదలైంది. ఈ ఉద్యమ స్ఫూర్తి చిత్తూరు జిల్లాలో 20ఏళ్ల పాటు కొనసాగింది.

యువతే శక్తి...

చంద్రబాబు నాటిన యువజన సంఘ విత్తనం చూస్తుండగానే మానై ఎదిగింది. 1978లో చంద్రబాబు గెలుపు వెనుక యువశక్తిత పాత్ర చాలా కీలకం.



ఎగువన బాక్స్‌లో చంద్రబాబు, దిగువ ఎడమవైపు బాక్స్‌లో జబాష్, పక్కన బాక్స్‌లో రాజగోపాల్‌గుప్త

హితుడు... స్నేహితుడు!

ఆ పల్లె నుంచి బడికి వెళ్లాలంటే 12 కిలోమీటర్ల దూరం! సన్నని కాలిబాట. ముళ్ల పొదలు, చిట్టడివి. బడికి వెళ్లాలంటే నడిచి వెళ్లాల్సిందే. అలా అయిదేళ్లు నడిచాడు. ఆ నడకే అతని నడతను మార్చింది. ఆ పిల్లవాడి పేరు నారా చంద్రబాబు. ఆయన ఊరు నారావారిపల్లె. ఐదు నుంచి పదో తరగతి దాకా నడిచి వెళ్లి చదువుకున్నది చంద్రగిరిలోని ప్రభుత్వ పాఠశాలలో. ఆ తర్వాత చంద్రగిరి, తిరుపతిలో చంద్రబాబు విద్యాభ్యాసం సాగింది. అనేకమందితో ఆయన స్వచ్ఛమైన స్నేహాన్ని పంచుకున్నారు. ఆ కాలంలో చంద్రబాబుతోపాటు నడిచిన, కలిసి చదువుకున్న కొందరు బాల్య స్నేహితులు ఇప్పుడు ఏమంటున్నారంటే...

సైకిల్ నేర్పింది నేనే

శేషాపురం ఎలిమెంటరీ స్కూల్లో ఒకటి నుంచి ఐదో తరగతి దాకా నేనూ చంద్రబాబూ కలిసి చదువుకున్నాం. బాబుకు సైకిల్ తొక్కేది నేనే నేర్పించా. అప్పట్లో 'పరువు కోసం' అనే సాంఘిక నాటికలో బాబు హీరోగా, ఎంపీ శివప్రసాద్ కమెడియన్‌గా నటించారు. ఒక పక్క నాటకాల పిచ్చి, ఇంకో పక్క అప్పుడే ఇంగ్లీషు మీడియం, పైగా కాంపోజిట్ మ్యాథ్స్.. దీంతో చంద్రబాబు పదోతరగతి తప్పారు. ఆ తర్వాత తిరుపతిలోని టీపీపీఎం స్కూల్లో జాయిన్ అయి పది పాసయ్యాడు. చంద్రబాబు ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు వచ్చాక హాస్టల్లో రూం నెంబర్ 102లో ఉండేవాడు. ఎమ్మెల్యే టికెట్ కోసం తొలిసారిగా హైదరాబాద్ వెళ్లినప్పుడు అన్నపూర్ణ హోటల్లో కూడా 102 నెంబరు గదినే అద్దెకు తీసుకున్నాం. దాదాపు నెల రోజులు అక్కడే గడిపాం.

-జెడ్ఏ జభాష్, రిటైర్డ్ మిలిటరీ వైద్యాధికారి, చంద్రగిరి



వివాహ సమయంలో అత్తమామలు బసవతారకం, ఎన్టీఆర్

పట్టు వదలడు బాబు

చంద్రబాబు కష్టజీవి. అందరితో కలివిడిగా ఉండేవారు. నన్ను 'జీఎల్' అంటూ పిలిస్తే... నేను 'బాబు' అనేవాడిని. మా షాపులో నోట్‌బుక్స్ కొనుక్కునేవాడు. పట్టుదల గల వ్యక్తి. ఎవరు వద్దన్నా తను ఏం చెప్పాలనుకున్నాడో అదే చెప్పేవాడు., ఏం చేయాలనుకుంటే అది చేసి తీరేవాడు. ఎమ్మెల్యే టికెట్ వచ్చినప్పుడు పాత మిత్రులందరినీ ఒక్కటి చేశాడు. అతనితో స్నేహం చేస్తే ఎవరూ వదిలిపెట్టరు.

- జీఎల్ రాజగోపాల్ గుప్త, చంద్రగిరి

ఏడులోనే ఉపన్యాసాలు

ఏడో తరగతిలో ఒకసారి మా అయ్యవారు ఒక సబ్జెక్టు ఇచ్చి క్లాసులో అందరినీ దాని మీద మాట్లాడమన్నాడు. అందరం రెండు, మూడు నిమిషాలలో చెప్పి ముగించేశాం. చంద్రబాబు లేచాడు. మాట్లాడటం మొదలుపెట్టాడు పది నిమిషాలు అవుతోంది. ఆపలేదు. సార్ ఆపమన్నాడు. పదో తరగతి తర్వాత. తిరుపతికి వెళ్లడంతో చంద్రబాబు దశ మారింది.

-గిరిధర్ నాయుడు, తొండవాడ, టీడీపీ నేత

విద్యార్థిగానే నాయకుడు



విద్యార్థి నేతగా ఉన్నప్పుడే మెస్ ఎన్నికల్లో చంద్రబాబు గెలిచారు. ఆ తర్వాత విశ్వవిద్యాలయ ఎన్నికల్లో అప్పటివరకు ఉన్న ఒకే వర్గం గుత్తాధిపత్యాన్ని సవాల్ చేశారు. 1978 ఎన్నికల పోలింగ్ రోజున సాయంత్రం నాలుగు గంటల వరకు తిరిగాం. ఒక గ్రామంలో దళితులను ఓట్లు వేయనివ్వడం లేదంటే అక్కడికెళ్లాం. అక్కడ ప్రత్యర్థి పార్టీకి చెందిన నేతతో చంద్రబాబు మాట్లాడి... ఇలా చేయడం సరికాదని చెప్పారు. అంతా ఓట్లేసేలా చూశారు. ఆ తర్వాత అక్కడినుంచి వెళ్తుండగా దారిలో జీపు చెడిపోయింది. ఆయన నెలరోజుల్నుంచీ నిద్రలేకుండా తిరుగుతునే ఉన్నారు. పోలింగ్ అయిపోవడంతో జీపులోనే పడుకున్నారు. మూడు కిలోమీటర్లు జీపును తోసుకుంటూ వెళ్లాం."

- మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ

'అన్నగారి' అల్లుడు!

టీడీపీ ఏర్పాటుకు ముందే ఎన్టీఆర్‌తో బంధం.. నాడు సినిమాటోగ్రఫీ మంత్రిగా చంద్రబాబు

తొలుత జయకృష్ణతో పరిచయం.. బాబు నచ్చి కూతురునిచ్చిన ఎన్టీఆర్

వ్యక్తిగత సామర్థ్యం ఒకవైపు! కలిసి వచ్చిన అదృష్టం, ఎన్టీఆర్‌తో అనుబంధం మరోవైపు! ఈ రెండూ కలిసి చంద్రబాబును గొప్ప పదవులకు దగ్గర చేశాయి. 1981లో నాటి ముఖ్యమంత్రి అంజయ్య తన మంత్రివర్గంలో చంద్రబాబుకు చోటిచ్చారు. అది 68 మందితో కూడిన జంబో కేబినెట్. వారందరికీ కేటాయించడానికి శాఖలు కూడా చాలలేదు. బాబుకు సినిమాటోగ్రఫీ శాఖ ఇచ్చారు. ఆ సమయంలో ఎన్టీఆర్ కుమారుడు జయకృష్ణ అప్పుడప్పుడూ చంద్రబాబు వద్దకు వస్తుండేవారు. అప్పట్లో కాంగ్రెస్‌లోని ముఠా తగాదాలు, అవినీతి వ్యవహారాలు చంద్రబాబుకు విసుగు తెప్పించాయి. ఏదో ఒక ప్రత్యామ్నాయం రాష్ట్రానికి అవసరమని అనుకొన్నారు. దీంతో జయకృష్ణతో మాట్లాడి ఒక రోజు హైదరాబాద్‌లో ఎన్టీఆర్‌ను కలవడానికి నాచారంలోని రామకృష్ణ సినీ స్టూడియోస్‌కు వెళ్లారు. ఆ రోజు అక్కడ అనురాగ దేవత సినిమా షూటింగ్ జరుగుతోంది. ఎన్టీఆర్ హీరో, శ్రీదేవి హీరోయిన్. పెళ్లి వేడుకను చిత్రీకరిస్తున్నారు. పెళ్లి కుమారుడి దుస్తులతోనే పక్క గదిలోకి వచ్చి చంద్రబాబుతో చాలాసేపు మాట్లాడారు. తనకు 60 ఏళ్లు వచ్చాక ప్రజా జీవితంలోకి రావాలని అనుకొంటున్నానని ఎన్టీఆర్ పేర్కొన్నారు.

చంద్రబాబులోని చురుకుదనం నచ్చి.. ఆయనకు తన కుమార్తె భువనేశ్వరిని ఇచ్చి వివాహం చేశారు ఎన్టీఆర్. తర్వాత ఆరు నెలలకు చంద్రబాబుకు పెద్ద సమస్య వచ్చింది. ఆయన తన జిల్లా చిత్తూరులో పార్టీ అంతర్గత రాజకీయాల కారణంగా జడ్పీ ఛైర్మన్ ఎన్నికలో పార్టీ అధికార అభ్యర్థిని ధిక్కరించి పోటీ అభ్యర్థిని నిలపాల్సి వచ్చింది. ఈ సమయంలో రామారావుకు ఫోన్ చేశారు. ఈ పరిణామం కారణంగా తన మంత్రి పదవి పోయే అవకాశముందని, పార్టీ నుంచి సస్పెండ్ చేసే ప్రమాదమూ ఉందని చెప్పారు. "నేను మంత్రి పదవి చూసి మా అమ్మాయిని ఇవ్వలేదు. నువ్వు నచ్చి ఇచ్చాను. ఆ పదవి పోయినా ఫర్వాలేదు. నీ అంతరాత్మ ఏం చెబితే అదే చెయ్యి" అని ఎన్టీఆర్ భరోసా ఇచ్చారు. జడ్పీ ఎన్నికల్లో బాబు వ్యూహం ఫలించి తిరుగుబాటు అభ్యర్థి కుతూహలమ్మ ఛైర్‌పర్సన్ అయ్యారు. దీంతో బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. కానీ సస్పెన్షన్‌ను ఎత్తివేయించుకుని మంత్రిగానూ కొనసాగారు.



నాటి ముఖ్యమంత్రి అంజయ్యతో చంద్రబాబు


ఎన్టీఆర్ వచ్చాక...

ఎన్టీఆర్ 'తెలుగుదేశం' పార్టీ ఏర్పాటు చేశారు. అప్పటికి విజయభాస్కర్ రెడ్డి సీఎంగా ఉన్నారు. అప్పటికీ మంత్రిగా ఉన్న చంద్రబాబు... తెలుగుదేశం పార్టీలో చేరాలనుకున్నారు. కానీ... ఎన్టీఆర్ ఆయనను ఆపారు. చంద్రబాబు ఇందిరా కాంగ్రెస్‌లోనే ఉండి ఆ పార్టీ తరపున 1983 ఎన్నికల్లో చంద్రగిరి నుంచి పోటీచేశారు. అయితే... ఓడిపోయారు. కొంతకాలం స్తబ్దుగా ఉండి... 1984లో టీడీపీలో చేరారు. ఎన్టీఆర్‌పై నాదెండ్ల భాస్కరరావు నాయకత్వంలో కొందరు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేశారు. నాదెండ్ల ముఖ్యమంత్రి అయ్యారు. ఎన్టీఆర్‌ను మళ్లీ సీఎం చేయాలంటూ 'ప్రజాస్వామ్య పరిరక్షణ' పేరిట మహోద్యమం నడిచింది. ఆ సమయంలో పార్టీ ఎమ్మెల్యేలను ఎన్టీఆర్ వైపు కూడగట్టడం, వారెవరూ జారిపోకుండా చూడటం, ప్రజా ఉద్యమంలో వేడి తగ్గకుండా నడిపించడం, ఇతర పార్టీలతో సమన్వయం చేసుకోవడం వంటి రాజకీయ వ్యూహాలను అంతర్గతంగా చంద్రబాబు పకడ్బందీగా నడిపించారు. ఎన్టీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనకు చంద్రబాబుపై బాగా గురి కుదిరింది. ఆ తర్వాత 1985 అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు పోటీ చేయలేదు. ఆయనను ఎన్టీఆర్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. 1989 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయింది. కాంగ్రెస్‌నేతల తీరుకు నిరసనగా ఎన్టీఆర్ అసెంబ్లీకి రావడం మానేశారు. దానితో టీడీఎల్పీ ఉప నేతగా ఉన్న చంద్రబాబు తానే అసెంబ్లీ వ్యవహారాలు, ప్రతిపక్ష నేత బాధ్యత నిర్వహించేవారు. ఆ సమయంలో ఎన్టీఆర్‌కు తలలో నాలుకలా పనిచేశారు. ఎన్టీఆర్ జీవితంలో లక్ష్మీపార్వతి ప్రవేశంతో తెలుగుదేశంలో రాజకీయాలు శరవేగంగా మారిపోయాయి. ఎన్టీఆర్ 1994లో మరోసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత... పార్టీపై పట్టు పెంచుకోవడానికి ఆమె చేసిన ప్రయత్నాలు అంతర్గతంగా అసమ్మతికి దారితీశాయి. ఎన్టీఆర్ స్థానంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఆ తర్వాత కొద్దికాలానికే ఎన్టీఆర్ స్వర్గస్థులు కావడంతో చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠంలో కుదురుకొన్నారు. 1999 ఎన్నికల్లో తన నాయకత్వంలో పార్టీని గెలిపించుకున్నారు కూడా.

- ఆంధ్రజ్యోతి, అమరావతి




చంద్రబాబు తల్లిదండ్రులు అమ్మణ్ణమ్మ, ఖర్జూరనాయుడు



విద్యార్థి నేతగా..



విద్యార్థి మిత్రులతో చంద్రబాబు



అమెరికాలో చనిపోతే..



స్వదేశంలో ఎవరైనా చనిపోతే దహన సంస్కారాలకు ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కావు. కానీ విదేశాల్లో చనిపోయిన భారతీయులకు అక్కడే దహన సంస్కారాలు చేయాలంటే ఎన్నో నియమ నిబంధనలు పాటించాలి. అదే పార్థివ దేహాన్ని స్వదేశానికి తరలించాలంటే అనేక శవ పరీక్షలు.. మరెన్నో ప్రభుత్వ అనుమతులు అవసరమవుతాయి. చనిపోయినవారు సామాన్యులా? ప్రముఖులా? అనే విషయాన్ని పక్కనపెట్టి, విదేశాల్లోని ప్రభుత్వ అధికారులు అన్ని నియమ నిబంధనలను తప్పకుండా పాటిస్తారు. ముఖ్యంగా విదేశాల్లో అకస్మాత్తుగా ఎవరైనా చనిపోయినప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియక వారి కుటుంబసభ్యులు అయోమయానికి గురవడం సహజం. ఈ విషాద పరిస్థితుల నుంచి తేరుకొని చనిపోయిన వ్యక్తి అంతిమ సంస్కారాలు అక్కడే జరిపించాలంటే ఈ పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉంది. ఒక వ్యక్తి అనారోగ్య కారణంగా ఇంటి వద్ద చనిపోయినా.. ఏదైనా ప్రమాదంలో మరణించినా.. హత్య జరిగినా.. ఆత్మహత్య చేసుకున్నా వెంటనే పోలీసు శాఖకు తెలియజేయాలి. ఆ తర్వాత పోలీసుల అనుమతితో ఆ పార్థివ దేహాన్ని దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి. అవసరమైతే వైద్యులు శవ పంచనామా చేసి మరణానికి గల కారణాలను ధ్రువీకరిస్తూ ఒక శవపంచనామా నివేదిక (అటాప్సి రిపోర్ట్) రూపొందిస్తారు. ఇందులో ఏ రోజు? ఏ సమయానికి? చనిపోయారన్న విషయాలను నిర్ధారిస్తూ మరణ ధ్రువీకరణ పత్రాన్ని (డెత్ సర్టిఫికేట్) జారీ చేస్తారు. ఒకవేళ చికిత్స పొందుతూ ఆస్పత్రిలోనే చనిపోతే.. ఏ కారణాలతో చనిపోయారో వివరిస్తూ వైద్య అధికారులు మరణ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేస్తారు. తర్వాత ఆ పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులు సూచించిన విధంగా స్థానికంగా ఉన్న ఒక 'ఫ్యునరల్ హోం' (అంతిమ సంస్కారాలు జరిపే ప్రదేశం)కు తరలిస్తారు. అంతిమ సంస్కరాలు అక్కడే జరపాలా? పార్థివ దేహాన్ని విదేశాలకు పంపాలా? అనే విషయాన్ని కుటుంబసభ్యుల నుంచి రాత పూర్వకంగా తీసుకొని అధికారులు తదుపరి చర్యలు చేపడతారు. ఈ సమయంలో ఫ్యునరల్ హోం అధికారులకు కుటుంబ సభ్యులు ఈ వివరాలు అందజేయాలి.

ఇవ్వాల్సిన వివరాలు

1. చనిపోయిన వ్యక్తి పేరు; 2. స్త్రీ లేదా పురుషుడు; 3. పుట్టిన తేది; 4. వయస్సు; 5. జన్మస్థలం; 6. సోషల్ సెక్యూరిటీ నంబర్ (ఒకవేళ ఉంటే); 7. జాతి; 8. వివాహితులా? లేదా?; 9. భర్త లేదా భార్య వివరాలు; 10. విద్యార్హతలు; 11. వృత్తి; 12. పనిచేస్తున్న రంగం; 13. చిరునామ; 14. తండ్రి పేరు; 15. తల్లి ఇంటి పేరు (పెళ్లికాక ముందు); 16. చనిపోయిన స్థలం, ప్రాంతం; 17. ఆస్పత్రి పేరు; 18. చనిపోయినట్లుగా తెలిపిన వ్యక్తి పేరు, వివరాలు; 19. అంతిమ సంస్కారాల ప్రాధాన్యత? (దహన సంస్కారమా/ఖననమా/ ఏదైనా ఆస్పత్రికి విరాళమా?)

ఈ వివరాలను సేకరించిన తర్వాత ఆస్పత్రి నుంచి శవ పంచనామా నివేదిక (ఉంటే), డెత్ సర్టిఫికెట్, చనిపోయిన వ్యక్తి జనన, మరణ నమోదు కార్యాలయం అధికారుల నుంచి చనిపోయినట్లుగా నమోదు చేసిన పత్రాలను ఫ్యునరల్ హోం అధికారులు సేకరిస్తారు. పార్థివ దేహం చెడిపోకుండా భద్రపరిచిన తర్వాత కుటుంబసభ్యుల కోరిక మేరకు అంతిమ సంస్కారాలకు ఏర్పాట్లు చేస్తారు.

సేకరించాల్సిన పత్రాలు



- చనిపోయిన వ్యక్తి పాస్ పోర్టు.
- పార్థివ దేహం నుంచి ఎటువంటి అంటు వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నట్టు ధ్రువీకరిస్తూ స్థానిక ఆరోగ్య అధికారుల నుంచి అనుమతి పత్రం.
- పార్థివ దేహాన్ని సీల్డ్ కంటైనర్‌లో భద్రపరచినట్లు ధ్రువీకరించే పత్రం.
- కొన్ని సందర్భాల్లో పోలీసు అధికారుల నుంచి కావాల్సిన అనుమతి.
- కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా అధికారుల నుంచి పార్థివ దేహాన్ని భారత్‌కు పంపడానికి అనుమతి పత్రం.
- పార్థివ దేహాన్ని ఎవరైతే భారత్‌లో స్వీకరిస్తున్నారో వారి వివరాలు.
- పార్థివ దేహాన్ని భారత్‌లో ఏ శ్మశాన వాటికలో దహనం చేస్తున్నారో దాని చిరునామా వివరాలను సేకరించి విమానయాన అధికారులతో ఫ్యునరల్ హోం అధికిరారులు చర్చించి భారత్‌కు తరలిస్తారు.
- సాధారణ పరిస్థితుల్లో ఈ ఏర్పాట్లన్నీ పూర్తై.. పార్థివ దేహం భారత్‌కు చేరడానికి సుమారు 3 నుంచి 5 రోజులు పడుతుంది. దాదాపు 5-8 వేల డాలర్ల ఖర్చవుతుంది.
- పూర్తి వివరాలకు www.prasadthotakura.com వెబ్ సైట్‌ను చూడవచ్చు.

(డాక్టర్. ప్రసాద్ తోటకూర, ప్రముఖ ప్రవాస భారతీయ నాయకుడు.)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107
Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.